
Vaachaspathi
Veda Vidya
www.vaachaspathi.com

సంపూర్ణ కార్తీక మహాపురాణము

(నిత్య పారాయణ గ్రంథము)

మొదటి రోజు పారాయణము

శ్రీ విఘ్నేశ్వర ప్రార్థన

శ్లో॥ వాగీశాద్యా స్సుమనస స్సర్వార్థానా ముపక్రమే ।
యంనత్వా కృతకృత్యాస్స్యుస్తంనమామి గజాననమ్ ॥

శౌనకాదులకు సూతుడు కార్తీక పురాణమును చెప్పుట:

పూర్వం నైమిశారణ్యమునకు సూతమహర్షి రాగా ఆయనను శౌనకాది మునులు సత్కరించి, సంతుష్టుని చేసి, కైవల్యదాయకము అయిన కార్తీకమాస మహాత్మ్యమును వినిపించి మమ్ములను ధన్యులను చేయుమని కోరారు. వారి కోరికను మన్నించిన వ్యాసశిష్యుడైన సూతర్షి -"శౌనకాదులారా! మా గురువుగారైన భగవాన్ వేదవ్యాస మహర్షులవారు ఈ కార్తీక మహాత్మ్యాన్ని - అష్టాదశ పురాణములలోని స్కాంద, పద్మ పురాణములు రెండింటా కూడా వక్కాణించి వున్నారు. ఋషి రాజైన శ్రీ వశిష్ఠుల వారిచే, రాజర్షియైన జనకునకు స్కాంద పురాణములోనూ, హేలావిలాస బాలామణియైన సత్యభామకు, లీలామానుష విగ్రహుడైన శ్రీకృష్ణపరమాత్మ చే పద్మ పురాణములోనూ ఈ కార్తీక మహాత్మ్యము సవిస్తరముగా చెప్పబడినది. మన అదృష్టము వలన నేటి నుంచే కార్తీక మాసము ప్రారంభము. కావున - ప్రతి రోజూ నిత్య పారాయణగా - ఈ మాసమంతా కార్తీక పురాణ శ్రవణమును చేసికొందాము. ముందుగా స్కాందపురాణములోని వశిష్ఠ ప్రోక్తమైన కార్తీక మహాత్మ్యాన్ని వినిపిస్తాను - వినండి' అంటూ చెప్పసాగాడు.

జనకుడు వశిష్ఠుని కార్తీక వ్రత ధర్మములడుగుట:

పూర్వమొకసారి సిద్ధాశ్రమములో జరుగుతున్న యాగానికవసరమైన ద్రవ్యార్థియైన వశిష్ఠ మహర్షి జనకమహారాజు ఇంటికి వెళ్లాడు. జనకునిచే యుక్త మర్యాదలు అందుకుని తను వచ్చిన విషయాన్ని ప్రస్తావించాడు. అందుకు జనకుడు ఆనందముగా అంగీకరించి - 'హే బ్రహ్మర్షీ! మీ యగానికెంత ద్రవ్యం కావాలన్నా నిరభ్యంతరంగా ఇస్తాను. కాని సర్వపాపహరమైన ధర్మసూక్ష్మాన్ని నాకు తెలియజేయండి. సంవత్సరములోని సర్వమాసముల కంటెను కార్తీకమాసం అత్యంత మహాఇమానహిమాన్వితమైనదనీ, తద్వ్రతాచరణము సమస్తధర్మాల కన్నా శ్రేష్ఠతరమైనదనీ చెబుతూ వుంటారు గదా! ఆ నెలకు అంతటి ప్రాముఖ్యమెలా కలిగింది? ఆ వ్రతము ఉత్కృష్ట ధర్మమే విధంగా అయింది' అని అడుగగా - మునిజన వశిష్ఠుడైన వశిష్ఠుడు, జ్ఞాన హాసమును చేసతూ, ఇలా ప్రవచించినాడు.

జనక మహారాజా! పూర్వజన్మలలో ఎంతో పుణ్యం చేసుకుంటేనేగాని, సత్వశుద్ధి కలుగదు. ఆ సత్వశుద్ధి కలిగిన నీ వంటి వారికి మాత్రమే ఇటువంటి పుణ్యప్రదమైనదీ, వినినంత మాత్రం చేతనే అన్ని పాపాలనూ అణచి వేసేదీ అయిన - కార్తీక మహాత్మ్యమును వినాలనే కోరిక కలుగుతుంది. విశ్వశ్రేయాన్ని దృష్టిలో వుంచుకుని నీవడిగిన సంగతులను చెబుతాను, విను. ఓ విదేహా! కార్తీకమాసములో సూర్యుడు తులా సంక్రమణముతో వుండగా - సహృదయతతో ఆచరించే స్నాన, దాన, జప, పూజాదులు విశేష ఫలితాలు ఇస్తాయని తెలుసుకో, ఈ కార్తీక వ్రతాన్ని తులాసంక్రమణాదిగా గాని, శుద్ధ పాడ్యమి నుంచి గాని ప్రారంభించాలి. ముందుగా -

శ్లో॥ "సర్వపాప హరం పుణ్యం వ్రతం కార్తీక సంభవం
నిర్విఘ్నం కురుమే దేవ దామోదర నమోస్తుతే ॥

ఓ దామోదరా! నా ఈ వ్రతమును నిర్విఘ్నముగా పూర్తి చేయుము అని నమస్కార పూర్వకముగా సంకల్పించుకొని, కార్తీక స్నానమాచరించాలి. కార్తీకమందలి సూర్యోదయ వేళ కావేరీ నదిలో స్నానం చేసిన వారి పుణ్యం చెప్పనలవి కాదు. సూర్యుడు తులారాశిని ప్రవేశించగానే గంగానది ద్రవరూపం ధరించి సమస్త నదీజలాల యందునా చేరుతుంది. వాపీకూప తటాకాది సమస్త సజ్జలాశయాలలోనూ కూడా విష్ణువు వ్యాపించి వుంటాడు. బ్రాహ్మణుడయిన వాడు కార్తీక మాసములో నదికి వెళ్ళి హరి ధ్యానయుతుడై, కాళ్లూ-చేతులూ కడుగకొని, ఆచమించి,

శుద్ధాత్ముడై మంత్ర యుక్తముగా భైరవాజ్ఞను తీసుకుని మొలలోతు నీటిలో నిలబడి స్నానము చేయాలి. పిదప దేవతలకు, ఋషులకు పితరులకు తర్పణాలను వదలాలి. అనంతరం అఘమర్షణ మంత్రజపంతో, బొటనవ్రేలి కొనతో నీటిని కెలికి, మూడు దోసెల్ల నీళ్లను గట్టుమీకు జిమ్మి, తీరము చేయాలి. చేరగానే కట్టుబట్ట కొనలను పిండాలి. దీనినే యక్ష తర్పణమంటారు. అనంతరం ఒళ్లు తుడుచుకుని, పొడివి-మడివి-తెల్లనివైన వస్త్రాలను ధరించి హరిస్మరణ చేయాలి. గోపీచందనంతో 12 ఊర్ధ్వపుండ్రాలను ధరించి, సంధ్యావందన గాయత్రీ జపాలను ఆచరించాలి. ఆ తరువాత - ఔపాసనము చేసి, బ్రహ్మయజ్ఞ మాచరించి, తన తోటలో నుంచి చక్కటి పుష్పాలను తెచ్చి శంఖ-చక్రధారియైన విష్ణువును - సాలగ్రామ మందు నుంచి సభక్తిగా షోడశోపచారాలతోనూ పూజించాలి. అటు పిమ్మట కార్తీక పురాణ పఠనమును గాని, శ్రవణమును గాని ఆచరించినవాడై. స్వగృహాన్ని చేరి, దేవతార్చన, వైశ్వ దేవాదులను చేసి, భోజనమును చేసి, ఆచమించి పునః పురాణ కాలక్షేపమును చేయాలి.

సాయంకాలము కాగానే ఇతర వ్యాపారాలనన్నిటినీ విరమించుకుని - శివాలయములోగాని, విష్ణ్వాలయములోగాని యథాశక్తి దీపాలను పెట్టి అక్కడి స్వామిని ఆరాధించి, భక్ష్యభోజ్యాదులు నివేదించి శుద్ధ వాక్కులతో హరిని స్తుతించి నమస్కరించుకోవాలి.

ఈ కార్తీక మాసము పొడుగునా ఈ విధంగా వ్రతాన్ని చేసిన వారు పునరావృత్తి రహితమైన వైకుంఠాన్ని పొందుతున్నారు. ప్రస్తుత పూర్వ జన్మార్జితాలైన పాపాలన్నీ కూడా కార్తీక వ్రతం వలన హరించుకుపోతాయి.

వర్ణాశ్రమ లింగవయోభేద రహితముగా ఈ వ్రతాన్ని ఎవరాచరించినా సరే వాళ్లు మోక్షార్హులు కావడం నిస్సంశయము. జనకరాజా! తనకు తానుగా ఈ వ్రతాన్ని ఆచరించలేక పోయినా - ఇతరులు చేస్తుండగా చూసి, అసూయారహితుడై ఆనందించే వానికి - ఆ రోజు చేసిన పాపాలన్నీ విష్ణుకృపాగ్నిలో ఆహుతి అయిపోతాయి.

## ద్వితీయాధ్యాయము

## కార్తీక సోమవార వ్రతము

వశిష్ఠ ఉవాచ: హే జనక మహారాజా! వినినంత మాత్రము చేతనే మనోవాక్కాయముల ద్వారా చేయబడిన సర్వపాపాలనూ హరింపచేసే కార్తీక మహాత్మ్యాన్ని శ్రద్ధగా విను సుమా! అందునా, ఈ నెలలో శివప్రీతిగా సోమవార వ్రతము ఆచరించేవాడు తప్పనిసరిగా కైలాసాన్ని చేరుకుంటాడు. కార్తీకమాసంలో వచ్చే ఏ సోమవారము నాడయినా సరే - స్నాన, జపాదులను ఆచరించిన వాడు వెయ్యి అశ్వమేథాల ఫలాన్ని పొందుతాడు. ఈ సోమవార వ్రతవిధి ఆరురకాలుగా ఉంది. 1.ఉపవాసము 2. ఏకభక్తము 3. నక్తము 4. అయాచితము 5.స్నానము 6.తిలదానము

1.ఉపవాసము: శక్తిగలవారు కార్తీక సోమవారం నాడు పగలంతా అభోజనము (ఉపవాసము)తో గడిపి, సాయంకాలమున శివాభిషేకం చేసి, నక్షత్ర దర్శనానంతరమున తులసితీర్థము మాత్రమే సేవించాలి.

2. ఏకభక్తము: సాధ్యం కాని వాళ్లు ఉదయం స్నాన దాన జపాలను యథావిధిగా చేసికొని - మధ్యాహ్నమున భోజనము చేసి, రాత్రి భోజనానికి బదులు శైవ తీర్థమో తులసీ తీర్థమో మాత్రమే తీసుకోవాలి.

3.నక్తము: పగలంతా ఉపవసించి, రాత్రి నక్షత్ర దర్శనం తరువాత భోజనమునకు గాని, ఉపాహారమును గాని స్వీకరించాలి.

4. అయాచితము: భోజనానికై తాము ప్రయత్నించకుండా ఎవరైనా - వారికి వారుగా పిలిచి పెడితే మాత్రమే భోజనం చేయడం 'అయాచితము'

5.స్నానము: పై వాటికి వేటికీ శక్తి లేని వాళ్లు సమంత్రక స్నాన జపాదులు చేసినప్పటికిన్నీ చాలును.

6. తిలదానము: మంత్ర జపవిధులు కూడా తెలియని వాళ్ళు కార్తీక సోమవారము నాడు నువ్వులను దానము చేసినా సరిపోతుంది.

పై 'ఆరు' పద్ధతులలో దేవిని ఆచరించినా కార్తీక సోమవార వ్రతము చేసినట్లే అవుతుంది. కానీ, తెలుసుండి కూడా ఏ ఒక్కదానినీ ఆచరించని వాళ్లు ఎనిమిది యుగాల పాటు కుంభీపాక రౌరవాది నరకాల్ని పొందుతారని ఆర్షవాక్యము. ఈ వ్రతాచరణము వలన అనాథలూ, స్త్రీలు కూడా విష్ణు సాయుజ్యమును పొందుతారు. కార్తీక మాసములో వచ్చే ప్రతి సోమవారము నాడూ కూడా పగలు ఉపవసించి, రాత్రి నక్షత్ర దర్శనానంతరము మాత్రమే భోజనము చేస్తూ - ఆ రోజంతా భగవద్ధ్యానములో గడిపే వాళ్లు తప్పనిసరిగా శివసాయుజ్యాన్ని పొందుతారు. సోమవార వ్రతాన్ని చేసే వాళ్లు నమక చమక సహితంగా శివాభిషేకమును చేయుట ప్రధానమని తెలిసికోవాలి. ఈ సోమవార వ్రతఫలాన్ని వివరించే ఒక ఇతిహాసాన్ని చెబుతాను విను.

### నిష్ఠురి కథ

పూర్వం ఒకానొక బ్రాహ్మణునికి 'నిష్ఠురి' అనే కూతురుండేది. పుష్టిగానూ, అందంగానూ, అత్యంత విలాసంగానూ వుండే ఈమెకు గుణాలు మాత్రం శిష్టమైనవి అబ్బలేదు. దుష్టగుణ భూయిష్ఠమై, గయ్యాళిగానూ, కాముకురాలుగానూ చరించే ఈ 'నిష్ఠురి'ని ఆమె గుణాల రీత్యా 'కర్కశ' అని కూడా పిలుస్తూ వుండేవారు. బాధ్యత ప్రకారం తండ్రి ఆ కర్కశను సౌరాష్ట్ర బ్రాహ్మణుడయిన మిత్రశర్మ అనేవానికిచ్చి, తన చేతులు దులిపేసుకున్నాడు. ఆ మిత్రశర్మ చదువుకున్నవాడు, సద్గుణవంతుడు, సదాచారపరుడూ, సరసుడూ మాత్రమేకాక సహృదయుడు కూడా కావడం వలన - కర్కశ ఆడినది పాటగా, పాడినది పాటగా కొనసాగజొచ్చింది. పైగా ఆమె ప్రతి రోజూ తన భర్తను తిడుతూ, కొడుతూ వుండేది. అయినప్పటికీ కూడా మనసుకు నచ్చినది కావడం వలన మోజు చంపుకోలేక, భార్యను పరత్యజించడం తన వంశానికి పరువు తక్కువనే ఆలోచన వలన - మిత్రశర్మ, కర్కశ పెట్టే కఠిన హింసలనన్నిటినీ భరిస్తూనే వుండేవాడు గాని, ఏనాడు ఆమెను శిక్షించలేదు. ఆమె ఎందరో పరపురుషులతో అక్రమ సంబంధమును పెట్టుకుని, భర్తను, అత్తమామలను మరింత నిర్లక్ష్యంగా చూసేది. అయినా భర్త సహించాడు. ఒకానొకనాడు ఆమె యొక్క విటులలో ఒకడు ఆమెను పొందుతూ 'నీ మొగుడు బ్రతికి వుండటం వల్లనే మనం తరచూ కలుసుకోలేకపోతున్నాం' అని రెచ్చగొట్టడంతో - కర్కశ ఆ రాత్రికి రాత్రే నిద్రాముద్రితుడై వున్న భర్త శిరస్సును ఒక పెద్ద బండరాతితో మోది చంపివేసి, ఆ శవాన్ని తానే మోసుకుని పోయి ఒక పాడుబడిన నూతిలోనికి విసిరి వేసింది. ఇదంతా గమనించినప్పటికీ కూడా ఆమె విటుల బలం ఎక్కువ కావడం చేత, అత్తమామలు ఆమెనేమీ అనలేక, తామే ఇల్లు వదిలి పారిపోయారు.

అంతటితో మరింత స్వతంత్రించిన కర్కశ కన్నుమిన్నుగానని కామావేశంతో అనేక మంది పురుషులతో సంపర్కము పెట్టుకొని - ఎందరో సంసార స్త్రీలను కూడా తన మాటలతో భ్రమింప జేసి తన విటులకు తార్చి, తద్వారా సొమ్ము చేసుకునేది. కాలం గడిచింది. దాని బలం తగ్గింది. యవ్వనం తొలగింది. శరీరంలోని రక్తం పలచబడటంతో 'కర్కశ' జబ్బు పడింది. అసంఖ్యాక

పురుషోత్తములతో సాగించిన శృంగార క్రీడల పుణ్యమా అని, అనూహ్యామైన వ్యాధులు సోకాయి. పూలగుత్తిలాంటి మేను పుళ్లుపడిపోయినది. జిగీబిగీ తగ్గిన కర్కశ వద్దకు విటుల రాకపోకలు తగ్గిపోయాయి. ఆమె సంపాదన పడిపోయింది. అందరికందరూ ఆమెను అసహ్యించుకోసాగారు. తుదకు అక్రమపతులకే గాని సుతులకు నోచుకోని ఆ నిష్ఠుర, తినడానికి తిండి, ఉండేందుకింత ఇల్లూ, వంటినిండా కప్పుకునేందుకు వస్త్రము కూడా కరువైనదై, సుఖవ్రణాలతో నడివీధినపడి మరణించింది. కర్కశ శవాన్ని కాటికి మోసుకుపోయే దిక్కుకూడా లేకపోయింది. యమదూతలు ఆ జీవిని పాశబద్ధను చేసి, నరకానికి తీసుకు వెళ్లారు. యముడామెకు దుర్భరమైన శిక్షలను విధించాడు.

భర్తృద్రోహికి భయంకర నరకం:

భర్తను విస్మరించి పరపురుషులను ఆలింగనము చేసుకున్న పాపానికి - ఆమె చేత మండుతున్న ఇనుపస్తంభాన్ని కౌగిలింపచేశాడు. భర్త తలను బ్రద్ధలు కొట్టినందుకు - ముండ్ల గదలతో ఆమె తల చిట్లేటట్లు మోదించాడు. భర్తను దూషించినందుకు కొట్టినందుకు, తన్నినందుకు, దాని పాదాలను పట్టుకుని, కఠినశిలలపై వేసి బాదించాడు. సీసమును గాని చెవులలో పోయించాడు. కుంభీపాక నరకానికి పంపాడు. ఆమె పాపాలకు గాను ఆమె ముందరి పది తరాలవారూ, తదుపరి పది తరాలవారూ - ఆమెతో కలిసి మొత్తం 21 తరాల వాళ్లూ కుంభీపాకములో కుమిలిపోసాగారు. నరకానుభవము తర్వాత ఆమె పదిహేనుసార్లు భూమిపై కుక్కగా జన్మించినది. పదిహేనవ పర్యాయమున కళింగ దేశములో కుక్కగా పుట్టి, ఒకానొక బ్రాహ్మణ గృహములో వుంటూ వుండేది.

సోమవార వ్రతఫలముచే కుక్క కైలాసమందుట:

ఇలా వుండగా, ఒక కార్తీక సోమవారము నాడా బ్రాహ్మణుడు పగలు ఉపవాసముండి, శివాభిషేకాదులను నిర్వర్తించి, నక్షత్ర దర్శనానంతరము, నక్త స్వీకారానికి సిద్ధపడి, ఇంటి బయలులో బలిని విడిచి పెట్టాడు. ఆనాడంతా ఆహారము దొరకక పస్తుపడి వున్న కుక్క ప్రదోష దినాన ఆ బలి అన్నాన్ని భుజించినది. బలి భోజనము వలన దానికి పూర్వస్మృతి కలిగి - "ఓ విప్రుడా! రక్షింపు"మని కుయ్యి పెట్టినది. దాని అరుపులు విని వచ్చిన విప్రుడు - కుక్క మాటలాడటాన్ని గమనించి విస్తుపోతూనే - "ఏమి తప్పు చేశావు? నిన్ను నేనెలా రక్షించగలను?" అని అడిగాడు.

అందుకా కుక్క 'ఓ బ్రాహ్మణుడా! పూర్వజన్మలో నేనొక విప్ర వనితను. కామముతో కండ్లు మూసుకు పోయి, జారత్వానికి ఒడిగట్టి, భర్తృహత్యకూ, వర్ణసంకరానికి కారకురాలినైన పతితను. ఆయా పాపాలకు అనుగుణంగా అనేక కాలం నరకంలో చిత్రహింసలనుభవించి ఈ భూమిపై ఇప్పటికి 14 సార్లు కుక్కగా పుట్టాను. ఇది 15వ సారి. అటువంటిది - ఇప్పుడు నాకు హఠాత్తుగా

ఈ పురాజన్మలెందుకకు గుర్తుకు వచ్చాయో అర్థము కావడం లేదు. దయచేసి విశదపరుచుమని కోరినది.

బ్రాహ్మణుడు సర్వాన్నీ జ్ఞాన దృష్టి చేత తెలుసుకుని 'శునకమా! ఈ కార్తీక సోమవారమునాడు ప్రదోషవేళ వరకు పస్తుపడి వుండి - నాచే విడువబడిన బలిభక్షణమును చేయుట వలననే నీకీ పూర్వజన్మ జ్ఞానము కలిగిన'దని చెప్పాడు. ఆపై నా జాగిలము 'కరుణామయుడైన ఓ బ్రాహ్మణుడా! నాకు మోక్షమెలా సిద్ధించునో ఆనతీయుమని కోరిన మీదట, దయాళువైన ఆ భూసురుడు తాను చేసిన అనేకానేక కార్తీక సోమవార వ్రతాలలో - ఒక సోమవారం నాటి వ్రతఫలాన్ని ఆ కుక్కకి ధారపోయగా, ఆ క్షణమే ఆ కుక్క తన శునక దేహాన్ని పరిత్యజించి - దివ్య స్త్రీ శరీరిణియై - ప్రకాశమానహార వస్త్ర విభూషితయై, పితృదేవతా సమన్వితయై కైలాసమునకు చేరినది కాబట్టి ఓ జనక మహారాజా! నిస్సంశయ నిశ్రేయసదాయియైన ఈ కార్తీక సోమవార వ్రతాన్ని నీవు తప్పనిసరిగా ఆచరించు' అంటూ వశిష్ఠుడు చెప్పడం ఆపాడు.

ద్వితీయోధ్యాయ స్సమాప్తః

మొదటి రోజు పారాయణము సమాప్తము

సంపూర్ణ కార్తీక మహాపురాణము

రెండవరోజు పారాయణము

తృతీయాధ్యాయము

బ్రహ్మర్షియైన శ్రీ వశిష్ఠ మహర్షి రాజర్షియైన జనకునికి ఇంకా ఇలా చెప్పసాగాడు; 'రాజా! స్నాన దాన జప తపాలలో దేనినిగానీ, ఈ కార్తీకమాసంలో ఏ కొద్దిపాటిగా ఆచరించినప్పటికీ కూడా - అది అక్షయమైన ఫలాన్నిస్తుంది. ఎవరైతే సుఖలలాసులై శరీర కష్టానికి జడిసి కార్తీక వ్రతాన్ని ఆచరించరో - అటువంటి వాళ్లు వంద జన్మలు కుక్కలుగా పుడతారు.

శ్లో॥ పౌర్ణమ్యాం కార్తీకేమాసి స్నానాందీస్తు నాచరన్ ।
కోటిజన్మసు చండాలయోనౌ సంజాయతే నృప ॥

శ్లో॥ క్రమాద్యోనౌ సముత్పన్నో భవతి బ్రహ్మరాక్షసః ।
అత్రైవోదాహరంతీ మ మితిహాసం పురాతనమ్ ॥

భావం: కార్తీక పౌర్ణమినాడు, స్నాన దాన జపోపవాసాలలో ఏ ఒక్కటీ కూడా ఆచరించని వాళ్లు కోటి పర్యాయాలు చండాలపు యోనులలో జన్మించి, తుదకు బ్రహ్మరాక్షసులుగా పరిణమిస్తారు. ఇందుకు ఉదాహరణంగా ఒక గాథను చెబుతాను విను.

తత్త్వనిష్ఠోపాఖ్యానము:

అతి పూర్వకాలంలో ఆంధ్రదేశంలో తత్త్వనిష్ఠుడనే బ్రాహ్మణుడు వుండేవాడు. సకల శాస్త్ర పారంగతుడు, అసత్యములను పలుకని వాడూ, అన్ని భూతముల యందునూ దయాళువూ, తీర్థాటన ప్రియుడూ అయిన ఆ విప్రుడు ఒకానొక తీర్థయాత్రా సందర్భముగా ప్రయాణిస్తూ మార్గమధ్యములో గోదావరీ తీరానగల ఒకానొక ఎత్తయిన మఱ్రిచెట్టు మీద - కారు నలుపు కాయచ్ఛాయ గలవాళ్లూ, ఎండిన డొక్కలు కలవాళ్లూ, ఎఱ్ఱని నేత్రములు - గడ్డములూ కలవాళ్లూ, గ్రుచ్చబడిన ఇనుపతీగెలకు మల్లే పైకి నిక్కి వున్న తలవెంట్రుకలతో, వికృత వదనారవిందాలతో, కత్తులూ, కపాలాలూ ధరించి, సర్వజీవ భయంకరులుగా వున్న ముగ్గురు బ్రహ్మరాక్షసులను చూశాడు. ఆ రాక్షసుల వలన భయము చేత ఆ మఱ్రిచెట్టు నాలుగు వైపులా కూడా పన్నెండు మైళ్ల దూరంలో ఎక్కడా ప్రాణి సంచారమనేదే వుండేది కాదు. అటు వంటి భయంకర స్వరూపులైన ఆ రాక్షసులను అల్లంత దూరము నుంచే చూసిన తత్వనిష్ఠుడు అదిరిపడ్డాడు. దానితో బాటే ఆ రాక్షసులు కూడా తనను చూడటంతో మరింత భయపడినవాడై - శోకాకుల చిత్తముతో శ్రీహరిని స్మరించసాగాడు.

తత్వనిష్ఠుడి శరణాగతి

శ్లో॥ త్రాహి దేవేశ లోకేశ! త్రాహి నారాయ ణావ్యయ
సమస్త భయవిధ్వంసిన్! త్రాహిమాం శరణాగతం
వ్యాసం పశ్యామి దేవేశ! త్వత్తోహం జగదీశ్వర ॥

అంటే - "దేవతలకూ, లోకాలకూ కూడా యజమానివయిన వాడా! నారాయణా! అవ్యయా! నన్ను కాపాడు. అన్నిరకాల భయాలనూ అంతము చేసేవాడా! నిన్నే శరణుకోరుతున్న నన్ను రక్షిం చు. ఓ జగదీశ్వరా! నువ్వు తప్ప ఇంకొక దిక్కు ఎరుగని వాడను. నన్ను కాపాడు రక్షించు" అని ఎలుగెత్తి స్మరించుచు రాక్షస భయముతో అక్కడ నుంచి పారిపోసాగాడు. అతనిని పట్టి వధించాలనే తలంపుతో ఆ రాక్షసత్రయము అతని వెనుకనే పరుగెత్తసాగినది. రక్కసులా పారునికి చేరువవుతున్న కొద్దీ, సాత్వికమైన విప్ర తేజస్సు కంటబడటం వలనా - తెరిపి లేకుండా అతనిచే స్మరించబడుతూన్న హరినామము చెవులబడుట వలనా - వెంటనే వారికి జ్ఞానోదయమయింది. అదే తడవుగా ఆ బాపనికి ఎదురుగా చేరుకొని, దండ ప్రణామాలాచరించి, అతనికి తమ వలన కీడు కలుగబోదని నమ్మబలికి, 'ఓ బ్రాహ్మణుడా! నీ దర్శనముతో మా పాపాలు నశించిపోయాయి. అని పునః పునః నమస్కరించారు. వారి నమ్రతకు కుదుట పడిన హృదయముతో - తత్వనిష్ఠుడు 'మీరెవరు? చేయరాని పనులు వేనిని చేయడం వలన ఇలా అయిపోయారు? మీ మాటలు వింటుంటే బుద్ధిమంతుల్లా వున్నారు. మరి ఈ వికృత రూపాలేమిటి? నాకు వివరముగా చెప్పండి. మీ భయబాధావళి తొలగే దారి చెబుతాను' అన్నాడు.

ద్రావిడుని కథ:

పారుని పలుకులపై, ఆ రక్కసులలో ఒకడు తన కథనిలా వినిపించసాగాడు. 'విప్రోత్తమా! నేను ద్రావిడుడను. ద్రవిడ దేశమందలి మంధరమనే గ్రామాధికారినైన నేను, కులానికి బ్రాహ్మణుడనే అయినా - గుణానికి కుటిలుడనీ, వంచనామయ వచః చమత్కారుడినీ అయి వుండేవాడిని. నా కుటుంబ శ్రేయస్సుకై, అనేక మంది విప్రుల విత్తాన్ని హరించాను. బంధువలకుగాని, బ్రాహ్మణులకు గాని ఏనాడూ పట్టెడన్నమయినా పెట్టి ఎరుగను. నయవంచనలతో బ్రాహ్మణ ధనాన్ని అపహరించడం చేత నా కుటుంబము నాతో సహా ఏడు తరాల వాళ్లు అధోగతుల పాలయిపోయారు. మరణానంతరము దుస్సహమైన నరకయాతనలు అనుభవించి చివరికిలా బ్రహ్మరాక్షసుడనయ్యాను. కృపాయత్త చిత్తుడవై - నాకు ముక్తినిచ్చే యుక్తిని చెప్పు' అన్నాడు.

ఆంధ్రదేశీయుని గాథ:

రెండవ రాక్షసునిలా విన్నవించుకోసాగేడు - 'ఓ పవిత్రుడా! నేను ఆంధ్రుడను. నిత్యమూ నా తల్లిదండ్రులతో కలహించుచు, వారిని దూషించుచు వుండే వాడిని. నేను నా భార్యాపిల్లలతో మృష్టాన్నాన్ని తింటూ, తల్లిదండ్రులకు మాత్రం చద్ది కూటిని పడవేసే వాడిని. బాంధవ బ్రాహ్మణ కోటికేనాడూ ఒక పూటయినా భోజనము పెట్టక - విపరీతముగా ధనార్జన చేసి ఆ కావరముతో బ్రతికే వాడిని. ఆ శరీరము కాలం చేశాక నరకానపడి ఘోరాతి ఘోరమైన బాధలనుభవించి చివరికి ఇక్కడిలా పరిణమించాను. ఆ ద్రావిడునికివలెనే - నాకు కూడా ముక్తి కలిగే దారిని బోధించుము' అని అన్నాడు.

పూజారి కథ:

అనంతరం మూడవ రాక్షసుడు ముందరకు వచ్చి ఇలా మొరపెట్టనారంభించాడు. 'ఓ సదాచార సంపన్నుడా! నేను ఆంధ్రదేశపు బ్రాహ్మణుడను. విష్ణ్వాలయంలో పూజారిగా వుండేవాడిని. కాముకుడనూ, అహంభావినీ, కఠినవచస్కుడనీ అయిన నేను - భక్తులు స్వామి వారికి అర్పించే కైంకర్యాలన్నిటినీ - నా వేశ్యలకు అందచేసి, విష్ణు సేవలను సక్రమముగా చేయక గర్వముతో తిరిగేవాడిని. తుదకు గుడి దీపాలలో నూనెను కూడా హరించి, వేశ్యలకు ధారపోసి వారితో సంభోగ సుఖములనుభవించుచు పాపపుణ్య విచక్షణా రహితుడనై ప్రవర్తించేవాడిని. ఆ నా దోషాలకు ప్రతిఫలంగా నరకమును చవి చూసి, అనంతరము ఈ భూమిపై నానావిధ హీన యోనులలోనూ, నానా నీచ జన్మలనూ ఎత్తి కట్టకడకీ బెట్టిదయిన బ్రహ్మరాక్షసునిగా పరిణమించాను. ఓ సదాయుడా! నన్ను మన్నించి - మరలా జన్మించే అవసరం లేకుండా - మోక్షాన్ని పొందే మార్గాన్ని ప్రవచించవయ్యా' అని ప్రార్థించాడు.

బ్రహ్మరాక్షసులు ఉత్తమ గతి పొందుట:

తమ తమ పూర్వ భవకృత మహాఘరాశికి - ఎంతగానో పశ్చాత్తాప పడుతూన్న ఆ రక్కసులకు అభయమిచ్చి 'భయపడకండి - నాతో కలిసి కార్తీక స్నానానికి రండి. మీ సమస్త దోషాలూ నశించిపోతాయి' అని చెప్పి వారిని తన వెంట బయలు దేర దీశాడా బ్రాహ్మణుడు. అందరూ కలిసి కావేరీ నదిని చేరారు. అక్కడ తత్వనిష్ఠుడు - బ్రహ్మరాక్షసుల నిమిత్తమై సంకల్పం చేసి తాను స్వయముగా ముందు స్నానం చేసి, పిమ్మట రక్కసుల చేత కూడా స్నానం చేయించాడు. అనంతరము -

శ్లో ॥ అముకానాం బ్రహ్మరాక్షసత్వ నివారణార్థం ।
అస్యాం కావేర్యాం - ప్రాతః స్నాన మహం కరిష్యే ॥

అనే సంకల్పములతో అతడు విధివిధానముగా స్నానం చేసి, తత్ఫలాన్ని బ్రహ్మరాక్షసులకు ధారపోయగా - వారు విగతదోషులూ - దివ్యవేషులూ అయి తక్షణమే వైకుంఠానికి ప్రయాణమయ్యారు.

విదేహరాజా! అజ్ఞానము వలన కాని, మోహ - ప్రలోభావల వలన గాని, ఏ కారణము చేతనైనా గాని - కార్తీక మాస సూర్యోదయ కాలాన కావేరీ నదిలో స్నానమాచరించి, విష్ణువును పూజించిన వాళ్లకు నిస్సందేహముగా పది వేల యజ్ఞాలు చేసిన ఫలము కలుగుతుంది. అందువల్ల - ఏదో ఒక ఉపాయం చేసైనా సరే కార్తీకంలో కావేరీ స్నానమును తప్పకుండా చేయాలి. కావేరీలో సాధ్యము కాకపోతే గోదావరిలోనైనా, మరెక్కడయినా సరే - ప్రాతః స్నానం మాత్రం చేసి తీరాలి. అలా ఎవ్వరైతే కార్తీక దామోదర ప్రీతిగా ప్రాతః స్నానము చేయరో, వాళ్లు పది జన్మలు చండాలపు యోనులలో పుట్టి, అనంతరము ఊరపందులుగా జన్మిస్తారు సుమా!

కాబట్టి - ఎటువంటి మీమాంసతోటీ నిమిత్తం లేకుండా స్త్రీలుగాని, పురుషులుగాని కార్తీక మాసంలో తప్పనిసరిగా ప్రాతః స్నానం ఆచరించాలి.

## చతుర్థాధ్యాయము:

జనకుడు అడుగుతున్నాడు: "హే బ్రహ్మర్షీ! నువ్వింతవరకూ కార్తీక మహాత్మ్యాన్ని అసాధారణ ధోరణిలో చెప్పావు. అయితే ఏ సంకల్పంతో ఈ వ్రతం ఆచరించాలో - ఏఏ దానాలు చేయాలో కూడా తెలియజేయి."

వశిష్ఠ ఉవాచ: అన్ని పాపాలనూ మన్ను చేసేదీ, పుణ్యాలను అగణ్యాలుగా మార్చేదీ అయిన ఈ కార్తీక వ్రతానికి ఫలానా 'సంకల్పము' అనేది హాస్యాస్పదమయిన విషయము.

ఈ కార్తీక వ్రతం ఆచరించడం వలన నశించనంతటి పాపం అనేది ఇంకా ఈ ప్రపంచంలో పుట్టనే లేదు.

అందువల్ల వ్రత ధర్మాలనూ, తత్ఫలాలనూ చెబుతాను విను.

కార్తీకమాసపు సాయంకాలము శివాలయములో దీపారాధన చేయడం వలన అనంతమైన ఫలము వస్తుంది. శివాలయ గోపురద్వార, శిఖరాలయందుగానీ - శివలింగ సన్నిధినిగానీ దీపారాధన చేయడం వలన అన్ని పాపాలూ అంతరించిపోతాయి. ఎవరయితే కార్తీకములో శివాలయములో ఆవునేతితోగాని, నువ్వులనూనెతో గాని, ఇప్ప-నారింజనూనెలతో గాని దీప సమర్పణ చేస్తారో -వాళ్లు ధర్మవేత్తలవుతారు. ఆఖరికి ఆముదపు దీపాన్నయినా సమర్పించిన వాళ్లు అత్యంత పుణ్యవంతులవుతారు. కనీసము, కాంక్షతో గాని - నలుగురి నడుమా బడాయి కోసం గానీ దీపాన్నిచ్చే వాళ్లు కూడా శివప్రియులవుతారు. ఇందుకు ఉదాహరణగా ఒక చిన్న కథ చెబుతాను విను.

## కార్తీక దీపారాధనా మహిమ

పూర్వము పాంచాలదేశాన్ని పరిపాలించే మహారాజొకడు, కుబేరుని మించిన సంపద కూర్చుకుని వున్నా, కుమారులు లేని కారణంగా క్రుంగిపోయిన వాడై, కురంగపాణికై తపస్సుకు కూర్చున్నాడు. మధ్యకాలంలో అటుగా వచ్చిన పిప్పలుడనే ముని - అతని తపస్సుకు కారణమడిగి తెలుసుకుని, 'ఓ రాజా! ఈ మాత్రపు కోరికకు తపస్సుతో పని లేదు. కార్తీక మాసములో శివప్రీతిగా వ్రతమాచరించి, బ్రాహ్మణులను దీపదాన దక్షిణలతో సంతోషపెట్టు. అలా చేస్తే - నీకు తప్పక పుత్రక సంతానము కలుగుతుందని చెప్పాడు. ఋషి వాక్యమును శిరోధార్యముగా తలచి - ఆ పాంచాలుడు తన పట్టణము చేరి, కార్తీక వ్రతమాచరించి, శివప్రీతికై బ్రాహ్మణులకు దీపదానములను చేశాడు. తత్ఫలముగా మహారాణి నెల తప్పి, యుక్తకాలములో పురుష శిశువును ప్రసవించింది. రాజ దంపతులు ఆ శిశువుకి 'శత్రుజిత్తు' అని పేరు పెట్టారు.

శత్రుజిత్తు చరిత్రము:

ఆ శత్రుజిత్తు దినదిన ప్రవర్ధమానుడై పెరిగి, యువకుడై, వీరుడై వేశ్యాంగనా లోలుడై, అప్పటికీ తృప్తి చెందక, పరస్త్రీరక్తుడై, యుక్తా యుక్త విచక్షణా నాస్తికుడై, శాస్త్ర ధిక్కారియై, వర్ణసంకర కారకుడై హితవు చెప్పవచ్చిన వారిని చంపుతానని బెదరించుచు, స్వేచ్ఛాచారియై ప్రవర్తింపసాగేడు. అటు వంటి సందర్భంలో - సౌందర్యరాశి సింహమధ్యమా, అరటి దోనెల వంటి తొడలు గలదీ, పెద్ద పెద్ద పిరుదులూ, కుచాలూ, కన్నులూ కలదీ, చిలుకవలే చక్కని పలుకులు గలదీయైన ఒక బ్రాహ్మణ పత్ని తారసిల్లింది. శత్రుజిత్తు ఆమె పట్ల మోహితుడయ్యాడు. అనుపమాన సౌందర్య, శౌర్య, తేజో విరాజితుడైన ఈ యువరాజు పట్ల ఆ బాపనిది కూడా మోజు పడినది. తత్కారణముగా - ఆమె రోజూ రాత్రి తన భర్త నిద్రపోగానే - సంకేత స్థలంలో రాజకుమారుని కలిసి - సురత క్రీడలలో సుఖించేది. రంకూ-బొంకూ దాగవు గదా! ఏదో విధంగా ఈ సంగతి ఆ బాపని దాని భర్తకు తెలిసిపోయినది. అది మొదలు అతనొక కత్తిని ధరించి - ఈ రంకు జంటను ప్రత్యక్షంగా చూసి, వారి గొంతు ఉత్తరించాలని తిరుగుతున్నాడు. మహాకాముకురాలయిన జారిణిగాని, ఆ శత్రుజిత్తుగాని ఈ సంగతి ఎరుగరు.

రోజులిలా గడుస్తూ వుండగా ఒకానొక కార్తీక పౌర్ణమి సోమవారం నాడు రాత్రి ఆ కాముకులు తమ సురత క్రీడలకై ఒకానొక శిథిల శివాలయాన్ని సంకేత స్థానముగా ఎంచుకున్నారు. అపరరాత్రి వేళ వాళ్లు అక్కడ కలుసుకున్నారు. గర్భగుడిలో అంతా చీకటిగా వుంది. ఆ బాపనిది తన చీరచెంగు చింపి వత్తిని చేసింది. రాజకుమారుడు ఎక్కడినించో ఆముదమును తెచ్చాడు. ఇద్దరూ కలిసి అక్కడి ఖాళీప్రమిదలో ఆ రెంటినీ జోడించి దీపం పెట్టారు. ఆ దీపపు వెలుగులో ఒకరి అందాలొకరు చూసుకుంటూ సంభోగములో లీనమయ్యారు.

ఈ విషయాన్ని ఆ బాపన దాని మొగుడెలాగో తెలుసుకున్నాడు. కత్తి పట్టుకుని వచ్చాడు. ముందుగా శత్రుజిత్తునీ, అనంతరం తన భార్యనూ తెగనరికి - తాను కూడ ఆ అదే కత్తితో పొడుచుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ విధంగా వాళ్లు ముగ్గురూ ఆ రాత్రి అక్కడికక్కడే విగతజీవులు కాగానే - పాశహస్తులైన యమదూతలూ - పవిత్రాత్ములైన శివదూతలూ - ఒకేసారి అక్కడకు చేరారు. శివదూతలు రాకుమారుడినీ, రంకులాడినీ తమ విమానంలో కైలాసానికి తీసుకుపోసాగారు. యమదూతలు అమాయకపు బాపడిని తమతో నరకము వైపు లాగుకొని పోసాగారు. అందుకచ్చెరుపడిన పారుడు - "ఓ శివదూతలారా! కాని పని చేసిన వారికి కైలాసభోగము - నా వంటి సదాచారుడికి నరక యోగమునా?' అని ప్రశ్నించగా, అందులకా శివదూతలు - 'వీరెంత పాపాత్ములయినా - ఈ రోజు కార్తీక పూర్ణిమ సోమవారం కాబట్టి, శివాలయములో - అందునా - శిథిలాయములో శివలింగమునకు ఎదురుగా దీపారాధన చేశారు గనక, వారి పాపాలూ, నేరాలూ నశించి పుణ్యాత్ములయ్యారు. ఏ కారణం చేతనైనా సరే కార్తీక మాసములో అందునా పౌర్ణమినాడు, పైగా సోమవారమునాడు దేవాలయములో దీపారాధనము

చేయడం వలన అత్యధిక పుణ్యాత్ములైన వీళ్లని పాపకర్ములుగా భావించి చంపిన కారణంగా నువ్వు పుణ్యహీనుడివీ, పాపాత్ముడివీ అయ్యావు. అందుకే, నీకు నరకము - వీరికి కైలాసము' అని చెప్పారు.

బ్రాహ్మణుడికీ, శివపారిషదులకూ జరిగిన ఈ సంభాషణను విన్న శత్రుజిత్తు తాను కలుగ చేసుకుని, 'అయ్యలారా! దోషులము మేమైయుండగా, మాకు కైవల్యమిచ్చి మమ్మల్ని చంపి పుణ్యాత్ములను చేసిన ఆ అమాయకుడిని నరకానికి పంపడం భావ్యము కాదు. కార్తీక మాసము దొడ్డదయితే, అందునా పౌర్ణిమ గొప్పదయితే, సోమవారము మరీ ఘనమియనదయితే, దీపారాధాన మరీ పుణ్యకరమైనదయితే మాతో బాటే కలసి మరణించిన ఆ బాపనికి కూడా కైలాసమీయక తప్ప'దని వాదించడం జరిగింది. తత్ఫలముగా - శత్రుజిత్తు తానూ, తన ప్రియురాలూ ఆచరించిన వత్తీ, తైలముల పుణ్యము తాముంచుకుని, ఆ దీపమును వెలిగించిన పుణ్యమును బ్రాహ్మణునకు ధారపోయగా, శివదూతలా విప్రుని కూడా యమదూతల నుండి విడిపించి - తమతో కైలాసానికి తీసికొని వెళ్ళారు.

కాబట్టి, ఓ మిధిలానగరాధీశ్వరా! కార్తీక మాసములో తప్పనిసరిగా - శివాలయములోగాని, విష్ణ్వాలయంలో గాని దీపారాధన చేసి తీరాలి. నెల పొడుగునా చేసిన వాళ్లు జ్ఞానులై, తద్వారా మోక్షాన్ని పొందగలుగుతారు. అందునా, శివాలయములో చేసిన దీపారాధన నిరంతర మోక్షప్రదాయినిగా గుర్తించు. నా మాట విని - కార్తీక మాసము నెల పొడుగునా నువ్వు శివాలయములో దీపారాధన చెయ్యి.'

ఏవం శ్రీస్కాంద పురాణాంతర్గత కార్తీక మహాత్మ్యమందు చతుర్ధాధ్యాయ స్సమాప్తః

-: రెండవరోజు పారాయణము సమాప్తము:-

సంపూర్ణ కార్తీక మహాపురాణము

మూడవ రోజు పారాయణము

పంచమాధ్యాయము

'ఓ శివధనుస్సంపన్నా! జనకరాజా! శ్రద్ధగా విను. మనము చేసిన పాపాలన్నింటినీ - నశింపచేయగల శక్తి ఒక్క కార్తీక మాస వ్రతానికి మాత్రమే వుంది. కార్తీకమాసములో విష్ణుసన్నిధిని ఎవరయితే భగవద్గీతా పారాయణమును చేస్తారో - వారి పాపాలన్నీ కూడా పాము కుబుసములాగా తొలగిపోతాయి. అందునే పదీ-పదకొండు అధ్యాయాలను పారాయణ చేసే వారు - వైకుంఠానికి క్షేత్రపాలకులవుతారు. ఎవరయితే కార్తీకమాసంలో తులసీదళాలతోగాని, తెలుపు లేదా నలుపు గన్నేరు పూలతో గాని విష్ణుపూజను చేస్తారో - వాళ్లు వైకుంఠానికి చేరి, విష్ణు సమభోగాలననుభవిస్తారు. ఈ కార్తీకమాసంలో హరిహరులెవరి సన్నిధినైనా సరే - ఏ పురాణాన్నయినా సరే ప్రవచించేవారు సర్వ కర్మబంధ విముక్తులవుతారు.

కార్తీక వనభోజనము

శ్లో॥ యః కార్తీకే సితే వనభోజన మాచరేత్

సయాతి వైష్ణవం ధామ సర్వపాపైః ప్రముచ్యతే ॥

కార్తీక మాస శుక్లపక్షంలో వనభోజనము చేసిన వారు - పాపవిముక్తులై విష్ణుధామాన్ని పొందుతారు. జప, హోమ, పూజా, భోజన, తర్పణ ఫలాలతో - పాపీ క్షుద్ర ఛండాలాది అశౌచవంతుల యొక్క సంభాషణలను వినిన పాపం తుడిచి పెట్టుకు పోతుంది. కాబట్టి మహారాజా! కార్తీకమాస శుక్లపక్షంలో అన్నిరకాల వృక్షాలతో బాటుగా ఉసిరిచెట్టు కూడా వున్న తోటలోనే వనభోజనమును ఏర్పాటు చేసుకోవాలి. ఉసిరి చెట్టు క్రింద సాలగ్రామము నుంచి, గంధ పుష్పాక్షతాదులతో పూజించి, యధాశక్తి బ్రాహ్మణులను ఆహ్వానించి గౌరవించి, వారితో కలసి భోజనము చేయాలి. ఇలా - కార్తీక మాసములో వనభోజనాన్ని ఎవరయితే నిర్వహిస్తారో, వాళ్లు ఆయా కాలాలలో చేసిన సర్వపాపాల నుంచీ తెములుకుని, విష్ణులోకాన్ని పొందుతారు. జనకజనపతీ! ఈ కార్తీక మహాత్మ్యాన్ని భక్తిశ్రద్ధలతో విన్న బ్రాహ్మణుడొకడు దుర్యోనీ సంకటము నుంచీ రక్షింపబడ్డాడు. కథ చెబుతాను విను.

దేవదత్తోపాఖ్యానము:

పూర్వం కావేరీ తీరములో దేవశర్మ అనే సద్బ్రాహ్మణుడు వుండేవాడు. అతనికొక పరమ దుర్మార్గుడయిన కుమారుడు కలిగాడు. అతని పేరు దేవదత్తుడు. అతగాడి దుష్ట ప్రవర్తనలను గుర్తించిన తండ్రి, అతగాడిని పాపవిముక్తుని చేయాలని సంకల్పించి 'నాయనా! రోజూ కార్తీక ప్రాతః స్నానాన్ని ఆచరించు. సాయంకాలమున హరి సన్నిధిలో దీపారాధనమును చేస్తూ వుండు. ఈ విధంగా కార్తీక వ్రతాన్ని ఆచరించి ధన్యుడివికా' అని చెప్పాడు. కాని దుర్వర్తనుడయిన ఆ బ్రాహ్మణ పుత్రుడు - తానటువంటి కట్టుకథలను నమ్మననీ, కార్తీక వ్రతాన్ని

ఆచరించననీ - తండ్రికి ఎదురు తిరిగాడు. అందుకు కినిసిన దేవశర్మ తన కుమారుడిని 'అడవిలోన చెట్టు తొర్రలో ఎలుకవై పడి వుండు' అని శపించాడు. శాపానికి భయపడిన ఆ విప్ర కుమారుడు తండ్రి పాదాలబడి, తనకు తరణోపాయం చెప్పమని కోరగా - ఆ తండ్రి 'నాయనా! నీవు ఎప్పుడైతే కార్తీక మహాత్మ్యాన్ని సంపూర్ణముగా వింటావో అప్పుడే నీ ఎలుక రూపము పోతుం'దని - శాపవిముక్తి అనుగ్రహించాడు.

దేవదత్తునికి శాపవిముక్తి:

పితృశాప కారణంగా అప్పటికప్పుడే మూషికరూపాన్ని ధరించిన బ్రాహ్మణ యువకుడు గజారణ్యములో ఫలవంతమైనదే - అనేక జంతువులకు ఆధారభూతమైనదీ అయిన ఒకానొక మహావృక్ష కోటరములో మనసాగాడు. ఇలా కొంతకాలము గడిచాక, ఒకానొకప్పుడు మహర్షియైన విశ్వామిత్రుడు శిష్య సమేతంగా కార్తీక స్నానమాచరించి వచ్చి, ఆ ఎలుక వున్న చెట్టు మొదలునందు విష్టుడై తన పరివారానికి పరమపావనమైన కార్తీక మహాత్మ్యాన్ని వినిపించసాగాడు.

ఆ సమయంలో దయాహీనుడూ, పాపాలపుట్టా, అడవి జీవాలను హింసించి పొట్టపోసుకునేవాడూ అయిన ఒక కిరాతకుడు ఆ ప్రాంతాలకు వచ్చాడు. పుణ్యపురుషుల దర్శనము వల్ల ఉపకారమేగాని, అపకారము ఏనాడూ జరుగదు. అదే విధముగా, విశ్వామిత్రాది తపోబృంద దర్శనమాత్రం చేత - రవంత పశ్చాత్తాప్తుడూ - జ్ఞానీ అయిన ఆ కిరాతకుడు వారిని సమీపించి 'అయ్యా! మీరు చెప్పుకుంటున్న కథలేమిటి? అని వింటూంటే - నాకీ కిరాతక జీవితం పట్ల చిరాకు పుడుతోంది. దయ చేసి ఈ రహస్యమేమిటో చెప్పండి' అనగానే, అతనిలో వివేకం విచ్చుకుంటున్న వైనమును గమనించిన విశ్వామిత్రుడు - 'నాయనా! మేము కార్తీక వ్రతాన్ని ఆచరిస్తున్నాము. ఈ కార్తీక మాసములో ఎవరయినా సరే తెలిసిగాని,

తెలియకగాని స్నాన దాన జప తపః పురాణ శ్రవణాదును చేసినట్లయితే వారు వారి సర్వ పాపాల నుంచీ విముక్తులవుతారు. ఈ వ్రతాన్ని భక్తితో ఆచరించే వాళ్లు జీవన్ముక్తులవుతారు' అని తెలియజేశాడు. ఈ విధముగా కిరాతకునికి చెబుతూన్న కార్తీక మహాత్మ్యాన్ని వినడమే తడవుగా - తొర్రలో వున్న ఎలుక తన శాపగ్రస్తరూపాన్ని వదలివేసి, పూర్వ యువ బ్రాహ్మణ రూపాన్ని పొంది - విశ్వామిత్రాదులకు ప్రణమిల్లి తన పూర్వపుగాధను వినిపించి, ఆ ఋషుల నుండి సెలవు తీసుకొని తన ఆశ్రమానికి తరలిపోయాడు. అనంతరము ఆ కిరాతకుడు కూడా విశ్వామిత్రాదుల వలన కార్తీక మహాత్మ్యాన్ని కడ కంటా తెలుసుకొనడం వలన - ఆ జన్మకి కిరాతకుడయ్యీ కూడా- దేహాంతరాన ఉత్తమగతులను పొందాడు. కాబట్టి ఓ జనకుడా! ఉత్తమ గతులను కోరే వారు ప్రయత్నపూర్వకముగా నయినాసరే కార్తీక వ్రతమాచరించాలి. లేదా, కనీసము కార్తీక మహాత్మ్యాన్నయినా భక్తి శ్రద్ధలతో వినాలి.

పంచమోధ్యాయ స్సమాప్తః

## షష్ఠాధ్యాయము:

శ్రీ వశిష్ఠుడు చెబుతున్నాడు రాజర్షీ, జనకా! ఈ కార్తీక మాసము ముప్పయి రోజులు కూడా - ఎవరైతే శ్రీమహావిష్ణువును కస్తూరీ, గంధాదులతోనూ, పంచామృతములతోనూ అభిషేకిస్తారో వారికి పదివేల అశ్వమేధాలు చేసిన ఫలితము లభిస్తుంది. కార్తీక మాసములో సంధ్యావేళ విష్ణుసన్నిధిలో దీపారాధనమును చేసినా, దీపదానము చేసినా వారు విష్ణులోకాన్ని పొందుతారు. ప్రత్తిని శుభ్రపరచి దానితో వత్తిని చేసి, బియ్యపిండి లేదా గోధుమపిండితో ప్రమిదను చేసి ఆవునేతిని పోసి, ఆ ప్రతివత్తిని తడిపి వెలిగించి ఒకానొక సద్బ్రాహ్మణుని ఆహ్వానించి, చివరి రోజున వెండి ప్రమిదను, భమిడి వత్తినీ చేయించి, వాటిని బియ్యపు పిండి మధ్యన వుంచి, పూజా నివేదనాదులను పూర్తి చేసి బ్రాహ్మణులకు భోజనము పెట్టి అనంతరము - తాము స్వయంగా-

*దీపదానమంత్రము : సర్వజ్ఞాన ప్రదం దీపం సర్వసంప చ్ఛుభావహం ।*
*దీపదానం ప్రదాస్యామి శాంతిరస్తు సదా మమ॥*

'జ్ఞానమునూ, సంపదలనూ, శుభములనూ కలిగించే దైవ, దీపదానాన్ని చేస్తున్నాను. దీని వలన నాకు నిరంతరము శాంతి, సుఖములు ఏర్పడుగాక' అని చెప్పుకుంటూ, పిండితో సహా ఆ దీపాన్ని బ్రాహ్మణునికి దానం చేయాలి. అలా చేసిన వారు అక్షయమైన పుణ్యాన్ని పొందుతారు. ఈ దీపదానము వలన విద్య, జ్ఞాన, ఆయుర్వృద్ధి, అనంతరము స్వర్గభోగాలూ కలుగుతాయి. మనోవాక్కాయ కృత పాపాలన్నీ సమసిపోతాయి. నిదర్శనార్థమై ఒక కథను వినిపిస్తాను విను.

### లుబ్ధ వితంతువు మోక్షమందుట:

పూర్వం ద్రావిడ దేశములో ఒక అనాథ వితంతు వుండేది. ఆమె రోజూ భిక్షాటనమును చేసి, వచ్చిన దానిలో - మంచి అన్నమునూ, కూరలని విక్రయించి తాను దూషితాన్నముతో తృప్తిపడుతూ డబ్బును వెనకేయసాగింది. ఇతరుల ఇండ్లలో వంట పనులు, కుట్టుపనులు మొదలైనవి చేస్తూ ప్రతిఫలముగా వారి వద్ద కొంత ద్రవ్యాన్ని తీసుకుంటూ ఉండేది. అదిగాక ద్రవ్యభిక్షాటన కూడా చేసేది. ఇలా నిత్య ధనార్జనాలగ్నమానసయైన ఆ వితంతువు డబ్బు సంపాదించడమే తప్ప ఏనాడూ హరినామస్మరణ చేయడం గాని, హరికథనో, పురాణాన్నో వినడంగాని, పుణ్యతీర్థ సేవనమునుగాని, 'ఏకాదశీ ఉపవాసమును గాని చేసి ఎరుగదు. ఇటు వంటి లుబ్ధురాలింటికి దైవవశాన - శ్రీరంగ యాత్రీకుడైన ఒక బ్రాహ్మణుడు వచ్చి - ఆమె స్థితిని చూసి - ఆమెకు నరకము తప్పదని గుర్తించి, జాలిపడి - ఆమెను మంచి దారిలో పెట్టదలచి - 'ఓ అమాయకురాలా! నేను చెప్పేది శ్రద్ధగా విని ఆలోచించుకో. ఈ తోలు శరీరము వట్టి అశాశ్వతమని తెలుసుకో. నేల, నీరు,నిప్పు, నింగి, గాలి - అనే పంచభూతాత్మకమైనదే ఈ శరీరము. ఈ దేహము నశించగానే ఆ పంచభూతములు కూడా - ఇంటి కొప్పు మీద కురిసి నలుదిక్కులకూ చెదరిపోయే వాననీళ్లలా - చెదరిపోతాయి. నీటి మీద నురుగులాటి నీ తనువు

నిత్యము కాదు. ఇది శాశ్వతమని నమ్ముకున్నట్లయితే - ఆశల అగ్నిలో పడే మిడతవలె మసి కావడమే తప్ప మేలనేది లేదు. మోహాన్ని, భ్రమలనూ వదలి పెట్టు. దైవమొక్కడే శాశ్వతుడనీ, సర్వభూతదయకారుడనీ గుర్తించు. నిరతమూ హరిచరణాలనే స్మరించు. కామమంటే - కోరిక, కోపమంటే - దురాగ్రహం, భయమంటే - ఆత్మానాత్మీయ భంగత, లోభ మంటే - ధనవ్యయ చింత, మోహమంటే - మమతాహంకారాలు - ఇటు వంటి ఈ ఆరింటినీ వదలిపెట్టు. నా మాట విని, ఇక నుంచయినా కార్తీకమాసములో ప్రాతఃస్నానాన్ని ఆచరించు. విష్ణుప్రీతికై భగవదర్పణంగా దీపదానము చెయ్యి.

తద్వారా అనేక పాపాల నుంచి రక్షించబడతావు' అని హితవు చెప్పి, తన దారిన తాను వెళ్లిపోయాడు.

అతగాడి వచోమహిమ వలన ఆమెకు జ్ఞానోదయమైంది. తను చేసిన పాపాలకై చింతించినది. తాను కూడా కార్తీక వ్రతాన్ని చేయాలని సంకల్పించినది. అందుచేత ఆ సంవత్సరములో వచ్చిన కార్తీకమాసాననే వ్రతాచరణమును ప్రారంభించినది. సూర్యోదయ వేళకల్లా చన్నీళ్ల స్నానమును, హరిపూజ, దీపదానము, పిదప పురాణ శ్రవణము - ఈ విధముగా కార్తీక మాసము నెల రోజులూ ఆచరించి చివరి రోజున చక్కగా బ్రాహ్మణసమారాధన కూడా చేసినది. తక్షణమే ఆమె బంధాలు నశించిపోయినదై. విగతాసువై విమానారూఢురాలై, శాశ్వత స్వర్గభోగ సౌఖ్యాలను పొందినది. కాబట్టి 'రాజా! కార్తీకమాసములో అన్నిటికంటే ప్రధానమైనది దీపదానము. తెలిసిగాని, తెలియకగాని ఎవరైతే దీపదానము చేస్తున్నారో వారు తమ పాపాలను నశింప చేసుకొన్న వారే అవుతున్నారు. దీనిని వినినా, చదివినా జన్మ సంసార బంధ విముక్తులై విష్ణుభక్తి పరాయణులవుతారు.

ఏవం శ్రీస్కాంద పురాణాంతర్గత కార్తీక మహాత్మ్యే షష్ఠోధ్యాయ స్సమాప్తః

మూడవ రోజు పారాయణము సమాప్తము

## సంపూర్ణ కార్తీక మహాపురాణము

## నాలుగవ రోజు పారాయణము

## సప్తమాధ్యాయము

'ఓ జనక రాజేంద్రా! కల్మషఘ్నమైన కార్తీక మహాత్మ్యంలో పుష్పార్చన, దీప విధానాలను చెబుతాను విను.

పుష్పార్చనా ఫలదాన దీపవిధి-విశేషములు:

ఈ కార్తీక మాసములో కమలనాభుడైన శ్రీహరిని కమలాలచే పూజించటం వలన కమలాసనియైన లక్ష్మీదేవి ఆ భక్తుల ఇండ్ల స్థిరనివాస మేర్పరచుకుంటుంది. తులసీ దళాలతోగాని, జాజిపువ్వులతోగాని, మారేడు దళాలతో గాని పూజించేవారు తిరిగి ఈ భూమిపై జన్మించరు. ఎవరైతే ఈ కార్తీకములో భక్తియుతులైన పండ్లను దానము చేస్తారో వారి పాపాలు సూర్యోదయానికి చీకట్లవలె చెదరిపోతాయి. ఉసిరిచెట్టు కింద విష్ణువును ఉసిరికాయలతో పూజించే వారిని తేరిజూడడానికి యమునికి కూడా శక్తి చాలదు. కార్తీకములో ఎవరైతే సాలగ్రామాన్ని తులసీదళాలతో పూజిస్తారో, వారికి మించిన ధన్యులెవరూ ఉండరనడం అతిశయోక్తి కాదు. బ్రాహ్మణ సమేతులై, ఉసిరిచెట్టు వున్న తోటలో - వనభోజనమును చేసేవారి మహాపాతకాలు సైతము మట్టిగలసిపోతాయి. బ్రాహ్మణ సమేతులై ఉసిరిచెట్టు కింద సాలగ్రామ పూజ చేసే వారు వైకుంఠాన్ని పొంది విష్ణువువలె ఆనందిస్తారు. ఎవరైతే కార్తీక మాసములో విష్ణ్వాలయములో మామిడాకుల తోరణం కడతారో, వాళ్లు పరమపదాన్ని పొందుతారు. పువ్వులతోగాని, అరటి స్తంభాలతో గాని మండపము కట్టిన వాళ్లు వైకుంఠములో విష్ణువు సామీప్యాన్ని పొందుతారు. ఒక్కసారైనా శ్రీహరికి సాష్టాంగ దండప్రణామమును చేసిన వాళ్లు అశ్వమేధ పుణ్యవంతులవుతారు. విష్ణువునకు ఎదురుగా జప, హోమ దేవతార్చనలు చేసే వాళ్లు పితరులతో సహా వైకుంఠానికి వెళ్లి సుఖిస్తారు. స్నానము చేసి తడిబట్టలతో వున్న వానికి పొడిబట్టని దానము చేసిన వాడు పదివేల అశ్వమేధాల ఫలాన్ని పొందుతాడు. ఆలయ శిఖరముపై ధ్వజారోహణము చేసిన వారి పాపాలు గాలికి - పుష్పము పరాగమువలె ఎగిరిపోతాయి. నల్లని లేదా తెల్లని అవిసెపూలతో హరిపూజను చేసిన వారికి పదివేల యజ్ఞాల ఫలితము ప్రాప్తిస్తుంది. కార్తీకమాసమందు ఏ స్త్రీ అయితే బృందావన గోమయంతో అలికి, పంచరంగులతోనూ, శంఖ, పద్మ, స్వస్తికారి నందా దీపాన్ని అర్పించడం వలన కలిగే పుణ్యాన్ని వేయినోళ్ల ఆదిశేషుడైనా పొగడలేడు. ఈ కార్తీక మాసములో శివుని జిల్లేడు పూలతో పూజించినవాడు దీర్ఘాయువై, అంత్యాన మోక్షాన్ని పొందుతాడు. విష్ణ్వాలయంలో మండపాన్ని అలంకరించిన వారు హరి మందిరములో చిరస్థాయిగా వుంటారు. హరిని మల్లెపువ్వులతో పూజించిన వారి పాపాలు సర్వనాశనమై పోతాయి. తులసీ గంధముతో సాలగ్రామ పూజను చేసిన వారు వైకుంఠాన్ని పొందుతారు. విష్ణు సన్నిధిలో నాట్యమును చేసిన వారి యొక్క

పూర్వసంచిత పాపాలన్నీ నాశనమై పోతాయి. భక్తియుక్తులై అన్నదానమును చేసే వారి పాపాలు గాలికి మంచుతునకలలా ఎగిరిపోతాయి. ప్రత్యేకించి కార్తీక మాసములో నువ్వుల దానము, మహానదీ స్నానము, బ్రహ్మపత్ర భోజనము, అన్నదానము ఈ నాలుగూ ఆచరించడం ధర్మముగా చెప్పబడుతూ వుంది. స్నాన దానాదులను ఆచరింపని వారూ, లోభియై యధాశక్తిగా చేయని వారు నూరు జన్మలు కుక్కగా పుట్టి కడపట ఛండాలయోనిని జన్మిస్తారు. కార్తీక వ్రత శూన్యులు మరుజన్మలో గాడిదగా పుట్టి, తదుపరి నూరుపుట్టుకలూ శునకయోనిని జన్మిస్తారు. కార్తీకమాసములో

శ్రీహరిని కదంబ పుష్పాలతో పూజించిన వారు సూర్యమండలములోనే నివసిస్తారు. ఓ జనక మహారాజా! కార్తీక మాసములో ఎవరైతే అవిసెపువ్వుల మాలను తాము ధరించి - తదుపరిని అవిసె పువ్వుల మాలికలతో శ్రీహరిని పూజిస్తారో వారు స్వర్గాధిపతులవుతారు. మాల్యములు - తులసీదళాలతో విష్ణువును పూజించే వనితలు వైకుంఠాన్ని పొందుతారు. ఇంకొక్క సూక్ష్మాన్ని చెబుతాను విను, అశక్తులయిన వాళ్లు -

శ్లో ॥ కార్తీకే భానువారేతు స్నానకర్మ సమాచరేత్ ।
మాసస్నానేన యత్పుణ్యం తత్పుణ్యం లభతేనృప ॥

శ్లో ॥ ఆద్యేంతియే తిథౌ మధ్యమే చ దినే యః స్నానమాచరేత్ ।
మాస స్నాన ఫలం తేన లభ్యతే నాత్ర సంశయః ॥

'కార్తీకమాసంలో ఆదివారం నాడు లేదా శుక్ల పాడ్యమి నాడు గాని, పూర్ణిమనాడు గాని, అమావాస్యనాడు గాని సంకల్పరహితముగా ప్రాతఃస్నానం ఆచరించడం వలన కూడా ఆ మాసమంతా స్నానము చేసిన పుణ్యం లభిస్తుంది. ' ఆ పాటి శక్తి కూడా లేని వాళ్లు కార్తీకమాసము నెల రోజులూ ఈ సంపూర్ణ కార్తీక మహాపురాణాన్ని చదివినా, వినినా కూడా స్నానఫలాన్ని పొందుతారు. కార్తీకమాసము సాయంకాలాలో దేవాలయాలలో శివ-విష్ణుస్తోత్రాలను పఠించేవారు - కొంతకాలము స్వర్గలోకములో వుండి - అనంతరము ధ్రువలోకాన్ని పొందుతారు. ఇలా ప్రతీ కార్తీక మాసములో ఎవరైతే హరిహరులను స్మరించకుండా వుంటారో వాళ్లు ఏడు జన్మల పాటు నక్కలుగా పుడతారనడంలో ఏమీ సందేహము లేదు.

సప్తమాధ్యాస్సమాప్తః

## అష్టమాధ్యాయము

వశిష్ఠుడు చెప్పినదంతా విని జనకుడు అడుగుతున్నాడు: 'మహర్షీ! మీరు చెప్పినవన్నీ వినిన తరువాత నాకొక సందేహము కలుగుతోంది. వర్ణసాంకర్యాది మహాపాపాలను చేసిన దుర్జనులు వేదత్రయోక్తాలయిన ప్రాయశ్చిత్తాలను చేసుకొననిదే పరిశుద్ధులు కారు' అని సమస్త ధర్మ శాస్త్రాలలోను ఘోషిస్తుండగా, కేవలం కార్తీక వ్రతాచరణా ధర్మలేశము చేతనే సమస్త

పాపాలూ హరించుకుని పోయి వైకుంఠాన్ని పొందుతారని చెప్పడంలోని మర్మమేమిటి? ఇది ఎలా సంభవం? అత్యంత స్వల్పమైన పుణ్య మాత్రము చేతనే గొప్ప గొప్ప పాపాలు ఎలా నశించిపోతాయి? గండ్రగొడ్డళ్లతో కూడా కూలనేయ సాధ్యముగాని మహాపర్వతాన్ని కేవలము కొన వ్రేలిగోటితో కూల్చడము సాధ్యమవుతుందా? అగ్ని దగ్ధమవుతూన్న ఇంటిలో వున్నవాడు ఆ మంట మీద పురిషెడు నీళ్లు జల్లినంత మాత్రాన అగ్ని ప్రమాదము తొలగిపోతుందా? ఏ మహానదీ ప్రవాహములోనో కొట్టుకుని పోయే వారిని ఓ పాటి గడ్డిపరక గట్టుకు చేర్చగలుగుతుందా? తనకు తానై కొండచరియలలోని ఏ లతాసూత్రాన్నో పట్టుకున్నంత మాత్రము చేతనే నదీపాతవేగాన్నుంచి సంరక్షించబడతాడా? వశిష్ఠా! ఈ విధమైన దృష్టాంతాల రీత్యా మహాపాపులైన వాళ్లు సహితము అతి స్వల్ప కార్యమైన కార్తీక వ్రతాచరణము వలన పాపరహితులూ, పుణ్యాత్ములూ ఎలా అవుతారు? వీటికి సమాధానమేమిటి?

జనకుడి ప్రశ్నకు జ్ఞానహాసమును చేస్తూ - ఇలా చెప్పసాగాడు వశిష్ఠుడు.

జనకుని ప్రశ్నలకు వశిష్ఠుని జవాబు:

వశిష్ఠ ఉవాచ: మంచి విమర్శే చేశావు మహారాజా! చెబుతాను విను. ధర్మాన్ని సూక్ష్మముగా చింతించాలేగాని, స్థూలరూపాన్ని మాత్రమే ఆలోచించకూడదు. అదిగాక, వేదశాస్త్ర పురాణాలన్నీ కూడా అనేక ధర్మసూక్ష్మాలను మనకందిస్తున్నాయి. ఆయా ధర్మసూత్రాల వలన కొన్ని పర్యాయాలలో గొప్ప గొప్ప పుణ్యాలు స్వల్పమైనవిగానూ - స్వల్ప పుణ్యాలు గొప్పవిగానూ పరిణమిస్తూంటాయి. ధర్మాలన్నీ గుణత్రయముతో కూడుకుని స్వల్ప నల్పతలను సిద్ధింపచేసుకుంటాయి. మూల ప్రకృతియైన 'మహామాయ' కారణంగా సత్వర జస్తమస్సులనే మూడు గుణాలు కూడా ఏర్పడ్డాయి. వీటిలో సత్వగుణ ప్రధానమైనవి ధర్మసూక్ష్మాలు, కర్మకాండ, తపస్సు, ప్రాయశ్చిత్తాలన్నీ కూడా రజోగుణం వలన ఏర్పడ్డాయి. తర్కము - దైవేతర చింతనతో సాగించే దైవీయ కృత్యాలు, ఆచరించే దానధర్మాలు, ఇవన్నీ కూడా ధర్మము యొక్క స్థూలస్వరూపాలు. ఇవి తమోగుణము వలన ఏర్పడతాయి. వీటిల్లో - సత్వగుణ ప్రధానముగా ఆచరించే ధర్మాలు స్వల్పముగా తోచినప్పటికీ దేశకాల యోగ్యతాదుల వలన విశేష ఫలాలను ఇస్తాయి. 'దేశము' అంటే పుణ్యక్షేత్రం, కాలము అంటే పుణ్యకాలము. యోగ్యత అంటే - పాత్రత. బ్రహ్మజ్ఞత కలవాళ్లు ఈ మూడింటినీ చింతించకుండా చేసే సర్వధర్మాలూ తామసాలు - వీటివలన పాపాలు నశించవు. కాబట్టి దేశకాల యోగ్యతలను విచారించి చేసేవే

సత్వధర్మాలు. వీటిలో కొన్ని సమకూడి కొన్ని సమకూడక జరిపేవి రజోగుణ ధర్మాలని వేరే చెప్పనక్కరలేదు కదా! జనకరాజా! అన్నిటికి కర్మమే మూలము. ఎవరి కర్మను బట్టి వారికి ఫలితాలుంటాయి. అయినప్పటికి మనిషికి జ్ఞానము అనేది ఉన్నందువలన ఆచరించే ధర్మాలను పై మూడింటితో పోల్చుకుని ప్రయత్న పూర్వకముగా నైనా ఆచరించాలి. ఈ విధంగా మూడు కలిసి వచ్చినప్పుడు ఆచరించిన ధర్మము అక్షయ ఫలితాన్నిస్తుంది. రాజా! పర్వతమంత ఎత్తు

కట్టెలను పేర్చి, వాటి మధ్య గురివింద గింజంత అగ్నికణాన్ని ఉంచితే ఆ అగ్నికణము ఆ కట్టెలనెలా కాల్చివేయగలుగుతుందో, సువిశాలమైన నట్టింట పెట్టిన నలుసంత దీపము ఆ ఇంటి చీకట్లనెలా తొలగిస్తుందో, గుండిగెడు మురికినీళ్లను ఒక్క ఇండుపగింజ ఎలా శుభ్ర పరుస్తుందో - అదే విధంగా తెలిసిగాని, తెలియకగాని పుణ్యకాలములో, పుణ్యక్షేత్రములో పుణ్యమూర్తుల వలన ఆచరించే ధర్మము అనంత పాపాలనూ దగ్ధం చేసి, మోక్షానికి మార్గాన్ని వేస్తుంది. ఇందుకు ఉదాహరణగా ఒక కథ చెబుతాను విను.

### అజామిళోపాఖ్యానము

బహుకాలం పూర్వం కన్యాకుబ్జ క్షేత్రవాసీ, సార్థక నామధేయుడూనైన సత్యనిష్ఠుడనే బ్రాహ్మణునికి అజామిళుడనే కుమారుడు వుండేవాడు. వాడు పరమ దురాచారుడు. దాసీ సాంగత్యపరుడు, హింసా ప్రియుడుగా వుండేవాడు. సాటి బ్రాహ్మణ గృహములోని ఒకానొక దాసితో సాంగత్యమును పెట్టుకొని, తల్లిదండ్రులను మీరి ఆ దాసీ దానితోనే భోజన శయానాదులన్నిటినీ నిర్వర్తిస్తూ, కామాంధుడై వైదిక కర్మలన్నింటినీ విడచి పెట్టి కేవల కామాసక్తుడై ప్రవర్తించసాగాడు. తద్వారా బంధువులతా అతనిని వదలివేశారు. కులము వాళ్లు వెలివేశారు. అందువలన ఇల్లు వదలి పెట్టిపోవలసి వచ్చిన అజామిళుడు ఛండాలపువాడలోని ఒకానొక దాసీ దానితో కాపురము పెట్టి, కుక్కలనూ, మృగాలనూ ఉచ్చులు వేసి పట్టుకునే వృత్తితో బతికకే జనాలలో లీనమై, మధుమాంస సేవనా లోలుడై కాలమును గడపసాగాడు. ఇలా వుండగా, ఒకనాడతని ప్రియురాలైన దాసీది, కల్లు తాగడం కోసం తాడిచెట్టునెక్కి, కమ్మ విరగడం వలన కింద పడి మరణించింది. అజామిళుడు అమితంగా దుఃఖించాడు. అప్పటికే ఆ దాసీ దానికి యవ్వనవతియైన కూతురు వుంది. మహాపాపాత్ముడూ, మహా కామాంధుడూ అయిన అజామిళుడు, తనకి కూతురు వరుసని కూడా తలచకుండా - ఆ పిల్లనే వరించి, ఆమెతోనే కామోప భోగాలనుభవించసాగాడు. కాముకుడైన అజామిళుడు, తన కూతురి యందే అనేక మంది బిడ్డలను పొందాడు. కాని వాళ్లందరూ కూడా పసికందులుగా కడతేరిపోగా, కడగా పుట్టి మిగిలిన బిడ్డకు 'నారాయణ' అని నామకరణం చేసి అత్యధిక ప్రేమతో పెంచుకోసాగాడు. తాను తింటున్నా, నిదురిస్తున్నా ఏం చేస్తున్నా సరే - సతతం అతనినే స్మరించుకుంటూ 'నారాయణా - నారాయణా' అని పిలుచుకుంటూ తన్మయుడవుతూ వుండేవాడు.

కాలము గడచి అజామిళుడు, కాలము చేసే సమయము ఆసన్నమైంది. అతడిలోని జీవుని తీసుకొని పోయేందుకుగాను - ఎర్రని గడ్డములు - మీసములు కలిగి, చేత దండపాశాలను ధరించిన భయంకర రూపులైన యమదూతలు వచ్చారు. వారిని చూస్తూనే గడగడలాడి పోయిన అజామిళుడు, ఆ ప్రాణావసాన వేళ కూడా పుత్రవాత్సల్యాన్ని విరమించుకోలేక, ఎక్కడో దూరముగా స్నేహితులతో ఆటలలో మునిగి వున్న కుమారుని కోసమై 'నారాయణా, ఓ నారాయణా! తండ్రి నారాయణా'! అని పలుమారులు పిలవసాగాడు.

ఆ పిలుపు అతడి కొడుకుకు వినబడలేదు. అతను రానూ లేదు. కాని చేరువకు వచ్చిన యమదూతలు ఆ 'నారాయణ' నామస్మరణను విని వెనుకకు జంకారు. అదే సమయంలో అక్కడ ఆవిష్కృతులైన విష్ణుదూతలు - 'ఓ యమదూతలారా! అడ్డు తొలగండి. ఇతడు మాచే తీసుకొని పోబడదగినవాడేగాని, మీరు తీసుకొని వెళ్లదగిన వాడు కాదు' అని హెచ్చరించారు. వికసిత పద్మాల వలే విశాలమైన నేత్రాలు కలవాళ్లూ, పద్మమాలాంబర వసనులూ అయిన ఆ పవిత్ర విష్ణుపారిషదులను చూసి, విభ్రాంతులైన యమదూతలు 'అయ్యా! మీరెవరు? యక్ష గంధర్వ సిద్ధ చారణ కిన్నెర విద్యాధరులలో ఏ తెగకు చెందిన వారు? మా ప్రభువైన యమధర్మరాజు మాకు విధించిన ధర్మము రీత్యా తీసికొని వెళ్లనున్న ఈ జీవుని మీరెందుకు తీసికొని వెడుతున్నారు?' అని అడగడంతో, విష్ణుదూతలు ఇలా చెప్పసాగారు.

ఏవం శ్రీస్కాంద పురాణాంతర్గత కార్తీక మహాత్మ్యే
సప్తమ, అష్టమ అధ్యాయౌ, (సప్త-మాష్టమాధ్యాయములు)
నాలుగవరోజు పారాయణము సమాప్తము

సంపూర్ణ కార్తీక మహాపురాణము

అయిదవరోజు పారాయణము

నవమాధ్యాయము

యమదూతల ప్రశ్నలకు చిరునగవుమోము కలవారైన విష్ణుదూతలు ఇలా భాషించసాగారు, 'ఓ యమదూతలారా! మేము విష్ణుదూతలము. మీ ప్రభువు మీకు విధించిన ధర్మాలేమిటి? పాపాత్ములెవరు? పుణ్యాత్ములెవరు? యమదండనకు అర్హులైన వారెవరు? అవన్నీ విపులీకరించి చెప్పండి?'

విష్ణుదూతల ప్రశ్నలకు యమదూతలిలా సమాధానమీయసాగారు. 'సూర్య, చంద్రాగ్ని వాయురాకాశ గోసంధ్యలూ దశదిశా కాలాలూ, వీనిని మానవుల యొక్క పాప పుణ్యాలకు సాక్ష్యాలుగా విచారించి వారిని మేము శిక్షిస్తాము. ఓ విష్ణుదేవతలారా! శ్రద్ధగా వినండి - వేద మార్గాన్ని విడిచిన స్వేచ్ఛాచారులూ, సాధుజన బహిష్కృతులూ యమదండనార్హులు. బ్రాహ్మణునీ, గురువునీ, రోగినీ పాదాలతో తాడించేవాడు తల్లిదండ్రులతో కలహించేవాడూ, అసత్యవాదీ, జంతుహింసకుడూ, దానము చేసిన దానిని మరలా ఆశించేవాడూ, డాంబికుడూ, దయారహితుడూ, దానము చేసిన దానిని మరలా ఆశించేవాడూ, డాంబికుడూ, దయారహితుడూ, పరభార్యా సంగముడూ, సొమ్ములను తీసుకొని పక్షాన్ని అవలంబించేవాళ్లనీ, చేసిన దానాన్ని బైట పెట్టుకునే వానినీ, మిత్రద్రోహినీ, కృతఘ్నులనీ, ఇతరుల పురుష సంతతిని చూసి ఏడ్చేవానినీ, కన్యాశుల్కాలతో జీవించేవానినీ, వాపీకూప తటాకాది నిర్మాణాటంకపరులనీ, తల్లిదండ్రుల శ్రాద్ధ కర్మలను విడచినవానినీ, కేవలం భోజనం గురించీ ఆలోచించే వానినీ, ఇతరులు చేసిన దానాన్ని నిరోధించే వానినీ, నిత్యం స్నానసంధ్యాదులను విడిచిన వానినీ, బ్రాహ్మణాశ్వ గోహత్య ఇత్యాది పాపయుక్తులైన వారందరూ కూడా యమలోకంలో మాచేత దండించబడుతూంటారు. ఇక ఈ అజామిళుడంటారా? వీడు చేయని పాపమంటూ లేదు. బ్రాహ్మణ జన్మమెత్తి, దాసీ సంగమ లోలుడై చేయరాని పాపాలు చేసిన వీడు మీ విష్ణులోకానికెలా అర్హుడు!'

యమదూతల సమాధానాన్ని విని - విష్ణుపార్షదులిలా చెప్పసాగారు.

'ఓ యమదూతలారా! ఉత్తమ లోకార్హతకు కావలసిన పుణ్యాల గురించి మేము చెప్పేది కూడా వినండి. ఏ కారణము వలన గాని దుస్సంగమాన్ని వదలి సత్సంగమములో కలిసేవాడు. నిత్యము దైవచింతనాపరుడు. స్నాన సంధ్యా జపహోమతత్పరుడూ మీ యమలోక గమనానికి అర్హులు కారు.

ఓ యమదూతలారా! అసూయారహితులై, జపాగ్నిహోత్ర నిర్వాహకులై, సర్వ కర్మలనూ సగుణ బ్రహ్మార్పణము చేసే వారు - జలాన్నగోదాతలు, వృషోత్సర్జనా కర్తలూ యమలోకాన్ని పొందేందుకు అనర్హులు. విద్యాదాత (గురువులు), పరోపకార శీలురు, హరిపూజాప్రియులు,

హరినామ జాపకులూ, వివాహ - ఉపనయనాలను చేయించే వారూ - అనాథ ప్రేత సంస్కారకర్తా - వీళ్లెవరూ మీ యమదండనలకు అర్హులు కారు. నిత్యము సాలగ్రామాన్ని అర్చించి, తత్తీర్థాన్ని పానము చేసే వాడూ - తులసీకాష్ఠ మూలికలను ధరించేవాడూ - గృహాంగణాలలో తులసిని పెంచేవాడూ - భాగవతాన్ని పఠించేవాడూ - పూజించేవాడూ, వినేవాడూ - సూర్యుడు మేష - తులా - మకర సంక్రాంతులందుండగా ప్రాతఃస్నానమును ఆచరించే వాళ్లూ - వీళ్లెవరూ కూడా మీ యమలోకానికి అనర్హులు. తెలిసిగాని - తెలియకగాని హరినామ సంకీర్తనమును చేసే వాళ్లు - పాపవిముక్తులవుతారు. ఓ యమదూతలారా! ఇన్ని మాటలెందుకు? ఎవడైతే అవసాన కాలంలో ఒక్కసారైనా హరినామస్మరణ చేస్తున్నాడో వాడు విష్ణులోకానికే వస్తాడు.

ఈ విధముగా సాగుతున్న యమ, విష్ణుదూతల సంవాదాన్నంతటినీ వినిన అజామిళుడిలోని జీవుడు - తన శారీరక కృతదాసీ సాంగత్యాది పాపాలను తలంచుకుని దుఃఖిస్తూన్న జీవుడు - స్పృహామయుడై అచ్చెరువందాడు. 'ఇదేమి ఆశ్చర్యం? ఆ నల్లని కత్తులను ధరించిన యమదూతలు ఏమై పోయారు? నేనీ వైకుంఠములో ఎలా ఉండగలిగాను? పూర్వజన్మ పుణ్యము కాకపోతే నా జిహ్వాపై హరినామమెలా వచ్చింది? నాకీ వైకుంఠము ఎలా ప్రాప్తించింది?' అని తనలో తనే అనుకుంటూ హరిస్మరణమును చేయసాగాడు. కాబట్టి రాజా! కేవల హరినామస్మరణమే అంతటి ముక్తిప్రదమైనది. కాగా, హరి ప్రియంకరమైన కార్తీక వ్రతమును ఆచరిస్తే ఎంత పుణ్యం కలుగుతుందో ఊహించు అంటూ ఆపాడు వశిష్ఠుడు.

నవమాధ్యాయస్సమాప్తః

## దశమాధ్యాయము

*జనక ఉవాచ:* 'వశిష్ఠా!ఈ అజామిళుడు పూర్వజన్మలో ఎవరు? ఏ పాపం వలన ఇలా పుట్టాడు? విష్ణుదూతల మాటలకు యమదూతలు ఎందుకు ఊరుకున్నారు? వాళ్లు యమునికి ఏమని విన్నవించారు. అన్నీ సవిస్తరంగా చెప్పు.'

*వశిష్ఠ ఉవాచ:* నీవడిగిన ప్రశ్నలన్నింటికీ ఒక క్రమములో సమాధానాలు చెబుతాను విను. విష్ణుపారిషదుల చేత తిరస్కృతులైన యమదూతలు తమ ప్రభువైన యముని చేరి ఇలా చెప్పసాగారు.

### యమదూతల ఆరోపణము - యముని ఉపదేశము:

'అయ్యా పాపాత్ముడునూ, దురాచారుడునూ, నిందిత కర్మాచరణపరుడూ అయిన అజామిళుని యందలి జీవుని తెచ్చే సమయంలో - విష్ణుదూతలు మమ్మల్ని అడ్డగించి, అతనిని మా నుంచి విడిపించి, తమతో వైకుంఠానికి తీసికొని వెళ్లారు. వాళ్లను ఎదిరించ లేక మేమిలా రిక్తహస్తులమై వచ్చాము' అని కింకరులు చెప్పినది విని, రవంత క్రోధోద్రిక్తుడైన సమవర్తి

జ్ఞానదృష్టితో సమస్తాన్నీ అవలోకించినవాడై - కింకరులారా! కించిదపి పుణ్యవిహీనోపి - ఆ అజామిళుడనే పాపి, అంత్యకాలాన హరి నామస్మరణమును చేయడము వలన సమస్త పాపాలనూ నశింప జేసుకుని విష్ణుప్రియుడై, విష్ణుదూతల చేత తీసుకొని పోబడ్డాడు. తెలిసి తాకినా - తెలియక తాకినా దహించవలెనను కోరిక లేకపోయినప్పటికీ సమస్త జాతులనూ అగ్ని దహించునో అదే విధముగా - దుష్టాత్ములై, మహిమను తెలుసుకోలేక పోయినా - ఆ శ్రీహరి యొక్క నామస్మరణమును చేసినంత మాత్రము చేతనే వారి సమస్త పాపాలు దహించబడి పోతాయి. ఇక, భక్తి భావముతో స్మరించిన వారు కేవలము కైవల్య పథగాములే అవుతారు' అంటూ సేవకులను ఎంతవరకూ చెప్పాలో అంతవరకూ మాత్రమే చెప్పి - యముడు మరింత పూర్వాలోచనా పరుడయ్యాడు.

అజామిళుని పూర్వజన్మ:

అజామిళుడు అతని పూర్వజన్మలో సౌరాష్ట్రదేశములో శివార్చకుడుగా వుండేవాడు. ఆ జన్మలో కూడా స్నానసంధ్యాచరణాది రహితుడూ, దైవేతరచిత్తుడూ, దైవద్రవ్యాపహారి అయి వుండేవాడు. బ్రాహ్మణుడయి వుండి కూడా ఆయుధపాణియై, దుష్టులతో స్నేహమును చేస్తూ తిరిగేవాడు. అర్చకుడయి వుండీ కూడా వివిధాభరణ భూషితుడై స్వేచ్ఛావిహారాలు చేసే వాడు. బహుభాషియై యవ్వనములో వుండేవాడు. ఆ కాలానికి అదే గ్రామంలో ఒక దరిద్ర బ్రాహ్మణుడుండేవాడు. అతడు దరిద్ర పీడితుడై, అన్నము కొరకై పట్టణములు, పల్లెలు తిరుగుతూ - యాయవార వృత్తిని అవలంబించి వున్నాడు. ఒకానొకసారి అతగాడు తనకు లభించిన యాయవార వస్తుజాలన్నంతటినీ మోసుకుని వచ్చి భార్యను పిలిచి - 'చాలా ఆకలిగా వుంది. సత్వరమే వంట చేయి. ముందు కాసిని మంచినీళ్లియ్యి. అవి త్రాగి రవంత ఉపశాంతిని పొందుతాను' అన్నాడు. కాని, యౌవనమదాశ్రితయై వున్న ఆ ఇల్లాలు భర్త ఎన్నిసార్లు పిలిచినా పట్టించుకోకుండా తన జారుని గురించే తలపోస్తూ వుండిపోయింది. అందుకు కోపించిన భర్త, చేతికందిన కర్రతో ఆమెను కొట్టాడు. తన కామపుటాలోచనలకు అంతరాయమును కలిగించాడనే కోపంతో తన ముష్టితో ఘాతించింది. అడలీ-బడలీ వున్న ఆ బాపడు అందుకై పరితాపంతో ఆమెనూ, గృహాన్నీ వదిలిపెట్టి గ్రామాంతరము వెళ్లి, భిక్షాటనతో బతకసాగాడు.

మగడు ఇల్లు వదలి వెళ్లిపోవడంతో మరింత తెగించిన ఆ జారిణి - మగడు తెచ్చినవన్నీ సుష్ఠుగా మేసి, మగడిచ్చినవన్నీ అలంకరించుకుని, మగడు తెచ్చిన మంచి చీరను కట్టుకుని, తాంబూల చర్వణము చేస్తూ - ఒకానొక రజకుని ఇంటికి వెళ్లి - ఆ రాత్రి తనతో సంభోగించవలసిందిగా కోరినది. కాని, నీతిమంతుడైన ఆ రజకుడు, ఆమె కోరిన తప్పుడు పనికి అంగీకరించకపోవడంతో - వారిద్దరికి వాగ్వివాదం జరిగింది. అంతటితో వాంఛితార్థం నెరవేరని ఆ బ్రాహ్మణ జారిణి వీధినపడి రసికులను వెతుక్కుంటూ పోతూ ఇతః పూర్వం చెప్పబడిన ఈశ్వరాలయార్చకుని చూసి - సురత క్రీడలకు ఆహ్వానించింది. బ్రాహ్మణుడైన వీడు - ఆమె పర

స్త్రీ అని కూడా ఆలోచించకుండా - అంగీకరించి ఆ రాత్రంతా ఆమెతో సుఖించాడు. అయినప్పటికీ ఆ జారిణి సద్వంశ సంజాత అయిన కారణంగా కామము చల్లారగానే తన దోషాన్ని తెలుసుకున్నదై, భర్తను వెతుక్కుంటూ వెళ్లి బ్రతిమాలి తెచ్చుకుని అది మొదలుగా అతని మాటలకు తుచ. తప్పకుండా బ్రతుకసాగింది.

ఇటువంటి పాపాలవలన మరణానంతరం ఆ శివార్చకుడు రౌరవాది మహానరకాలు అనుభవించి, అనుభవించి - సత్యనిష్ఠుడి కొడుకైన అజామిళుడుగా జన్మించి - కార్తీక పౌర్ణమినాటి శివసందర్శనం - అంత్యకాల హరిస్మరణల పుణ్యం వలన మోక్షాన్ని పొందాడు.

ఆనాటి శివార్చకుని జన్మలో - ఇతనితో జారత్వం నెరపిన బ్రాహ్మణ జారిణి కూడా కొంతకాలానికి మరణించింది. నరకానుభవమును పొంది - కన్యాకుబ్జములోని ఛండాల గృహములో బాలికగా జన్మించింది. కాని ఆ -పిల్ల - తండ్రి గండాన పుట్టడం వలన - వాళ్లా పిల్లను అడవిలో వదలివేశారు. ఆ వనాంతర్గామియైన ఒక బ్రాహ్మణుడు బాలిక అరణ్యరోదన విని, జాలిపడి తనతో తీసికొని వెళ్లి, తన ఇంటి దాసీకి పెంపకానికి ఇచ్చాడు. ఆ దాసీదాని దగ్గర పెరిగిన ఈ పిల్లనే అనంతర కాలంలో అజామిళుడు దగ్గరకు తీసుకున్నాడు. మహారాజా! నువ్వడిగిన అజామిళుడి పూర్వగాథ ఇది. సమస్తమైన పాపములకూ హరినామ స్మరణ కన్నా మించిన ప్రాయశ్చిత్తము మరొకటి లేదు. అది సాధ్యము కానప్పుడే ఇతరేతర ధర్మశాస్త్రాది ప్రోక్త ప్రాయశ్చిత్త కర్మలను ఆచరించాల్సి వుంటుంది.

జనక నరపాలా! ఎవరి జిహ్వా హరిని కీర్తించదో, ఎవరి మనసు హరి చరణాలను ఆశ్రయించదో, ఎవరి చెవులు, శ్రీహరి సంకీర్తనలను ఆలకించవో వాళ్ల పాపాలు ఏ విధముగానూ కూడా నశించే అవకాశము లేదు. ఎవరైతే ఇతర చింతలన్నిటినీ విడిచి పెట్టి విష్ణువునే ధ్యానిస్తూ వుంటారో వారు తప్పనిసరిగా కైవల్యాన్ని పొందుతారనడంలో ఏమీ సందేహము లేదు! మోక్షాసక్తులను మురహరి స్మరణ ఏ విధంగా సూక్ష్మమార్గమో - అదే విధముగా కార్తీక ధర్మాచరణమనే సూక్ష్మమార్గము కూడా మహోత్కృష్ట పుణ్యప్రదాయినియై పాతకాలను పారదోలుతుంది. పాపాలను నశింపచేసే శక్తి ఈ కార్తీక వ్రతాచరణకకు మాత్రమే వుండడము వలన, ఎవరైతే ఈ దివ్యవ్రతాన్ని ఆచరించరో, వాళ్లు నరక ప్రాప్తులవుతారని తెలుసుకో. పాపనాశనియైన ఈ కార్తీక మహాత్మ్యాన్ని శ్రద్ధాభక్తులతో వినినప్పటికీ కూడా - వారు మోక్షార్హులే అవుతున్నారు. ఆసక్తులైన వారికి -పావన హృదయంతో ఈ మహాత్మ్యాన్ని వినిపించేవాడు వైకుంఠగతుడై విష్ణువుతో కలిసి సుఖించుతాడు.

ఏవం శ్రీస్కాంద పురాణాంతర్గత కార్తీక మహాత్మ్యే
నవమ, దశమ అధ్యాయౌ సమాప్తౌ (తొమ్మిది, పది అధ్యాయములు)
అయిదవరోజు పారాయణము సమాప్తము

## సంపూర్ణ కార్తీక మహాపురాణము

## ఆరవరోజు పారాయణము

## ఏకాదశాధ్యాయము

వశిష్ఠ ఉవాచ: ఓ మహారాజా! కార్తీకమాసములో శ్రీహరిని ఎవరైతే అవిసెపూలతో పూజిస్తారో వాళ్లకి చాంద్రాయణ ఫలము కలుగుతుంది. గరికతోనూ, కుశలతోనూ పూజించే వాళ్లు పాపవిముక్తులై వైకుంఠమును పొందుతారు. చిత్రవర్ణ వస్త్రాన్ని శ్రీహరికి సమర్పించిన వాళ్లు మోక్షమును పొందుతారు. కార్తీక స్నానాచరణమును చేసి విష్ణుసన్నిధిని దీపమాలికను వుంచే వాళ్లూ, వైకుంఠ పురాణ పాఠకులూ, శ్రోతలూ కూడా విగతపాపులై పరమపదాన్ని చేరుతారు. ఇందుకు ఉదాహరణగా మాత్రాననే సర్వపాపాలనూ సమయింపచేసేదీ - ఆయురారోగ్య దాయినీ - అయిన ఒక కథను వినిపిస్తాను విను.

### మందరోపాఖ్యానము

కళింగ దేశీయుడైన మంధరుడనే ఒకానొక బ్రాహ్మణుడు స్నానసంధ్యా వందనాలన్నిటినీ విసర్జించి, పరులకు కూలిపని చేస్తూ వుండేవాడు. అతనికి పతివ్రత, సర్వసాముద్రికాది శుభలక్షణ సంపన్నా, సద్గుణ సముచ్చయము చేత 'సుశీల' అని పిలువబడే భార్య వుండేది. భర్త ఎంత దుర్మార్గుడైనా కూడా, అతని యందు రాగమే తప్ప ద్వేషము లేనిదై, పాతివ్రత్య నిష్ఠాపరురాలయి వుండేది. కొన్నాళ్ల తరువాత, కూలితో జీవించడం కష్టమని భావించిన మంధరుడు వనగతుడై, ఖడ్గపాణియై, దారులు కాసి బాటసారులను కొట్టి - వారి నుండి ధనమును అపహరిస్తూ కాలం గడపసాగాడు. ఆ దొంగసొత్తును ఇరుగు పొరుగు దేశాలకు తీసికొనిపోయి, అమ్మి, ఆ సొమ్ముతో కుటుంబ పోషణ చేసేవాడు. ఒకసారి దొంగతనానికై దారికాసి వున్న మంధరుడు బాటసారియైన ఒకానొక బ్రాహ్మణునిని పట్టుకొని - అక్కడి మర్రిచెట్టుకు కట్టివేసి, ఆ బాపని ద్రవ్యాన్నంతనూ అపహరించేశాడు. ఇంతలో అటుగా వచ్చిన పరమ క్రూరుడైన ఒక కిరాతకుడు - దోచుకొనిన మంధరుడినీ, దోచుకోబడి బంధితుడై వున్న బ్రాహ్మణునినీ ఇద్దరినీ కూడా చంపివేసి, ఆ ద్రవ్యాన్ని తాను హరించుకు పోబోయాడు. కాని, అదే సమయానికి అక్కడి కిరాత, మంధర, బ్రాహ్మణుల నుండి వచ్చే నరవాసనను పసిగట్టిన చేరువగుహలోని ఖడ్గంతోనూ ఒకరినొకరు ప్రహరించుకున్నారు. ఆ జగడంలో పులీ, కిరాతకుడూ కూడా ఏకకాలంలో మరణించారు. ఆ విధముగా మరణించిన విప్ర, మంధర, వ్యాఘ్ర, కిరాతకుల జీవులు నలుగురూ యమలోకమును చేరి, కాలసూత్రమనే నరకాన్ని పొందారు. యమకింకరులు ఆ నలుగురినీ - పురుగులూ, అమేధ్యమూతో నిండి వున్న తప్త రక్తకూపంలో పడవేశారు.

ఇక భూలోకములో, భర్త మరణవార్త తెలియని మంధరుని భార్యయైన సుశీల మాత్రము నిత్యం భర్తృ ధ్యానాన్నే చేస్తూ ధర్మవర్తనతో, హరిభక్తితో, సజ్జన సాంగత్యముతో జీవించసాగింది. ఒకనాడు నిరంతర హరినామ సంకీర్తనా తత్పరుడు, సర్వాలయందునా భగవంతుని

దర్శించువాడూ, నిత్యానంద నర్తనుడూ అయిన ఒకానొక యతీశ్వరుడు - ఈ సుశీల ఇంటికి వచ్చాడు. ఆమె శ్రద్ధాభక్తులతో అతనికి భిక్ష వేసి 'అయ్యా! నా భర్త కార్యార్థియై వెళ్లి వున్నాడు. ఇంట లేడు. నేను ఏకాకినై ఆయన ధ్యానములోనే కాలమును గడుపుతున్నాను' అని విన్నవించుకుంది. అందులకా యతి 'అమ్మాయీ! ఆవేదనపడకు. ఇది కార్తీక పూర్ణిమా మహాపర్వదినము. ఈ రోజు సాయంకాలము నీ ఇంట పురాణ పఠనాశ్రవణాదులు ఏర్పాటు చేయి. అందుకుగాను ఒక దీపము చాలా అవసరము. దీపానికి తగినంత నూనె నా దగ్గర వుంది. నీవు వత్తిని - ప్రమిదను సమర్పించినట్లయితే - దీపమును వెలిగించవచ్చును' అని సలహా ఇచ్చాడు.

ఆ యతిశ్రేష్ఠుని మాటలనంగీకరించి సుశీల తక్షణమే గోమయముతో ఇల్లంతా చక్కగా అలిగి పంచరంగుల ముగ్గులను పెట్టినది. ప్రత్తిని పరిశుభ్రపరిచి, రెండు వత్తులను చేసి, యతీశ్వరుని వద్ద నూనెతో వాటిని వెలిగించి శ్రీహరికి సమర్పించినది. యతి, ఆ దీప సహితముగా - విష్ణువును పూజించి, మనశ్శుద్ధి కోసం పురాణ పఠనమును ఆరంభించాడు. సుశీల పరిసరాల ఇండ్లకు వెళ్లి, వారందరినీ పురాణ శ్రవణానికి ఆహ్వానించినది. అందరి నడుమా తాను కూడా ఏకాగ్రచిత్తయై ఆ పురాణాన్ని వింది. అనంతరము ఆమెకు శుభాశీస్సులు అందించి యతీశ్వరుడు వెళ్లిపోయాడు. నిరంతర హరిసేవనము వలన క్రమక్రమముగా ఆమె జ్ఞానియై, తదుపరిని కాలధర్మమును చెందినది.

తత్క్షణమే శంఖ చక్రాంకితులు, చతుర్బాహువులు, పద్మాక్షులు, పీతాంబరధరులు అయిన విష్ణుదూతలు - నందనవన, సుందర మందారాది సుమాలతోనూ, రత్నమౌక్తిక ప్రవాళాదులతోనూ నిర్మించిన

మాలికాంబరాభరణాలంకృతమై వున్న దివ్య విమానాన్ని తెచ్చి - సుశీలను అందు అధిరోహింప చేసి వైకుంఠానికి తీసుకుపోసాగారు. అందులో వెళుతున్న సుశీల మార్గమధ్యములోని నరకములో మరి ముగ్గురు జీవులతో కలిసి బాధలు పడుతూనన తన భర్తను గుర్తించి, విమానాన్ని ఆపించి - తత్కారణమేమిటో తెలుపవలసిందిగా విష్ణు పారిషదులను కోరింది. అందుకు వారు 'అమ్మా! నీ భర్తయైన ఆ మంధరుడు విప్రకుల సంజాతుడైనప్పటికీ కూడా వేదాచారాలను విసర్జించి కూలియై, మరి కొన్నాళ్ళు దొంగయై, దుర్మార్గ ప్రవర్తన వలన ఇలా నరకాన్ని అనుభవిస్తున్నాడు. అతనితో బాటే వున్న మరొక బ్రాహ్మణుడు మిత్రద్రోహి. మిత్రుడొకనిని చంపి అతని ధనముతో పరదేశాలకు పారిపోబోతూ నీ భర్త చేత బంధితుడయ్యాడు. అతగాడి పాపాలకుగాను అతడు నరకము పొందాడు. మూడవవాడు కిరాతకుడు. బంధితుడైన ఆ బ్రాహ్మణునినీ, నీ భర్తను కూడా చంపివేసిన పాపానికిగాను ఇతడు నరకమును చేరవలసి వచ్చినది. ఇక నాలుగవ జీవి ఒక పులి. ఆ పులి అతః పూర్వజన్మలో ద్రావిడ బ్రాహ్మణుడై వుండి - ద్వాదశినాడు భక్షాభక్ష్య విచక్షణా రహితుడై ఆచరించిన తైలాదిక

భోజనాదుల వలన నరకమును పొంది - పులిగా పుట్టి - ఈ కిరాతకుని తోడి జగడములో అతనితో బాటే నరకాన్ని చేరాడు. ఈ నలుగురి నరకయాతనలకూ కారణాలివే తల్లీ!' అని చెప్పారు.

ఆ మీదట సుశీల విష్ణుదూతలను చూసి - ఏ పుణ్యము చేసినట్లయితే వాళ్ళకా నరకము తప్పుతుందో చెప్పుడని కోరగా, వైష్ణవులు కార్తీకమాసములో నీచేత ఆచరించబడిన పురాణ శ్రవణ ఫలితానని ధారబోయడము వలన నీ భర్తా-పురాణ శ్రవణార్థమై నువ్వు ఇంటింటికీ వెళ్ళి ప్రజలను పిలిచిన పుణ్యమును ధారబోయడము వలన మిత్ర ద్రోహియైన ఆ బ్రాహ్మణుడు - ఆ పురాణ శ్రవణార్థమై నువ్వు సమర్పించిన రెండు వత్తుల పుణ్యమును చెరిసగముగా ధారపోయడము వలన కిరాత వ్యాఘ్రూలూ నరకము నుంచి ముక్తిని పొందుతారు అని పలికారు. అలా వాళ్ళు చెప్పినదే తడవుగా సుశీల ఆయా విధాలుగా తన పుణ్యాలను వారికి ధారబోయడముతో ఆ నలుగురూ నరకము నుండి విముక్తులై దివ్య విమానారూఢులై సుశీలను వివిధ రూపాలుగా ప్రశంసిస్తూ మహాజ్ఞానులు పొందే ముక్తి పదానికై తీసుకుపోబడ్డారు. కాబట్టి ఓ జనక మహారాజా! కార్తీకమాసములో చేసే పురాణ శ్రవణము వలన హరిలోకమును తప్పనిసరిగా పొందుతారని తెలుసుకో.

ఏకాదశోధ్యాయ స్సమాప్తః (పదకొండవ అధ్యాయము)

## ద్వాదశాధ్యాయము (వశిష్ఠ ప్రవచనం)

పునః వశిష్ఠుడు జనకునికిలా చెప్పసాగాడు: 'ఓ రాజా! కార్తీకమాసములో వచ్చే సోమవార మహాత్మ్యమును విని వున్నావు. ఆ కార్తీక సోమవారము ఎంత ఫలాన్నిస్తుందో అంతకంటే కార్తీక శని త్రయోదశి - వందరెట్లు, కార్తీకపూర్ణిమ - వెయ్యిరెట్లు, శుక్ల పాడ్యమి - లక్షరెట్లు, శుక్ల ఏకాదశి - కోటిరెట్లు, ద్వాదశి లెక్కలేనంత అనంతమైన ఫలాలనూ అదనముగా ప్రసాదిస్తాయి. మోహము, చేతనైనాసరే శుక్ల ఏకాదశినాడు ఉపవసించి, మరునాడు (ద్వాదశి) బ్రాహ్మణయుక్తులై పారాయణ చేసే వాళ్ళు సాయుజ్య మోక్షాన్ని పొందుతారు. ఈ కార్తీక శుద్ధ ద్వాదశినాడు అన్నదానమును చేసిన వారికి సమస్త సంపదలూ అభివృద్ధి చెందుతాయి. రాజా! సూర్యగ్రహణ సమయములో గంగా తీరములో కోటి మంది బ్రాహ్మణులకు అన్నసమారాధన చేయడము వలన ఎంత పుణ్యము కలుగుతుందో అంత పుణ్యమూ కూడా కేవలం కార్తీక ద్వాదశినాడు ఒక్క బ్రాహ్మణునికి అన్నమును పెట్టడము వలన కలుగుతుంది. వేయి గ్రహణపర్వాలు, పదివేల వ్యతీపాత యోగాలూ, లక్ష అమావాస్యాపర్వాలు ఏకమైనా కూడా - ఒక్క కార్తీక ద్వాదశిలో పదహారవవంతు కూడా చేయమని తెలుసుకో. మనకు ఉన్న తిథులలో పుణ్యప్రదాలైన తిథులెన్నయినా వుండవచ్చును గాక, కాని - వాటన్నింటికంటే కూడా

సాక్షాద్విష్ణు ప్రీతికరమైన ఈ కార్తీక ద్వాదశి అత్యంత ఫలప్రదమని మర్చిపోకు.

## ద్వాదశీ దానములు

ఏకాదశినాడు రాత్రి యామముండగా కార్తీక శుద్ధ ద్వాదశినాడు క్షీర సముద్రము నుండి శ్రీహరి నిద్రలేస్తాడు. అందువలన దీనికి హరిబోధినీ ద్వాదశి అనే పేరు వచ్చింది. అటు వంటి ఈ హరిబోధినినాడు ఎవరైతే కనీసం ఒక్క బ్రాహ్మణునికైనా అన్నదానమును చేస్తారో, వాళ్లు ఇహములో భోగాను సేవనాన్నీ, పరములో భోగిశయనామ సేవనాన్నీ పొందుతారు. కార్తీక ద్వాదశినాడు పెరుగు-అన్నదానం చేయడం సర్వోత్కృష్టమైన దానముగా చెప్పబడుతూ వుంది. ఎవరైతే ఈ ద్వాదశినాడు పాలిచ్చే ఆవును, వెండి డెక్కలూ, బంగారు కొమ్మలతో అలంకరించి పూజించి దూడతో సహా గోదానము చేస్తారో వాళ్లు ఆ ఆవు శరీరంపై ఎన్ని రోమాలైతే వుంటాయో, అన్నివేల సంవత్సరాలు స్వర్గములో నివసిస్తారు. ఈ రోజు వస్త్రదానము చేసిన వాళ్లు సంచితార్థాలన్నీ సమసిపోయి వైకుంఠాన్ని చెందుతారానడంలో ఎటు వంటి వివాహము లేదు. ఓ మహారాజా! ఎవరైతే కార్తీక శుద్ద ద్వాదశినాడు సాలగ్రామాన్నీ, బంగారపు తులసీ వృక్షాన్నీ - దక్షిణా సమేతముగా దానము చేస్తారో వాళ్లు - చతుస్సాగర పర్యంతమైన సమస్త భూమండలాన్నీ దానము చేసినంత పుణ్యాన్ని పొందుతూన్నారు. ఇందుకు నిదర్శనముగా ఒక గాథను చెబుతాను విను.

## ధర్మవీరోపాఖ్యానము

పూర్వము గోదావరీ తీరములో దురాచారవంతుడూ, పరమ పిసినిగొట్టూ అయిన ఒక వైశ్యుడు వుండేవాడు. ఈ లుబ్ధుడు దానధర్మాలు చేయకపోవడమే కాక, తాను కూడా తినకుండా ధనమును పోగు చేసేవాడు. ధనధాన్యాలనే కాదు. కనీసము ఎవరికీ మాట సాయమైనా చేసే వాడు కాదు. నిత్యమూ పరులను నిందిస్తూ పరద్రవ్యాసక్తుడై మసలే ఈ పిసినిగొట్టు ధనమును వడ్డీలకు తిప్పుతూ అంతకంతకూ ద్రవ్యాన్ని పెంచుకోసాగాడు.

ఒకానొకసారి ఈ లుబ్ధుడొక బ్రాహ్మణునికి ఇచ్చిన అప్పును రాబట్టుకోవడం కోసం అతని గ్రామానికి వెళ్లి - తానిచ్చిన బాకీని వడ్డీతో సహా ఆ క్షణమే చెల్లించవలసిందిగా పట్టుబట్టాడు. అందుకు, బ్రాహ్మణుడు 'ఋణదాతా! నేను నీ బాకీ ఎగవేసేవాడిని కాను ఎందుకంటావేమో -

శ్లో ॥ యో జీవతి ఋణీనిత్యం నియమం కల్పమశ్నుతే ।

పశ్చాత్తస్యసుతో భూత్వా తత్సర్వం ప్రతిదాస్యతి ॥

'ఎవడయితే ఋణం తీర్చకుండానే పోతాడో, వాడు మరుసటి జన్మలో ఋణదాతకు సంతురూపముగా జన్మించి ఆ ఋణాన్ని చెల్లుబెట్టుకోవలసి వస్తుంది. అందు చేత ఏదో విధముగా సంపాదించి ఈ మాసాంతానికల్లా నీ ఋణము చెల్లుబెడతాను. అంతవరకూ ఓర్పు వహించి వుండు' అని చెప్పాడు.

ఆ బ్రాహ్మణ వచనాలను పరాభవ వాక్కులుగా భావించిన లుబ్ధుడు కనిసి, 'నీ కబుర్లు నా దగ్గర కాదు. నీ బాకీ వసూలు కోసం నెల్లాళ్లాగే సమయం నాకు లేదు. మర్యాదగా ఇప్పుడే ఇయ్యి లేదా ఈ కత్తితో నిన్ను నరికేస్తాను' అననాడు. యధార్థంగా ఆ సమయంలో ధనము లేదనీ, అప్పటికప్పుడు తానా అప్పు తీర్చలేననీ చెప్పాడు విప్రుడు. మరింత మండిపడిన ఆ పిసినారి - బ్రాహ్మణుడిని జుట్టు పట్టుకుని లాగి, నేలకు పడదోసి, కాలితో తన్ని, అప్పటికీ కోపం తీరక కత్తితో ఒక వేటు పెట్టాడు. సింహము యొక్క పంజా విసురుకు లేడిపిల్ల చనిపోయినట్లుగా, క్రోధోన్మత్తుడైన ఆ కోమటి కొట్టిన కత్తిదెబ్బకు బ్రాహ్మణుడు ప్రాణాలు కోల్పోయాడు. అంతటితో కోమటి-హత్యానేరానికి గాను రాజు తనను దండిస్తాడనే భయంతో త్వరితముగా ఇంటికి పారిపోయి - గుట్టుగా బ్రతకసాగాడు. బ్రతికినంత కాలం గుట్టుగా ఉండగలమే గాని గుట్టుగా ఉన్నంత మాత్రం చేత ఎల్లకాలం బ్రతకలేం గదా! అదే విధముగా ఆ కోమటి కూడా ఆయువు దీరి మృతి చెందాడు. యమకింకరులు వచ్చి, ఆ జీవుని నరకానికి తీసుకుపోయారు. జనకభూపతీ! 'రురువు'లనే మృగాల చేతా, వాటి శృంగాల చేతా పీడింప చేసే ఒకానొక యాతననే 'రౌరవం' అంటారు. ఈ కోమటిని ఆ రౌరవమనే నరక విభాగములో వేసి శిక్షించవలసిందిగా ఆజ్ఞాపించాడు యమధర్మరాజు. కింకరులు ఆ ఆజ్ఞను అమలు చేయసాగారు.

ఇక ఈ భూలోకములో ఆ లుబ్ధ వైశ్యుని కుమారుడైన 'ధర్మవీరు'డనే వాడు - మహాదాతా, పరోపకారియై - పిత్రార్జితమైన అగణిత ధనరాశులతో ప్రజా శ్రేయస్సుకై చెరువులు, నూతులు త్రవ్వించి తోటలు వేయించి - వంతెనలు కట్టించి - పేదలకు వివాహోపనయనాదులు చేయిస్తూ - యజ్ఞయాగాది క్రతువులనూ - క్షుత్పీడితులకు తరతమ భేద రహితముగా అన్నదానాలను చేస్తూ - ధర్మాత్ముడుగా పేరు పొందాడు. ఒకానొక నాడీ ధర్మవీరుడు విష్ణుపూజ చేసే సమయానికి త్రిలోక సంచారియైన - నారద మహర్షి యమ లోకము నుండి బయలుదేరి హరినామ స్మరణను చేసుకుంటూ ఈ ధర్మవీరుని తావుకు వచ్చాడు. ముంగిలికి వచ్చిన మునిరాజు నారదుని చూచి ధర్మవీరుడు భక్తిప్రపత్తులతో ప్రణమిల్లాడు. అర్ఘ్యపాద్యాది వివిధోపచారాలతోనూ నారదుని పూజించి 'నారదా! దేవర్షులైన మీరిలా మా భూవర్షానికి అందునా నా గృహానికి విచ్చేయడం వలన నా జన్మధన్యమైంది. హే దివ్య ప్రభూ! నేను నీ దాసుడిని. నన్నేమి చేయమంటావో ఆజ్ఞాపించు. నువ్వేమి చెబితే అది చేస్తాను' అని వినయపూర్వకముగా వేడుకున్నాడు. అందుకు సంతసించిన నారదముని చిరునవ్వు ముఖము కలవాడై 'ధర్మవీరా! నా కోసము నువ్వేమీ చేయనక్కరలేదు. నీ శ్రేయస్సుకై చెబుతున్న నా ఈ మాటల్ని శ్రద్ధగా విను. కార్తీక ద్వాదశి శ్రీ మహావిష్ణువునకు అత్యంత ప్రియమైన రోజు. ఆ రోజున చేసిన స్నానదాన జప తపః ప్రభృతి కార్యాలన్నీ కూడా విశేషమైన ఫలాన్నిస్తాయి. ధర్మవీరా! సూర్యుడు తులారాశిలో వుండగా కార్తీక ద్వాదశీ

ప్రాతఃస్నాతులై - సాలగ్రామ దానమును చేసే వారు - దరిద్రులు గానీ, ధనికులు గానీ, యతులు గానీ, వానప్రస్థులు గానీ, బ్రాహ్మణులు గానీ, క్షత్రియులు గానీ, వైశ్యులుగానీ, శూద్రులు - స్త్రీలేగానీ - వాళ్లెవళ్లయినా సరే జన్మ జన్మాంతర కృత పాపాలను దహింప చేసుకున్న వాళ్లే అవుతారు. మరో ముఖ్య విషయమును చెబుతాను విను. నీ తండ్రి మరణించి, యమలోకములో పడరాని పాట్లు పడుతున్నాడు. అతనికి నరకబాధా విముక్తిని సంకల్పించి - నువ్వు కార్తీక ద్వాదశినాడు సాలగ్రామ దానమును చెయ్యి.

నారదడు చెప్పినదంతా విని నవ్వేశాడు ధర్మవీరుడు. పైపెచ్చు 'నారద మునీంద్రా! నా తండ్రి పేరున - గో, భూ, తిల, సువర్ణాది దానాలు ఎన్నో చేశాను. వాటివల్ల వెలువరించబడని నరకయాతన కేవలం సాలగ్రామమనే పేరు కలిగిన రాతిని దానము చేస్తే సాధ్యమవుతుందా? అయినా ఆ సాలగ్రామమనే రాయి ఎందుకు ఉపయోగపడుతుంది? తినడానికా పనికిరాదు, అలంకారానికా నవరత్నాలలోనిది కాదు. ఏ రకంగానూ ఎవరికీ కూడా పనికిరాని దానిని నీనెందుకు దానము చేయాలి. రాతి దాతకు కీర్తి వుండదు. ఆ దానమును పట్టిన వానికి సుఖమూ వుండదు. కాబట్టి ఆ సాలగ్రామ దానమును నేను చెయ్యనుగాక చెయ్యను.' అన్నాడు.

నారదుడెంత అనునయముగా చెప్పినా కూడా, ధర్మవీరుడు తన మూర్ఖత్వాన్ని వదలనూ లేదు. సాలగ్రామ దానానికి అంగీకరించనూ లేదు. అంతటితో నారదుడు అంతర్హితుడైపోయాడు. మరి కొంత కాలానికి ధర్మవీరుడు మరణించాడు. గౌరవనీయులూ, సర్వహితాత్ములు అయిన పెద్దల మాటలను పాటించని పాపానికీ - సాలగ్రామ దానము చేయకపోవడము వలనా నరకగతుడై, అనంతరము మూడు మారులు పులిగాను, మూడుసార్లు కోతిగాను, అయిదుసార్లు ఆబోతుగాను, పది పర్యాయాలు స్త్రీగాను జన్మించి వైధవ్య పీడను పొందడం జరిగింది. పునః పదకొండవ జన్మలో కూడా ఒకానొక యాచకుని పుత్రికగా జన్మించవలసి వచ్చింది. పురాకర్మ వలన పెండ్లి కుమారుడు అనతికాలంలోనే మరణించడంతో - ఒక్కగానొక్క కూతురికి కలిగిన వైధవ్యానికి చింతించి ఆ యాచక బ్రాహ్మణుడు జ్ఞాన దృష్టి చేత తన కూతురి పురాకర్మను గత పాపఫలాన్ని తెలుసుకున్నవాడై - ఆ విషయాలన్నీ ఆమెకు సవిస్తరంగా చెప్పి - కార్తీక సోమవారం నాడు వేదోక్త విధిగా, జన్మజన్మార్జిత పాపనాశకమైన సాలగ్రామ దానాన్ని చేయించాడు. ఆ పుణ్యఫలావాప్తి వలన - మరణించిన పెండ్లికొడుకు పునర్జీవితుడయ్యాడు. ఆ దంపతులు ఇహ జీవితాన్ని ధర్మకామ సౌఖ్యాలతో గడిపి కాలాంతర స్వర్గమును చేరి, పుణ్యఫలానుభ వాప్తులయ్యారు. తదుపరి ధర్మవీరుడు ఇరవై మూడవ జన్మగా ఒక బ్రాహ్మణుని ఇంట శిశువుగా పుట్టి, పూర్వజన్మలో చేసిన మహత్త్వ పూర్వక సాలగ్రామ దాన పుణ్య విశేషము వలన జ్ఞానియై - ప్రతివర్ష ప్రయుక్త కార్తీక సోమవారము పర్వదినాలలో సాలగ్రామ దానాన్ని ఆచరిస్తూ - ఆ పుణ్యఫలముగా మోక్షప్రాప్తుడయ్యాడు. ఇతగాడి సాలగ్రామ దాన మహాపుణ్యము వలన 'రౌరవ' గతుడైన ఇతని తండ్రి కూడా నరకము నుండి విముక్తుడయ్యాడు.

కాబట్టి జనక మహారాజా! కార్తీక మాసములో సాలగ్రామ దానము చేత విష్ణువు సంప్రీతుడై విశేష పుణ్యాన్ని కల్పిస్తాడని ధ్రువపరుచుకో. ఎంతటి పాపానికైనా సరే కార్తీక మాసంలో సాలగ్రామ దానమును చేయడమే సర్వోత్తమమైన ప్రాయశ్చిత్తము. ఇంతకు మించిన ప్రాయశ్చిత్తము మరొకటి లేదు అనడంలో ఏ మాత్రమూ అతిశయోక్తి లేదు.

ఏవం శ్రీస్కాంద పురాణాంతర్గత కార్తీక మహాత్మ్యే

ఏకాదశ, ద్వాదశాధ్యాయౌ (పదకొండు -పన్నెండు అధ్యాయములు)

ఆరవరోజు పారాయణము సమాప్తము

ఏడవరోజు పారాయణము

త్రయోదశాధ్యాయము

కన్యాదాన ఫలము

వశిష్ఠ ఉవాచ: రాజా! ఎంత చెప్పినా తరగని ఈ కార్తీక మహాత్మ్య పురాణములో కార్తీకమాసంలో చేయవలసిన ధర్మాల గురించి చెబుతాను. ఏకాగ్రచిత్తుడవై విను. తప్పనిసరిగా చేయవలసిన వానిని చేయకపోవడం వలన పాపాలను కలిగించేవీ అయిన ఈ కార్తీక ధర్మాలన్నీ కూడా - నా తండ్రియైన బ్రహ్మదేవుని ద్వారా నాకు బోధించబడ్డాయి. నీకిప్పుడు వాటిని వివరిస్తాను. జనక రాజేంద్రా! ఈ కార్తీక మాసంలో కన్యాదాన, ప్రాతః స్నానములు, యోగ్యుడైన బ్రాహ్మణ

బాలకునకు ఉపనయనము చేయించడం, విద్యాదాన, వస్త్రదాన, అన్నదానములు - ఇవి చాలా ప్రధానమైనవి. బ్రాహ్మణ కుమారునికి కార్తీకమాసములో ఒడుగు చేయించి దక్షిణను సమర్పించడం వలన పూర్వజన్మ పాపాలు కూడా తొలగిపోతాయి. ఆ విధముగా తమ ధనముతో ఉపనయనము చేయించబడిన వటువు చేసే గాయత్రీ జపము వల్ల దాత పంచ మహాపాతకాలూ నశించిపోతాయి. వంద రావిచెట్లు నాటించినా, వంద తోటలను వేయించినా, వంద నూతులను - దిగుడు బావులనూ నిర్మించినా, పది వేల చెరువులను తవ్వించినా వచ్చే పుణ్యమెంతయితే వుంటుందో అది పేద బ్రాహ్మణ బాలునికి ఉపనయనము చేయించడం వలన కలిగే పుణ్యంలో పదహారోవంతుకు కూడా సమానము కాదు. మరో విషయమును గుర్తుంచుకో -

శ్లో ॥ మాఘ్యాం వైమాధవేమాసి చోత్తమం మౌంజి బంధనం ।
కారయిష్యంతి తే రాజన్ దానం దత్వాతు కార్తీకే ॥

కార్తీకంలో ఉపనయన దానమును చేసి తదుపరిని వచ్చే మాఘములో గాని, వైశాఖములో గాని ఉపనయనము చేయించాలి. సాధువులూ, శ్రోత్రియులూయైన బ్రాహ్మణ బాలకులకు ఉపనయనమును చేయించడం వలన అనంత పుణ్యము కలుగుతుందని ధర్మవేత్తలైన మునులందరూ కూడా చెప్పియున్నారు. అటువంటి ఉపనయనానికి కార్తీక మాసంలో సంకల్పమును చెప్పుకుని ఫలానా వారికి నేను నా ద్రవ్యముతో ఉపనయనమును చేయిస్తాను - అని వాగ్దానము చేయడం వలన కలిగే సత్ఫలితాన్ని చెప్పడానికి స్వర్గలోక వాసులకు కూడా సాధ్యము కాదని తెలుసుకో.

జనక నరపాలా! ఇతరుల సొమ్ముతో చేసే తీర్థయాత్రలు, దేవ, బ్రాహ్మణ సమారాధనలూ వీని వలన కలిగే పుణ్యం ఆ ధనదాతలకే చెందుతుందన్న విషయము జగద్విదితమే కదా! కార్తీకములో, తమ ధనముతో ఒక బ్రాహ్మణునకు ఉపనయనముతో బాటు వివాహమును కూడా చేయించడం వలన తత్పుణ్యము మరింతగా ఇనుమడిస్తుంది.

శ్లో ॥ కన్యాదానం తు కార్తిక్యాం యః కుర్యాద్భక్తి2తో నఘ ।

స్వయంపాపై ర్వినిర్ముక్తః పితౄణాం బ్రహ్మణః పదమ్

కార్తీకములో కన్యాదాన మాచరించిన వాడు స్వయముగా వాడుతరించడమేగాక, వాని పితరులందరికీ కూడా బ్రహ్మలోక ప్రాప్తిని కలిగించిన వాడవుతాడు. ఇందుకు నిదర్శనముగా ఒక ఇతిహాసమును చెబుతాను విను.

సువీరోపాఖ్యానము

ద్వాపర యుగంలో వంగదేశాన దుర్మార్గుడైన సువీరుడనే రాజు వుండేవాడు. లేడికన్నుల వంటి సోగ కన్నులుగల సుందరాంగి ఒకర్తె అతని భార్యగా వుండేది. దైవ యోగము వలన - సువీరుడు, దాయాదులచే ఓడింపబడినవాడై, రాజ్యభ్రష్టుడై, అర్ధాంగి యైన సుందరాంగితో సహా అడవులలోకి పారిపోయి, కందమూలాదులతో కాలము గడపసాగాడు. ఇలా వుండగా, అతని భార్య గర్భవతి అయ్యింది. రాజు నర్మదా తీరములో పర్ణశాలను నిర్మించాడు. ఆ పర్ణశాలలనే అతని రాణి ఒక చక్కటి కుమార్తెను ప్రసవించింది. సర్వ సంపదలూ శత్రువుల పాలై పోవడం, తాను అడవుల పాలవడం, కందమూలాలలో బతుకుతూన్న ఈ రోజుల్లో కడుపు పండి సంతానం కలగడం, పోషణకు చిల్లిగవ్వయినా లేని దరిద్రము, వీటన్నిటినీ పదే పదే తలచుకుంటూ తన పురాకృత కర్మలని నిందించుకుంటూ అతి కష్టం మీద ఆ ఆడకూతురుని పెంచుకోసాగారు సువీర దంపతులు. కాలగమనములో సువీరుని కూతురు చక్కగా ఎదిగి నిజరూప లావణ్యా సౌందర్యాదులతో చూసే వారికి నేత్రానందకారిణిగా పరిణమించింది. ఎనిమిదేండ్ల ప్రాయంలోనే ఎంతో మనోహరముగా వున్న ఆమెని చూసి, మోహితుడైన ఒక ముని కుమారుడు - ఆ బాలికను తనకిచ్చి పెండ్లి చేయవలసిందిగా సువీరుని కోరాడు. అందుకా రాజు 'ఋషిపుత్రా! ప్రస్తుతము నేను ఘోర దరిద్రముతో వున్నాను. గనుక నేను కోరినంత ధనాన్ని నువ్వు కన్యాశుల్కముగా సమర్పించగలిగితే నీ కోరిక తీరుస్తాను' అన్నాడు. ఆ పిల్లమీది మక్కువ మానుకోలేని ముని బాలకుడు - రాజా! నేను కేవలం ముని కుమారుడినైన కారణముగా నీవు అడిగినంత దనమును తక్షణమే ఇవ్వలేను. తపస్సు చేత, తద్వారా ధనమును సంపాదించి తెచ్చి ఇస్తాను. అంతవరకూ ఈ బాలికను నా నిమిత్తమై భద్రపరచి వుంచు అని చెప్పాడు. అందుకు, సువీరుడు అంగీకరించడంతో ఆ నర్మదా తీరములోనే తపోనిష్ఠుడై, తత్ఫలితంగా అనూహ్య ధనరాశిని సాధించి, దానిని తెచ్చి సువీరునికిచ్చాడు. ఆ సొమ్మునకు సంతృప్తి చెందిన రాజు తమ ఇంటి ఆచారము ప్రకారముగా తన కూతురుని ముని యువకునికి ఇచ్చి ఆ అరణ్యములోనే కళ్యాణమును జరిపించేశాడు. ఆ బాలిక భర్తతో కలిసి వెళ్లిపోయినది. తత్కన్యా విక్రయ ద్రవ్యముతో రాజు తన భార్యతో సుఖముగా వుండసాగాడు. తత్ఫలితముగా

సువీరుని భార్య గర్భిణియై మళ్లా ఒక ఆడపిల్లను కన్నది. అందుకు రాజు ఆనందించాడు. పెద్దపిల్లను అమ్మి ధనమును రాబట్టినట్టే - ఈ పిల్ల ద్వారా కూడా మరింత ద్రవ్యమును సంపాదించవచ్చునని - సంతోషించాడు. బిడ్డ ఎదుగుతూ వుంది. ఇదిలా వుండగా -

ఒకానొక యతీశ్వరుడు నర్మదా స్నానానికై వచ్చి, అక్కడి పర్ణశాలలో వున్న సువీరుని, అతని భార్యనూ, కుమార్తెను చూసి - 'ఓయీ! నేను కౌండిన్య గోత్రజుడైన యతిని - ఈ అరణ్య ప్రాంతంలో సంసారయుతంగా వున్న నువ్వెవరివి? అని అడిగాడు. యతీంద్రుడి ప్రశ్నలకు జవాబుగా - అయ్యా! నేను వంగాశాధీశుడైన సువీరుడను. దాయాదుల వలన రాజ్యభ్రష్టుడనై ఇలా అడవిలో జీవిస్తున్నాను.

శ్లో॥ న దారిద్ర్యా సమం దుఃఖం । నశోకః పుత్రమారణాత్ ।
న చ వ్య ధానుగమనేన వియోగః ప్రియాపహాత్ ॥

దరిద్రం కన్నా ఏడిపించేది - కొడుకు చావు (లేకపోవడం) కంటే ఏడవలసినదీ - భార్యా (రాజ్యం, భార్యా) వియోగం కన్నా బయటకు ఏడవలేని అంతశ్శల్యంలాంటి దుఃఖం ఇంకేమీ వుండదు. తమకు తెలిసినదే గదా! ప్రస్తుతం నేనా విధమైన మూడు రకాల విచారాల వలనా అమిత దుఃఖితుడనై - ఈ విధముగా కందమూల భక్షణములతో ఈ అరణ్యమే శరణ్యముగా బ్రతుకు చున్నాడు. ఈ అరణ్యములోనే తొలి చూలుగా నాకొక కూతురు పుట్టినది. ఆమె నొక మునికుమారునికి విక్రయించి ఆ ధనముతో ప్రస్తుతానికి సుఖముగానే బతుకుతున్నాను. ఇది నా రెండవ కూతురు. ఈమె నా భార్య, నా గురించి ఇంకా ఏ వివరాలు కావాలో అడిగితే చెబుతాను' అన్నాడు సువీరుడు.

సువీరుడిచ్చిన సమాధానానికి ఆశ్చర్యపోతూనే ఆ యతీంద్రుడు ''ఓ రాజా! ఎంత పని చేశావు? మూర్ఖుడవై అగణితమైన పాపాన్నీ పోగు చేసి పెట్టుకున్నావు.

శ్లో ॥ కన్యా ద్రవ్యేణ యో జీవే దసిపత్రం సగచ్ఛతి
దేవాన్ ఋషీన్ పిత్రూన్ క్యాపి కన్యా ద్రవ్యేణ తర్పయేత్
శాపం దాస్యంతి తే సర్వే జన్మ జన్మ న్యపుత్రతామ్ ॥

ఆడపిల్లని అమ్ముకుని అలా వచ్చిన డబ్బుతో జీవించేవారు, మరణాంతాన - 'అసిపత్రం' అనే నరకము పాలవుతారు. ఆ సొమ్ముతో దేవ, ఋషి, పితృగణాలకు చేసిన అర్చన తర్పణాదుల వలన ఆ దేవ ఋషి పిత్రాదులందరూ కూడా నరకాన్ని చవి చూస్తారు. అంతే గాదు - కర్తకు జన్మజన్మలకూ కూడా పుత్ర సంతానముకలగకూడదని శపిస్తారు. ఇక, అలా ఆడపిల్లలను అమ్ముకొని జీవించడమే వృత్తిగా పెట్టుకొన్న వాళ్లు, ఖచ్చితముగా రౌరవ నరకములో పడతారు - రాజా!

శ్లో॥ సర్వేషా మేవ పాపానాం ప్రాయశ్చిత్తం విదుర్బుధాః ।
కన్యావిక్రయ శీలస్య ప్రాయశ్చిత్తం న చోదితమ్ ॥

అన్ని రకాల పాపాలకూ ఏవో కొన్ని ప్రాయశ్చిత్తాలున్నాయి గాని ఈ కన్యాశుల్కము అనబడే ఆడపిల్లని అమ్ముకునే మహా పాపానికి మాత్రం ఏ శాస్త్రములోనూ కూడా ఎటు వంటి ప్రాయశ్చిత్తము లేదు.

కాబట్టి, "సువీరా! ఈ కార్తీక మాసములో శుక్లపక్షములో, నీ రెండవ కుమార్తెకు కన్యాదాన పూర్వకముగా కళ్యాణం జరిపించు. కార్తీకమాసములో విద్యాతేజశ్శీల యుక్తుడైన వరునికి కన్యాదానమును చేసినవాడు - గంగాది సమస్త తీర్థాలలోనూ స్నాన దానాదులు చేయడం వలన కలిగే పుణ్యాన్ని, యధోక్త దక్షిణాయుతముగా అశ్వమేధాది యాగములను చేసిన వాళ్లు పొందే సత్ఫలితాన్నీ పొందుతాడు' అని హితబోధ చేశాడు.

కాని, నీచబుద్ధితో కూడుకొనిన ఆ సువీరుడు, ఆ సజ్జన సద్బోధను కొట్టిపారేస్తూ - బాగా చెప్పావయ్యా బాపడా! పుట్టినందుకు గాను - పుత్రద్వారా గృహ, క్షేత్ర వాసోవసు రత్నాద్యలంకారాదులతో ఈ శరీరాన్ని పుష్టిపరచి సుఖించాలే గాని, ధర్మము-ధర్మము అంటూ కూర్చుంటే ఎలాగ? అసలు ధర్మమంటే ఏమిటి? దానమంటే ఏమిటి? ఫలమంటే ఏమిటి? పుణ్యలోకాలంటే ఏమిటి? అయ్యా ఋషిగారూ! ఏదో రకంగా డబ్బును సంపాదించి భోగాలు అనుభవించడమే ప్రధానము. పెద్ద పిల్ల విషయములో కంటే అధికముగా ధనమిచ్చేవానికే నా చిన్నపిల్లని కూడా ఇచ్చి పెండ్లి చేసి - నేను కోరుకునే సుఖభోగాలన్నీ అనుభవిస్తాను. అయినా నా విషయాలన్నీ నీకెందుకు? నీ దారిన నువ్వెళ్లు' అని కసిరికొట్టాడు.

అంతటితో ఆ తాపసి తన దారిన తాను వెళ్లిపోయాడు.

### శ్రుతకీర్త్యుపాఖ్యానము

ఈ సువీరుని పూర్వీకులలో శ్రుతకీర్తి అనే రాజొకడున్నాడు. సమస్త సద్ధర్మ ప్రవక్తా, శతాధిక యాగకర్తా అయిన ఆ శ్రుత కీర్తి తన పుణ్యకార్యాల వలన స్వర్గములోని ఇంద్రాదుల చేత గౌరవింపబడుతూ, సమస్త సుఖాలను అనుభవిస్తున్నాడు.

సువీరునికి - యముడు విధించిన శిక్ష కారణముగా యమదూతలు స్వర్గము చేరి - అక్కడ సుఖిస్తున్న శ్రుత కీర్తియొక్క జీవుని పాశబద్ధుని చేసి - నరకానికి తీసుకుని వచ్చారు. ఆ చర్యకు ఆశ్చర్యపడిన శ్రుతకీర్తి యముని ముంగిట నిలబడి - స్వర్గములో వున్న నన్ను ఇక్కడికెందుకు రప్పించావు? నేను చేసిన పాపమేమిటి?' అని నిలదీసి అడిగాడు. మందహాసము చేశాడా మహాధర్ముడు. ఇలా చెప్పసాగాడు. 'శ్రుతకీర్తీ! నువ్వు పుణ్యాత్ముడవే, స్వర్గార్హుడవే, కాని నీ వంశీకుడైన సువీరుడనే వాడు కన్యను విక్రయించాడు. అతగాడు చేసిన మహా పాపము వలన అతని వంశీకులైన మీరంతా నరకానికి రావలసి వచ్చినది. అయినా వ్యక్తిగతముగా చేసిన సువీరుని రెండవ కుమార్తె నర్మదానదీ తీరాన గల పర్ణశాలలో తన తల్లితో జీవిస్తూ వుంది. ఆ బిడ్డకింకా వివాహము కాలేదు. కాబట్టి నువ్వు నా అనుగ్రహము వలన దేహివై (భూలోక వాసులు గుర్తించే శరీరి), అక్కడకు వెళ్లి, అక్కడ యోగ్యుడైన వరునికి ఇచ్చి,

కన్యాదాన విధానముగా పెండ్లిని జరిపించు శ్రుతకీర్తి! ఎవడైతే కార్తీకమాసములో సర్వాలంకార భూషితయైన కన్యను యోగ్యుడైన వరునికి దానము చేస్తాడో వాడు లోకాధిపతితో తుల్యుడవుతాడు. అలా కన్యాదానమును చేయాలనే సంకల్పము వుండీ కూడా సంతానము లేని వాడు - బ్రాహ్మణ కన్యాదానికిగాను కన్యాదానం అందుకోబోతూన్న బ్రాహ్మణునకుగాని ధన సహాయమును చేసినట్లయితే ఆ ధనదాత కన్యాదాత పొందే ఫలాన్నే పొందుతాడు. అంతే కాదు - స్వలాభాపేక్షా రహితులై రెండు పాడి ఆవులను చెల్లించి, కన్యను కొని, ఆ కన్యను చక్కటి వరునకిచ్చి పెండ్లి చేసే వారు కూడా కన్యాదాన ఫలాన్ని పొందుతారు. కాబట్టి, ఓ శ్రుతకీర్తి! నీవు తక్షణమే భూలోకానికి వెళ్ళి, సువీరుని ద్వితీయ కుమార్తెను ఎవరైనా సద్బ్రాహ్మణునకు కన్యామూలముగా దానము చేసినట్లయితే - తద్వారా నువ్వూ, నీ పూర్వీకులూ, ఈ సువీరాదులు కూడా నరకము నుండి విముక్తి పొందుతారు' అని చెప్పాడు.

ధర్ముని అనుగ్రహము వలన దేహధారియైన శ్రుతకీర్తి, వెనువెంటనే భూలోకములోని నర్మదా నదీ తీరాన్ని చేరి, అక్కడి పర్ణశాలలో వున్న సువీరుని భార్యకు హితవులు గరపి, వారి ద్వితీయ సంతానమైన ఆడపిల్లను సువర్ణాభరణ భూషితను చేసి, శివప్రీతిగా, 'శివార్పణమస్తు' అనుకుంటూ ఒకానొక బ్రాహ్మణునికి కన్యాదానముగా అర్పించాడు. ఆ పుణ్యమహిమ వలన సువీరుడు - నరకపీడా విముక్తుడై, స్వర్గమును చేరి సుఖించసాగాడు. తదనంతరము శ్రుతకీర్తి పది మంది బ్రహ్మచారులకు కన్యామూల్యమును ధారబోయడం వలన వారి వారి పితృపితా మహాదివర్గాల వారంతా కూడా విగతపాపులై, స్వర్గాన్ని పొందారు. అనంతరము శ్రుతకీర్తి కూడా యధాపూర్వకముగా స్వర్గము చేరి తన వారిని కలిసి సుఖించసాగాడు. కాబట్టి ఓ జనక మహారాజా! కార్తీకమాసములో కన్యాదానము చేసేవాడు, సర్వపాపాలనూ నశింప చేసుకుంటానడంలో ఏ మాత్రమూ సందేహం లేదయ్యా! కన్యామూల్యాన్ని చెల్లించ లేని వారు వివాహార్థము మాట సహాయమును చేసినప్పటికీ కూడా అమితమైన పుణ్యాన్ని పొందుతారు రాజా! ఎవరైతే కార్తీక మాసములో యధావిధిగా కార్తీక వ్రతాన్ని ఆచరిస్తారో వాళ్ళు స్వర్గాన్నీ, ఆచరించని వాళ్ళు నరకాన్నీ పొందుతారనడంలో ఏ మాత్రం సందేహము లేదని గుర్తించు.

## చతుర్ధశాధ్యాయము

వశిష్ఠుడు చెబుతున్నాడు: మిధిలాధీశా! కార్తీక మాసమంతా పూర్వోక్త సర్వధర్మ సంయుతంగా కార్తీక వ్రతాన్ని ఆచరించలేక పోయినప్పటికీ కూడా ఎవరైతే కార్తీక పూర్ణిమ నాడు వృషోత్సర్గం చేస్తారో వారి యొక్క జన్మాంతర పాపాలన్నీ కూడా నశించిపోతాయి.

### వృషోత్సర్గము

జనక మహీపాలా! ఆవు యొక్క కోడెదూడను - అచ్చుబోసి ఆబోతుగా స్వేచ్ఛగా వదలడాన్నే వృషోత్సర్గము అంటారు. ఈ మానవలోకంలో ఏ ఇతర కర్మాచరణాల వలన కూడా

అసాధ్యమైన పుణ్యాన్ని ప్రసాదించే ఈ కార్తీక వ్రతములో భాగముగానే, కార్తీక పూర్ణిమ నాడు పితృదేవతా ప్రీత్యర్థము ఒక కోడె (ఆవు) దూడను అచ్చుబోసి ఆబోతుగా

స్వేఛ్ఛగా వదలాలి. అలా చేయడం వలన గయా క్షేత్రములో, పితరులకు కోటిసార్లు శ్రాద్ధాన్ని నిర్వహించిన పుణ్యము కలుగుతుంది.

శ్లో॥ యః కోవా స్మత్కులే జాతః పౌర్ణమాస్యాంతు కార్తీకే
ఉత్సృజే ద్వృషభంనీలం తేన తృప్తా వయం త్వితి
కాంక్షంతి నృపశార్దూల - పుణ్యలోక స్థితా అపి....

'పుణ్యలోకాలలో వున్న పితరులు సైతం తమ కులములో పుట్టిన వాడెవడైనా కార్తీక పౌర్ణమినాడు నల్లని గిత్తను అచ్చుబోసి వదిలినట్లయితే మనకు అమితానందం కలుగుతుంది గదా!' అని చింతిస్తూ వుంటారు రాజా! ధనికుడైనా సరే జీవితంలో ఒక్కసారైనా కార్తీక పౌర్ణమినాడు వృషోత్సర్గమును చేయని వాడు 'అంధతామిస్రము' అనే నరకాన్ని పొందుతాడు. గయా శ్రాద్ధము వలన గాని, ప్రతివర్షాబ్దికాల వల్లగాని, తీర్థ స్థలాల్లో తర్పణం వల్లగాని ఈ వృషోత్సర్గంతో సమానమైన ఆనందాన్ని పితరులు పొందరనీ, గయాశ్రాద్ధ వృషోత్సర్గాలు రెండూ సమానమేనని పెద్దలు చెప్పినా, వృషోత్సర్గమే ఉత్తమమైనదనీ తెలుసుకో."

### వివిధ దానములు

ఇక కార్తీక మాసములో పండ్లను - దానము చేసేవాడు దేవర్షి పితౄణాలు మూడింటి నుంచి కూడా విముక్తుడై పోతాడు. దక్షిణాయుతంగా ధాత్రీ (ఉసిరిక) ఫలాన్ని దానమిచ్చేవాడు సార్వభౌముడౌతాడు. కార్తీక పౌర్ణమినాడు లింగదానము సమస్త పాపహారకము. అత్యంత పుణ్యదాయకమే కాక ఈ దానము వలన ఈ జన్మలో అనేక భోగాలను అనుభవించి, మరుజన్మలో చక్రవర్తిత్వాన్ని పొందుతారు.

### నిషిద్ధాహారాలు

అనంత ఫలదాయకమైన ఈ కార్తీక వ్రతాచరణా సదవకాశము అందరికీ అంత తేలికగా లభ్యము కాదు. అత్యంతోత్కృష్టమైన ఈ కార్తీక మాసములో ఇతరుల అన్నమును, పితృ శేషమును, తినకూడనివి తినడము, శ్రాద్ధములకు భోక్తగా వెళ్లడము, నువ్వుల దానము పట్టడము అనే అయిదూ మానివేయాలి. ఈ నెలలో సంఘాన్నము, శూద్రాన్నము, దేవార్చకాన్నము, అపరిశుద్ధాన్నము, త్యక్తకర్మని అన్నము, విధవా అన్నము - అనేవి తినకూడదు. కార్తీక పౌర్ణమి, అమావాస్యలలోనూ - పితృదివసము నాడు, ఆదివారమునాడు సూర్యచంద్ర గ్రహణ దినాలలోనూ వ్యతీపాతవైధృత్యాది నిషిద్ధ దినాలలోనూ రాత్రి భోజనము నిషిద్ధము. ఈ నెలలో వచ్చే ఏకాదశినాడు రాత్రింబవళ్లు రెండు పూటలూ కూడా భోజనము చేయకూడదు. ఇటు వంటి రోజులలో ఛాయానక్తము (అనగా తమ నీడ - శరీరపు కొలతకు రెండింతలుగా పడినప్పుడు భుజించుట) ఉత్తమమని మహర్షులు చెప్పారు.

పరమ పవిత్రమైన ఈ కార్తీకములో నిషిద్ధ దినాలలో భుజించే వారి పాపాలు అగణితముగా పెరిగిపోతాయి. అందువలన కార్తీకములో తైలాభ్యంగనము, పగటి నిద్ర, కంచుపాత్రలో భోజనము, పరాన్నభోజనము, గృహ స్నానము, నిషిద్ధ దినాలలో రాత్రి భోజనము, వేదశాస్త్ర నింద - అనే ఈ ఏడింటిని జరుపకూడదు. సమర్థులై వుండీ కూడా - కార్తీకములో నదీ స్నానం చేయకుండా ఇంటి దగ్గరనే వేడి నీటి స్నానమును చేసినట్లయితే అది కల్లుతో చేసిన స్నానానికి సమానమవుతుందని బ్రహ్మశాసనము. సూర్యుడు తులలో వుండగా నదీ స్నానమే అత్యంత ప్రధానము. చేరువలో నదులు లేనప్పుడు మాత్రము చెరువులలోగాని, కాలువలలోగాని, నూతి వద్ద గానీ - గంగా గోదావర్యాది మహానదులను స్మరించుకుంటూ స్నానం చేయవచ్చును. ఎక్కడా చేసినా ప్రాతఃకాలంలోనే స్నానం చేయాలి. అలా చేయని వాళ్లు నరకాన్ని పొంది, అనంతరం చండాలపు జన్మనెత్తుతారు. గంగానదీ స్మరణమును చేసి, స్నానమును చేసి, సూర్యమండల గతుడైన శ్రీహరిని ధ్యానించి, ఆ విష్ణుగాధా పురాణాదులను ఆలకించి - ఇంటికి వెళ్లాలి. పగలు చేయవలసిన పనులన్నీ ముగించుకుని సాయంకాలం మరలా స్నానము చేసి - ఆచరించి, పూజా స్థానములో పీఠమును వేసి, దాని మీద ఈశ్వరుని ప్రతిష్ఠించి పంచామృత, ఫలోదక, కుశోదకాలతో మహా స్నానమును చేయించి షోడశోపచారాలతోనూ పూజించాలి.

పరమేశ్వర షోడశోపచార పూజాకల్పం

ముందుగా పరమేశ్వరుడైన ఆ పార్వతీపతిని ఆవాహన చేయాలి. అటు పిదప -

1. ఓం వృషధ్వజాయ నమః - ధ్యానం సమర్పయామి (పుష్పాక్షతలు)

2. ఓం గౌరీ ప్రియాయ నమః - పాద్యం సమర్పయామి (నీటిచుక్క)

3. ఓం లోకేశ్వరాయ నమః - ఆర్ఘ్యం సమర్పయామి (నీటిచుక్క)

4. ఓం రుద్రాయ నమః - ఆచమనీయం సమర్పయామి (నీటిచుక్క)

5. ఓం గంగాధరాయనమః - స్నానం సమర్పయామి (నీరు విడవాలి, లేదా

మంత్రము:

ఆపోహిష్ఠామయోభువః తాన ఊర్జేదథాతన । మహేరణాయచక్షసే
యోవశ్శివతమోరసః తస్యభాజయతే హనః । ఉశతీరవమాతరః
తస్మాదరంగమామవో - యస్యక్షయాయ జిన్వథ । అపోజనయథాచనః ॥

(ఈ మంత్రము పఠించుచు)నీటితో అభిషేకించవచ్చును.

6. ఓం ఆశాంబరాయ నమః - వస్త్రం సమర్పయామి (వస్త్రయుగ్మం)

7. ఓం జగన్నాధాయ నమః - ఉపవీతం సమర్పయామి (ఉపవీతం)

8. ఓం కపాలధారిణే నమః నమః - గంధం సమర్పయామి (కుడిచేతి అనామికతో గంధం చిలకరించాలి)

9. ఓం ఈశ్వరాయ నమః - అక్షతాన్ సమర్పయామి (అక్షతలు)

*10. ఓం పూర్ణ గుణాత్మనే నమః - పుష్పం సమర్పయామి (పువ్వులు)*

*11. ఓం ధూమ్రాక్షాయ నమః - ధూపమాఘ్రాపయామి (అగరు లేదా సాంబ్రాణి ధూపమీయవలెను.)*

*12. ఓం తేజో రూపాయ నమః - దీపం సమర్పయామి (ఒక వత్తితో ఆవునేతి దీపమును వెలిగించి చూపవలెను.)*

*13. ఓం లోకరక్షాయ నమః - నైవేద్యం సమర్పయామి (నివేదన ఇవ్వవలెను.)*

*"ఓం భూర్భువస్సువః తత్ సవితుర్వ రేణ్యం భర్గోదేవస్య ధీమహి - ధియోయోనః ప్రచోదయాత్' అనుకుంటూ ఒక పువ్వుతో - నివేదించు పదార్థముల చుట్టూ నీటిని ప్రోక్షించి - 1.ఓం ప్రాణాయస్వాహా, 2. ఓం అపానాయస్వాహా, 3. ఓం వ్యానాయస్వాహా 4. ఓం ఉదానాయస్వాహా 5. ఓం సమానాయస్వాహా, 6. ఓం శ్రీ మహాదేవాయ శివ శివ శివ శంభవే స్వాహా - అంటూ స్వాహా అనినప్పుడల్లా ప్రభువునకు నివేదనము చూపి, ఫలానా పదార్థమును నివేదించాము అనుకుని 'అమృతమస్తు, అమృతోపస్తరణమసి - ఋతం నత్యేన పరిషించామి - ఉత్తరాపోసనం సమర్పయామి ' అనుకుని పదార్థాల కుడిప్రక్కన ఒక చుక్క నీరును వదలవలెను. పిదప -*

*14. ఓం లోకసాక్షిణే నమః - తాంబూలాదికం సమర్పయామి*

*(5 తమలపాకులు, 2 పోకచెక్కలు సమర్పించాలి)*

*15. ఓం భవాయ నమః - ప్రదక్షిణం సమర్పయామి (ప్రదక్షిణం)*

*16. ఓం కపాలినే నమః - నమస్కారం సమర్పయామి (సాష్టాంగ నమస్కారం చేయాలి.)*

*జనక మహారాజా! పైన చెప్పిన విధముగా షోడశ (16) ఉపచారాలతోనూ గాని, లేదా నెల పొడుగునా ప్రతి రోజూ సహస్ర నామయుతంగా గాని శివపూజ చేసి, పూజ యొక్క చివరలో -*

*మంత్రము:*

*పార్వతీకాంత దేవేశ పద్మజార్చ్యాంఘ్రి పంకజ ।*
*అర్ఘ్యం గృహాణ దైత్యారే దత్తంచేద ముమాపతే ॥*

*అనే మంత్రంతో అర్ఘ్యమును ఇవ్వాలి. అనంతరము యధాశక్తి దీపములను సమర్పించి, శక్తివంచన లేకుండా బ్రాహ్మణులకు దానమును ఇవ్వాలి. ఈ ప్రకారంగా కార్తీకము నెల్లాళ్లూ కూడా బ్రాహ్మణ సమేతంగా నక్తవ్రతాన్ని ఆచరించేవాడు - వంద వాజపేయాలు, వెయ్యేసి సోమాశ్వమేధాలూ చేసిన ఫలాన్ని పొందుతాడు. కార్తీకమంతా ఈ మాసనక్త వ్రతాచరణ వలన పుణ్యాధిక్యత - పాపనాశనం అవలీలగా ఏర్పడతాయి అనడములో ఎటువంటి సంకోచమూ లేదు. కార్తీక చతుర్దశినాడు పితృప్రీతిగా బ్రాహ్మణులకు భోజనము పెట్టడం వలన వాళ్లయొక్క పితాళ్లందరూ కూడా సంతృప్తులు అవుతారు. కార్తీక శుద్ధ చతుర్దశినాడు*

ఔరసపుత్రుడు చేసే తిలతర్పణము వలన పితృలోకము సర్వము తృప్తి చెందుతుంది. ఈ చతుర్దశినాడు ఉపవాసము వుండి, శివారాధన చేసి, తిలలను దానము చేసినవాడు కైలాసానికి క్షేత్రాధిపతి అవుతాడు. ఈ కార్తీక వ్రతాన్ని ఆచరించిన వాళ్లు తప్పకుండా తమ పాపాలను పోగొట్టుకున్న వాళ్లయి

మోక్షగాములౌతారు.

జనక మహారాజా! కార్తీక పురాణములో ముఖ్యంగా ఈ 14 అధ్యాయాన్ని శ్రద్ధాభక్తులతో చదివినా, వినినా కూడా వాళ్లు సమస్త పాపాలకు ప్రాయశ్చిత్తము చేసుకోవడం ద్వారా కలిగే ఫలితాన్ని పొందుతారు.

ఏవం శ్రీస్కాంద పురాణాంతర్గత కార్తీక మహాత్మ్యే

త్రయోదశ, చతుర్దశాధ్యాయౌ (పదమూడు-పదునాలుగు అధ్యాయములు)

సప్తమ దినము (సప్తమీ) పారాయణము సమాప్తము

# సంపూర్ణ కార్తీక మహాపురాణము

## ఎనిమిదవరోజు పారాయణము

వశిష్ఠ ఉవాచ: ఓ జనక నరేంద్రా! కార్తీక మాసములో ఎవరైతే హరి ముందర నాట్యమును చేస్తారో, వాళ్లు శ్రీహరి ముందర నివాసులవుతారు. కార్తీక ద్వాదశి నాడు హరికి దీప మాలార్పణ చేసే వాళ్లు వైకుంఠములో సుఖిస్తారు. కార్తీక మాస శుక్ల పక్ష సాయంకాలాలందు విష్ణువుని అర్చించే వాళ్లు - స్వర్గ నాయకులౌతారు. ఈ నెల రోజులూ నియమముగా విష్ణ్వాలయానికి వెళ్లి, దైవ దర్శనము చేసుకునే వాళ్లు సాలోక్య మోక్షాన్నందుకుంటారు. అలా గుడికి వెళ్లేటప్పుడు వాళ్లు వేసే ఒక్కొక్క అడుగుకూ ఒక్కొక్క అశ్వమేధ యజ్ఞ ఫలాన్ని పొందుతారు. కార్తీక మాసములో అసలు విష్ణుమూర్తి గుడికి వెళ్లని వాళ్లు ఖచ్చితముగా రౌరవ నరకానికో, కాలసూత్ర నరకానికో వెళతారు. కార్తీక శుద్ధ ద్వాదశినాడు చేసే ప్రతి సత్కర్మా అక్షయ పుణ్యాన్నీ, ప్రతి దుష్కర్మా అక్షయ పాపాన్ని కలిగించుతాయి. శుక్ల ద్వాదశినాడు విప్రసహితుడై భక్తియుతుడై గంధ పుష్పాక్షత దీపధూపాజ్యభక్ష్య నివేదనలతో విష్ణువును పూజించే వారి పుణ్యానికి మితి అనేది లేదు. కార్తీక శుద్ధ ద్వాదశినాడు శివాలయములో గాని, కేశవాలయములో గాని - లక్ష దీపాలను వెలిగించి సమర్పించే వాళ్లు విమానారూఢులై దేవతల చేత పొగడబడుతూ విష్ణులోకాన్ని చేరి సుఖిస్తారు. కార్తీకము నెల్లాళ్లూ దీపమును పెట్టలేని వాళ్లు ద్వాదశీ, చతుర్దశీ, పూర్ణిమ. ఈ మూడు రోజులైనా దీపమును పెట్టాలి. ఆవు నుండి పాలు పితికేందుకు పట్టేటంత సమయమైనా దైవసన్నిధిలో దీపమును వెలిగించిన వాళ్లు పుణ్యాత్ములే అవుతారు. ఇతరులు పెట్టిన దీపాన్ని ప్రకాశింప చేసిన వాళ్ల పాపాలు ఆ దీపాగ్నిలోనే కాలిపోతాయి. ఇతరులు ఉంచిన దీపము ఆరిపోయినట్లయితే, దానిని పునః వెలిగించేవాడు ఘనమైన పాపాల నుండి తరించి పోతాడు. ఇందుకు ఉదాహరణగా ఒక కథ చెబుతాను విను.

### ఎలుక దివ్య పురుషుడగుట

సరస్వతీ నదీతీరంలో - అనాదికాలముగా పూజా పునస్కారాలు లేక శిథిలమై పోయిన విష్ణ్వాలయము ఒకటుండేది. కార్తీక స్నానార్థమై సరస్వతీ నదికి వచ్చిన ఒక యతి - ఆ గుడిచి చూచి, తన తపోధ్యానాలకు గాను ఆ ఏకాంత ప్రదేశము అనువుగా వుంటుందని భావించి, ఆ గుడిని తుడిచాడు. నీళ్లు చల్లాడు. చేరువ గ్రామానికి వెళ్లి - ప్రత్తి, నూనె, పన్నెండు ప్రమిదలూ తెచ్చి - దీపాలను వెలిగించి 'నారాయణార్పణమస్తు' అనుకుని తనలో తాను ధ్యానమును చేసుకోసాగాడు. ఈ యతి ప్రతి రోజూ ఇలా చేస్తుండగా - కార్తీక శుద్ధ ద్వాదశి నాటి రాత్రి, బైట ఎక్కడా ఆహారము దొరకకపోవడం వలన ఆకలితో తన కడుపులోనే

ఎలుకలు పరుగెడుతున్న ఒక ఎలుక - ఆ గుడిలోనికి వచ్చి, ఆహారాన్వేషణలో విష్ణు విగ్రహానికి ప్రదక్షిణముగా తిరిగి, మెల్లగా దీపాల దగ్గరకు చేరినది. అప్పటికే ఒక ప్రమిదలో నూనె అయిపోవడం వలన ఆరిపోయిన వత్తి మాత్రమే వుంది. తడిగా వున్న ఆ వత్తి నుంచి వచ్చే నూనె వాసనకు భ్రమసిన ఎలుక, అదేదో ఆహారముగా భావించి - ఆ వత్తిని నోట కరచుకుని ప్రక్కనే వెలుగుతూన్న మరో దీపము వద్దకు వెళ్ళి పరిశీలించబోయింది. ఆ పరిశీలనలో అప్పటికే నూనెతో బాగా తడిసి వున్న - ఆ ఆరిపోయిన వత్తికొన వెలుగుతూన్న వత్తి అగ్ని సంపరక్కమై వుండడంలో ఎలుక దానిని వదిలివేసినది. అది ప్రమిదలో పడి - రెండు వత్తులూ చక్కగా వెలగసాగాయి. రాజా! కార్తీక శుద్ధ ద్వాదశినాడు విష్ణుసన్నిధిలో ఒక యతీంద్రుడు పెట్టిన దీపము ఆరిపోగా, అదే విధముగా ఎలుక వలన పునః ప్రజ్వలితమై - తన పూర్వపుణ్యవశాన, ఆ మూషికము ఆ రాత్రి ఆ గుడిలోనే విగతదేహియై దివ్యమైన పురుష శరీరాన్ని పొందడం జరిగింది.

అప్పుడే ధ్యానములో నుండి లేచిన యతి - ఆ అపూర్వ పురుషుణ్ణి చూసి, 'ఎవరు నువ్వు? ఇక్కడికి ఎందుకొచ్చావు?' అని అడగడంతో - ఆ అద్భుత పురుషుడు - 'ఓ యతీంద్రా! నేనొక ఎలుకను. కేవలం గడ్డిపరకల వంటి ఆహారంతో జీవించేవాడిని. అటు వంటి నాకిప్పుడీ దుర్లభమైన మోక్షము ఏ పుణ్యము వలన వచ్చినదో తెలియడం లేదు. పూర్వజన్మలో నేనెవరిని? ఏ పాపము వలన అలా ఎలుకనయ్యాను? ఏ పుణ్యము వలన ఈ దివ్యదేహమును పొందాను? తపస్సంపన్నుడివైన నువ్వే నన్ను సమాధాన పరచగలవాడివి. దయగలవాడివై వివరించు. నేను నీ శిష్యుణ్ణి' అని అంజలి ఘటించి ప్రార్థించాడు. ఆ యతి తన జ్ఞాన నేత్రముతో సర్వాన్నీ దర్శించి ఇలా చెప్పసాగాడు. తిల సమేతముగా దానిపై నేతితో దీపాన్ని వెలిగించి - విష్ణ్వర్పణము చేసి, పునఃగుడిలోకే వెళ్ళి పురాణ కాలక్షేపము చేయసాగారు. అంతలోనే వారికి ఛటచ్ఛటారావాలు వినిపించడంతో వెనుదిరిగి స్తంభదీపము వైపు చూశారు. వాళ్ళలా చూస్తుండగానే ఆ స్తంభము ఫటఫటరావాలతో నిలువునా పగిలి నేలను పడిపోయింది. అందులో నుంచి ఒక పురుషాకారుడు వెలువడంతో విస్మయచకితులైన ఆ ఋషులు 'ఎవరు నువ్వు? ఇలా స్థాణువుగా ఎందుకు పడి వున్నావు?

నీ కథ ఏమిటో చెప్పు' అని అడిగారు. అందుకు ఆ పురుషుడు ఇలా చెప్పసాగాడు - 'ఓ మునివరేణ్యులారా! నేను గతములో ఒక బ్రాహ్మణుడను అయినా, వేదశాస్త్ర పఠనమునుగాని, హరి కథా శ్రవణమును గాని, క్షేత్ర యాత్రాటనలను గాని, చేసి ఎరుగను. అపరిమిత ఐశ్వర్యము వలన బ్రాహ్మణ ధర్మాన్ని వదలి - రాజునై పరిపాలన చేస్తూ దుష్టబుద్ధితో ప్రవర్తించేవాడిని. వేద పండితులు, ఆచారవంతులు, పుణ్యాత్ములు, ఉత్తములూ

అయిన బ్రాహ్మణులను నీచాసనాలపై కూర్చో నియోగించి, నేను ఉన్నతాసనముపై కూర్చునే వాడిని. ఎవరికీ దాన ధర్మాలు చేసే వాణ్ణి కాదు. తప్పనిసరైనప్పుడు మాత్రం - 'ఇంతిస్తాను-అంతిస్తాను' అని వాగ్దానం చేసే వాణ్ణే తప్ప, ద్రవ్యాన్ని మాత్రము ఇచ్చే వాడిని కాను. దేవబ్రాహ్మణ ద్రవ్యాలను స్వంతానికై ఖర్చు చేసుకునే వాడిని. తత్ఫలముగా దేహాంతాన నరకగతుడనై, అనంతరము - 52 వేల మార్లు కుక్కగాను, పది వేల సార్లు కాకిగాను, మరో పదివేల పర్యాయాలు తొండగానూ, ఇంకో పది వేల సార్లు విష్ఠాశినైన పురుగుగానూ, కోటి జన్మలు చెట్టుగానూ గత కోటి జన్మలుగా ఇలా మొద్దువలెనూ పరిణమించి కాలమును గడుపుతూన్నాను. ఇంతటి పాపినైన నాకు ఇప్పుడెందుకు విమోచనము కలిగిందో - ఈ విశేష పురుషాకృతి ఎలా వచ్చినదో సర్వజ్ఞులైన మీరే చెప్పాలి.

ఆ ఉద్భూత పురుషుని వచనాలను విన్న ఋషుల తమలో మాటగా ఇలా అన్నారు - ఈ కార్తీక వ్రతఫలము యదార్థమైనది సుమా! ఇది ప్రత్యక్ష మోక్షదాయకము. మన కళ్ల ముందరే ఈ కొయ్యకు ముక్తి కలిగినది కదా! అందునా కార్తీక పూర్ణిమనాడు స్తంభదీపమును పెట్టడం సర్వత్రా శుభప్రదము. మనచే పెట్టబడిన దీపము వలన ఈ మొద్దు ముక్తిని పొందినది. మొద్దయినా - మ్రానైనా సరే కార్తీకములో దైవసన్నిధిని దీపాన్ని వహించడము వలన దామోదరుని దయవల్ల మోక్షమును పొందడం తథ్యము' ఇలా చెప్పుకుంటూన్న వారి మాటలను విన్న ఉద్భూత పురుషుడు - 'అయ్యలారా! దేహి ఎవరు? జీవి ఎవరు? జీవుడు దేని చేత ముక్తుడూ - దేని చేత బద్ధుడూ అవుతున్నాడో, దేనిచేత దేహులకు ఇంద్రియాలు కలుగుతున్నాయో వివరింపుడు' అని ప్రార్థించడముతో, ఆ తాపసులలో వున్న అంగీరసుడనే ముని అతనికి జ్ఞానబోధ చేయసాగాడు.

ఏవం శ్రీస్కాంద పురాణాంతర్గత కార్తీక మహాత్మ్యే
పంచదశ, షోడశాధ్యాయౌ, (పది హేను - పదహారు అధ్యాయములు)
ఎనిమిదవ రోజు (అష్టమదిన) నాటి పారాయణము సమాప్తము

## తొమ్మిదవరోజు పారాయణము

## సప్తదశాధ్యాయము

పూర్వోక్త ఉద్భూత పురుషునికి అంగీరసుడిలా ఉపదేశిస్తున్నాడు. నాయనా! ఒకప్పుడు కైలాసములో పార్వతీదేవికి శివుడు చెప్పిన విషయాలనే నీకిప్పుడు చెప్పబోతున్నాను - శ్రద్ధగా విను.

### ఉద్భూత పురుషునకు అంగీరసుడు చేసిన ఆత్మజ్ఞానబోధ

శ్లో॥ కర్మబంధశ్చ ముక్తిశ్చ కార్యంకారణ మేవ చ
స్థూలసూక్ష్మం తథా ద్వంద్వ సంబంధో దేహముచ్యతే ॥

కర్మబంధము, ముక్తికార్యము, కారణము - స్థూల సూక్ష్మము, ఈ ద్వంద్వ సంబంధితమే, దేహమనబడుతూంది.

శ్లో॥ అత్రబ్రూమ స్సమాధానం కోన్యోజీవస్త్వమేవహి
స్వయం పృచ్ఛసిమాంకోఽహం బ్రహ్మైవాస్మి న సంశయః ॥

జీవుడంటే వేరెవరూ కాదు, నీవే అప్పుడు - 'నేనెవర్ని?' అని నిన్ను నువ్వే ప్రశ్నించుకుంటే నేనే బ్రహ్మనై వున్నాను. ఇది నిశ్చయము' అనే సమాధానమే వస్తుంది.

పురుష ఉవాచ: 'అంగీరసా! నువ్వు చెప్పిన వాక్యార్థ జ్ఞానము నాకు తట్టడం లేదు. నేనే 'బ్రహ్మను' అనుకోవడానికైనా బ్రహ్మ అనే పదార్థమును గురించి తెలిసి వుండాలి గదా! ఆ పదార్థ జ్ఞానము కూడా లేనివాడనైన నాకు - మరింత వివరముగా చెప్పమని కోరుతున్నాను.'

అంగీరస ఉవాచ: అంతఃకరణానికీ, తద్వ్యాపారాలకీ, బుద్ధికీ సాక్షి - సత్, చిత్ ఆనందరూపీ అయిన పదార్థమే ఆత్మ అని తెలిసికొనుము. దేహము కుండవలె రూపాదివత్‌గా వున్న పిండ శేషమూ - ఆకాశాది పంచభూతాల వలన పుట్టినదీ అయిన కారణముగా - ఈ శరీరము ఆత్మేతరమైనదే తప్ప - 'ఆత్మ' మాత్రము కాదు. ఇదే విధముగా ఇంద్రియాలుగాని, అగోచరమైన మనస్సుగాని, అస్థిరమైన ప్రాణముగాని - ఇవేవీ కూడా 'ఆత్మ' కాదు - అని తెలుసుకో. దేనివలనైతే దేహింద్రియాదులన్నీ భాసమానాలవుతున్నాయో అదే 'ఆత్మ'గా తెలిసికొని - ఆ 'ఆత్మపదార్థమే నేనై వున్నాను' అనే విచికిత్సను పొందు. ఏ విధంగానైనా అయస్కాంతమణి తాను ఇతరాల చేత - ఆకర్షింపబడకుండా - ఇనుమును తానాకర్షిస్తుందో - అదే విధంగా - తాను నిర్వికారియై బుద్ధ్యాదులను సైతము చలింప చేస్తున్నదే దానిని ఆత్మవాచ్యమైన

'నేను'గా గుర్తించు. దేని సాన్నిధ్యము వలన జడాలైన దేహేంద్రియ మనఃప్రాణులు భాసమానాలౌతున్నాయో - అదే జనన మరణ రహితమైన ఆత్మగా భావించు. ఏదైతే నిర్వికారమై - నిద్రాజాగ్రత్ స్వప్నాదులనూ, వాటి ఆద్యంతాలనూ గ్రహిస్తున్నదో అదే నేనుగా స్మరించు. ఘటాన్ని ప్రకాశింప చేసే దీపం ఘటితమైనట్లే - దేహేతరమై 'నే'నబడే ఆత్మ చేతనే దేహాదులన్నీ భాసమానాలవుతాయి. సమస్తమూ పట్లా ఏర్పడుతూండే అనూహ్, అగోచర ప్రేమైకారమే నేనుగా తెలుసుకో, దేహేంద్రియ మనః ప్రాణాహంకారాల కంటే విభిన్నమైనదీ - జనితత్వ అస్తిత్వ వృద్ధిగతత్వ, పరిణామత్వ, క్షీణత్వ, నాశంగతత్వాలనే షడ్వికారాలు లేని దానినే ఆత్మగా - అదే నీవుగా ఆ నీవే నేనుగా - నేనే నీవుగా 'త్వమేవాహం'గా భావించు. ఈ విధంగా 'త్వం' (నీవు అనే పదార్థ జ్ఞానాన్ని పొంది, తత్కారణాత్ వ్యాపించే స్వభావము వలన సాక్షాద్విధిముఖంగా తచ్ఛబ్దార్థాన్ని గ్రహించాలి ('తత్' శబ్దానికి 'బ్రహ్మ' అని అర్థము).

శ్లో॥ అతద్వ్యావృత్తిరూపేణ సాక్షాద్విధి ముఖేన చ
వేదాంతానాం ప్రవృత్తిః స్యాత్ ద్విరాచార్య సుభాషితమ్ ॥

'అతః' శబ్దానికి బ్రహ్మణమైన ప్రపంచమని అర్థం. 'వ్యావృత్తి అంటే - ఇది కాదు - ఇదీ కాదు - (నేతి-న+ఇతి, న+ఇతి=ఇదీకాదు) అనుకుంటూ - ఒకటొకటిగా ప్రతిదానినీ కొట్టిపారవేయడం - అంటే, ఈ చెయ్యి 'బ్రహ్మ (ఆత్మ)' కాదు. ఈ కాలు 'ఆత్మ (బ్రహ్మ)' కాదు. అనుకుంటూ - 'ఇది కాక పోతే మరి 'అది' ఏది? అని ప్రశ్నించుకుంటూ పోగా పోగా మిగిలేదే 'బ్రహ్మ' (ఆత్మ) అని అర్థం. ఇక - సాక్షా ద్విధిముఖాత్ అంటే - 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' అనే వాక్యాల ద్వారా సత్యత, జ్ఞానం, ఆనందాలవల్లనే - 'ఆత్మ' నరయగలగాలని అర్థము. ఆ 'ఆత్మ' సంసార లక్షణావేష్టితం కాదనీ, సత్యమనీ, దృష్టిగోచరము కాదనీ, చీకటిని ఎరుగనిదనీ - లేదా - చీకటికి అవతలిదనీ, పోల్చి చెప్పడానికి వీలు లేనంతటి ఆనందమయమనీ, సత్య ప్రజ్ఞాది లక్షణయుతమనీ, పరిపూర్ణమనీ - పూర్వోక్త సాధనల వలన తెలుసుకో. అబ్బాయీ!

దేనినైతే 'సర్వజ్ఞం పరేశం సంపూర్ణ శక్తిమంతం' గా, వేదాలు కీర్తిస్తున్నాయో - ఆ బ్రహ్మ 'నేనే'నని గుర్తించు. ఏదీ తెలుసుకుంటే అన్నీ తెలిసిపోతాయో - అదే ఆత్మ. అదే నువ్వు. అదే నేను. 'తదనుప్రవిశ్య' ఇత్యాది వాక్యాల చేత జీవాత్మరూపాన జగత్ప్రవేశమూ - ప్రవేశిత జీవులను గురించిన నియంతృత్వము - కర్మ ఫలప్రదత్వమూ - సర్వజీవ కారణ కర్తృత్వమూ - దేనికైతే చెప్పబడుతూ వుందో -అదో

'బ్రహ్మ'గా తెలుసుకో. 'తత్త్వమసి'=తత్ అంటే బ్రహ్మ, లేదా ఆత్మ - త్వం అంటే నువ్వే - అనగా - నువ్వే - అనగా పరబ్రహ్మమని అర్థం. ఓ జిజ్ఞాసూ! అద్వయానంద పరమాత్మయే ప్రత్యగాత్మ. ఈ ప్రత్యగాత్మే ఆ పరమాత్మ - ఈ ప్రకారమైన తాదాత్మ్యత ఏనాడు సిద్ధిస్తుందో - అప్పుడు మాత్రమే 'తత్' శబ్దార్థం తనేననీ, 'త్వం' శబ్దము సాధనమే గాని ఇతరం గాదనీ తేలిపోతుంది. నీకు మరింత స్పష్టముగా అర్థమవడం కోసం చెబుతున్నాను విను. తత్త్వమసి=తత్+త్వం+అసి. ఈ వాక్యానికి అర్థం తాదాత్మ్యము అనే చెప్పాలి. ఇందులో వాక్యార్థాలైన కించిజ్ఞత్వ, సర్వజ్ఞతా విశిష్టులైన జీవేశ్వరులను ప్రక్కనబెట్టి - లక్ష్యార్థాలైన ఆత్మలనే గ్రహించినట్లయితే 'తాదాత్మ్యము' సిద్ధిస్తుంది. (ముఖ్యార్థ వేధా శంక కలిగితే లక్షణావృత్తి నాశ్రయించాలి. అందులో 'భాగ లక్షణ' అనే దాని వలన ఇది సాధింపబడుతూ వుంది (ఉదా// సో2యం దేవదత్తః ఆత్మసంపన్నః). 'అహం బ్రహ్మ2స్మి' అనే వాక్యార్థబోధ స్థిరపడే వరకూ కూడా శమ దమాది సాధన సంపత్తితో - శ్రవణమనదికాలను ఆచరించాలి. ఎప్పుడైతే శ్రుతివల్లనో, గురు కటాక్షము వల్లనో తాదాత్మ్యబోధ స్థిరపడుతుందో, అప్పుడే వర్తమాన సంసార లంపటము దానికదే పుటుక్కున తెగిపోతుంది. అయినా కొంత కాలము ప్రారబ్ధకర్మ పీడిస్తూనే వుంటుంది. అది కూడా క్షయమవడంతో పునరావృత్తి రహితమైన స్థాయిని చేరతాము. దానినే ముక్తి - మోక్షము అంటారు. అందువల్ల, ముందుగా చిత్తశుద్ధి కోసం కర్మిష్ఠులుగా వుండి, తత్ఫలాన్ని దైవార్పణము చేస్తూండడం వలన - ప్రారబ్ధాన్ననుసరించి ఆ జన్మలోనే గాని, లేదా - ప్రారబ్ధ కర్మ ఫలము అధికమైతే మరుజన్మలోనైనా వివిధ మోక్షవిద్యాభ్యాసపరులై, జ్ఞానులై, కర్మబంధాల్ని త్రెంచుకుని ముక్తులవుతారు - 'నాయనా! బంధించేవి - ఫలవాంఛిత కర్మలు. ముక్తినిచ్చేవి - ఫలపరిత్యాగకర్మలు' అని ఆపాడు అంగీరసుడు.

సప్తదశాధ్యాయ స్సమాప్తః (పదునేడవ అధ్యాయము)

## అష్టాదశాధ్యాయము

అంగీరసుడు చెప్పింది వినిన -ఉద్భ్రాంత పురుషుడు కర్మయోగాన్ని గురించి ప్రశ్నించడంతో -

అంగీరసుడిలా చెబుతున్నాడు: చక్కటి విషయాన్ని అడిగావు. శ్రద్ధగా విను. సుఖ దుఃఖాది ద్వంద్వాలన్నీ దేహానికేగాని, తదతీతమైన ఆత్మకు లేవు. ఎవడైతే ఆత్మానాత్మ

సంశయగ్రస్తుడో వాడు మాత్రమే కర్మలను చేసి, తద్వారా చిత్తశుద్ధిని పొందిన వాడై ఆత్మజ్ఞాని కావాలి. దేహధారియైన వాడు తన వర్ణాశ్రమ విద్యుక్తాలయిన స్నానశౌచాదిక కర్మలను తప్పనిసరిగా చేసి తీరాలి.

శ్లో॥స్నానేన రహితం కర్మ హస్తిభుక్త కపిత్థవత్
ప్రాతః స్నానం ద్విజాతీనాం శాస్త్రం చ శ్రుతిచోదితమ్ ॥

స్నానము చేయకుండా చేసే ఏ కర్మ ఐనా సరే - ఏనుగు తినిన వెలగపండులా నిష్ఫలమే అవుతుంది. అందునా - బ్రాహ్మణులకు ప్రాతః స్నానము వేదోక్తమై వుంది. ప్రతి రోజునా ప్రాతః స్నానం చెయ్యలేని వాళ్లు - సూర్యసంచారము కల తులా-కార్తీక మకర-మాఘ మేష-వైశాఖాలలోనైనా - చెయ్యాలి. జీవితంలో ఈ మూడు మాసాలైనా ప్రాతః స్నానాలు చేసే వాడు సరాసరి వైకుంఠాన్నే పొందుతాడు. చాతుర్మాస్యాది పుణ్యకాలాలలోగాని, చంద్ర సూర్యగ్రహణ పర్వాలలోగాని - స్నానము చాలా ప్రధానము. గ్రహణాలలో - గ్రహణకాల స్నానమే ముఖ్యము. సర్వకాలముల యందు బ్రాహ్మణులకు పుణ్యకాలాలలో సర్వ ప్రజలకు - స్నాన సంధ్యా, జప, హోమ, సూర్యనమస్కారాలు తప్పనిసరిగా చేయవలసి వున్నాయి. స్నానాన్ని వదలిన వాడు రౌరవ నరకగతుడై - పునః కర్మభ్రష్టుడిగా జన్మిస్తాడు. ఓ వివేకవంతుడా!
పుణ్యకాలాలన్నింటా సర్వోత్తమమైనదీ కార్తీకమాసము. వేదాన్ని మించిన శాస్త్రము, గంగను మించిన తీర్థము, భార్యతో సమానమైన సుఖము, ధర్మతుల్యమైన స్నేహము, కంటికంటే వెలుగు -లేనట్లుగానే కార్తీకమాసముతో సమానమైన పుణ్యకాలము గాని, కార్తీక దామోదరునికన్నా దైవముగాని లేడని గుర్తించు, కర్మ మర్మాన్ని తెలుసుకుని కార్తీకములో ధర్మాన్ని ఆచరించేవాడు వైకుంఠమును చేరుతాడు. నాయనా! విష్ణువు - లక్ష్మీసమేతుడై, ఆషాడశుక్ల దశమ్యంతంలో - పాలసముద్రాన్ని చేరి నిద్రా మిషతో శయనిస్తాడు. పునః హరిబోధినీ అనబడే కార్తీకశుక్ల ద్వాదశినాడు నిదురలేస్తాడు. ఈ నడుమ నాలుగు మాసాలనే చాతుర్మాస్య (వ్రతము) అంటారు. విష్ణువునకు నిద్రాసుఖప్రదమైన ఈ నాలుగు నెలలూ కూడా ఎవరైతే హరి ధ్యానమును, పూజలను చేస్తుంటారో వాళ్ల పుణ్యాలు అనంతమై, విష్ణులోకాన్ని పొందుతారు. ఈ విషయమై ఒక పురాణ రహస్యాన్ని చెబుతాను విను.
ఒకానొక కృతయుగంలో విష్ణువు లక్ష్మితో సహా వైకుంఠ సింహాసనాన్ని అలంకరించి వుండగా - నారదుడు అక్కడకు వెళ్లి వారికి మ్రొక్కి -

'హే శ్రీహరీ! భూలోకంలో వేదవిధులు అడుగంటాయి. జ్ఞానులు సైతము గ్రామ్యసుఖాలకు లోనై పోతున్నారు. ప్రజలంతా వికర్ములై వున్నారు. వారెలా విముక్తులవుతారో తెలియక నేను దుఃఖితుడనవుతున్నాను' అని విన్నవించాడు. నారదుని మాటలను విశ్వసించిన నారాయణుడు, సతీసమేతుడై, వృద్ధ బ్రాహ్మణ రూపధారియై తీర్థక్షేత్రాదులలోనూ, బ్రాహ్మణ పరిషత్పట్టణాలలోనూ పర్యటించసాగాడు. కొందరు ఆ దంపతులకు అతిథి సత్కారాలు చేశారు. కొందరు హేళన చేశారు. ఇంకొందరు లక్ష్మీనారాయణ ప్రతిమలను పూజిస్తూ వీళ్లను తిరస్కరించారు. కొందరు అభక్ష్యాలను పాపాచరణులనీ చూచిన శ్రీహరి - ప్రజోద్ధరణ చింతనామానసుడై - చతుర్భుజాలతో, కౌస్తుభాది ఆభరణాలతో యధారూపాన్ని పొంది వుండగా - జ్ఞాన సిద్ధుడనే ఋషి తన శిష్యగణ సమేతముగా వచ్చి ఆయనని ఆరాధించాడు. అనేక విధాలుగా స్తుతించాడు.

ఏవం శ్రీస్కాంద పురాణాంతర్గత కార్తీక మహాత్మ్యే
సప్తదశ, అష్టాదశాధ్యాయౌ, (పదిహేడు - పద్దెనిమిదీ అధ్యాయములు)
తొమ్మిదవ రోజు (నవమి) నాటి పారాయణము సమాప్తము

పదియవరోజు పారాయణము

ఏకోనవింశాధ్యాయము

జ్ఞానసిద్ధ ఉవాచః వేదవేత్తల చేత - వేదవేద్యునిగానూ, వేదాంత స్థితునిగానూ, రహస్యమైనవానిగానూ, అద్వితీయునిగానూ కీర్తింపబడే వాడా! సూర్యచంద్ర శివబ్రహ్మాదుల చేతా - మహారాజాధి రాజుల చేతా స్తుతింపబడే రమణీయ పాదపద్మాలు గలవాడా! నీకు నమస్కారము. పంచభూతాలూ, సృష్టి సంభూతాలైన సమస్త చరచరాలూ కూడా నీ విభూతులే అయి వున్నాయి. శివసేవిత చరణా! నువ్వు పరమము కంటేను పరముడవు. నువ్వే సర్వాధికారివి. స్థావర జంగమరూపమైన సమస్త ప్రపంచమూ కూడా - దానికి కారణబీజమైన మాయతో సహా నీయందే ప్రస్ఫుటమవుతోంది. సృష్ట్యాదినీ, మధ్యలోనూ, తదంతమున కూడా ప్రపంచమంతా నువ్వే నిండి వుంటావు. భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్య రూప చతుర్విధాన్న రూపుడవూ, యజ్ఞ స్వరూపుడవూ కూడా నీవే. అమృతమయమూ, పరమ సుఖప్రదమూ అయిన నీ సచ్చిదానంద రూప సంస్మరణ మాత్రము చేతనే - ఈ సంసారము సమస్తమూ 'వెన్నెట్లో సముద్రములా' భాసిస్తోంది. హే ఆనందసాగారా! ఈశ్వరా! జ్ఞాన స్వరూపా! సమస్తానికీ ఆధారమూ, సకల పురాణసారమూ కూడా నీవే అయి వున్నావు. ఈ విశ్వము సమస్తము నీ వల్లనే జనించి - తిరిగి నీ యందే లయిస్తూ వుంది. ప్రాణులందరి హృదయాలలోనూ వుండే వాడివీ, ఆత్మవాచ్యుడవూ, అఖిలవంద్యుడవు. మనోవాగ గోచరుడవూ అయిన నువ్వు - కేవలము మాంసమయాలైన భౌతిక నేత్రాలకు కనిపించవు గదా తండ్రీ! ఓ కృష్ణా! ఈశ్వరా! నారాయణా! నీకు నమస్కారము. నీ ఈ దర్శన ఫలముతో నన్ను ధన్యుని చెయ్యి. దయామతివై నన్ను నిత్యమూ పరిపాలించు. జగదేక పూజ్యుడవైన నీకు మ్రొక్కడం వలన - నా జన్మకు సాఫల్యాన్ని అనుగ్రహించు దాతవు. నేతవు. కృపాసముద్రుడవూ - అయిన నీవు సంసార సాగరములో సంకటాల పాలవుతున్న నన్ను సముద్ధరించు.

హే శుద్ధచరితా! ముకుందా! త్రిలోకనాథా! త్రిలోక వాసీ! అనంతా! ఆదికారణా! పరమాత్మా! పరమహంసపతీ! పూర్ణాత్మా! గుణతీతా! గురూ! దయామయా విష్ణో! నీకు నమస్కారము. నిత్యానంద సుధాబ్ధి వాసీ! స్వర్గాపవర్గ ప్రదా! అభేదా! తేజోమయా! సాధు హృత్పద్మ స్థితా! ఆత్మారామా! దేవదేవేశా! గోవిందా! నీకిదే నమస్కారము. సృష్టి స్థితి లయకరా! వైకుంఠవాసా! బుద్ధిమంతులైన వారు ఏనీ పాదాలయందలి భక్తియనే

పడవ చేత సంసార సాగరాన్ని తరించి నీ సారూప్యాన్ని పొందగలుగుతున్నారో, అటువంటి తేజస్స్వరూపాలైన నీ పాదాలకివే నా ప్రణామాలు. వేదాల చేత గాని, శాస్త్రతర్క పురాణ నీతి కావ్యాదుల చేతగాని - మానవులు నిన్ను దర్శించలేరు. నీ పాదసేవ, భక్తి అనే అంజనాలను ధరించ గలిగిన వాళ్లు మాత్రమే - నీ రూపాన్ని భావించగలిగి, ఆత్మస్వరూపునిగా గుర్తించి తరించగలుగుతున్నారు. ప్రహ్లాద, ధ్రువ, మార్కండేయ, విభీషణ, ఉద్ధవ, గజేంద్రాది భక్తకోటులను రక్షించిన నీ నామస్మరణ మాత్రము చేతనే సమస్త పాపాలూ నశించి పోతున్నాయి. ఓ కేశవా! నారాయణా! గోవిందా! విష్ణూ! మధుసూదనా! త్రివిక్రమా! వామనా! శ్రీధరా! హృషీకేశా! పద్మనాభా! దామోదరా! సంకర్షణా! వాసుదేవా! నీకు నమస్కారము. నన్ను రక్షించు.

ఈ విధంగా తెరపిలేని పారవశ్యంతో తనను స్తుతిస్తున్న జ్ఞానసిద్ధుణ్ని చిరునవ్వుతో చూస్తూ 'జ్ఞానసిద్ధా! నీ స్తోత్రానికి నేను సంతోషభరితుడనయ్యాను. ఏమి వరం కావాలో కోరుకో' అన్నాడు విష్ణుమూర్తి. 'హే జగన్నాథా! నీకు నాయందు అనుగ్రహమే వున్నట్లయితే, నాకు సాలోక్యాన్ని (వైకుంఠం) ప్రసాదించు'మని కోరాడు జ్ఞానసిద్ధుడు. 'తథాస్తు' అని దీవించి - తార్క్ష్య వాహనుడైన శ్రీహరి ఇలా చెప్పసాగాడు. 'జ్ఞానసిద్ధా! నీ కోరిక నెరవేరుతుంది. కాని, అత్యంత దురాత్ములతో నిండిపోతూన్న ఈ నరలోకములో - మహాపాపాత్ములు సైతము సులువుగా తరించే సూత్రాన్ని చెబుతున్నాను విను. సత్పురుషా! నేను ప్రతీ ఆషాఢ శుద్ధ దశమినాడూ, లక్ష్మీసమేతుడనై పాలసముద్రములో పవళించి కార్తీకశుద్ధ ద్వాదశినాడు మేల్కొంటాను. నాకు నిద్రాసుఖాన్నిచ్చే ఈ నాలుగు నెలలూ - ఎవరైతే సద్వ్రతాలను ఆచరిస్తారో, వారు విగతపాపులై నా సాన్నిధ్యాన్ని పొందుతారు. విజ్ఞులూ, వైష్ణవులూ అయిన నీవూ, నీ సహవ్రతులూ కూడా నేను చెప్పిన చాతుర్మాస్య వ్రతాచరణను చేయుడు. చాతుర్మాస్య వ్రతాచరణ శూన్యులైన వాళ్లు బ్రహ్మహత్యా పాతక ఫలానని పొందుతారని తెలుసుకోండి. నిజానికి నాకు నిద్ర-మెలకువ కల - అనే అవస్థాత్రయ మేదీ లేదు. నేను వానికి అతీతుడను. అయినా నా భక్తులను పరీక్షించటానికి నేనలా నిద్రామిషతో జగన్నాటక రంగాన్ని చూస్తూంటానని గుర్తించు. చాతుర్మాస్యాన్నే కాకుండా - నీవు నాపై చేసిన స్తోత్రాన్ని త్రికాలములందూ పఠించే వాళ్లు కూడా తరిస్తారు. వీటిని లోకంలో - ప్రచారం చేసి - లోకోపకారానికి నడుం కట్టు' ఈ విధంగా చెప్పి,

ఆదినారాయణుడు లక్ష్మీసమేతుడై - ఆషాఢశుక్ల దశమినాడు పాలసముద్రాన్ని చేరి శేషతల్పముపై శయనించాడు.

అంగీరస ఉవాచ: ఓయీ! నీవడిగిన చాతుర్మాస్య వ్రత మహిమ ఇది. దురాత్ములైనా - పాపులైనా సరే - హరిపరాయణులై ఈ చాతుర్మాస్య వ్రతాచరణ చేసే బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, శూద్ర, స్త్రీ జాతుల వారందరూ కూడా తరించి తీరుతారు. ఈ వ్రతాన్ని చేయని వాళ్లు గో గోత్రహత్యా ఫలాన్నీ, కోటిజన్మలు సురాపానము చేసిన పాపాన్నీ పొందుతారు. శ్రద్ధాభక్తులతో ఆచరించే వాళ్లు - వంద యజ్ఞాలు చేసిన ఫలాన్నీ, అంత్యంలో విష్ణులోకాన్నీ పొందుతారు.

ఏకోన వింశోధ్యాయ స్సమాప్తః (పందొమ్మిదవ అధ్యాయము)

వింశాధ్యాయము

జనకుని కోరికపై వశిష్ఠుడు - ఇంకా ఇలా చెప్పసాగాడు; ఓ మిథిలారాజ్య ధౌరేయా! ఈ కార్తీక మహాత్మ్యమును గురించి అత్ర్యగస్త్యమునుల నడుమ జరిగిన సంవాదమును తప్పనిసరిగా తెలుసుకోవాలి. ఒకనాడు అత్రిమహాముని, అగస్త్యుని చూసి 'కుంభ సంభవా! లోకత్రయోపకారము కోసము కార్తీక మహాత్మ్య బోధకమైన ఒకానొక హరిగాథను వినిపిస్తాను - విను. వేదముతో సమానమైన శాస్త్రము గాని, ఆరోగ్యానికి యీడైన ఆనందముగాని, హరికి సాటియైన దైవముగాని, కార్తీకముతో సమానమైన నెలకాని లేవయ్యా! కార్తీక స్నాన, దీపదానాలూ, విష్ణ్వర్చనల వలన సమస్త వాంఛలూ సమకూరుతాయి. ముఖ్యముగా కలియుగ ప్రాణులు కేవలము విష్ణుభక్తి వలన మాత్రమే విజయ వివేక విజ్ఞాన యశోధన ప్రతిష్ఠాన సంపత్తులను పొందగలుగుతారు. ఇందుకు సాక్షిభూతముగా పురంజయుని ఇతిహాసాన్ని చెబుతాను.

పురంజయోపాఖ్యానము

త్రేతాయుగంలో, సూర్యవంశ క్షత్రియుడైన పురంజయుడనే వాడు అయోధ్యను పరిపాలించేవాడు. సర్వశాస్త్రవిదుడు, ధర్మజ్ఞుడూ అయిన ఆ రాజు - అత్యధికమైన ఐశ్వర్యము కలగడంతో అహంకరించిన వాడై - బ్రాహ్మణ, ద్వేషి, దేవ బ్రాహ్మణ భూహర్త, సత్య శౌచ విహీనుడూ, దుష్టపరాక్రమయుక్తుడూ, దుర్మార్గవర్తనుడూ అయి ప్రవర్తింపసాగాడు. తద్వారా అతని ధర్మబలము నశించడంతో, సామంతులైన కాంభోజ కురుజాదులు అనేక మంది ఏకమై - చతురంగబలాలతో వచ్చి - అయోధ్యను చుట్టి ముట్టడించారు. ఈ వార్త తెలిసిన పురంజయుడు కూడా బలమదయుక్తుడై - శత్రువులతో

తలపడేందుకు సిద్ధమయ్యాడు. పెద్ద పెద్ద చక్రాలున్నదీ, ప్రకాశించేదీ, జెండాతో అలంకరించబడినదీ, ధనుర్బాణాదిక శస్త్రాస్త్రాలతో సంపన్నమైనదీ, అనేక యుద్ధాలలో విజయం సాధించినది, చక్కటి గుర్రాలు పూన్చినదీ, తమ సూర్యవంశాన్వయమైనదీ అయిన రథాన్నధిరోహించి - రథ, గజ, తురగ పదాతులు - అనబడే నాలుగు రకాల బలముతో - నగరము నుండి వెలువడి - చుట్టుముట్టిన శత్రు సైన్యములపై విరుచుకు పడ్డాడు.

*ఏవం శ్రీస్కాంద పురాణాంతర్గత కార్తీక మహాత్మ్యే*
*ఏకోనవింశతి, వింశతి అధ్యాయౌ, (పందొమ్మిది - ఇరవై అధ్యాయములు*
*పదియవ (దశమ దిన) నాటి పారాయణము సమాప్తము*

## పదకొండవరోజు పారాయణము

## ఏకవింశాధ్యాయము

## యుద్ధ వర్ణనము

అత్రి ఉవాచ: అగస్త్యా - సాధారణమైన దొమ్మీగా కొట్లాటగా ప్రారంభమై, మారి, ఆ సమరమొక మహాయుద్ధముగా పరిణమించినది. అస్త్రశస్త్రాలతో, పదునైన బాణాలతో, వాడి వాడి గుదియలతో ఇనుపకట్ల తాడికర్రలతో, ఖడ్గ, పట్టిన, ముసల, శూల, భల్లాతక, తోమర, కుంభ, కుఠారాద్యాయుధాలతో ఘోరముగా యుద్ధము చేశారు. ఆ సంకుల సమరములో కాంభోజరాజు మూడు వందల బాణాలను ప్రయోగించి, పురంజయుని గొడుగునూ, జెండానూ, రధాన్నీ కూలగొట్టాడు. అనంతరం ఇంకొక అయిదు బాణాలతో గుర్రాలను కూల్చివేశాడు. మరి కొన్ని బాణాలతో పురంజయుని గాయపరిచాడు. అందుకు కోపించిన పురంజయుడు - బ్రహ్మాస్త్ర మంత్రముతో అభిమంత్రించిన పదునైన పది బాణాలను, కాంభోజ రాజుపై వేశాడు. ఆ బాణాలు కాంభోజుని కవచానని చీల్చి, గుండెలో దిగబడ్డాయి. రక్తం ధారాపాతంగా కారుతుండగా తన వక్షంలో గ్రుచ్చుకొన్న బాణాలను పెరికి తీసి - ఆ కాంభోజ మహారాజు - 'ఓ పురంజయా! నేను పరుల సొమ్ముకు ఆశపడే వాడిని కాను. నీవు పంపిన బాణాల్ని నీకు త్రిప్పి పంపుతున్నాను తీసుకో' అంటూ వానినే తన వింట సంధించి, పురంజయుని మీదకు ప్రయోగించాడు.

ఆ బాణాలు పురంజయుని సారధిని చంపివేశాయి. ధనుస్సును ముక్కలు చేశాయి. పురంజయుని మరింత గాయపరిచాయి. అంతటితో మండిపడిన అయోధ్యాధిపతి - ఇరవై రెక్కల బాణాలను వింట సంధించి వాటిని ఆకర్ణాంతము లాగి కాంభోజునిపై వదిలాడు. ఆ ఇరవై బాణాలూ ఏకకాలములో అతగాడి గుండెలలో నుండి - వీపు గుండా దూసుకు పోవడంతో - కాంభోజరాజు మూర్ఛిల్లాడు. దానితో యుద్ధము మరింత భయంకరమైనది. తెగిన తుండాలతో ఏనుగులు, నరకబడిన తలలతో గుర్రాలూ, విరగిపడిన రథాలూ, స్వేచ్ఛగా దొర్లుతున్న రథచక్రాలు, తలలూ-మొండేలూ వేరుగాబడి ఎడం ఎడంగా పడి గిలగలా తన్నుకుంటున్న కాల్బంటుల కళేబరాల్తో కదనరంగమంతా కంటగింపుగా తయారైంది. మృత వీరుల రక్తమక్కడ వాగులు కట్టి ప్రవహించసాగింది. అటువంటి ఆ భీషణ భీభత్స సంగ్రామములో అధర్మియైన పురంజయుని బలం క్రమక్రమంగా క్షీణించి పోయింది. కురుజాది వీరుల విజృంభణను

తట్టుకోలేక - ఆ సాయంకాలానికి సమరభూమిని వదిలి, పట్టణంలోనికి పారిపోయాడు. అంతఃపురము చేరి - ఆనాటి శత్రువుల విజయానికి పడి పడి దుఃఖిస్తూన్న పురంజయుని చూసి 'సుశీలుడు' అనే పురోహితుడు - 'మహారాజా! శత్రువైన ఆ వీరసేనుని గెలవాలనే కోరిక గనుక బలవత్తరంగా వుంటే - ఈ క్షణమే భక్తిప్రపత్తులతో విష్ణువును సేవించడమొక్కటే మార్గము రాజా! ఇది కార్తీకపూర్ణిమ, కృత్తికా నక్షత్రయుతుడై - చంద్రుడు షోడశ కళాశోభాయమానముగా వుండే ఈ వేళ - ఈ ఋతువులో లభించే పూలను సేకరించి, హరి ముందు మోకరించి పూజించు - విష్ణుసన్నిధిలో దీపాలను వెలిగించు. ఆయన ముందర, గోవిందా - నారాయణా - ఇత్యాది నామాలతో మేళతాళాలతో ఎలుగెత్తి పాడు - ఆ పాటలతో పరవశుడవై హరి ముందు నర్తించు. అలా చేసినట్లయితే ఆ విష్ణుమూర్తి అనుగ్రహము వల్ల నీకు మహావీరుడైన కుమారుడు కలుగుతాడు. కార్తీక మాసములో తనను ఆరాధించే భక్తుల రక్షణార్థం - వేయి అంచులతో శత్రు భయంకరమైన తన సుదర్శన చక్రాన్ని సహాయంగా పంపుతాడు.
ఈ కార్తీక పుణ్యమహిమను చెప్పడం ఎవరి వల్లా అయ్యేపని కాదు. భూపతీ! ఈనాటి నీ ఓటమికి కారణం సైన్యబలం లేకపోవడం గాని, నీకు శరీర బలం లేకపోవడం గాని కానే కాదు సుమా! మితిమీరిన అధర్మవర్తనం వలన నీ ధర్మఫలం - తద్వారా దైవబలం తగ్గిపోవడమే నీ పరాజయానికి కారణం. కాబట్టి పురంజయా! శోకాన్ని వదలి భక్తితో శ్రీహరిని సేవించు. కలతమాని కార్తీక వ్రతాన్ని ఆచరించు. ఈ కార్తీక వ్రతం వలన ఆయురారోగ్యైశ్వర్య సుఖసంపత్ సౌభాగ్య సంతానాలు సంఘటిల్లి తీరుతాయి. నా మాటలను విశ్వసించు.

ఏకవింశోధ్యాయ స్సమాప్తః (ఇరువది ఒకటవ అధ్యాయము)

## ద్వావింశాధ్యాయము

### రెండవనాటి యుద్ధము - పురంజయుని విజయము:

అత్రిమహర్షి ఇంకా ఇలా చెప్పసాగాడు; అగస్త్యా! ఆ విధంగా సుశీలుడు చేసిన బోధతో - పురంజయుడు తక్షణమే విష్ణ్వాలయానికి వెళ్లి, వివిధ ఫలపుష్ప పల్లవ దళాదిగా విష్ణువును షోడశోపచారాలతోనూ పూజించి - ప్రదక్షిణ నమస్కారాలర్పించి - మేళతాళాలతో ఆయనను కీర్తించి, పారవశ్యంతో నర్తించాడు. అంతే కాదు. బంగారంతో విష్ణు ప్రతిమను చేయించి దానికి కూడా పూజులు చేశాడు. దీపమాలికలు వెలిగించి

అర్పించాడు. ఆ రాత్రంతా అలా విష్ణుసేవలో విలీనుడైన పురంజయుడు - మరుసటి రోజు ఉదయమే శేషసైన్య సమేతుడై పునః యుద్ధరంగాన్ని చేరాడు. నగర సరిహద్దులను దాటుతూనే శత్రువులను సమరానికి ఆహ్వానిస్తూ - భీషణమైన ధనుష్టంకారాన్ని చేశాడు. ఈ ఠంకారం చెవినబడిన - కాంభోజ కురుజాది బలాలు పురంజయుడిని ఎదుర్కొన్నాయి. వజ్రాల వంటి కత్తులతోనూ, పిడుగుల వంటి బాణాలతోనూ, అమిత వేగవంతాలూ ఆకాశానికి సైతం ఎగరగలిగినవీ అయిన గుర్రాలతోనూ, ఐరావతాల వంటి ఏనుగులతోనూ అన్యోన్య జయకాంక్షా తత్పరులై ప్రాణాలకు తెగించి పోరాడే కాల్బాలతోనూ - క్రమక్రమంగా యుద్ధం దుర్నిరీక్ష్యమానంగా పరిణమించసాగింది.

గత రాత్రి పురంజయుడు చేసిన పూజలకు సంతుష్టుడైన గరుగగమనుడు - అతనికి దైవబలాన్ని తోడు చేయడం వలన ఆనాటి యుద్ధంలో శత్రురాజుల శక్తులన్నీ ఉడిగిపోయాయి. కాంభోజుల గుర్రాలు, కురుజాదుల ఏనుగులు, వివిధరాజుల రథబలాలూ, వైరి కూటం యొక్క పదాతి బలాలు - దైవకృపాప్రాప్తుడైన పురంజయుని ముందు చిత్తు చిత్తుగా ఓడిపోయాయి. పురంజయుడి పరాక్రమానికి గుండెలవిసిపోయిన పగవారందరూ - ప్రాణభీతితో రణరంగాన్ని వదలి తమ తమ రాజ్యాలకు పరుగులు తీశారు. అంతటితో - విష్ణ్వనుగ్రహం వలన విజయాన్ని పొందినవాడై పురంజయుడు - అయోధ్యా ప్రవేశం చేశాడు. విష్ణువు అనుకూలుడైతే శత్రువు మిత్రువవుతాడు. విష్ణువు ప్రతికూలుడైతే మిత్రుడే శత్రువవుతాడు. దేనికైనా దైవబలమే ప్రధానం. ఆ దైవబలానికి ధర్మాచరణమే అత్యంత ముఖ్యం. అటు వంటి ధర్మాచరణలో ప్రప్రథమైన కార్తీక వ్రత ధర్మానుష్ఠానంతో ఎవరైతే శ్రీహరిని సేవిస్తారో - వారి సమస్త దుఃఖాలూ కూడా చిటికెల మీదనే చిమిడిపోతాయి. అగస్త్యా! విష్ణుభక్తి సిద్ధించడమే కష్టతరం. అందునా కార్తీక వ్రతాచరణసక్తీ - శక్తీ కలగడం ఇంకా కష్టతరం. కలియుగంలో ఎవరైతే కార్తీక వ్రతమూ, శ్రీహరిసేవా వదలకుండా చేస్తారో వాళ్లు శూద్రులైనా సరే - వైష్ణవోత్మములుగా పరిగణింపబడతారు. వేదవిధులైన బ్రాహ్మణులైనప్పటికీ కూడా - ఈ హరిసేవా, కార్తీక వ్రతాచరణలు లేని వాళ్లు కర్మచండాలులేనని గుర్తించు. ఇక వేదవేత్తయై, హరిభక్తుడై, కార్తీక వ్రతనిష్ఠుడైన, వాని యందు సాక్షాత్తూ ఆ విష్ణువు నివసిస్తాడని చెప్పబడుతోంది. ఏ జాతివాళ్లయినా సరే ఈ సంసార సాగరాన్నుంచి బైటపడి ఉత్తమగతుల్ని పొందాలనే కోరికతో విష్ణువుని అర్చించినట్లయితే - తక్షణమే వాళ్లు తరించుకుపోయినట్లుగా

భావించు. అగస్త్యా! స్వతంత్రుడు గానీ, పరతంత్రుడు గానీ - హరి పూజాసక్తుడై వుంటేనే ముక్తి. భక్తులకా శ్రీహరీ, విష్ణువుకీ భక్తులూ అన్యోన్యానురాగబద్ధులై వుంటారు. భక్తులకు ఇహపరాలు రెండింటినీ అనుగ్రహించి, రక్షించగలిగిన ఏకైక దైవం ఆ వాసుదేవుడే. విశ్వమంతటా నిండివున్న ఆ విష్ణువునందు భక్తి ప్రవత్తులున్న వారికి మాత్రమే కార్తీక వ్రతావకాశం చేజిక్కుతుంది. కాబట్టి, వేదసమ్మతమూ, సకలశాస్త్రసారము, గోప్యమూ, సర్వవ్రతోత్తమోత్తమమూ అయినా ఈ కార్తీకవ్రతాన్ని ఆచరించినా, కనీసం కార్తీక మహాత్మ్యాన్ని మనస్ఫూర్తిగా విన్నా కూడా - వాళ్లు విగత పాపులై - అంత్యంలో వైకుంఠం చేరుకుంటారు. మహత్త్వపూర్వకమైన ఈ ఇరవై రెండవ అధ్యాయాన్ని శ్రాద్ధకాలంలో పఠించడం వలన - పితృదేవతలు కల్పాంత తృప్తిని పొందుతారు సుమా!

## త్రయోవింశాధ్యాయము

## పురంజయుని మోక్షము

'హే అత్రి మునీంద్రా! విష్ణుకృప వలన విజయుడైన పురంజయుడు ఆ తరువాత ఏమి చేశాడో వివరించు' అని అగస్త్యుడు కోరడంతో - అత్రి ఇలా చెప్పసాగాడు. భగవత్కృప వలన భండన భూమిలో విజయలక్ష్మి వరించిన పురంజయుడు, అమరావతిలో ఇంద్రునివలె, తన అయోధ్యలో అత్యంత వైభవంతో ప్రకాశించాడు. గతంలోని దుష్టభావాలను విసర్జించి సత్యశౌచపాలనం, నిత్యధర్మాచరణం, దానశీలత, యజ్ఞ యాగాది నిర్వహణలూ - ఇత్యాదులు చేస్తూ - ప్రతివర్ష ప్రయుక్త కార్తీక వ్రతాచరణం వలన విగత కల్మషుడై, విశుద్ధుడై, అరిషడ్వర్గాన్నీ - జయించి - పరమ వైష్ణవుడై మనసాగేడు. అంతేగాదు - నిరంతరమూ కూడా - శ్రీహరి పూజాప్రియుడై - ఏ దేశాలలో, ఏఏ క్షేత్రాలలో తీర్థాలలో విష్ణువును ఏఏ విధాలుగా పూజించడం వలన తన జన్మ తరిస్తుందా - అనే తపనతో వుండేవాడు, అంతగా హరిసేనా సంవిధాన సంతృప్తుడైన కారణంగా - ఒకనాడు ఆకాశవాణి - 'పురంజయా! కావేరీతీరంలో శ్రీరంగ క్షేత్రం వుంది. శ్రీరంగనాథుడనే పేర అక్కడ వెలసి వున్న విష్ణువును కార్తీక మాసంలో అర్చించి - జనన మరణాల నుంచి కడతేరుమని ప్రబోధించడంతో - రాజ్యపాలనను మంత్రులకు అప్పగించి - తగినంత చతురంగ బలయుక్తుడై - అనేక తీర్థక్షేత్రాలను దర్శిస్తూ అక్కడక్కడ యోగ్యవిధిగా శ్రీహరినే అర్చిస్తూ కావేరీ మధ్యంగతమైన భూలోక వైకుంఠమైన శ్రీరంగాన్ని చేరి, కార్తీక మాసమంతా కావేరీనదిలో స్నానాదులనీ,

శ్రీరంగంలో రంగనాథ సేవలనూ చేస్తూ ప్రతిక్షణమూ కూడా 'కృష్ణా! గోవిందా! వాసుదేవా! శ్రీరంగనాథా!' అని హరినే స్మరిస్తూ జపదానాది విద్యుక్త ధర్మాలన్నింటినీ నిర్వర్తించి కార్తీకమాస వ్రతం పూర్తి చేసుకుని పునః అయోధ్యను చేరుకున్నాడు. అనంతరం ధర్మకామం వలన సత్పుత్రపౌత్రాదుల్ని పొంది, కొన్నాళ్లు సర్వభోగ వివర్జితుడై, భార్యాసమేతంగా వానప్రస్థమును స్వీకరించి కార్తీక వ్రతాచరణ - విష్ణుసేవలలోనే లీనమై తత్పుణ్యవశాన అంత్యంలో వైకుంఠాన్ని చేరుకున్నాడు.

*ఏవం శ్రీస్కాంద పురాణాంతర్గ కార్తీక మహాత్మ్యే ఏకవింశాద్వావింశాధ్యాయౌ*

*(ఇరువది ఒకటి, ఇరువది రెండు - ఇరువది మూడు అధ్యాయములు)*

*పదకొండవ (ఏకాదశ దిన) నాటి పారాయణము సమాప్తము*

## పన్నెండవరోజు పారాయణము

## చతుర్వింశాధ్యాయము

అత్రి మహాముని చెబుతున్నాడు: అగస్త్యా! కార్తీకమాస శుక్ల ద్వాదశిని 'హరిభోధిని! అంటారు. ఆ ఒక్క పర్వతిథీ వ్రతాచరణం చేస్తే - అన్నీ తీర్థాలలోనూ స్నానం చేసినా అన్ని విధాలైన యజ్ఞాలనూ ఆచరించినా కలిగే పుణ్యం ప్రాప్తిస్తుంది. విష్ణువు పట్లా, ఏకాదశి పట్లా భక్తిని కలిగిస్తుంది. సూర్యచంద్ర గ్రహణ పర్వాల కంటే గొప్పదీ, ఏకాదశి కంటే వందరెట్లు మహిమాన్వితమైనదీ అయిన ఈ ద్వాదశినాడు ఏ పుణ్యం చేసినా, పాపం చేసినా అది కోటిరెట్లుగా పరిణమిస్తుంది. అంటే - ఈ ద్వాదశి నాడు ఒకరికి అన్నదానం చేసినా కోటి మందికి అన్నదానం చేసిన పుణ్యమూ, ఒక్క మెతుకు దొంగిలించినా - కోటి మెతుకులు దొంగిలించిన పాపమూ కలుగుతాయి. ఒక వేళ ఏ రోజుకైనా ద్వాదశీ ఘడియలు తక్కువగా వున్న పక్షంలో - ఆ స్వల్ప సమయమైనా సరే పారణకు ఉపయోగించాలే గాని, ద్వాదశి దాటిన తరువాత పారణం పనికి రాదు. పుణ్యాన్ని కోరే వారెవరైనా సరే ఏ నియమాన్నయినా అతిక్రమించ వచ్చును గాని - ద్వాదశీ పారణను మాత్రం విసర్జించకూడదు. ఏకాదశీ తిథినాడు ఉపవాసం వుండి, మరునాడు ద్వాదశీ తిథి దాటి పోకుండా పారణ చేయాలి. తద్వారా కలిగే శ్రేయస్సుని శేషశాయి చెప్పాలేగాని - శేషుడు కూడా చెప్పలేడు. ఇందుకు అంబరీషుని కథే ఉదాహరణ.

### అంబరీషోపాఖ్యానము

ద్వాదశీవ్రతాచరణ తత్పరుడూ, పరమ భాగవతోత్తముడూ అయిన అంబరీషుడనే మహారాజు - ఒకానొక కార్తీకశుద్ధ ఏకాదశినాడు ఉపవసించి, మరునాడు ద్వాదశి ఘడియలు స్వల్పంగా వున్న కారణంగా, తిథి దాటకుండానే పారణ చేయాలను కున్నాడు. అదే సమయానికి దుర్వాసమహర్షి వచ్చి - ఆనాటి అతిథ్యములో తనకు కూడా భోజనమును పెట్టవలసినదిగా కోరాడు. అంబరీషుడు ఆయనను ద్వాదశీపారణకు ఆహ్వానించాడు. తక్షణమే దుర్వాసుడు స్నానాద్యనుష్ఠానార్థం నదికి వెళ్లాడు. అలా వెళ్లిన ఋషి ఎంతసేపటికీ మళ్లీ రాకపోవడంతో అంబరీషుడు ఆత్రుత పడ్డాడు. ఆ రోజున ద్వాదశి ఘడియలు స్వల్పంగా వున్నాయి. కాలాతిక్రమణం కూడా కాకుండా పారణ చేసి తీరాల్సి వుంది. అతిథి వచ్చేవరకూ ఆగడం గృహస్థ ధర్మం. దానిని వదలలేడు. ద్వాదశి దాటకుండా పాణ చేయడం ఈ వ్రతస్థ ధర్మం. దీనిని వదులకోలేడు. అదీగాక.

శ్లో ॥ హరిభక్తి పరిత్యాగో ద్వాదశీత్యాగతో భవేత్
యతో2నుపోషితో భూయా త్కృత్వాసమ్య గుపోషణం
పూర్వం ద్వాదశ సంఖ్యాకే పురుషో హరివాసరే
పాపముల్లంఘునేపాపాత్ నైవయుజ్యం మనీషిణా ॥

'ద్వాదశీ వ్రతాన్ని ఉల్లంఘించిన వాడు, విష్ణుభక్తిని విసర్జించినవాడవుతారు. ఏకాదశినాడు ఉపవాసం చేయకపోతే ఎంత పాపం కలుగుతుందో, ద్వాదశినాడు పారణ చేయకపోతే అంతకు రెట్టింపు పాపం కలుగుతుంది. అంతే కాదు - ఒక్క ద్వాదశీ పారణాతి క్రమణ వల్ల, ఆనాటి వ్రతఫలంతో బాటు గానే, అతః పూర్వం చేసిన పన్నెండు ద్వాదశీ పారణల మహాపుణ్యం కూడా హరించుకుపోతుంది. జన్మజన్మాంతర పుణ్యబలం క్షీణిస్తుంది. అన్నింటికన్నా ముఖ్యంగా ద్వాదశ్యతిక్రమణము వలన విష్ణు విరోధభీతి ఏర్పడుతుంది. అందువల్లే ప్రాణావసానమయినా సరే, ద్వాదశీపారణ చేయడమే కర్తవ్యం. తద్వారా సంక్రమించే బ్రాహ్మణశాపం వల్ల కల్పాంత దుఃఖమే కలుగును గాక! దూర్వాసాగమనానంతరం కన్నా, ద్వాదశీ తిరోగమనాత్పూర్వమే పారణ చేసి - హరిభక్తిని నిలుపుకున్నట్లయితే - కలగబోయే కష్టాలను ఆ కమలనాభుడే కడతేరుస్తాడు. ఇలా తన మనస్సులో ఒక నిర్ణయానికి వచ్చి కూడా, ధర్మవర్తనుడైన ఆ అంబరీషుడు, ద్వాదశీ పారణార్థం తనను పరివేష్టించి వున్న వేదవిదులకు తన ధర్మసందేహాన్ని తెలియజేశాడు.

అంబరీషుని మనోవ్యథ:

అంబరీషుని సమస్యను వినిన వేదస్వరూపులైన ఆ విప్రులు, క్షణాల మీద శ్రుతి స్మృతి శాస్త్ర పురాణదులన్నిటినీ మననం చేసుకుని "మహారాజా! సర్వేశ్వరుడైన ఆ భగవంతుడు సమస్త జీవులయందునా జఠరాగ్ని రూపంలో ప్రక్షిప్తమై వుంటున్నాడు. ఆ జఠరాగ్ని, ప్రాణవాయువుచేత ప్రజల్వింప చేయబడటం వలననే జీవులకు ఆకలి కలుగుతోంది. దానినే తాపమే క్షుత్పిపాసా బాధగా చెప్పబడుతూ వుంది కాబట్టి, యుక్తాహారం చేత ఆ అగ్నిని పూజించి శాంతింప చేయడమే
జీవలక్షణం. జీవులచే స్వీకరించబడే భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యారూప అన్నాదులను వారిలోని అగ్ని మాత్రమే భుజిస్తున్నాడు. జీవులందరిలోనూ వున్న జఠరాగ్ని జగన్నాథ స్వరూపం కనుకనే -

శ్లో ॥ అథ శ్వపాకం శూద్రం వాస్వన్య సద్మాగతం శుభం
అతిక్రమ్య న భుం జీత గృహమే ధ్యతిథి, నిజమ్ ॥

తన ఇంటికి వచ్చిన వాడు శూద్రుడైనా -ఛండాలుడైనా సరే, ఆ అతిథిని వదిలి గృహస్థ భోజనం చెయ్యగూడదు. అటు వంటి స్థితిలో బ్రాహ్మణుడే అతిథిగా వస్తే - అతనిని విసర్జించడం అధమాధమమని వేరే చెప్పనక్కరలేదు గదా! పైగా - తననే స్వయంగా పిలువబడిన బ్రాహ్మణుని కంటే ముందుగా తానే భోజనం చేయడం బ్రాహ్మణావమానమే అవుతుంది. భూవరా! భూసురావమానం వలన ఆయుష్షు, ఐశ్వర్యం, కీర్తి, ధర్మం నశించిపోతాయి. మనస్సంకల్పాలు సైతం తిరోహితాలై పోతాయి. బ్రాహ్మణుడు సర్వదేవతా స్వరూపుడుగా చెప్పబడి వుండటం వలన, బ్రాహ్మణావమానం సర్వదేవతలనూ అవమానించండంతో సమానమవుతుంది. జాతి మాత్రం చేతనే బ్రాహ్మణుడు దేవతాతుల్యుడై వుండగా - కేవలం జన్మవలననేగాక, జ్ఞానం వలనా, తపో మహిమ వలనా, శుద్ధరుద్ర స్వరూపుడుగా కీర్తించబడే దూర్వాసుని వంటి ఋషిని భోజనానికి పిలిచి, ఆయన కంటే ముందే పారణ చేయడం ధర్మమని చెప్పడం సాధ్యం కాదు. కోపిష్ఠి అయిన ఆ ఋషి శపిస్తాడనే భయాన్ని ప్రక్కకు నెట్టి చూసినా -

శ్లో॥ వయం న నిశ్చయం క్వాపిగచ్ఛామో నరపుంగవ
తథాపి ప్రథమం విప్రా ద్భోజనం నప్రకీర్తితమ్ ॥

బ్రాహ్మణాతిధి కంటె ముందుగా భుజించటం కీర్తికర్తమైనది మాత్రం కాదు. ధరణీపాలా! ద్వాదశీపారణా పరిత్యాగం వలన, తత్పూర్వదినమైన ఏకాదశ్యుపవాసానికి భంగం కలుగుతుంది. ఆ ఏకాదశీ వ్రతభంగానికి ప్రాయశ్చిత్తమనేదే లేదు. ఇట్లు - బ్రాహ్మణాతిధిని అతిక్రమించడం వలన కలిగే విప్రపరాభవానికి కూడా విరుగుడు లేదు. రెండూ సమతూకంలోనే వున్నాయి.

చతుర్వింశోధ్యాయ స్సమాప్తః (ఇరువది నాలుగవ అధ్యాయము)

## పంచవింశాధ్యాయము

## విప్రుల ధర్మబోధ

'అంబరీషా! పురాకర్మానుసారియై నీకిప్పుడు రెండు ప్రక్కల నుంచీ కంఠపాశరజ్జువులా ఈ ధర్మ సంకటం ప్రాప్తించింది. దుర్వాసుడు వచ్చేవరకూ ఆగాలో,

లేదా - ద్వాదశీ ఘడియలు దాటకుండా పారణ చేయాలో - ఏది నిశ్చయించి చెప్పడానికి -

శ్లో॥ స్వ బుద్ధ్యాతు సమాలోక్య కురుత్వం తవ నిశ్చయం ॥

మేము అశక్తులమై పోతూన్నాం కాబట్టి - 'ఆత్మబుద్ధి - స్సుఖంచైవ' అనే సూత్రం వలన భారం భగవంతుడి మీద పెట్టి నీ బుద్ధికి తోచిన దానిని నువ్వాచరించు' అన్నారు బ్రాహ్మణులు. ఆ మాటలు వినగానే అంబరీషుడు. 'ఓ బ్రాహ్మణులారా! బ్రాహ్మణ శాపం కన్నా విష్ణుభక్తిని విడిచి పెట్టడమే ఎక్కువ కష్టంగా భావిస్తున్నాను. అని అనుకోగానే పూజాస్థానంలో వున్న యంత్రాన్ని ఆవహించి - జగదేక శరణ్యమూ, జగదేక భీకరమూ అయిన సుదర్శన చక్రము రివ్వున దూర్వాసుని వంకగా కదిలింది. అచేతనాలైన పూజిత సంజ్ఞలలోంచి జడమైన విష్ణుచక్రం, దివ్యకాంతి ప్రభాశోభితమై తన వంకగా కదలి రావడాన్ని చూడగానే - దూర్వాసుడు త్రుళ్ళిపడ్డాడు. ఆ చక్రానికి చిక్కగూడదని - భూచక్రమంతా గూడా క్షణాల మీద పరిభ్రమించాడు. అయినా 'సుదర్శనం' అతగాడిని తరుముతూనే వుంది. భీతావహుడైన ఆ దూర్వాసుడు - వశిష్ఠాది బ్రహ్మర్షులనీ, ఇంద్రాది అష్టదిక్పాలకులనీ, చిట్టచివరికి శివ-బ్రహ్మలనీ గూడా శరణుకోరాడు. కాని, అతని వెనకనే విహ్వాల మహాగ్ని జ్వాలాయుతంగా వస్తూన్న విష్ణుచక్రాన్ని చూసి - ఎవరికి వారే తప్పుకున్నారే తప్ప విడిచి, తెగించి ఎవరూ అభయాన్నీయలేదు.
పంచవింశోధ్యాయ స్సమాప్తః (ఇరువది ఐదవ అధ్యాయము)

## షడ్వింశాధ్యాయము

ఈ విధంగా ప్రాణభీతుడైన దూర్వాసుడు - సంభవిత లోకాలన్ని సంచరించి, చిట్టచివరగా - చక్రపాణియైన విష్ణువులోకాన్ని చేరాడు. 'హే బ్రాహ్మణప్రియా! మాధవా! మధుసూదనా! కోటి సూర్యులతో సమానమైన కాంతిని - వేడిని కలిగిన నీ సుదర్శన చక్రం నన్ను చంపడానికై వస్తూ వుంది. బ్రాహ్మణ పాద ముద్రా సుశోభిత మనోరస్కుడవైన నువ్వే నన్నీ ఆపద నుంచి కాపాడాలి' అని ఘోషిస్తూ - సర్వేశ్వరుడైన ఆ శ్రీహరినే శరణు కోరాడు. విలాసంగా నవ్వాడు విష్ణువు. 'దూర్వాసా! ప్రపంచానికి నేను దైవాన్నయినా - నాకు మాత్రం బ్రాహ్మణులే దైవాలు. కాని, నువ్వు సద్బ్రాహ్మణుడవూ, రుద్రాంశ సంభూతుడవూ అయి వుండి కూడా - అంబరీషుణ్ణి అకారణముగా శపించావు. పారణకు వస్తానని చెప్పి, స్నానార్థమై వెళ్లిన

నువ్వు - సకాలానికి చేరుకోలేదు - ఆలస్యంగా రాదలుచుకున్న వాడివి నీ కోసం ఎదురు చూడకుండా, ద్వాదశీ ఘడియలు గతించి పోకుండా పారణ చేయడానికి అనుమతినైనా ఈయలేదు. ద్వాదశి దాటిపోవడానికి కొన్ని క్షణాలు మాత్రమే వ్యవధి వున్న సమయంలో - వ్రతభంగానికి భయపడి మంచినీళ్లను తీసుకున్నాడే గాని ఆకలితోనో - నిన్నవమానించాలనో కాదు. 'అనాహారేపి యచ్ఛస్తం శుద్ధ్యర్థం వర్ణినాం సదా' - నిషిద్ధాహారులకు కూడా, జలపానము దోషము కాదని శాస్త్రాలు చెబుతూండగా, అదేమంత తప్పని నువ్వు శపించాల్సి వచ్చింది? ఆత్రేయా! నువ్వెంత కటువుగా మాట్లాడినా కూడా అతగాడు నిన్ను వినయపూర్వకంగా శాంతించుమనీ వేడుకున్నాడేగాని, కోపగించుకోలేదు గదా! అయినా సరే, ముముక్షువైన అతగాడిని నువ్వు - పది దుర్భర జన్మలను పొందాలని శపించావు. నా భక్తులను రక్షించు కోవడం కోసం నీ శాపాన్నీ నిమిషంలో త్రిప్పి వేయగలను. కాని, బ్రాహ్మణ వాక్యము వట్టిపోయిందనే లోకాపవాదము. నీకు కలగకుండా ఉండడం కోసం - ఆ భక్తుని హృదయములో చేరి, నీ శాపాన్ని సవినయంగా స్వీకరించిన వాడినీ, నీ శాపాన్ని అంగీకరిస్తూ 'గృహ్ణామి' అన్నవాడినీ నేనేగాని, ఆ అంబరీషుడు మాత్రం కాదు. అతనికి నీవిచ్చిన శాపం సంగతే తెలియదు. ఋషిప్రభూ! నీ శాపం ప్రకారంగానే రీ కల్పాంతాన దుష్టుడైన శంఖాసురుణ్ణి సంహరించేందుకూ, శిష్యుడైన మనువు నుద్ధరించేందుకూ మహామత్స్యంగా అవతరిస్తాను. దేవదానవులు క్షీర సాగరాన్ని మధించే వేళ, మందరగిరిని మూపున ధరించడానికి కుదురుగా వుండేందుకుగాను కూర్మావతారుడ (తాబేలు) నవుతాను. భూమిని ఉద్ధరించేందుకూ, హరిణ్యాక్షుణ్ణి చంపేందుకూ, వరాహాన్నవుతాను. హిరణ్యకశిపుణ్ణి సంహరించడం కోసం వికృతాననం గల 'నరసింహ' రూపావతార ధారుడినవుతాను. సర్వదేవతా సంరక్షణ కోసం ధర్మబలుడైనా కూడా దానవుడు గనుక 'బలి' అనే వాడిని శిక్షించేందుకు వామనుడనవుతాను. త్రేతాయుగమున జమదగ్నికి కుమారుడిగా పుట్టి సాయుధ బ్రాహ్మణుడనై దుర్మదులైన రాజులను దుళ్లగొడతాను. రావణ సంహారార్థమై ఆత్మజ్ఞాన శూన్యుడైన అంటే నేనే భగవంతుడనే దానిని మర్చిపోయిన - మాయామానుష విగ్రహుడైన దశరథ రామునిగా అవతరిస్తాను. ద్వాపరంలో జ్ఞానినీ, బలవంతుడను అయి వుండీ కూడా - రాజ్యాధికారం లేకుండా రాజు (బలరాముడు)కు తమ్మునిగా కృష్ణునిగా జన్మిస్తాను. కలియుగారంభాన పాపమోహము కొరకు పాషండమత ప్రచారకుడనై బుద్ధుడనే పేరున పుడతాను. ఆ

యగాంతన శత్రుఘాతుకుడైన - బ్రాహ్మణునిగా ప్రభావిస్తాను, దుర్వాసా! నా ఈ దశావతారాలనూ - ఆయా అవతారాలలోని లీలలనూ ఎవరు వినినా, చదివినా తెలుసుకున్నా- వారి పాపాలు పటాపంచలవుతాయి.

శ్లో॥ ధర్మానానా విధా వేదే విస్తృతా వరజన్మనాం
దేశకాల వయోవస్థా వర్ణాశ్రమ విభాగశః ॥

దేశ, కాల, వయో అవస్థలను బట్టి వర్ణాశ్రమాలను అనుసరించీ - 'ధర్మము' అనేక విధాలుగా వేదముచే ప్రవచింపబడి వుంది. అటువంటి వివిధ విధ ధర్మాలలోనూ కూడా 'ఏకాదశి' నాడు ఉపవాసం. ద్వాదశి దాటకుండా పారణం అనేవి విశ్వజనీనంగా భాసిస్తున్నాయి. అటు వంటి వైదిక ధర్మాచరణమును చేసినందుకుగాను - నువ్వా అంబరీషుణ్ణి శపించింది చాలక, తిరిగి మరో ఘోరశాపమును ఇవ్వబోయావు. బ్రాహ్మణుడవైన నీ వాక్యాన్ని సత్యము చేయడమూ - భక్తుడైన ఆ రాజును కాపాడుకోవడమూ రెండూ నా బాధ్యతలే గనక - పునః శపించబోయే నిన్ను నివారించడానికే నా చక్రాన్ని నియమించాను.

(ఇరువది నాలుగు - ఇరువది ఐదు - ఇరువది ఆరు అధ్యాయములు)

పన్నెండవ (ద్వాదశి) నాటి పారాయణము సమాప్తము

## పదమూడవరోజు పారాయణము

## సప్తవింశాధ్యాయము

విష్ణోవాచః 'దూర్వాసా! బ్రాహ్మణుడవైన నీ పట్ల అపచారం జరిగిందన్న తపనతో ఆ అంబరీషుడు విచారగ్రస్తుడై, ప్రాయోపవిష్టునిలాగా బ్రాహ్మణ పరివేష్టితుడై వున్నాడు. నా సుదర్శన చక్రం తన కారణంగానే నిన్ను తరుముతోందని దుఃఖిస్తున్నాడు. రాజయినందుకుగాను గో, బ్రాహ్మణ రక్షణ తన ప్రథమ కర్తవ్యమై వుండగా, విప్రుడవైన నీకు విపత్తు కలిగించినందుకు ఎంతగానో బాధపడుతున్నాడు. రాజు దండనీతితోనే ధర్మ పరిపాలనమును చేయాలి. కాని, బ్రాహ్మణుని మాత్రం దండించగూడదు.

శ్లో॥ బ్రాహ్మణో బ్రాహ్మణై రేవ నిగ్రాహ్యో వేదవాదిభిః
సత్య ధర్మాది నిరతైః లోభ దంభ వివర్జితైః ॥

దోషియైన బ్రాహ్మణుని-వేదవిదులు, సత్యధర్మనిరతులు, లోభదంభ శూన్యులూ అయిన బ్రాహ్మణులు మాత్రమే దండించాలి. బ్రాహ్మణుడు పాపమును చేసి, ప్రాయశ్చిత్తమును చేసుకోనప్పుడు - ధనహరణము లేదా వస్త్రహరణము, స్థానభ్రష్టత్వము మొదలైన విధులతో బ్రాహ్మణులు మాత్రమే శిక్షించాలి తప్ప, రాజు శిక్షించగూడదు. తాను స్వయంగా బ్రాహ్మణుని చంపినా, తన నిమిత్తంగా బ్రాహ్మణుడు చంపబడినా, ఇతరులచే తాను చంపించినా కూడా బ్రహ్మ హత్యాపాతకం కలుగుతుందని ధర్మశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. అందుచేత మహాభక్తుడైన ఆ అంబరీషుడు - బ్రాహ్మణుడవైన నీకు తన వల్లనే ప్రాణాపాయకరమైన సుదర్శన వేధ కలిగినందుకు ఖిన్నుడై వున్నాడు. కాబట్టి నువ్వు తత్క్షణమే అంబరీషుని దగ్గరకు వెళ్లు. తద్వారా మీ ఇద్దరికి కూడా శుభం జరుగుతుంది' అని విష్ణువు చెప్పగానే, దూర్వాసుడు అంబరీషుని ఎదుట ప్రత్యక్షమయ్యాడు. మరుక్షణమే సుదర్శనం కూడా అక్కడ ఆవిష్కరించబడింది. భయగ్రస్తుడైన దూర్వాసునిని, అతని మీదికి రానున్న సుదర్శనాన్నీ చూడగానే, అంబరీషుడు - ఆ చక్రానికి ఎదురెళ్లి - 'ఓ సుదర్శన చక్రమా! నన్ను మన్నించు. భయభ్రాంతుడైన వానిని, అందునా బ్రాహ్మణుని ఇలా క్రూరంగా హింసించడం న్యాయం గాదు' అంటూనే ధనుర్ధారియై, ఇంకా ఇలా చెప్పసాగాడు.

సప్తవింశోధ్యాయ స్సమాప్తః (ఇరువది ఏడు అధ్యాయము)

అష్టవింశాధ్యాయము

'ఆగు! ఓ విష్ణు చక్రమా, ఈ బ్రాహ్మణ వధ నీకు తగదు. చంపడమే ప్రధానమనుకుంటే నన్ను చంపు. ఈ దూర్వాసుని వదలని పక్షంలో నీతో యుద్ధానికైనా సరే నేను సిద్ధముగానే వున్నాను. రాజులకి యుద్ధమే ధర్మముగాని, యాచన చేయడం ధర్మము కాదు. విష్ణ్వాయుధానివైన నీవు నాకు దైవస్వరూపానివే. గనుక నిన్ను ప్రార్థించడంలో తప్పులేదు. అయినప్పటికీ కూడా ఈ బ్రాహ్మణ రక్షణార్థం నేను నిన్ను ఎదిరించక తప్పదు. నిన్ను జయించగలిగినదంటూ ఈ ప్రపంచంలో ఏదీ లేదని నాకు తెలియును. అయినా, నా బలపరాక్రమాలను కూడా ఒక్కసారి రుచి చూడు. మరి కొన్నాళ్లపాటు ఆ శ్రీహరి హస్తాలలో బ్రతికి వుండదలచుకుంటే శరణాగతుడైన దూర్వాసుని వదిలిపెట్టి వెళ్లిపో. లేదంటే నిన్ను ఖచ్చితంగా నేల కూలుస్తాను. అని క్షాత్రధర్మపాలనకై, తనకీ దూర్వాసునికీ మధ్య ధనుర్ధారియై నిలబడిన అంబరీషుణ్ని ఆప్యాయంగా చూసి, అతని ధర్మనిర్వహణని మరింత పరీక్షించడం కోసం సుదర్శన చక్రం ఇలా పలుకసాగింది.

'అంబరీషా! నాతో యుద్ధమంటే సంబరమనుకుంటున్నావా? మహాబల మదమత్తులైన మధుకైటభుల్నీ - దేవతలందరికీ అజేయులైన మరెందరో రాక్షసుల్నీ అవలీలగా నాశనం చేశాను నేను. ఎవరికి కోపం వస్తే ఆ ముఖాన్ని తేరి చూడడానికైనా, సమస్త ప్రపంచమూ కంపించిపోతుందో అటువంటి బ్రహ్మరుద్ర తేజోమూర్తియైన ఈ దూర్వాసుడిప్పుడిలా దిక్కులేక దీనుడై అవస్థ పడుతున్నాడంటే - అది నా ప్రతాపమేనని మర్చిపోకు. ఉభయ తేజస్సంపన్నుడై దూర్వాసుడే నాకు భయపడుతూండగా, కేవలము క్షత్రియాహంకార కారకమైన ఏకైక శివ తేజోమూర్తివి నువ్వు. నువ్వు నన్నేం చెయ్యగలవు? క్షేమం కోరుకునే వాడు బలవంతుడితో సంధి చేసుకోవాలేగాని, ఇలా యుద్ధానికి దిగి నాశనం కాకూడదు. విష్ణుభక్తుడివి కాబట్టి ఇంతవరకూ నిన్ను సహించాను. లేనిపోని బీరాలకు పోయి, వృథాగా ప్రాణాలను పోగొట్టుకోకు.' ఈ మాటలతో అంబరీషుడి కళ్లు ఎరుపెక్కాయి.

'ఏమిటి సుదర్శనా? ఎక్కువగా మాట్లాడుతున్నావు. నా దైవమైన హరి ఆయుధానివని ఇంతవరకు ఊరుకున్నానుగాని, లేకుంటే నా బాణాలతో నిన్నెప్పుడో నూరు ముక్కలు చేసి వుండే వాణ్ని. దేవబ్రాహ్మణులైనా, స్త్రీలూ - శిశువుల మీదా, ఆవుల మీదా నేను బాణప్రయోగం చెయ్యను. నువ్వు దేవతవైన కారణంగా నీవింకా నా

క్రూర నారాచఘాతాల రుచి తెలియపరచలేదు. నీకు నిజంగానే పౌరుష - ప్రతాపాలుంటే నీ దివ్యత్వాన్ని దిగవిడిచి (క్షాత్ర) ధర్మయుతంగా పురుషరూపుడివై యుద్ధము చెయ్యి' అంటూ - ఆ సుదర్శనము యొక్క పాదాలపైకి ఏకకాలంలో ఇరవై బాణాలను వేశాడు అంబరీషుడు.

అతని పౌరుషానికీ, ధర్మరక్షణా దీక్షలో దైవానికైనా జంకని క్షాత్రానికీ సంతోషించిన సుదర్శన చక్రం సరూపితమై దరహాసమును చేస్తూ - 'రాజా! శ్రీహరి నీ సంరక్షణ నిమిత్తమే నన్ను నియంత్రించాడు గాని నీతో కయ్యానికి కాదు. పరీక్షించేందుకలా ప్రసంగించానే గాని, విష్ణుభక్తులతో నేనెప్పుడూ విరోధపడను. నీ కోరిక ప్రకారమే శరణాగ్నితుడైన దుర్వాసుణ్ని వదిలివేస్తున్నా'నని చెప్పి, అంబరీషుని ఆలింగనం చేసుకున్నాడు. అంతటితో అంబరీషుడు ఆనందితుడై - 'సుదర్శనా! నీతో యుద్ధానికి దిగినందుకు నన్ను క్షమించు. భక్తులను పాలించడంలోనూ, రాక్షసులను సంహరించడంలోనూ, విష్ణుతుల్య ప్రకాశమానమూ ప్రాణప్రయాణ కష్టహరణ శీలము అయిన నీ ఉత్కృష్టతకివే నా నమస్కారాలు' అంటూ సాష్టాంగ నమస్కారం చేశాడు. సంతసించిన సుదర్శనుడు, అంబరీషుని లేవనెత్తి అభినందించి, దీవించి, అదృశ్యుడయ్యాడు. కలియుగ కార్తీకములో ఈ అధ్యాయాన్ని ఒక్కసారైనా చదివినా, విన్నా - అనేక భోగాలను అనుభవించి - అంత్యాన ఉత్తమగతులను పొందుతారు.

(ఇరువది ఏడు - ఇరువది ఎనిమిది అధ్యాయములు)

పదమూడవ (త్రయోదశి దిన) రోజు పారాయణము సమాప్తము

## పదునాలుగవ రోజు పారాయణము

## ఏకోన త్రింశాధ్యాయము

అనంతరము అంబరీషుడు దూర్వాసునికి నమస్కరించి - 'మహామునీ! నేను బహు పాపాత్ముడను. ఆకలితో వుండి అన్నానికైనా ఇంటికి వచ్చిన నిన్ను - అలసటపాలు చేసిన మందభాగ్యుడను. అయినా నాయందు దయతో మరల నా ఇంటికి అతిధిగా వచ్చితివి. దయచేసి నా ఇంట విందారగించి, నా సర్వదోషాలనూ ఉపశమింప చెయ్యి అని ప్రార్థించాడు. దూర్వాసుడు అంబరీషుడిని తన బాహువులతో లేవనెత్తి 'రాజా! ప్రాణదాతను తండ్రి అంటారు. ఇప్పుడు నువ్వు నా ప్రాణాలను కాపాడటం వలన నాకు పితృస్థానీయుడవయ్యావు. నిజానికి నేనే నీకు నమస్కరించాలి. కాని బ్రాహ్మణుడనూ, తాపసినీ, నీ కన్నా వయోవృద్ధుడినీ అయిన కారణంగా నా నమస్కారం నీకు కీడు కలిగిస్తుందేగాని మేలు చేయదు. అందువల్ల నీకు నమస్కరించబడం లేదని ఏమీ అనుకోవద్దు. నేను నిన్ను కష్టపెట్టాను. అయినా నువ్వు నాకు ప్రాణభిక్షను పెట్టావు. నీ వంటి ధర్మాత్మునితో కలిసి భోజనమును చేయడం మహద్భాగ్యం" అని చెప్పి, అతని అతిధ్యాన్నీ స్వీకరించి, విష్ణుభక్తుల మహాత్మ్య ప్రకటానార్థం, పరీక్షకునిగా వచ్చిన దూర్వాసుడు ఆ సత్కార్యం పూర్తి కావడంతో తన ఆశ్రమానికి తరలి వెళ్లిపోయాడు. కాబట్టి, కార్తీక శుద్ధ ఏకాదశినాడు ఉపవాస జాగరణలు చేసి - ద్వాదశినాడు దానాదులను (క్షీరాబ్దిద్వాదశీ వ్రతం) నిర్వర్తించి, బ్రాహ్మణ సమేతుడై, ద్వాదశి ఘడియలు దాటకుండా పారణం చేయడం వల్ల అన్ని పాపాలూ అంతరించి పోతాయి. ఈ పుణ్యగాథను చదివినా, చదివించినా, రాసినా, వినినా కూడా ఇహంలో సర్వసౌఖ్యాలనూ పొంది, పరంలో ఉత్తమ పదాన్ని పొందుతారు.

ఏకోన త్రింశోధ్యాయ స్సమాప్తః (ఇరువది తొమ్మిదవ అధ్యాయము)

## త్రింశాధ్యాయము

పూర్వోక్త విధంగా సూతుడు వినిపించిన కార్తీక మహాత్మ్యాన్ని విని, శౌనకాది ఋషులు - 'మహాభాగా! కలియుగ కల్మషగతులు, రాగాదిపాశయుక్త సంసారగ్రస్తులూ అయిన సామాన్యులకి సునాయాసంగా లభించే పుణ్యమేది? అన్ని ధర్మాల్లోనూ అధికమైనదేది? దేవతలందరిలోకీ దేవాదిదేవుడెవరు? దేని వల్ల మోక్షం కలుగుతుంది? మోహము దేనివలన నశిస్తుంది? జరామృత్యు పీడితులు, జడమతులు మందులూ

అయిన ఈ కలికాలపు ప్రజలు తేలిగ్గా తెములుకు పోయే తెరువేమిటీ, అని అడిగారు. అందుమీదట సూతుడిలా చెప్పసాగాడు -

'మంచి ప్రశ్నలను వేశారు. ఇలాంటి మంచి విషయాల గురించి ప్రసంగించుకోవడం వలన వివిధ తీర్థ క్షేత్రాటనా స్నానాల వల్లా - వివిధ యజ్ఞ యాగాది నిర్వహణల వల్లా కలిగేటంతటి పుణ్యం లభిస్తుంది. ఇంతవరకూ నేను మీకు చెప్పిన కార్తీక ఫలమే వేదోక్తమైనది. విష్ణ్వానందకారకమైన కార్తీక వ్రతమే ఉత్తమధర్మము. సర్వశాస్త్రాలనీ వివరించి చెప్పేందుకు నేను సమర్ధుడినీ గాను - సమయమూ చాలదు. గనుక - అన్ని శాస్త్రాలలోనూ వున్న - సారాంశాన్ని చెబుతాను వినండి. విష్ణుభక్తి కన్న తరుణోపాయం లేదు. విష్ణుగాథలను వినేవాళ్లు విగతపాపులై, నరకదూరులై వుంటారు - హరి ప్రీత్యర్థులుగా స్నాన, దాన, జప, పూజా, దీపారాధనాదులను చేసే వాళ్ల పాపాలన్నీ వాటికవే పటాపంచలై పోతాయి. సూర్యుడు తులారాశి యందుండే నెల రోజులూ కూడా విడవకుండా కార్తీక వ్రతమాచరించే వాళ్లు జీవన్ముక్తులవుతారు. కార్తీక వ్రతమును చేయని వాళ్లు - కుల, మత, వయో, లింగభేద రహితంగా -

'అంధతామిత్రము' అనే నరకాన్ని పొందుతారు. కార్తీకంలో కావేరీ నదీ స్నానం చేసిన వాళ్లు దేవతలచే కీర్తించబడుదురు. విష్ణులోకాన్ని చేరుదురు. కార్తీక స్నానమును చేసి, విష్ణ్వర్చన చేసిన వాడు వైకుంఠాన్ని పొందుతాడు. ఈ వ్రతాచరణ చేయని వాళ్లు వెయ్యిసార్లు ఛండాలపు జన్మల పాలవుతారు. సర్వశ్రేష్ఠము, హరిప్రీతిదాయకమూ, పుణ్యకరమూ అయిన ఈ వ్రతాచరణము దుష్టులకు లభించదు. సూర్యుడు తులారాశిలో వుండగా, - కార్తీక, స్నాన, దాన, జప పూజాదులు చేసే వాళ్లు - సర్వదుఃఖ విముక్తులై - మోక్షమును పొందుతారు. దీపదానం, కంచుపాత్రదానం, దీపారాధానం ధన-ఫల-ధాన్య-గృహాది దానాలూ అమిత పుణ్యఫలదాలు. కార్తీకం ముప్పయి రోజులూ కార్తీక మహాత్మ్యాన్ని వినినా - పారాయణ చేసినా కూడా - సకలపాపాలూ నశించిపోతాయి. సంపత్తులు సంభవిస్తాయి. పుణ్యాత్ములౌతారు. ఇన్ని మాటలెందుకు? విష్ణుప్రియమైన కార్తీక వ్రతాచరణం వలన ఇహపర సుఖాలు రెండూ గూడా కలుగుతాయి.

త్రింశాధ్యాయః సమాప్తః (ముప్పదియవ అధ్యాయము)

పదునాలుగవ (చతుర్దశ దిన) రోజు పారాయణము సమాప్తము

పదునైదవరోజు పారాయణము

ఆ మరునాడు కార్తీక పౌర్ణమి కావడం వలన, నైమిశారణ్యంలోని మునులందరూ సూతమహర్షి ఆధ్వర్యంలో వనభోజనాలను ఏర్పాటు చేసుకున్నారు. ధాత్రీ వృక్షసంయుతమైన చక్కటి ప్రదేశాన్ని చేరారు. ఉసిరిచెట్టు క్రింద కార్తీక దామోదరునిగా ప్రఖ్యాతుడైన శ్రీహరి ప్రతిమని ఏర్పరచారు. ఉసిరికలతో హరిని పూజించారు. అనంతరం 'గోవింద' నామస్మరణతో -వనభోజన సమారాధన నిర్వర్తించారు.
తదనంతర వీధులనన్నిటినీ నిర్వహించుకుని సాయంకాల సంధ్యావందనాలు పూర్తి చేసుకున్నవారై, తులసీ బృందావనాన్ని ఏర్పరచుకున్నారు. అక్కడ పునః విష్ణువును కార్తీక దామోదర నామునిగా ప్రతిష్ఠించారు. ప్రాణ ప్రతిష్ఠాదుల్ని చేశారు.
'ఓం శ్రీ తులసీధాత్రీ సమేత కార్తీక దామోదరాయ నమః' అంటూ నమస్కరించి దీపారాధలను చేశారు.

ధ్యానావాహన ఆసన, ఆర్ఘ్య, పాద్య, ఆచమన, మధుపర్క, స్నాన, వస్త్ర, ఆభరణ, గంధ, పుష్పాక్షత, ధూపదీప నైవేద్యాదులు, పుష్పహారాలంకరణ, నమస్కారాలనే షోడశోపచారాలతోనూ పూజించారు.
విష్ణువుకు ఎదురుగా చిలవలు పలవలు లేని మంచి కలపస్తంభాన్ని నాటి, దాని మీద శాలివ్రీహి ధాన్య తిలాదుల నుంచి ఆ పైన ఆవునేతితో దీపాన్ని వెలిగించి శ్రీహరికి, అర్పించారు.

అనంతరం కార్తీక మాసాదిగా తాము చెప్పుకొనిన స్కాంద పురాణాంతర్గత విశేషాలను - సోమవార వ్రత కార్తీక పౌర్ణమి స్నానాది పుణ్యసంచయ కథా స్వరూపాలైన తత్త్వనిష్ఠోపాఖ్యానము, శత్రుజిచ్చరితము, వనభోజన మహిమ, దేవదత్తోపాఖ్యానము. అజామిళోపాఖ్యానము, మంధరోపాఖ్యానము, శ్రుత కీర్త్యుపాఖ్యానము, అంబరీషోపాఖ్యానము మొదలైన వానిని పునః పునః మననం చేసుకున్నారు.
తదుపరిని - మునులందరూ కూడి, యజ్ఞ దర్శనార్థమూ, సూతుల వారిచే ప్రవచించబడే సంపూర్ణ కార్తీక మహాపురాణ శ్రవణార్థమూ నైమిశారణ్య సమాగతులైన సద్బ్రాహ్మణులకు - ఉసిరికలనూ, కార్తీక దీపాలనూ, దక్షిణ తాంబూలాదులతో సహా సమర్పించారు.

ఆ రాత్రి కాలాతిక్రమణాన్నీ కూడా లెక్క చేయకుండా హరినామ స్మరణలతో సంకీర్తనతోనూ, నృత్యగానద్యుపచార సమర్పణలతోనూ గడిపిన వారై - భక్తి పారవశ్యంతో తన్మయులై, జన్మసాఫల్య సంతృప్తులయ్యారు సౌతశౌనకాది ముని ప్రవరులు.

పదునైదవ (పౌర్ణమి) రోజు పారాయణము సమాప్తము.

## పదునారవరోజు పారాయణము

### ప్రథమాధ్యాయము

ఈ విధముగా సూతుడు ప్రవచించిన స్కాంద పురాణాంతర్గత కార్తీక మహాత్మ్యాన్ని విని సంతుష్టమానసులయిన శౌనకాది కులపతులు. ' సూతమునీ! లోకోత్తర పుణ్యదాయకమైన ఈ కార్తీక పురాణము స్కాందమందేగాక, పద్మ పురాణాంతరవర్తితయై కలదు కదా. దానిని కూడా విశదపరచవే అని ప్రార్థించగా మందస్మిత వదనుడయిన సూతుడు - మునులారా! వైకుంఠుని లీలా వినోదాలూ, మహిమలూ వినే వారికీ, వినిపించే వారికీ విశేష పుణ్యాన్నిస్తాయేగాని - విసుగుని కలిగించవు. భక్తి ప్రపత్తులతో మీరు కోరాలేగాని గురు ప్రసాదిత శక్త్యానుసారం వక్కాణిస్తాను - వినండి. స్కాంద పురాణంలో జనక మహారాజుకు వశిష్ఠుల వారెలా ఈ మహాత్మ్యాన్ని బోధించారో, అదే విధంగా పద్మ పురాణంలో సత్యభామకు శ్రీమన్నారాయణుడైన శ్రీకృష్ణ పరమాత్మ ముఖతః ఈ కార్తీక మాస విశేషాలన్నీ వివరించబడ్డాయి.

### పారిజాతాపహరణం

ఒకానొకప్పుడు నారదమహర్షి స్వర్గం నుంచి ఒక పారిజాత సుమాన్ని తెచ్చి, కృష్ణునికిచ్చి 'ఓ హరీ! నీకున్న పదహారువేల ఎనమండుగురు భార్యలలోనూ, నీకు అత్యంత ప్రియమైన ఆమెకి ఈ పువ్వు నీయవయ్యా' అని కోరాడు. ఆ సమయానికి రుక్మిణి అక్కడే వుంది. నందనందనుడు నందనవన కుసుమాన్ని రుక్మిణికి కానుక చేశాడు. ఆ సంగతి తెలిసిన సత్యభామ అలిగింది. 'ప్రియమైన భార్యకీయమంటే, తనకీయాలిగాని, ఆ రుక్మిణికీయడమేమిట'ని కోపించింది. కృష్ణుడామెకు ఎంత నచ్చ చెప్పినా వినిపించుకోలేదు. పారిజాత వృక్షాన్ని తెచ్చి, తన పెరటిలో పాదుకొలిపేదాకా ఊరుకునేది లేదని బెదిరించింది. అత్యంత ప్రియురాలయిన ఆమె అలుక తీర్చడమే ప్రధానంగా తలంచిన అనంతపద్మనాభుడు - తక్షణమే సత్యభామా సమేతంగా గరుత్మంతుడిని అధిరోహించి - ఇంద్రుని అమరావతీ నగరానికి వెళ్లాడు. పారిజాత వృక్షాన్ని శ్రీకృష్ణుడు కోరగా, స్వర్గసంపదను, భూలోకానికి పంపేందుకు దేవేంద్రుడు అంగీకరించలేదు. తత్ఫలితంగా ఇంద్రోపేంద్రుల నడుమ ఘోరమైన యుద్ధం జరిగింది. ఎట్టకేలకు ఆ తగవులో దేవేంద్రుడు తగ్గి, సవినయ పురస్సరంగా పారిజాతద్రుమాన్ని యాదవేంద్రునికి అర్పించుకున్నాడు. దానవాంతకుడు దానిని తెచ్చి ముద్దుల

భార్యామణియైన సత్రాజితి నివాసంలో ప్రతిష్ఠించాడు. అందువలన అమితానందాన్ని పొందిన ఆ అన్నుల మిన్న తన పెనిమిటియైన పీతాంబరునితో చాలా ప్రేమగా ప్రసంగిస్తూ

'ప్రాణప్రియా! నేనెంతయినా ధన్యురాలిని. నీ పదహారు వేల ఎనమండుగురు స్త్రీలలోనూ నేనే నీకు మీదుమిక్కిలి ప్రియతమను కావడం వలన, నా అందచందాలు ధన్యత్వం పొందాయి. అసలీ జన్మలో నీఅంతటివాడికి భార్యను కావడానికి, నీతో బాటు గరుడారూఢవై బొందెతో స్వర్గసందర్శనం చేయడానికి, కథలుగా చెప్పుకోవడమే తప్ప - ఎవ్వరూ ఎప్పుడూ కళ్లారా చూసి ఎరుగని కల్ప - (పారిజాత) వృక్షం నా పెరటి మొక్కగా వుండటానికి ఏమిటి కారణం? నేను నిన్ను తులాభార రూపంగా నారదుడికి ధారపోసినా, అలిగిన ఆవేశంలో నిన్ను వామపాదాన తాడించినా, నువ్వు మాత్రం నా మీద నువ్వు గింజంత కూడా కోపం చూపకుండా ఇలా ప్రేమిస్తున్నావంటే - ఈ నీ ఆదరాభిమానానురాగాలు పొందడానికి నేను గత జన్మలలో చేసిన పుణ్యం ఏమిటి? అదీగాక జన్మజన్మకీ నీ జంటను ఎడబాయకుండా వుండాలంటే నేనిప్పుడింకా ఏమేం చెయ్యాలి? అని అడిగింది. అందుకు ముకుందుడు మందహాసం చేస్తూ - ఓ నారీ లలామా, సత్యభామా! నీవు నన్ను కోరరానిది కోరినా, చెప్పకుండా అడిగినా, ఈయరానిదానిని ఆశించినా కూడా - నీ సమస్త వాంఛలనూ నెరవేర్చి సంతృప్తురాలను చేయడమే నా విధి. అందుకు కారణ నీ పూర్వజన్మమే' అంటూ ఇలా చెప్పసాగాడు.

## సత్యభామా పూర్వజన్మము

కృతయుగాంత కాలంలో, 'మాయా' అనే నగరంలో దేవశర్మ - అనే వేద పండితుడు వుండేవాడు. అతనికి లేక - లేక కలిగిన ఒకే ఒక ఆడబిడ్డ గుణవతి. అల్లారుముద్దగా పెంచుకున్న ఆ పిల్లని, తన శిష్య పరంపరలోని వాడే అయిన 'చంద్రు'డనే వానికిచ్చి పెండ్లి జరిపించాడు - దేవశర్మ. ఒకనాడీ మామా, జామాతలిద్దరూ కలిసి సమిధలనూ, దర్భలనూ తెచ్చుకునే నిమిత్తంగా అడవికి వెళ్లి, అక్కడ ఒక రాక్షసుని చేత హతమార్చబడ్డారు. బ్రాహ్మణులూ, ధర్మాత్ములూ నిత్య సూర్యోపాస్తిపరులూ అయిన వారి జీవిత విన్నాణానికి మెచ్చిన విష్ణుమూర్తి - శైవులుగాని, గాణాపత్యులుగాని, సౌర (సూర్య) వ్రతులు గాని, శాక్తేయులుగాని వీరందరూ కూడా వానచినుకులు వాగులై, వంకలై నదులై తుదకు సముద్రాన్నే చెందినట్టుగా - నన్నే పొందుతున్నారు. పుత్రభాత్రాది నామాలతో - దేవదత్తుని లాగా

నేనే వివిధ నామా రూప క్రియాదులతో అయిదుగా విభజింపబడి వున్నాను. అందువలన, మరణించిన మామా-అల్లుళ్లను మన వైకుంఠానికే తీసుకుని ర'మ్మని తన పార్షదులకు ఆజ్ఞాపించాడు. పార్షదులు ప్రభువాజ్ఞను పాటించారు. సూర్యతేజస్సమకాంతులతో ఆ

ఇరువురి జీవాలూ వైకుంఠం చేరి, విష్ణు సారూప్యాన్ని పొంది - విష్ణు సాన్నిధ్యంలోనే మసలసాగాయి.

ప్రథమోధ్యాయస్సమాప్తః (మొదటి అధ్యాయము సమాప్తము)

## ద్వితీయాధ్యాయము

### గుణవతి కథ

పితృభర్తృ మరణవార్తను విన్న గుణవతి ఎంతగానో క్రుంగిపోయినది. కాని, పోయిన వారితో తను కూడా పోలేదు గనుకా, మరణం ఆసన్నమయ్యేదాకా మనుగడ తప్పదు గనుకా - వేరొక దిక్కులేని ఆ యువతి ఇంట్లో వున్న వస్తు సంచయాన్నంతటినీ విక్రయించి తండ్రికీ - భర్తకూ ఉత్తమగతులకై ఆచరించవలసిన కర్మలను ఆచరించింది. శేషజీవితాన్ని శేషశాయి స్మరణలోనే గడుపుతూ, దేహ పోషణార్థం కూలిపని చేసుకుంటూ, ఆధ్యాత్మిక చింతనతో, హరిభక్తినీ - సత్యాన్నీ శాంతాన్నీ, జితేంద్రియత్వాన్నీ పాటిస్తూ వుండేది. పరమ సదాచారుపరులైన వారింట పుట్ట పెరిగింది కావడం వలన బాల్యం నుండి అలవడిన కార్తీక వ్రతాన్నీ - ఏకాదశీ వ్రతాన్ని మాత్రం ప్రతి ఏటా విడువకుండా ఆచరించేది.

కృష్ణుడు చెబుతున్నాడు; సత్యా! పుణ్యగణ్యాలూ, భుక్తి ముక్తిదాయకాలూ, పుత్రపౌత్ర సంపత్ సౌభాగ్య సంధాయకాలూ అయిన ఆ రెండు వ్రతాలూ నాకు అత్యంత ప్రీతిపాత్రమైన వన్న సంగతి నీకు తెలుసుకదా! కార్తీకమాసంలో సూర్యుడు తులారాశిలో వుండగా నిత్యమూ ప్రాతఃస్నానం ఆచరించే వారి సమస్త పాపాలనూ నేనూ నశింపచేస్తాను. ఈ కార్తీకంలో స్నానాలూ దీపారాధనలూ జాగరణ తులసిపూజ చేసే వాళ్లు అంత్యంలో వైకుంఠవాసుడైన శ్రీ మహావిష్ణు స్వరూపులై భావిస్తారు. విష్ణ్వాలయంలో మార్జనం చేసి, సర్వతోభద్రం - శంఖం - పద్మం మొదలయిన ముగ్గులను పెట్టి, పూజా పునస్కారాలను చేసే వారు జీవన్ముక్తులౌతారు. ఉపర్యుక్త ప్రకారంగా కార్తీక మాసంలో నెలరోజులలోనూ, కనీసం మూడు రోజులయినా ఆచరించిన వారు - దేవతలను కూడా నమస్కరించదగిన వాళ్లవుతున్నారు. ఇక పుట్టింది లగాయితు జీవితాంతమూ చేసే వారి పుణ్యవైభవాన్ని చెప్పడం ఎవరి వల్లా కాదు. అదే విధంగా - ఆనాటి గుణవతి, విష్ణుప్రియంకరాలయి ఏకాదశీ కార్తీక వ్రతాలను మాత్రం వదలకుండా కడునిష్ఠతో ఆచరిస్తూ కాలం వెళ్ల దీసి - కొన్నాళ్ల తరువాత వయోభారం వల్ల శుష్కించి, జ్వరపడింది. అయినప్పటికీ కూడా - కార్తీక స్నానం మానకూడదనే పట్టుదలతో నదికి వెళ్లి - ఆ చలిలో కూడా నడుములోతు నీళ్లకు చేరి స్నానమాడే ప్రయత్నం చేస్తూ వుంది. అంతలోనే ఆకాశం నుంచి శంఖ చక్ర గదా

పద్మాద్యాయుధాలు ధరించి విష్ణ్వాభులైన విష్ణుదూతలు గరుడతాకాయుతమైన విమానంలో వచ్చి గుణవతి నందులో చేర్చి దివ్యస్త్రీల చేత సేవలు చేయిస్తూ తమతో బాటుగా వైకుంఠానికి చేర్చారు. కార్తీక వ్రత పుణ్యఫలంగా పొగలేని అగ్నిశిఖలా ప్రకాశిస్తూ ఆమె హరి సాన్నిధ్యాన్ని పొందింది.

అనంతరం శ్రీ మహావిష్ణువునైన నేను దేవతల ప్రార్థన మీద దేవకి గర్భాన ఇలా కృష్ణుడిలా అవతరించాను. నాతో బాటే అనేకమంది వైకుంఠవాసులు కూడా యాదవులుగా జన్మించారు. పూర్మజన్మలలోని 'చంద్రుడు' ఈ జన్మలో అక్రూరుడయ్యాడు. అలనాటి దేవశర్మ సత్రాజిత్తుగా ప్రభవించాడు. బాల్యం నుంచే కార్తీకవ్రతం మీదా నా మీదా మాత్రమే మనసు లగ్నం చేసిన గుణవతే - నువ్వుగా - అంటే సత్రాజిత్ కుమార్తవైన సత్యభామగా ఇలా జన్మించావు. ఈ జన్మ వైభోగానికంతకూ కారణం పూర్వజన్మలోని కార్తీక వ్రతాచరణా పుణ్యలేశమే తప్ప ఇతరం కాదు. ఆ జన్మలో నా ముంగిట తులసి మొక్కను పాతిన పుణ్యానికి ఈ జన్మలో కల్పవృక్షం నీ వాకిట వెలసింది. ఆనాడు కార్తీక దీపారాధన చేసిన ఫలితంగా, ఈనాడు నీ ఇంటా-వంటా కూడా లక్ష్మీకళ స్థిరపడింది. అలనాడు నీ సమస్త వ్రతాచరణా పుణ్యాలనూ కూడా 'నారాయణాయేతి సమర్పయామి' అంటూ జగత్పతినైన నాకే ధారబోసిన దానికి ప్రతిఫలంగా ఇప్పుడు నా భార్యవయ్యావు. పూర్వజన్మలో జీవితాంతం వరకూ కార్తీక వ్రతాన్ని విడువలని భక్తికి ప్రతిగా సృష్టి వున్నంత వరకూ నీకు నా ఎడబాటు లేని ప్రేమను అనుభవిస్తున్నావు. సాత్రాజితీ! నువ్వే కాదు. నీ మాదిరిగా ఎవరయితే కార్తీక వ్రతానుష్ఠాననిష్ఠులూ నా భక్తగరిష్ఠులూ అయి వుంటారో వారందరూ కూడా నాకు ఇష్టులై సర్వకాల సర్వావస్థలలోనూ కూడా తత్కారణాలరీత్యా, నావారుగా, నా సాన్నిధ్యంలోనే వుంటూనే వుంటారు. రాగవతీ! ఒక్క రహస్యం చెబుతాను విను - తపోదాన యజ్ఞాదికాలను ఎన్నిటిని నిర్వర్తించిన వారైనా సరే కార్తీక వ్రతాచణా పరులకు లభించే పుణ్యంలో పదహారోవంతు పుణ్యం కూడా పొందలేరని గుర్తుంచుకో.

ఉపరివిధంగా - శ్రీకృష్ణప్రోక్తమైన తన పూర్వజన్మ గాధనూ కార్తీక వ్రత పుణ్యఫలాలనూ విని పులకితాంగియైన ఆ పూబోడి తన ప్రియపతియైన విశ్వంభరుడికి వినయ విధేయతలతో ప్రణమిల్లింది.

పదునారవ (బహుళ పాడ్యమి) నాటి పారాయణము సమాప్తము

# పదునేడవరోజు పారాయణము

## తృతీయాధ్యాయము

మళ్లా చెబుతున్నాడు సూతుడు: పూర్వాధ్యాయంలో చెప్పినట్లు సత్యభామ, శ్రీకృష్ణునికి నమస్కరించి, 'ప్రాణేశ్వరా! కాలస్వరూపుడవైన నీకు సర్వకాలాలూ అవయవాలై అలరారుతూండగా - తిథులలో ఏకాదశీ, నెలలలో కార్తీకమూ మాత్రమే అంతటి ఇష్టమయినందుకు కారణమేమిటో సెలవీయవలసిందని కోరగా - నవ్వు రాజిల్లేడు మోము వాడయిన నవనీత చోరుడిలా చెప్పసాగాడు. 'సత్యా! చక్కటి ప్రశ్ననే వేశావు. ఇది అందరూ కూడా తప్పనిసరిగా తెలుసుకోవలసిన విషయం. గతంలో పృథుచక్రవర్తి నారదుని ఇదే ప్రశ్న వేశాడు. అప్పుడు నారదుడు చెప్పిన దానినే ఇప్పుడు నీకు చెబుతాను విను.'

నారద ఉవాచ: పృధుచక్రవర్తితో నారదుడు చెబుతున్నాడు.

సముద్రనందనుడయిన శంఖుడనే రాక్షసుడు త్రిలోక కంటకుడయి సర్వదేవతాది కారాలరూ హస్తగతం చేసుకుని, వారిని స్వర్గం నుంచి తరిమివేశాడు. పారిపోయిన దేవతలు తమ తమ భార్యా బంధువులతో సహా మేరు పర్వత గుహలలో తల దాచుకున్నారు. అయినా శంఖుడికి తృప్తి కలగలేదు. పదవులు పోయినంత మాత్రాన పటుత్వాలు పోతాయా? పదవి లేనప్పుడే పునః దానిని సాధించుకోవడం కోసం తమ బలాన్ని పెంచుకుంటారు. ఆ రీత్యా వేదమంత్రాల వల్ల దేవతలు శక్తివంతులయ్యే అవకాశం వుంది గనుక, వేదాలను గూడ తన కైవసం చేసుకోవా'లనుకున్నాడు. విష్ణువు యోగ నిద్రగతుడయిన ఒకానొక వేళలో బ్రహ్మనుండి వేదాలను ఆకర్షించాడు. కాని యజ్ఞమంత్ర బీజాలతో గూడిన వేదాలు శంఖుని చేతి నుంచి తప్పించుకొని ఉదకాలలో తలదాచుకున్నాయి. అది గుర్తించిన శంఖుడు సాగరంలో ప్రవేశించి వెదికాడు గాని, వాటిని పసిగట్టలేక పోయాడు. అంతలోనే బ్రహ్మ, పూజాద్రవ్యాల్ని సమకూర్చుకొని, మేరు గుహాలయ వాసులయిన దేవతలందరినీ వెంటబెట్టుకుని, వైకుంఠం చేరాడు. సమస్త దేవతానీకమూ కలిసి వివిధ నృత్య వాద్యగీత నామస్మరణాదులతోనూ ధూపదీప సుగంధ ద్రవ్యాదులతోనూ - కోలాహలం చేస్తూ యోగ నిద్రాగతుడయిన శ్రీహరిని మేల్కొలిపే ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు నిదురలేచిన ఆ శ్రీహరిని షోడశోపచారాలా పూజించి, శరణుకోరారు దేవతలు. శరణాగతులైన సురతతులను చూసి రమాపతి ఇలా అన్నాడు. 'మీరు చేసిన సర్వోపచారాలకూ సంతోషించిన వాడై - మీ పట్ల వరదుడి నవుతున్నాను.

ఈ కార్తీక శుద్ధ ఏకాదశి రోజు తెల్లవారు ఝూమున నేను మేలుకొనే వారకూ మీరు ఏ విధంగా నయితే సేవించారో - అదే విధంగా - ధూపదీప సుగంధ ద్రవ్యాదులూ, నృత్య గీత వాద్య నామస్మరణాదులతోనూ, షోడశోపచారాలతోనూ, కార్తీక శుద్ధ ఏకాదశీ ప్రాతర్వేళ నన్ను సేవించే మానవులు నాకు ప్రియులై నా సాన్నిధ్యాన్ని పొందెదరు గాక! వాళ్ల చేత నాకీయబడిన అర్ఘ్యపాద్యాదులన్నీ కూడా ఆయా భక్తుల సుఖ సౌఖ్యాలకే కారణమగుగాక. ఇప్పుడు మంత్రబీజ సమాయుక్తాలైన వేదాలు ఉదకగతాలైనట్లే, ప్రతీ కార్తీకమాసంలోనూ కూడా వేదాలు జలాశ్రయాలై వర్థిల్లును గాక! నేనిప్పుడే మీనావతారుడనై సముద్రప్రవేశం చేసి శంఖుని సంహరించి వేదాల్ని కాపాడెదను గాక! ఇక నుంచి కార్తీక మాస ప్రాతర్వేళ మానవులచే చేయబడే నదీస్నానం - అవబృథ స్నానతుల్యమగు గాక! మరియు, ఓ మహేంద్రా! కార్తీక వ్రతము నాచరించిన వారందరును, నేను వైకుంఠమును, నీవు స్వర్గమును పాలించుట మనకు సహజమైనట్లుగ, పుణ్యలోకములను పొందదగియున్నారు. ఓ వరుణదేవా! కార్తీక వ్రతనిష్ఠుల కార్యాలకు విఘ్నాలు కలగకుండా రక్షణ చేసి, పుత్రపౌత్ర ధన కనక వస్తు వాహనాది సమస్త సంపదలూ అందించు. ఓ కుబేరా! ఏ కార్తీక వ్రతాచరణం వల్ల మానవులు నా యొక్క సారూప్యాన్ని పొంది జీవన్ముక్తులవుతున్నారో అటు వంటి వాళ్లందరికీ నువ్వు నా ఆజ్ఞానుసారంగా ధనధాన్య సమృద్ధిని కలిగించాలి. ముక్కోటి దేవతలారా! ఎవరీ కార్తీక వ్రతాన్ని జన్మవ్రతంగా భావించి విద్యుక్త విధానంగా ఆదరిస్తారో వాళ్లు మీ అందరి చేతా కూడా పూజించతగిన వారుగా తెలుసుకోండి. మేళతాళాలతో, మంగళవాద్యాలతో మీరు నన్ను మేలుకొలిపిన ఈ ఏకాదశి నాకు అత్యంత ప్రీతికరమైనది. అందువలన కార్తీక వ్రత, ఏకాదశీ వ్రతాలనే ఈ రెండింటినీ ఆచరించడం కన్నా నా సాన్నిధ్యాన్ని పొందేందుకు మరో దగ్గర దారి లేదని తెలుసుకోవాలి. తపోదాన యజ్ఞ తీర్థాదులన్నీ స్వర్గఫలాన్నీయ గలవేగాని - నా వైకుంఠ పదాన్నీయ లేవు సుమా.'

తృతీయోధ్యాస్సమాప్తః (మూడవ అధ్యాయము సమాప్తము)

## చతుర్థాధ్యాయము (మత్స్యావతారము)

భగవానుడైన శ్రీ మహావిష్ణువు దేవతలకలా ఉపదేశించిన వాడై తత్క్షణమే మహా మత్స్యశాబకమై - వింధ్యపర్వతమందలి కశ్యపుని దోసిలి జలాలలో తోచాడు. కశ్యపుడా చేపపిల్లను తన కమండలములో వుంచాడు. మరుక్షణమే ఆ మీనపుకూన పెరిగిపోవడం

వలన దానినొక నూతిలో వుంచాడు. రెప్పపాటు కాలంలోనే ఆశఫరీశిశువు నూతిని మించి ఎదిగిపోవడం వలన, కశ్యపుడు దానిని తెచ్చి ఒక సరస్సులో వుంచాడు. కాని విష్ణు మీనం సరస్సును కూడా అధిగమించడంతో దానిని సముద్రంలో వదలవలసి వచ్చింది. ఆ మహా సముద్రంలో మత్స్యమూర్తి విపరీతంగా పెరిగి - శంఖుని వధించి, వాడిని తన చేతి శంఖంగా ధరించి, బదరీ వనానికి చేరి, అక్కడ ఎప్పటివలెనే విష్ణురూపాన్ని వహించి ఋషులను చూసి, 'ఓ మునులారా! వేదాలు ఉదకాలలో ప్రవేశించి రహస్యంగా దాక్కొని వున్నాయి. మీరు వెళ్లి జలాంతర్గతములైన ఆ వేదాలను వెదకి తీసుకుని రండి. నేను దేవగణ సమాయుక్తుడనై ప్రయాగలో వుంటాను' అని చెప్పాడు. విష్ణ్వాజ్ఞను శిరసా ధరించిన ఋషులు సముద్రంలోకి వెళ్లి యజ్ఞబీజాలతో కూడి వున్న వేదాన్వేషణ ఆరంభించారు. ఓ పృథు మహారాజా! ఆ వేదాలలో నుంచి ఆ ఋషులకు ఎవరికెంత లభ్యమయ్యిందో అది వారి శాఖయైనది. తదాదిగా ఆయా శాఖలకు వారు ఋషులుగా ప్రభాసించారు. అనంతరం వేదయుతులై, ప్రయాగయందున్న విష్ణువును చేరి వేదాలను తెచ్చామని చెప్పారు. విష్ణ్వాజ్ఞపై ఆ సమస్త వేదాలనూ స్వీకరించిన బ్రహ్మ - ఆ శుభవేళను పురస్కరించుకుని, దేవతలతోనూ ఋషులతోనూ కూడిన వాడై అశ్వమేథయాగాన్ని ఆచరించాడు. యజ్ఞానంతరం గరుడ సమస్త దేవగంధర్వ యక్షపన్నగ గుహ్యకాదులందరూ కూడి శ్రీహరినిలా ప్రార్థించారు. 'ఓ దేవాధిదేవా! జగన్నాయకా! మా విన్నపాలను విను. అత్యంత సంతోషదాయకమైన ఈ సమయంలో మాకు వరప్రదాతనై మమ్మల్ని కాపాడు. హే లక్ష్మీనాధా! నీ అనుగ్రహం వల్లనే బ్రహ్మ తాను నష్టపోయిన వేదాలను ఈ స్థలంలో పొందగలిగాడు. నీ సమక్షంలో మేమందరమూ యజ్ఞంలోని హవిర్భాగాలనూ పొందాము. కాబట్టి, నీ దయవలన ఈ చోటు భూలోకంలో సర్వశ్రేష్ఠమైనదీ, నిత్యమూ పుణ్యవర్ధకమైనదీ, ఇహపర సాథకమైనదిగానూ యగుగాక! అదే విధంగా - ఈ కాలం మహా పుణ్యవంతమైనదీ - బ్రహ్మ హత్యాది పాతకాలను సైతం తొలగించేది, అక్షయ ఫలకరమైనదీ అయ్యేట్లుగా కూడా వరాన్ని అనుగ్రహించు.' దేవతల ప్రార్థనను వింటూనే వరదుడైన శ్రీహరి దివ్యమందహాసాన్ని చేశాడు. దైత్యారి 'దేవతలారా! మీ అభిప్రాయం నాకు సమ్మతమైంది. మీ వాంఛితం ప్రకారమే ఇది పుణ్యక్షేత్రమగుగాక! ఇక నుంచి బ్రహ్మ క్షేత్రమనే పేర ప్రఖ్యాతి వహించుగాక. అనతికాలంలోనే సూర్యవంశీయుడైన భగీరథుడీ క్షేత్రానికి గంగను తీసుకొని వస్తాడు. ఆ గంగా - సూర్యసుతయైన కాళిందీ ఈ పుణ్యస్థలిలోనే సంగమిస్తాయి. బ్రహ్మాదులైన

మీరందరూ నాతో కూడుకున్నవారై ఈ తావుననే సుస్థితులయ్యెదరు గాక! ఇది తీర్థరాజముగా ఖ్యాతి వహించుగాక! ఈ నెలవునందు ఆచరించే జప తపో వ్రత యజ్ఞ హోమనార్చనాదులు అనంత పుణ్యఫలదాలై నా సాన్నిధ్యమును అందిచ్చును గాక. అనేకానేక జన్మకృతాలైన బ్రహ్మహత్యాది ఘోరపాతకాలు సహితం ఈ క్షేత్రదర్శన మాత్రం చేతనే నశించిపోతాయి. ఇక్కడ నా సామీప్యంలో మరణించిన వాళ్లు నా యందే లీనమై మరుజన్మ లేని వాళ్లవుతారు. ఎవరైతే ఈ తీర్థంలో స్థిరచిత్తులై పితృకర్మలను ఆచరిస్తారో, వాళ్ల పితరులు నా సారూప్యాన్ని పొందుతారు. ఈ కాలం సర్వదా పుణ్యఫలాన్నిస్తుంది. సూర్యుడు మకరమందుండగా ప్రాతఃస్నానం చేసిన వాళ్లని చూసినంత మాత్రం చేతనే సామాన్య దోషాలన్నీ సమసిపోతాయి. వాళ్లకి నేను క్రమంగా - సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యాలను ప్రసాదిస్తాను. ఓ ఋషులారా! శ్రద్ధాళువులై వినండి. నేను సర్వకాల సర్వావస్థలలోనూ కూడా ఈ బదరీవన మధ్యంలోనే విడిది చేసి వుంటాను. ఇతరేతర క్షేత్రాలలో సంవత్సరాలుగా తపస్సు చేయడం వల్ల ఏ ఫలం కలుగుతుందో - ఆ ఫలాన్ని ఈ క్షేత్రంలో ఒక్క రోజు తపస్సుతోనే పొందవచ్చు. ఈ తీర్థ దర్శనమాత్రం చేతనే సర్వులూ తమ పాపాలను పోగొట్టుకున్నవారై - జీవన్ముక్తులవుతారు.'

శ్రీ మహావిష్ణువు ఈ విధంగా దేవతలకు వరప్రదానం చేసి - బ్రహ్మతో కలిసి అంతర్హితుడయ్యాడు. ఇంద్రాదులందరూ కూడా తమ తమ అంశలను ఆ క్షేత్రంలో విడిచి, తాము కూడా అదృశ్యులయ్యారు. ఓ పృథు నృపాలా! ఆ బదరీవన యాత్రా దర్శనాదుల చేత మానవులెంతటి పుణ్యాన్ని పొందగలరో - అంతటి పుణ్యాన్నీ కూడా ఈ కథా శ్రవణ మాత్రం చేతనే పొందగలరయ్యా!' అని చెప్పి ఆగాడు నారదుడు.

పదునేడవ (బహుళ విదియ) రోజు పారాయణము సమాప్తము

## పదునెమిదవ రోజు పారాయణము

## పంచమాధ్యాయము

నారదుడు చెప్పినదంతా విన్న పృథువు 'ఓ దేవర్షీ! కార్తీక మాసపు గొప్పదనమును వివరించి, నన్ను ధన్యుని చేశావు. అదే విధంగా స్నానాదివిధుల్ని, ఉద్యాపన విధినీ కూడా యథావిధిగా తెలియజేయవలసిన'దని కోరగా, నలువ చూలి ఇలా చెప్పసాగాడు.

### కార్తీకవ్రత విధి విధానములు

### శౌచం

శ్లో॥ ఆశ్వీన్యస్యతు మాసస్య యా శుద్ధైకాదశీ భవేత్

కార్తీకస్య వ్రతారంభం తస్యాం కుర్యా దతంద్రితః ॥

మహారాజా! ఈ కార్తీక వ్రతాన్ని అశ్వీయుజ శుద్ధ ఏకాదశీనాడే ప్రారంభించాలి. ముఖమార్జనం చేయని వాళ్లకు మంత్రాలు పట్టివ్వవు. కాబట్టి - ముఖమునూ, జిహ్వానూ ఎప్పుడూ శుభ్రంగా వుంచుకోవాలి.

మంత్రం: ఆయుర్బలం యశోవర్చః ప్రజాః పశువసూనిచ

బ్రహ్మప్రజ్ఞాం చ మేథాం చ త్వన్నో దేహివనస్పతే ॥

అనే మంత్రం పఠిస్తూ దంతధావనం చేసుకోవాలి. క్షయతిథులలోనూ, ఉపవాస దినాలలోనూ, పాడ్యమి - అమావాస్య - నవమి - పక్ష - సప్తమి - సూర్యచంద్ర గ్రహణాలూ - ఈ వేళల్లో దంతధావనం చేయకూడదు. ముళ్ల చెట్లు, ప్రత్తి, వావి, మోదుగ, మర్రి, ఆముదం - ఈ చెట్ల యొక్క పుల్లలతో దంతధావనం చేసుకోకూడదు.

దంతధావనం తరువాత - భక్తి-నిర్మలబుద్ధీ కలవాడై - గంధ పుష్ప తాంబూలాలను గ్రహించి శివాలయానికి గాని, విష్ణ్వాలయానికి గాని వెళ్లి - అక్కడి దైవతాలకు అర్ఘ్యపాద్యాది ఉపచారాలను ఆచరించి, స్తోత్ర నమస్కారాల్ని సమర్పించి, నృత్యగీత వాద్యాది సేవలను చేయాలి. దేవాలయాలలోని గాయకులు, వర్తకులు, తాళమృదంగాది వాద్య విశేష విద్వాంసులు, వీళ్లందర్నీ విష్ణు స్వరూపులుగా భావించి పుష్పతాంబూలాదులతో అర్చించాలి. కృతయుగంలో యజ్ఞం, ద్వాపరంలో దానం భగవత్ప్రీతికరాలు కాగా, ఈ కలియుగంలో భక్తియుతమైన సంకీర్తన మొక్కటే

ఆ భగవంతునికి సంతసాన్ని కలిగిస్తుంది.

హరిహర దుర్గా గణేశ సూర్యారాధనలకు ఉపయోగించకూడని పూవులు

ఓ రాజా! దిరిశెన, ఉమ్మెత్త, గిరిమల్లి, మల్లి, బూరుగ, జిల్లేడు, కొండగోగు - వీటి పుష్పాలుగాని, తెల్లటి అక్షతలుగాని విష్ణువును పూజించుటకు పనికిరావు. అదే విధంగా జపాకుసుమాలు, మొల్ల పుష్పాలు, దిరిశెన పూవులు, బండి గురువింద, మాలతి పుష్పాలు - ఇవి ఈశ్వరుడిని పూజించేందుకు తగవు. ఎవరైతే సిరిసంపదలు కావాలని కోరుకుంటున్నారో - అటువంటివాళ్లు -తులసీదళాలతో వినాయకుడినీ - గరికతో దుర్గాదేవినీ - అవిసెపువ్వులతో సూర్యునీ పూజించకూడదు. ఏ ఏ దేవలలకు ఏఏ పూవులు శ్రేష్ఠమైనవఓ వాటితోనే పూజించాలి. అలా పూజించినప్పటికీ కూడా -

శ్లో॥ మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం సురేశ్వర
యత్పూజితం మయాదేవ పరిపూర్ణం తదస్తుతే ॥

'ఓ దేవా! మంత్ర క్రియాదిక లోపభూయిష్టమైనప్పటికినీ, నాచే చేయబడిన పూజ నీకు పరిపూర్ణమైనదగును గాక' అని క్షమాపణ కోరుకోవాలి. ఆ పిదప దైవానికి ప్రదక్షిణ నమస్కారాదులను ఆచరించి, పునః క్షమాపణలు చెప్పుకుని, నృత్యగానాది ఉపచారాలతో పూజను సమాప్తి చేయాలి. ఎవరైతే కార్తీక మాసంలో ప్రతిదినం రాత్రి శివపూజను గాని, విష్ణుపూజను గాని ఆచరిస్తారో వాళ్లు సమస్త పాపాల నుండి విడివడిన వాళ్లయి - వైకుంఠాన్ని పొంది తీరుతారు.

పంచమోధ్యాయస్సమాప్తః (ఐదవ అధ్యాయము సమాప్తము)

## షష్ఠాధ్యాయము

నారదుడు చెబుతున్నాడు: రాజా! మరింత వివరంగా చెబుతాను విను. వ్రతస్థుడు మరో రెండు ఘడియలలో తెల్లవారుతుందనగా నిద్ర లేచి, శుచియై నువ్వులూ, దర్భలూ, అక్షతలు, పువ్వులు, గంధమూ తీసుకుని నది వద్దకు వెళ్లాలి. చెరువులలోగాని దైవనిర్మితజలాశయాలలో గాని, నదులలోగాని, సాగరసంగమాలలో గాని స్నానం చేస్తే - ఒకదాని కంటే ఒకటి పది రెట్ల పుణ్యానిస్తుంది. ఏ పుణ్యతీర్థంలో స్నానం చేసినా - అంతకు పదిరెట్లు ఫలం కలుగుతుంది. ముందుగా విష్ణువుని స్మరించి, స్నాన సంకల్పం చేసి, దేవతలకు అర్ఘ్యాలనీయాలి.

## అర్ఘ్యమంత్రం

శ్లో॥ నమః కమలనాభాయ నమస్తే జలశాయినే
నమస్తేస్తు హృషీకేశ గృహాణార్ఘ్యం నమోస్తుతే ॥

ఉపరివిధంగా అర్ఘ్యాదులనిచ్చి, దైవధ్యాన నమస్కారాదులను చేసి -
'ఓ దామోదరా! ఈ జలమందు స్నానము చేయుటకు ప్రయత్నించుచున్నాను. నీ అనుగ్రహం వలన నా పాపములన్నీ నశించిపోవును గాక! హే రాధారమణా! విష్ణూ! కార్తీక వ్రతస్నాతునడగుచున్న నా అర్ఘ్యాన్ని స్వీకరించుదువు గాక!

## స్నానవిధి

ఇలా వ్రతస్థుడు గంగ, విష్ణు, శివ, సూర్యుల్ని స్మరించి - బొడ్డులోతు వరకకు నీటిలో దిగి, యధావిధిగా స్నానం చేయాలి. గృహస్థులు ఉసిరిక పప్పు, నువ్వుల చూర్ణంతోనూ - యతులు, తులసి యొక్క మొదలి మన్నుతోనూ స్నానం చేయాలి. విదియ, సప్తమి, దశమి, త్రయోదశి, అమావాస్య - ఈ ఆరు తిధులలోనూ - నువ్వులతోనూ, ఉసిరిపండ్లతోనూ స్నానం చేయకూడదు. ముందుగా శరీరశుద్ధికి స్నానం చేసి, ఆ తరువాతనే మంత్ర స్నానం చేయాలి. స్త్రీలు, శూద్రులు పురాణోక్త మంత్రాలతోనే స్నానం చేయాలి.

'భక్తిగమ్యుడై ఎవడు దేవకార్యార్థం త్రిమూర్త్యాత్మకుడయ్యాడో సర్వపాపహరుడైన ఆ విష్ణువు నన్నీ స్నానముచే పవిత్రుని చేయుగాక! విష్ణ్వాజ్ఞాపరులైన ఇంద్రాది సమస్త దేవతలును నన్ను పవిత్రుని చేయుదురు గాక! రహో యజ్ఞ మంత్రబీజ సంయుతాలైన వేదాలు, వశిష్ఠ కశ్యపాది మునివరిష్ఠుల నన్ను పవిత్రునిగా చేయుదురుగాక, గంగాది సర్వనదులు, తీర్థాలు, జలధారలు, నదాలు, సప్త సాగరాలు, హ్రదాలు నన్ను పవిత్రుని చేయుగాక. ముల్లోకాలలోనూ గల అరుంధత్యాది పతివ్రతామ తల్లులు, యక్ష, సిద్ధ, గరుడాదులు - ఓషధులు, పర్వతాలు నన్ను పవిత్రు చేయుగాక!"

ఉపరి మంత్రయుక్తంగా స్నానం చేసి - చేతియందు పవిత్రాన్ని ధరించి దేవ-ఋషి-పితృ-తర్పణాలను విధిగా చేయాలి. కార్తీకమాసంలో పితృతర్పణ పూర్వకంగా ఎన్ని నువ్వులయితే విడువబడుతున్నాయో అన్ని సంవత్సరముల పాటు పితృదేవతలు స్వర్గంలో నివసిస్తున్నారు. ఆ తర్పణానంతరం నీటి నుండి తీరానికి చేరి, ప్రాతఃకాలానుష్ఠానం (సంధ్యావందనాది) నెరవేర్చుకొని - విష్ణు

పూజను చేయాలి. పిదప - ఆర్ఘ్యమంత్రం -

శ్లో॥ ప్రతిపత్ కార్తీకమాసే స్నాతస్య విధినామమ
గృహాణార్ఘ్యం మయాదత్తంరాధయా సహితోహ రే ॥

అనే మంత్రంతో గంధ పుష్పఫలాలతో కూడిన ఆర్ఘ్యాన్ని, క్షేత్ర తీర్థ దైవతాలను స్మరించి సమర్పించాలి. అనంతరం వేదపారీణులైన బ్రాహ్మణులకు భక్తిపూర్వకంగా గంధ తాంబూలాదులిచ్చి పూజించి నమస్కరించాలి. అలా పూజించేటప్పుడు -

శ్లో॥ తీర్థాని దక్షిణే పాదే వేదాస్త న్ముఖమాశ్రితాః
సర్వాంగేష్వాశ్రితాః దేవాః పూజితోసిమదర్చయా ॥

'కుడి పాదమందు సర్వతీర్థములు, ముఖమందు చతుర్వేదములు, అవయవము లందు సర్వదేవతలతో అలరారే ఈ బ్రాహ్మణ పూజ వలన పవిత్రుడనవుతున్నాను' అని అనుకోవాలి. అటు మీదట వ్రతస్థుడు హరి ప్రియమైన తులసికి ప్రదక్షిణ మాచరించి - 'దేవతలచే నిర్మించబడి, మునులచే పూజింపబడిన విష్ణు ప్రేయసివగు ఓ తులసీ! నీకు చేస్తున్న నమస్కారము నా పాపాలను నాశనము చేయుగాక' అనుకొని - నమస్కరించుకోవాలి. తదుపరి స్థిరబుద్ధి కలవాడై హరికథ, పురాణ శ్రవణాదులలో పాల్గొనాలి. ఇప్పుడు నేను చెప్పినది చెప్పినట్లుగా ఏ భక్తులైతే ఆచరిస్తారో వాళ్లు తప్పనిసరిగా దైవసాలోక్యాన్ని పొందుతారు. సమస్త రోగహారకము, పాపమారకము, సద్బుద్ధీదాయకమూ, పుత్రపౌత్ర ధనప్రదమూ, ముక్తికారకమూ, విష్ణుప్రీతికరమూ అయిన కార్తీక వ్రతాన్ని మించింది, కలియుగంలో మరొకటి లేదు.

అయిదూ, ఆరు అధ్యాయములు

పదునెనిమిదవ (బహుళ తదియ) నాటి పారాయణము సమాప్తము

## పందొమ్మిదవ రోజు పారాయణము

## సప్తమాధ్యాయము

నారదుడు చెబుతున్నాడు: పృథు భూపాలా! కార్తీక వ్రతస్థుడైన పురుషుడు పాటించవలసిన నియమాలను చెబుతాను విను.

### కార్తీక వ్రతస్థులకు నియమములు

ఈ వ్రతస్థుడు - మాంసము, తేనె, రేగుపండ్లు, నల్లావాలు, ఉన్మాదకాలను భుజించకూడదు. పరాన్న భుక్తి - పరద్రోహం - దేశాటనలు త్యజించాలి. తీర్థయాత్రలు మాత్రం చేయవచ్చును. దేవ బ్రాహ్మ గురు రాజులును, స్త్రీలను, గోవ్రతస్థులను దూషించకూడదు. అవిసెనూనెను, నువ్వులనూనెను, విక్రయాన్నమును, నింద్యవ్యంజనే యుక్త భోజనమునూ, దూషితాహారమునూ విసర్జించాలి. ప్రాణి సంబంధిత మాంసచూర్ణాలనూ, ఆమ్ల సంబంధితాలైన నిమ్మకాయలు కొఱ్ఱల వంటి హీనధాన్యాలనూ, చద్ది అన్నాన్ని స్వీకరించకూడదు. మేక, గేదె, ఆవు- వీటి పాలు తప్ప మరే ఇతర ప్రాణుల ఆమిష సంబంధ క్షీరాలనూ స్వీకరించకూడదు. బ్రాహ్మణులచే అమ్మబడే రసాలను భూజాతలవణాలను విసర్జించాలి. రాగిపాత్రలలో వుంచిన పంచగవ్యం, చిన్న చిన్న గుంటలలో వుండే కుళ్లు దైవానికి నివేదించబడని అన్నం - ఈ మూడూ మాంసతుల్యాలుగా చెప్పబడుతున్నాయి. గనుక వాటిని విసర్జించాలి. బ్రహ్మచర్యాన్నీ భూశయనాన్నీ పాటించాలి. ఆకులలోనే భోజనము చేయాలి. నాలుగవ ఝామున భుజించడమే శ్రేష్ఠం. ఈ కార్తీక వ్రతస్థుడు, ఒక్క నరక చతుర్దశినాడు తప్ప తక్కిన దీక్షా దినాలలో తైలాభ్యంగనం చేయకూడదు. విష్ణువ్రతం చేసేవారు - వంకాయ, గుమ్మడికాయ, వాకుడుకాయ, పుచ్చకాయలను విసర్జించాలి. బహిష్ఠలతోనూ, మ్లేచ్ఛులతోనూ, వ్రతభ్రష్ఠులతోనూ వేదత్యక్తులతోనూ సంభాషించ కూడదు. అటు వంటి వారి ఎంగిలికాని, కాకులు తాకిన ఆహారాన్నిగాని, ఆశౌచ సంబంధితాహారంగాని, ఒకసారి వండి మరల ఉడికించినది గాని, మాడు పట్టిన అన్నాన్ని గాని తినకూడదు. తన శక్తి కొలదీ విష్ణు ప్రీతికై కృచ్ఛ్రాదులను చేయాలి. గుమ్మడి, వాకుడు సురుగుడు, ముల్లంగి, మారేడు, ఉసిరిక, పుచ్చ, కొబ్బరికాయ, ఆనప, చేదు పొట్ల, రేగు, వంకాయ, ఉల్లి - వీటిని పాడ్యమి ఆదిగా పరిత్యజించాలి. కార్తీక మాసంలో కూడా ఉసిరికాయను తినకూడదు. ఇవేగాక, ఇంకా కొన్నింటిని కూడా వర్జించాలి. మరి కొన్నిటినీ బ్రహ్మార్పణం చేసి భుజించాలి.

ఈ కార్తీక మాసంలో చేసినట్లే, మాఘమాసంలో కూడా చేయాలి.

కార్తీక వ్రతాన్ని యథావిధిగా ఆచరించే భక్తులను చూసి - యమదూతలు సింహాన్ని చూసిన ఏనుగు వలె పారిపోతారు. వంద యజ్ఞాలు చేసిన వాడు కూడా స్వర్గాన్నే పొందుతున్నాడు. కాని కార్తీక వ్రతస్థుడు మాత్రం వైకుంఠాన్ని పొందుతున్నాడు. కాబట్టి - యజ్ఞ యాగాదుల కన్న కార్తీక వ్రతం గొప్పదని తెలుసుకోవాలి. ఓ రాజా భూలోకంలో వున్న పుణ్యక్షేత్రాలన్నీ కూడా, కార్తీక వ్రతస్థుని శరీరమందే వుంటాయి. విష్ణ్వాజ్ఞావశవర్తులైన ఇంద్రాదులందరూ, రాజును సేవకులు కొలిచినట్లుగా, ఈ వ్రతస్థుడినీ సేవిస్తారు. విష్ణు వ్రతాచరణపరులు ఎక్కడ పూజింపబడు తూంటారో, అక్కడి నుంచి గ్రహ, భూత పిశాచ గణాలు పలాయన మంత్రాన్ని పఠిస్తాయి. యథావిధిగా కార్తీక వ్రతం చేసే వారి పుణ్యాన్ని చెప్పడం చతుర్ముఖుడైన బ్రహ్మకు కూడా సాధ్యము కాదు. ఈ కార్తీక వ్రతాన్ని విడువకుండా ఆచరించేవాడు తీర్థయాత్రలు చేయవలసిన అవసరమే లేదు.

సప్తమోధ్యాయస్సమాప్త : (ఏడవ అధ్యాయము సమాప్తము)

## అష్టమాధ్యాయము

ప్రజారంజనశీలా! పృథునృపాలా! ఇక, ఈ కార్తీక వ్రతోద్యాపనా విధిని సంగ్రహంగా చెబుతున్నాను విను.

### ఉద్యాపనావిధి

విష్ణు ప్రీతి కోసమూ వ్రతసాఫల్యత కోసమూ - కార్తీకశుద్ధ చతుర్దశినాడు వ్రతస్థుడు ఉద్యాపనం చేయాలి. తులసిని స్థాపించి దాని చుట్టూ తోరణాలు గలది, నాలుగు ద్వారాలు కలదీ, పుష్ప వింజామరలచే అలంకరింపబడినదీయైన శుభప్రదమైన మండపాన్ని ఏర్పరచాలి. నాలుగు ద్వారాల వద్దా - సుశీల, పుణ్యశీల - జయ, విజయులనే నలుగురు ద్వారపాలకులను మట్టితో ఏర్పరచి - వారిని ప్రత్యేకంగా పూజించాలి. తులసి మొదట్లో నాలుగు రంగులు గల ముగ్గులతో 'సర్వతోభద్రం' అనే అలంకారాన్ని చేయాలి. దానిపై పంచరత్న సమన్వితము -నారికేళ సంయుక్తమూ అయిన కలశమును ప్రతిష్ఠించి - శంఖ చక్ర గదా పద్మధారీ పీతాంబరుడూ, లక్ష్మీసమేతుడూ అయిన నారాయణుని పూజించాలి. ఇంద్రాది దేవతలను ఆయా మండలాలలో అర్చించాలి. శ్రీ మహావిష్ణువు ద్వాదశి రోజున

నిద్రలేచి, త్రయోదశినాడు దేవతలకు దర్శనమిచ్చి, చతుర్దశినాడు పూజనీయుడై వుంటాడు కనుక, మానవుడు ఆ రోజున నిర్మలచిత్తుడై ఉపవాసముండి, విష్ణుపూజను విధివిధానంగా ఆచరించాలి.

గురువు ఆజ్ఞ ప్రకారం శ్రీహరిని సువర్ణరూపమందు ఆవాహన చేసి, షోడశోపచారాలతోనూ పూజించి, పంచభక్ష్య భోజ్యాలనూ నివేదించాలి. గీతవాద్యాది మంగళధ్వనులతో ఆ రాత్రి నుండి సేవించుచు మరునాడు ప్రాతఃకాలకృత్యాలు నెరవేర్చుకొని, నిత్యక్రియలను ఆచరించాలి. పిదప - నిష్కల్మషాంతరంగుడై హోమం చేసి, బ్రాహ్మణ సమారాధన చేసి, యధాశక్తి దక్షిణలు ఇవ్వాలి. ఈ విధంగా వైకుంఠ చతుర్దశినాడు ఉపవసించిన వాడూ, విష్ణుపూజ చేసిన వాడూ తప్పక వైకుంఠాన్నే పొందుతున్నాడు.

'ఓ బ్రాహ్మణులారా! మీరు సంతోషించుట చేత నేను విష్ణ్వనుగ్రహమును పొందెదను గాక! ఈ వ్రతాచరణ వలన - గత ఏడు జన్మలలోని నా పాపములు నశించును గాక! నా కోరికలు తీరునుగాక. గోత్రవృద్ధి స్థిరమగును గాక'' అని బ్రాహ్మణులను క్షమాపణ కోరాలి.

వారి చేత 'తథాస్తు' అని దీవింపబడి - దేవతోద్వాసనలు చెప్పి, బంగారపు కొమ్ములతో అలంకరింపబడిన - గోవును గురువు దానమివ్వాలి. అటు తర్వాత - సజ్జనులతో కూడిన వాడై భోజనాదులు పూర్తి చేసుకోవాలి.

పందొమ్మిదవ (బహుళ చవితి) రోజు పారాయణము సమాప్తము

## ఇరువదియవరోజు పారాయణము

## నవమాధ్యాయము

పృధు చక్రవర్తి అడుగుతున్నాడు: 'దేవర్షీ! తులసిని స్థాపించి ఆ మండపంలోనే ముందుగా విష్ణుపూజ చేయాలని సెలవిచ్చావు. పైగా తులసిని 'హరిప్రియా - విష్ణువల్లభా' వంటి పేరులతో సంబోధించావు. శ్రీవారికి అంతటి ప్రియకరమైన ఆ తులసీ మహాత్మ్యాన్ని వినిపించు.'

నారదుడు చెబుతున్నాడు 'శ్రద్ధగా విను. పూర్వమొకానొకసారి, ఇంద్రుడు సమస్త దేవతాప్సరసమేతుడై శివదర్శనార్థం కైలాసానికి వెళ్లాడు. ఆ సమయానికి శివుడు బేతాళ రూపియై వున్నాడు. భీత మహాదంష్ట్రా నేత్రాలతో మృత్యు భయంకరంగా వున్న ఆ స్వరూపాన్ని శివునిగా గుర్తించలేక 'ఈశ్వరుడు ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు?' అంటూ ఆయననే ప్రశ్నించసాగాడు ఇంద్రుడు. కాని, ఆ పురుషోత్తముడు జవాబీయని కారణంగా 'నిన్ను శిక్షిస్తున్నాను. ఎవడు రక్షిస్తాడో చూస్తాను' అంటూ తన వజ్రాయుధంతో అతని కంఠసీమపై కొట్టినాడు. ఆ దెబ్బకు ఆ భీకరాకారుడి కంఠం కమిలి నల్లనయ్యిందిగాని ఇంద్రుడి వజ్రాయుధం మాత్రం బూడిదై పోయింది. అంతటితో ఆ భీషణమూర్తి నుండి వచ్చే తేజస్సు దేవేంద్రుణ్ణి కూడా దగ్ధం చేసేలా తోచడంతో, దేవగురువైన బృహస్పతి ఆ బేతాళ స్వరూపం శివుడేనని గ్రహించి, ఇంద్రుడి చేత అతనికి మ్రొక్కించింది. తానీ విధంగా శాంతి స్తోత్రం చేశాడు.

బృహస్పతి కృత బేతాళ శాంతి స్తోత్రం

శ్లో ॥ నమో దేవాది దేవాయ త్ర్యంబకాయ కపర్దినే
త్రిపురఘ్నాయ శర్వాయ నమోంధ కనిషూఇనే ॥

శ్లో ॥ విరూపా యాదిరూపాయ బ్రహ్మరూపాయ శంభవే
యజ్ఞ విధ్వంసకర్త్రైవై యజ్ఞానాం ఫలదాయినే ॥

శ్లో॥ కాలాంత కాలకాలాయ కాలభోగి ధరాయచ
నమో బ్రహ్మ శిరోహంత్రే, బ్రహ్మణ్యాయ నమో నమః ॥

బృహస్పతి ఈ విధంగా ప్రార్థించడంతో శాంతించిన శివుడు - త్రిలోక నాశకమైన తన త్రినేత్రాగ్నిని ఉపసంహరించేందుకు నిశ్చయించి - 'బృహస్పతీ! నా కోపం నుంచి ఇంద్రుణ్ని బ్రతికించినందుకుగాను ఇక నుంచి నువ్వు 'జీవ' అనే పేరుతో ప్రఖ్యాతి పొందుతావు. నీ స్తోత్రం నన్ను ముగ్ధుణ్ని చేసింది. ఏదైనా వరం కోరుకో' అన్నాడు.

ఆ మాట మీద బృహస్పతి - 'హే శివా! నీకు నిజంగా సంతోషము కలిగితే మళ్లీ అడుగుతున్నాను - త్రిదివేశునీ త్రిలోకాలనూ కూడా నీ మూడో కంటి మంట నుంచి రక్షించు. నీ ఫాలాగ్ని జ్వాలలను శాంతింపజెయ్యి. ఇదే నా కోరిక' అన్నాడు.

సంతసించిన సాంబశివుడు - 'వాచస్పతీ! నా మూడో కంటి నుండి వెలువరించిన అగ్ని వెనక్కి తీసుకోదగినది కాదని తెలుసుకో. అయినా నీ ప్రార్థనను మన్నించి, అగ్ని లోకదహనం

చేయకుండా వుండేందుకుగాను సముద్రంలోనికి చిమ్మేస్తున్నాను' అని చెప్పాడు. చెప్పినట్లే చేశాడు శివుడు. ఆ అగ్ని గంగా సాగర సంగమానబడి - బాలక రూపాన్ని ధరించింది. పుడుతూనే ఏడ్చింది, ఆ ఏడుపు ధ్వనికి స్వర్గాది సత్యలోక పర్యంతం చెవుడు పొందింది. ఆ రోదన వినిన బ్రహ్మ పరుగు పరుగున సముద్రుడి వద్దకు వచ్చి - 'ఈ అద్భుత శిశువు ఎవరి పుత్రుడ'ని అడిగాడు. అందుకు సముద్రుడాయనకు నమస్కరించి - 'గంగా సంగమంలో జన్మించాడు గనక ఇతను నా కుమారుడే. దయ చేసి వీనికి జాత కర్మాది సంస్కారాలను చేయు'మని కోరాడు. ఈ మాటలు జరిగే లోపలే ఆ కుర్రాడు బ్రహ్మ గడ్డాన్ని పట్టుకొని ఊగులాడసాగాడు. వాడి పట్టు నుంచి తన గెడ్డం వదిలించుకొనేందుకు బ్రహ్మకు కళ్లనీళ్ల పర్యంతమైంది. అందువల్ల విధాత 'ఓ సముద్రుడా నా కళ్ల నుంచి రాలి చిందిన నీటిని ధరించిన కారణంగా వీడు జలంధరుడనే పేర విఖ్యాతుడవుతాడు. సకల విద్యావేత్త, వీరుడూ అయి శివునిచే తప్ప ఇతరులకు వధించరాని వాడవుతాడు' అని దీవించి పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. ఆ జలంధరుడికి, కాలనేమి కూతురైన బృందనిచ్చి పెళ్లి చేశారు. రూప, వయో, బలవిలాసుడైన జలంధరుడు బృందను భార్యగా గ్రహించి, దానవాచార్యుడయిన శుక్రుని సాహాయ్యంతో సముద్రము నుండి భూమిని ఆక్రమించి స్వర్గంలా పాలించసాగాడు.

నవమోధ్యాయస్సమాప్తః

## దశమాధ్యాయము

నారదడు చెబుతున్నాడు: పూర్వం దైవోపహతమై పాతాళాది లోకాలలో దాగిన దానవ బలమంతా ఇప్పుడు జలంధరుణ్ణి ఆశ్రయించి, నిర్భయంగా సంచరించసాగింది. ఆ జలంధరుడు ఒకనాడు శిరోవిహీనుడైన రాహువుని చూసి - 'వీడికి తల లేదేమిటి?'అని ప్రశ్నించిన మీదట శుక్రుడు, గతంలో జరిగిన క్షీరసాగర మధనం అమృతపు పంపకం. ఆ సందర్భంగా విష్ణువతని తల తెగవేయడం - ఇత్యాదిగా గల ఇతిహాసమంతా చెప్పాడు. అంతా విన్న సముద్ర తనయుడైన జలంధరుడు -

మండిపడ్డాడు. తన తండ్రియైన సముద్రుని మధించడం పట్ల చాలా మధనపడ్డాడు. ఘస్మరుడనే వాణ్ణి - దేవతల దగ్గరకి రాయబారిగా పంపాడు. వాడు - ఇంద్రుడి వద్దకు వెళ్ళి 'నేను రాక్షస ప్రభువైన జలంధరుడి దూతను. ఆయన పంపిన శ్రీముఖాన్ని విను - ఇంద్రా! నా తండ్రియైన సముద్రుని పర్వతంతో మధించి అపహరించిన రత్నాలను అన్నింటినీ వెంటనే నాకు అప్పగించు.'

అది విన్న అమరేంద్రుడు - 'ఓ రాక్షసదూతా! గతంలో నాకు భయపడిన లోక కంటకాలయిన పర్వతాలనీ, నా శత్రువులయిన రాక్షసులీ్ని ఆ సముద్రుడు తన గర్భంలో దాచుకున్నాడు. అందువల్లనే సముద్రమధనం చేయాల్సి వచ్చింది. ఇప్పటి మీ రాజులాగానే గతంలో శంఖుడనే సముద్రనందనుడు కూడా అహంకరించి ప్రవర్తించి నా తమ్ముడైన ఉపేంద్రుని చేత వధించబడ్డాడు. కాబట్టి సముద్ర మధన కారణాన్నీ దైవతగణ తిరస్కృతికి లభించబోయే

ఫలితాన్నీ కూడా మీ నాయకుడికి విన్నవించుకో...' అని చెప్పాడు.

ఘస్మరుడు జలంధరుడి దగ్గరకు వెళ్ళి మఘువుడు చెప్పిన మాటలను వినిపించాడు. మండిపడ్డ జలంధరుడు - మరుక్షణమే స్వర్గంపై సమరం ప్రకటించాడు. శుంభ-నిశుంభాది సైన్యాధిపతులతో సహా దేవతలపై దండెత్తాడు. ఉభయ సైన్యాలవారూ ముసల పరిఘ బాణగదాద్యాయుధాలతో పరస్పరం ప్రహరించుకున్నారు. రధ, గజ, తురగాదిక శవాలతోనూ, రక్తప్రవాహాలతోనూ రణరంగం నిండిపోయింది. రాక్షసగురువైన శుక్రుడు మరణించిన రాక్షసులందర్నీ 'మృత సంజీవనీ విద్యతో బ్రతికిస్తూండగా - దేవ గురువైన బృహస్పతి అచేతనాలైన దేవ గణాలను, ద్రోణగిరి మీది దివ్యౌషధాలతో చైతన్యవంతం చేయసాగాడు. ఇది గ్రహించిన శుక్రుడు జలంధరుడికి చెప్పి ఆ ద్రోణగిరిని సముద్రములో పార వేయించాడు. ఎప్పుడయితే ద్రోణపర్వతం అదృశ్యమయిందో - అప్పుడు బృహస్పతి, దేవతలను చూచి, 'ఓ దేవతలారా! ఈ జలంధరుడు ఈశ్వరాంశ సంభూతుడు గాబట్టి, మనకు జయింప శక్యం కాకుండా వున్నాడు. అందువల్ల ప్రస్తుతానికి ఎవరిదారిన వాళ్ళు పారిపోండి' అని హెచ్చరించాడు. అది వినగానే భయార్తులైన దేవతలందరూ కూడా యుద్ధరంగం నుంచి పారిపోయి మేరుపర్వత గుహాంతరాళాలను ఆశ్రయించారు. అంతటితో విజయాన్ని పొందిన జలంధరుడు - ఇంద్రపదవిలో తాను పట్టాభిషిక్తుడై, శుంభ నిశుంభాదులను తన ప్రతినిధులుగా నిర్ణయించి పారిపోయిన దేవతలను బందీలను చేయడం కోసం - కొంత సైన్యంతో ఆ మేరు పర్వతాన్ని సమీపించాడు.

తొమ్మిదీ, పదీ అధ్యాయములు

ఇరువదియవ (బహుళ పంచమి) రోజు పారాయణము సమాప్తము

ఇరువది ఒకటవ రోజు పారాయణము

ఏకాదశాధ్యాయము

మూరు మూలల్లో తలలు దాచుకున్నా కూడా వదలకుండా ముట్టడింప వస్తూన్న జలంధరునికి భయపడిన వారై దేవతలంతా విష్ణు స్తోత్రం చేయసాగారు.

సర్వదేవతా కృత విష్ణుస్తోత్రం

శ్లో ॥ నమో మత్స్య కూర్మాది నానా స్వరూపాయ
సదాభక్త కార్యద్యతా యార్తి హంత్రే
విధాత్రాధి సర్గస్థితి ధ్వంసకర్త్రే
గదాశంఖ పద్మాది హస్తాయతేస్తు
విధాత్రాధి సర్గస్థితి ధ్వంసకర్త్రే
గదాశంఖ పద్మాది హస్తాయతేస్తు ॥
రమావల్లభా యాసురాణాం నిహంత్రే
భుజంగారి యానాయ పీతాంబరాయ
మఖాది క్రియాపాక కర్త్రే వికర్త్రే
శరణ్యాయ తస్మై నతాస్మోవతాస్స్మః
నమో దైత్య సంతాపి తామర్త్యదుఃఖా
చల ధ్వంసదంభోళయే విష్ణవేతే
భుజంగేళ తలే శయా నాయార్క చంద్ర
ద్వినేత్రాయ తస్మై నతాస్మో నతాస్స్మః

నారదోవాచ:

సంకష్ట నాశనం స్తోత్ర మేతద్యస్తు పఠేన్నరః
సకదాచిన్న సంకష్టః పీడ్యతే కృపయా హరేః ॥

మత్స్యకూర్మాది అవతారములు ధరించిన వాడవునూ - సదా భక్తుల కార్యములు చేయుట యందు సంసిద్ధుడగువాడవును - దుఃఖములను నశింపచేయు వాడవును - బ్రహ్మాదులను సృష్టించి పెంచి లయింప చేయువాడును - గద, శంఖం, పద్మం, కత్తి ఆదిగా గల ఆయుధములను ధరించిన వాడవను అగు నీకు నమస్కారమగు గాక (1) లక్ష్మీపతి, రాక్షసారాతి, గరుడవాహనుడు, పట్టుబట్టలు, ధరించిన వాడవును, యజ్ఞాదులకు కర్త, క్రియారహితుడు, సర్వరక్షకుడవూనగు నీకు

నమస్కారమగును గాక (2) రాక్షసులచే పీడించబడిన దేవతల దుఃఖమనే కొండను నశింపజేయుటలో వజ్రాయుధము వంటి వాడవును, శేషశయనుడవును, సూర్యచంద్రులనే నేత్రములుగా గలవాడవును, ఆగు ఓ విష్ణూ! నీకు నమస్కారము. పునః నమస్కారము. (3) ఇలా దేవతల చేత రచింపబడినదీ, సమస్త కష్టాలనూ సమయింపచేసేదీ అయిన ఈ స్తోత్రాన్ని ఏ మానవుడైతే పఠిస్తుంటాడో - వాని ఆపదలన్నీ ఆ శ్రీహరి దయ వలన తొలగిపోతాయి' అని, పృధువుకు చెప్పి, నారదుడు మరలా పురాణ ప్రవచనానికి ఉపక్రమించాడు.

ఈ దేవతల స్తోత్రపాఠాలు ఆ చక్రపాణి చెవినబడ్డాయి. దేవతల కష్టానికి చింతిస్తూనే, దానవులపై కోపం గలవాడై చయ్యన తన శయ్యవీడి, గరుడ వాహనముపై కదులుతూ - 'లక్ష్మీ! నీ తమ్ముడైన జలంధరునికీ - దేవగణాలకీ యుద్ధం జరుగుతున్నది. దేవతలు నన్నాశ్రయించారు. నేను వెడుతున్నాను' అని చెప్పాడు. అందుకా ఇందిరాదేవి రవంత చలించినదై - 'నాథా! నేను నీకు ప్రియురాలనై వుండగా నువ్వు నా తమ్ముని వధించడం ఎలా జరుగుతుంది?' అని ప్రశ్నించింది. ఆ మాటకు మాధవుడు నవ్వి - 'నిజమే దేవీ! నాకు నీ మీదున్న ప్రేమ చేతా, బ్రహ్మ నుండి అతను పొందిన వరాల చేతా, శివాంశ సంజాతుడు కావడం చేత కూడా జలంధరుడు నేను చంపదగినవాడు కాడు' అని మాత్రం చెప్పి, సర్వాయుధ సమీకృతుడై, గరుడ వాహనారూఢుడై, అతి త్వరితంగా యుద్ధభూమిని చేరాడు. మహాబలియైన గరుడుని రెక్కల విసురులకు పుట్టిన గాలి వలన రాక్షస సేనలు మేఘశకలాల వలె చెల్లా చెదరై నేల రాలిపోసాగాయి. అది గుర్తించిన జలంధరుడు ఆగ్రహంతో ఆకాశానికి బాణాలతో జలంధరుని యొక్క జెండానీ, రథచక్రాలనీ ధనుస్సునీ చూర్ణం చేసేశాడు. అనంతరం అతని గుండెలపై ఒక గొప్ప బాణాన్ని గాడనేసాడు. ఆ బాధామయ క్రోధంతో జలంధరుడు గదాధరుడై - ముందుగా గరుడుడి తలపై మోదడంతో, గరుత్మంతుడు భూమికి వాలాడు. తక్షణమే విష్ణువు అతని గదను తన ఖడ్గంతో రెండుగా నరికి వేశాడు. అలిగిన అసురేంద్రుడు - ఉపేంద్రుడి ఉదరాన్ని పిడికిట పొడిచాడు. అక్కడితో జలధిశాయికీ, జలంధరుడికీ బాహుయుద్ధం ఆరంభమైంది. ఆ భుజాస్ఫాలనలకూ, ముష్టిఘాతాలకూ, జానువుల తాకిళ్లకీ భూమి మొత్తం ధ్వనిమయమై పోసాగింది. భయావహమైన ఆ మనోహర కలహంలో - జలంధరుని బలపరాక్రమాలకు సంతుష్టుడైన సంకర్షణుడు

'నీ పరాక్రమం నన్ను ముగ్ధుని చేసింది. ఏదైనా వరం కోరుకో'' అన్నాడు. విష్ణువు అలా అనగానే జలంధరుడు చేతులు జోడించి 'బావా! రమా రమణా! నీవు నా యందు నిజంగా ప్రసన్నుడవే అయితే - నా అక్కగారైన లక్ష్మీదేవితోనూ - నీ సమస్త వైష్ణవ గణాలతో సహా తక్షణమే వచ్చి నా ఇంట కొలువుండిపో'మ్మని కోరాడు. తానిచ్చిన మాట ప్రకారం తార్క్ష్యవాహనుడూ తక్షణమే దానవ మందిరానికి తరలి వెళ్లాడు.

సమస్త దైవస్థానాలలోనూ రాక్షసులను ప్రతిష్ఠించాడు జలంధరుడు. దేవ, సిద్ధ, గంధర్వాదులందరి వద్దా వున్న రత్న సముదాయాన్నంతటినీ స్వాధీనపరుచుకున్నాడు. వాళ్లనందరినీ తన పట్టణంలో పడి వుండేటట్లుగా చేసుకుని, తాను త్రిలోక ప్రభుత్వాన్ని నెరపసాగేడు. ఓ పృథు చక్రవర్తీ! ఆ విధంగా జలంధరుడు లక్ష్మీనారాయణులను తన ఇంట కొలువుంచుకుని, భూలోకమంతటినీ ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుతుండగా, విష్ణుసేవా నిమిత్తంగానే (నారదుడు) ఒకసారి ఆ జలంధరుని ఇంటికి వెళ్లాను.

ఏకాదశాధ్యాయ స్సమాప్తః (పదకొండవ అధ్యాయము సమాప్తము)

## ద్వాదశాధ్యాయము

నారదుడు చెబుతున్నాడు: పృథురాజా! అలా తన గృహానికి వచ్చిన నన్ను జలంధరుడు ఎంతో చక్కటి భక్తి ప్రత్తులతో శాస్త్రవిధిని సత్కరించి, అనంతరం - 'మునిరాజా! ఎక్కడ నుంచి ఇలా వచ్చేశావు? ఏ ఏ లోకాలు సందర్శించావు? నువ్వు వచ్చిన పనేమిటో చెబితే దానిని తప్పక నెరవేర్చుతా'నన్నాడు. అప్పుడు నేనిలా అన్నాను.

'జలంధరా! యోజన పరిమాణమూ, పొడవూ గలదీ - అనేకానేక కల్పవృక్షాలూ, కామధేనువులూ గలదీ - చింతామణులచే ప్రకాశవంతమయినదీ అయిన కైలాస శిఖరంపై - పార్వతీ సమేతుడయిన పశుపతిని సందర్శించాను. ఆ వైభవాలకు దిగ్భ్రాంతులనయిన నేను - అంతటి సంపద కలవారు మరెవరయినా ఉంటారా అని ఆలోచించగా త్రిలోక చక్రవర్తివయిన నువ్వు స్ఫురించావు. నీ సిరిసంపదలను కూడా చూచి - నువ్వు గొప్పవాడవో, ఆ శివుడు గొప్పవాడో తేల్చుకోవాలని ఇలా వచ్చాను. అన్ని విషయాల్లోనూ వీరిద్దరూ దీటుగానే వున్నారు గాని - ఒక్క స్త్రీ రత్నపుటాధిక్యత

వల్ల, నీ కన్నా ఆ శివుడే ఉత్కృష్టవైభవోపేతుడుగా కనిపిస్తున్నాడు. నీ ఇంట్లో అప్సరలు, నాగకన్యలు మొదలైన దేవకాంతలెందరయినా వుందురు గాక - వాళ్లంతా ఏకమైనా సరే ఆ ఏణాంకధారికి ప్రాణాంకస్థితయైన పార్వతీదేవి ముందు ఎందుకూ కొరగారు. కళ్యాణాత్పూర్వం వీతరాగుడయిన విషమాంబకుడు సైతం ఏ విద్యుల్లతా సౌందర్యమనే అరణ్యంలో భ్రామితుడై చేప వలే కొట్టుమిట్టాడో - అటువంటి ఆ అద్రినందనకు యికయే చానా యీడు కాలేదు. నిత్యమూ ఏ పార్వతీదేవినే పరిశీలిస్తూ - ఆమె అందానికి సాటి తేవాలనే నిశ్చయంతో బ్రహ్మదేవుడు అప్సరాగణాన్ని సృష్టించాడో - ఆ అప్సరసలు అందరూ ఏకమైనా సరే ఆ అమ్మవారి అందం ముందు దిగదుడపేనని తెలుసుకో. నీకెన్ని సంపదలున్నప్పటికీ కూడా అటు వంటి సాధ్వీమణి లేకపోవడం వలన ఐశ్వర్యవంతులలో నువ్వు శివునికి తర్వాత వానివేగాని, ప్రథముడివి మాత్రం కావు.'

ఉపర్యుక్త విధంగా, జలంధరునితో ఉటంకించి, నా దారిన నేను వచ్చేశాను. అనంతరం, పార్వతీ సౌందర్య ప్రలోభుడై, జలంధరుడు మన్మథ జ్వరగ్రస్తుడయ్యాడు. కాముకులకి యుక్తాయుక్త విచక్షణలుండవు కదా! అందువల్ల విష్ణుమాయా మోహితుడయిన ఆ జలంధరుడు సింహికానందనుడయిన 'రాహు'వనే వాణ్ణి చంద్రశేఖరుని దగ్గరగా దూతగా పంపించాడు. శుక్లపక్షపు చంద్రునిలా తెల్లగా మెరిసిపోతూండే కైలాస పర్వతాలన్నీ, తన యొక్క కారు నలుపు దేహకాంతులు సోకి నల్లబడుతూండగా -రాహువు కైలాసాన్ని చేరి, తన రాకను నందీశ్వరుని ద్వారా నటరాజుకు కబురు పెట్టాడు. 'ఏం పని మీద వచ్చావు?' అన్నట్లు కనుబొమ్మల కదలికతోనే ప్రశ్నించాడు శివుడు. రాహువు చెప్పసాగాడు -

'ఓ కైలాసావాసా! ఆకాశంలోని దేవతల చేతా, పాతాళంలోని ఫణుల చేత కూడ సేవింపబడుతున్నవాడూ - ముల్లోకాలకూ ఏకైక నాయకుడూ ఐన మా రాజు జలంధరుడిలా ఆజ్ఞాపించాడు. హే వృషధ్వజా! వల్లకాటిలో నివసించేవాడివీ, ఎముకల పోగులను ధరించేవాడివీ, దిగంబరివీ అయిన నీకు - హిమవంతుడి కూతురూ, అతిలోక సౌందర్యవతీ అయిన పార్వతి భార్యగా పనికిరాదు. ప్రపంచంలోని అన్ని రకాల రత్నాలకూ నేను రాజునై వున్నాను. కాబట్టి, స్త్రీ రత్నమైన ఆ పార్వతిని కూడా నాకు సమర్పించు. ఆమెకు భర్తనయ్యేందుకు నేనే అర్హుడిని గాని, నువ్వే మాత్రమూ - తగవు.'

## కీర్తిముఖోపాఖ్యానము

రాహువలా చెబుతూండగానే - ఈశ్వరుడి కనుబొమల వలన రౌద్రాకారుడైన పురుషుడు వేగవంతమైన పిడుగుతో సమానమైన ధ్వని కలవాడు ఆవిర్భవించాడు. పుడుతూనే ఆ పౌరుషమూర్తి రాహువు మీదకు లంఘించబోగా - రాహువు భయపడి పారిపోబోయాడు. కాని, ఆ రౌద్రమూర్తి అనతిదూరంలోనే రాహువును పట్టుకుని మ్రింగివేయబోయాడు. అయినప్పటికీ - రాహువు దూత అయిన కారణంగా వధించడం తగదని రుద్రుడు వారించడంతో, ఆ పౌరుషమూర్తి తన ప్రయత్నాన్ని విరమించుకున్న వాడై, శివాభిముఖుడై - 'హే జగన్నాథా! నాకసలే ఆకలి - దప్పికలెక్కువ. వీనిని తినవద్దంటున్నావు గనుక నాకు తగిన ఆహారపానీయాలేమిటో ఆనతినిమ్మ'ని కోరాడు. హరుడతనిని చూచి - 'నీ మాంసాన్నే నువ్వు ఆరగించు' అన్నాడు. శివాజ్ఞబద్ధుడైన ఆ పురుషుడు తన శరీరంలోని శిరస్సును తప్ప తక్కిన అన్నిభాగాల మాంసాన్నీ తిని వేశాడు. శిరస్సొకటే మిగిలిన ఆ మహాపురుషునిపట్ల కృపాళుడయిన కంఠేకాలుడు - 'నీ ఈ భయంకరకృత్యానికి సంతుష్టుడనైనాను. ఇక నుంచీ నువ్వు కీర్తిముఖ సంజ్ఞతో విరాజిల్లు'మని ఆశీర్వదించాడు. ఓ పృథురాజా! తదాదిగా ఆ శిరోవశేషుడు శివద్వారాన కీర్తిముఖుడై ప్రకాశిస్తున్నాడు. అంతే కాదు. 'ఇకపై, ముందు నిన్ను పూజించకుండా నన్ను అర్చించిన వారి పూజలన్నీ వృథా అవుతాయి. గనుక నన్ను అర్చిందలచిన వారు ముందుగా కీర్తిముఖుని పూజించి తీరాలి' అని ఈశ్వరుడు శాసించాడు కూడా. అలా కీర్తిముఖగ్రస్తుడు కాబోయిన రాహువును శివుడు బర్బర స్థలమందు విముక్తుడిని చేయడం వలన తదాదిగా రాహువు బర్బర నామధేయంతో ప్రసిద్ధి చెందాడు. ఆ మీదట రాహువు తనకది పునర్జన్మగా భావించి, భయవిముక్తుడై జలంధరుని దగ్గరకు వెళ్ళి జరిగిందంతా పొల్లుపోకుండా చెప్పాడు.

పదకొండు, పన్నెండు అధ్యాయములు

ఇరువది యొకటవ (బహుళ షష్ఠి) నాటి పారాయణము సమాప్తము

## ఇరువది రెండవ రోజు పారాయణము

## త్రయోదశాధ్యాయము

నారద ఉవాచ: ఓ పృథురాజా! రాహువు చెప్పిన విషయాలన్నీ వినగానే, క్రోధోద్రిక్తుడయిన జలంధరుడు శివుని మీద రణభేరీ వేయించాడు. కోట్లాది సేనలతో - కైలాసం వైపుకు దండు కదిలాడు. ఆ సందర్భంగా - జలంధరునికి అగ్రభాగాన వున్న శుక్రుడు రాహువు చేత చూడబడ్డాడు. తత్ఫలితంగా జలంధరుడి కిరీటం నేలకి పడింది. రాక్షస సేవా విమానాలతో క్రిక్కిరిసిన ఆకాశం - వర్షాకాలపు మేఘావృతమైన ఆకాశం వలె కనిపించసాగింది. ఈ రణోద్యోగాన్నెరిగిన దేవతలు ఇంద్రుణ్ని ముందర వుంచుకుని రహస్య మార్గాన శివుడి సన్నిధికి వెళ్లి - యుద్ధవార్తల్ని విన్నవించారు. 'ఓ దేవాదిదేవా! ఇన్నినాళ్లుగా వాని వల్ల మేము పడుతున్న ఇక్కట్లన్నీ నీకు తెలియును. ఈ వేళ వాడు నీ మీదకే దండెత్తి వస్తున్నాడు. సర్వలోక కళ్యాణార్థం వానిని జయించు తండ్రీ! అని ప్రార్థించారు. వెనువెంటనే విరూపాక్షుడు విష్ణువును స్మరించాడు - విష్ణువు వచ్చాడు. అప్పుడు శివుడాయనను చూచి 'కేశవా! గత జగడంలోనే ఆ జలంధరుడిని జమునిపాలు చేయకపోయావా? పైపెచ్చు వైకుంఠాన్ని కూడా వదిలి వాడింట కాపురముండటమేమిటి?' అని ప్రశ్నించాడు. అందుకు జవాబుగా విష్ణువు 'పరమేశ్వరా! ఆ జలంధరుడు నీ అంశ వలన పుట్టడం చేతా, లక్ష్మికి సోదరుడు కావడం చేతా - యుద్ధంలో నా చేత వధింపబడలేదు. కాబట్టి, నువ్వే వానిని జయించు' అని చెప్పాడు. అందు మీదట శివుడు - 'ఓ దేవతలారా! వాడు మహాపరాక్రమవంతుడు. ఈ శస్త్రాస్త్రాలవల్లగాని, నా చేతగాని మరణించేవాడు గాదు. కాబట్టి, మీరందరూ కూడా ఈ అస్త్రశస్త్రాలలో మీ మీ తేజస్సులను సయితం ప్రకాశింప చేయాలి' అని ఆజ్ఞాపించటంతో, విష్ణ్వాది దేవతలందరూ తమ తమ తేజస్సులను బయల్పరిచారు. గుట్టగా ఏర్పడిన ఆ తేజస్సులో శివుడు తన తేజాన్ని కలిపి - మహోత్తమమూ, భీషణజ్వాలాస్యము వేగసంపన్నమూ, అత్యంత భయంకరమూ అయిన 'సుదర్శన'మనే చక్రాన్ని వినిర్మించాడు.

అప్పటికే - ఒక కోటి ఏనుగులు, ఒక కోటి గుర్రాలు, ఒక కోటి కాల్బలగముతో కైలాసభూములకు చేరిన జలంధరుని దేవతలూ ప్రమథగణాలూ ఒక్కుమ్మడిగా ఎదుర్కొన్నాయి. నందీశ్వర, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వరాదులు కూడా తమ తమ గణాలతో సహా - జలంధరునిని మార్కొన్నారు. రెండు తెగల మధ్యనా భయంకరమయిన సంకుల సమరం కొనసాగింది. ఇరుపక్షాల నుంచీ వచ్చే వీర రస ప్రేరకాలయిన భేరీ మృదంగ శంఖాది ధ్వనులతోనూ, రథనేమి ధ్వనులతోనూ, గజ ఘీంకారాలతోనూ - భూమి విపరీతమైన ధ్వనులతో ప్రకంపించసాగింది. పరస్పర ప్రయోజితాలైన - శూల, పట్టిస, తోమర, బాణ శక్తి, గదాద్యాయుధ భరితమైన ఆకాశం - పగలే చుక్కలు పొడిచినట్లుగా వుంది. యుద్ధభూమిలో నేలకూలిన రథగజాదుల కళేబరాలు రెక్కలు తెగిన పర్వతాలు గుట్టలు పడినట్లుగా వున్నాయి. ఆ మహాహవంలో

ప్రమధబాణోపహతులైన దైత్యుల్ని శుక్రుడు మృత సంజీవనీ విద్యతో పునర్జీవింప చేయసాగాడు.

ఈ సంగతి ఈశ్వరుని చెవిన పడింది. తక్షణమే ఆయన ముఖం నుంచి కృత్య అనే మహాశక్తిని ఆవిర్భవించింది. అది, అత్యంత భయంకరమైన తాలు జంఘోదర వక్త్ర స్తనాలతో మహావృక్షాలను సైతం కూలగొడుతూ రణస్థలిని చేరింది.

శ్లో॥ సా యుద్ధభూమి మాసాద్య భక్షయంతీ మహాసురాన్

భార్గవం స్వభగేధృత్వా జగా మాంతర్హితా నభః ॥

రావడం రావడమే పేరు మోసిన రాక్షసులెందరినో తినేసింది. ఆ వూపు ఊపు శుక్రుణ్ని సమీపించి అతనిని తన యోనిలో చేర్చుకుని అంతర్ధానమై పోయింది. మరణించిన వాళ్లను మళ్లా బ్రతికించే శుక్రుడు లేకపోవడం వలన - ప్రమథగణాల విజృంభణకు రాక్షస సేన మొత్తం తుఫాను గాలికి చెదిరిపోయే మబ్బు తునకలవలె చెల్లా చెదరయి పోసాగింది. అందుకు కినిసిన శుంభనిశుంభ కాలనేమ్యాది సేనానాయకులు అగణ శరపరంపరతో శివగణాలను నిరోధింపసాగేరు. చక్కటి పంట మీద మిడుతల దండులాగా - తమ మీద పడే రాక్షస బాణాలకు రక్తసిక్త దేహులై, అప్పుడే పూసిన మోదుగ చెట్ల వలె తయారయిన శివ సేనలన్నీ తిరుగుముఖం పట్టి పారిపోసాగాయి. అది గమనించిన - నందీశ్వర, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వరులు ఆగ్రహావేశులై - రాక్షస సేనల మీదకు విజృంభించారు.

త్రయోదశోధ్యాయ స్సమాప్తః (పదమూడవ అధ్యాయము సమాప్తము)

## చతుర్థశాధ్యాయము

నందీశ్వరుడు కాలనేమితోనూ, విఘ్నేశ్వరుడు శుంభుడితోనూ, కుమారస్వామి నిశుంభుడితోనూ ద్వంద్వ యుద్ధాలకి తలపడ్డారు. నిశుంభుడి బాణఘాతానికి సుబ్రహ్మణ్య (కుమార) స్వామి వాహనమైన నెమలి మూర్ఛపోయింది. నందీశ్వరుడు తన బాణ పరంపరతో కాలనేమి యొక్క గుర్రాలనూ, జెండానూ, ధనుస్సునూ, సారథినీ నాశనం చేసేశాడు. అందుకు కోపించిన శుంభుడు విఘ్నేశ్వరుడి వాహనమైన ఎలుకని బాణంతో బాధించాడు. అది కదలలేని పరిస్థితి ఏర్పడటంతో, వినాయకుడు గండ్రగొడ్డలిని ధరించి - కాలినడకను శుంభుని చేరి వాని వక్షస్థలాన్నీ గాడనేశాడు. వాడు భూమిపై పడిపోయాడు. అది గమనించిన కాలనేమి - నిశుంభులు ఇద్దరూ ఒకేసారిగా గణపతితో కలియబడ్డారు. దీనిని గుర్తించి వారి మధ్యకు రంగప్రవేశం చేశాడు వీరభద్రుడు. వినాయకునికి సహాయార్థమై వీరభద్రుడు కదలగానే కూశ్మాండ-భైర -బేతాళ- పిశాచ-యోగినీ గణాలన్నియు ఆయననున అనుసరించాయి. గణసహితుడైన వీరభద్రుని విజృంభణతో రాక్షసగణాలు హాహాకారాలు చేశాయి. అంతలోనే మూర్ఛదేరిన నందీశ్వర, కుమారస్వాములిద్దరూ పునః యుద్ధంలో ప్రవేశించారు. వాళ్లందరి విజృంభణతోనూ వీగిపోతూన్న తన బలాన్ని చూసిన జలంధరుడు 'అతి' అనే పతాకం గల

రథంపై వచ్చి ఈ సమస్త గణాలనూ ఎదుర్కొన్నాడు. జలంధరుడి బాణాలతో భూమ్యాకాశాల మధ్య ప్రాంత మంతా నిండిపోయింది. అయిదు బాణాలతో విఘ్నేశ్వరుడినీ, తొమ్మిది బాణాలతో నందీశ్వరుడినీ, ఇరవై బాణాలతో వీరభద్రుడిని కొట్టి మూర్ఛ పోగొట్టి భీషణమైన సింహగర్జన చేశాడు. వాడి గర్జనతో ముందుగా స్పృహలోనికి వచ్చిన వీరభద్రుడు, ఏడు బాణాలతో జలంధరుడి గుర్రాలనీ, పతాకాన్నీ గొడుగునూ నరికేసాడు. మరో మూడు బాణాలు అతని గుండెలలో గుచ్చుకునేలా నాటాడు. దానితో మండిపడిన జలంధరుడు 'పరిఘు' అనే ఆయుధంతో వీరభద్రుని ఎదుర్కొన్నాడు. అద్భుతమైన యుద్ధం చేశారు వాళ్లు. అనంతరం జలంధరుడు వీరభద్రుడి తలపై పరిఘును ప్రయోగించడంతో - వీరభద్రుడు స్పృహ తప్పి పడిపోయెను. చివరికి దేవతల ప్రార్థనల మీద శివుడు జలంధరుడితో యుద్ధానికి ఉపక్రమించాడు. అతడిని యుద్ధంలో జయించడం శివుని శక్యం కాలేదు. జలంధరుడు హతుడు కాకపోవడానికి అతని భార్య బృంద పాతివ్రత్యం కారణమని విష్ణుమూర్తి గ్రహించాడు. ఆమె ముందు విష్ణు మాయను ప్రయోగించడానికి బయలుదేరాడు. అక్కడ బృంద ఒక మునీశ్వరుని వద్దకు వెళ్ళి తన భర్త యోగక్షేమాల గురించి అడిగింది.

పదమూడు, పదునాలుగు అధ్యాయములు

ఇరువది రెండవ (బహుళ సప్తమి) రోజు పారాయణము సమాప్తము

## ఇరువది మూడవ రోజు పారాయణము

## పంచదశాధ్యాయము

తూ అప్పుడా ముని - కరుణాకరమైన దృష్టులను ప్రసరిస్తూ ఆ ఋషి ఆకాశం వంక చూశాడు. వెంటనే ఇద్దరు వానరులు వచ్చారు. ముని వారికి కనుబొమలతోనే కర్తవ్యాన్ని ఆజ్ఞాపించాడు. ఆ రెండు కోతులూ మళ్లా ఆకాశానికి ఎగిరి - అతి స్వల్ప కాలంలోనే - తెగ వేయబడిన జలంధరుడి చేతులనూ, మొండెమునూ, తలనూ తెచ్చి - వారి ముందుంచాయి. తన భర్త ఖండితావయవాలను చూసి బృంద ఘొల్లుమని ఏడ్చింది. అక్కడే వున్న ఋషి పాదాలపై పడి - తన భర్తను బ్రతికించవలసిందిగా ప్రార్థించింది. అందుకా ముని నవ్వుతూ 'శివోపహతులైన వాళ్లని బ్రతికించడం ఎవ్వరికీ సాధ్యం కాదు, అయినా నాకు నీ పట్ల ఏర్పడిన అవ్యాజమైన కరుణ వలన తప్పక బ్రతికిస్తాను' అంటూనే అంతర్హితుడయ్యాడు. అతనలా మాయమైందే తడవుగా జలంధరుడి అవయవాలన్నీ అతుక్కొని, అతడు సజీవుడయ్యాడు. ఖిన్నురాలై వున్న బృందను కౌగిలించుకుని, ఆమె ముఖాన్ని పదే పదే ముద్దాడాడు. పునర్జీవితుడైన భర్తపట్ల అనురాగంతో బృంద పులకరించి పోయింది. వారిద్దరూ ఆ వనంలోనే వివిధ రకాలుగా సురత క్రీడలలో మునిగిపోయారు. మరణించిన మనోహరుడు మరలా బ్రతికి వచ్చాడనే ఆనందంలో - బృంద - వెంటనే గుర్తు పట్టలేక పోయినా - ఒకానొక సురత సుఖానంతరం ఆమె అతనిని విష్ణువుగా గుర్తించి వేసింది. మగని వేషంలో వచ్చి తన పాతివ్రత్యాన్ని మంటగలిపిన ఆ మాధవునిపై విపరీతంగా ఆగ్రహించింది. 'ఓ విష్ణుమూర్తీ! పర స్త్రీగామివై చరించిన నీ ప్రవర్తన నిందింపబడును గాక! నీ మాయతో ఇతః పూర్వం కల్పించిన వానరులిద్దరూ రాక్షసులై జన్మించి నీ భార్యనే హరించెదరుగాక! నువ్వు భార్యా వియోగ దుఃఖితుడవై, నీ శిష్యుడైన ఆదిశేషునితో సహితుడవై అడవులలో, పడి తిరుగుతూ - వానర సహాయమే గతియైన వాడివి ఆ గురువుగాక!' అని శపించి, తన నభిలషిస్తూ చేరువవుతూన్న శ్రీహరి నుండి తప్పుకుని, అగ్నిని కల్పించుకుని, అందులో పడి బూడిదై పోయింది. అందుకు చింతించిన విష్ణువు మాటి మాటికీ ఆ బృందనే స్మరించసాగాడు. నిలువునా కాలిపోయిన ఆమె యొక్క చితాభస్మాన్ని తన తనువంతా పూసుకుని విలపింపసాగాడు. సిద్ధులు, ఋషులు - ఎందరెన్ని విధాల చెప్పినా విష్ణువు శాంతిని పొందలేకపోయాడు. అశాంతితో అల్లాడిపోసాగాడు.

పదునైదవ, పదునారవ అధ్యాయములు

ఇరువది మూడవ (బహుళ అష్టమి) రోజు పారాయణము సమాప్తము

## ఇరువది నాలుగవ రోజు పారాయణము

## సప్తదశాధ్యాయము

ఇక ఇక్కడ యుద్ధరంగంలో - అతిలోకమైన శివశౌర్యానికి చిన్నబుచ్చుకొన్న జలంధరుడు పునః ఈశ్వరుణ్ణి సమ్మోహింప చేయదలచి మాయాగౌరిని సృష్టించాడు. ఒక రథంపై కట్టివేయబడి - నిశుంభాది నిశాచరుల చేత వధింపబడుతూ వున్న ఆ మాయా గౌరిని చూసాడు శివుడు. చూసీచూడగానే ఉద్విగ్న మానసుడైన ఉగ్రుడు యుద్ధాన్నీ, తన పరాక్రమాన్నీ, కర్తవ్యాన్నీ విస్మరించి ఉదాసీనుడై వుండిపోయాడు. అదే అదనుగా జలంధరుడు ఆ పుంఖశాణైకాలైన మూడు బాణాలను శివుని శిరసుపైనా, వక్షస్థలంపైనా, ఉదరమందునా ప్రయోగించాడు. అయినా ఈ జంగమయ్యలో చలనం లేదు. అటువంటి సమయంలో అదంతా రాక్షసమాయగా బ్రహ్మదేవునిచే బోధించబడిన వాడై, కోలుకొనిన ఆ పరమేశ్వరుడు జ్వాలామాలాతి భీషణమైన రౌద్రరూపాన్ని ధరించాడు. ఆ స్వరూపాన్ని చూసేందుకు సహితం శక్తిచాలక అనేక మంది రాక్షసులు పారిపోసాగారు. అలా పారిపోతున్న వారిలో వున్న అగ్రనాయకులైన శుభ, నిశుంభులను చూచిన రుద్రుడు - పారిపోతున్న వాళ్లంతా పార్వతి చేతిలో మరణించెదరు గాక' అని శపించాడు. అది గమనించిన జలంధరుడు బాణవర్షంతో అంధకారాన్ని కల్పించాడు. శివుడు తన తపోబలంతో ఆ చీకట్లను చీల్చివేశాడు. ఉడికిపోయిన జలంధరుడు పరిఘాయుధంతో పరుగు పరుగున వచ్చి ఈశ్వరుని వాహనమైన ఎద్దును భయంకరంగా గొట్టాడు. ఆ దెబ్బకు నంది యుద్ధ రంగం నుండి పరుగు తీయసాగింది. దానిని మళ్లించడం సాంబశివునికి కూడా సాధ్యం కాలేదు. ఎక్కడ లేని కోపం వచ్చింది రుద్రుడికి. వెనువెంటనే సుదర్శన చక్రాన్ని ప్రయోగించాడు. భూమ్యాకాశాలను దహింప చేసి వేయగలిగినంతటి వేగవంతమైన ఆ చక్రం చూపరులను భయభ్రాంతులను చేస్తూ వెళ్లి జలంధరుడి తలనరికి నేలపై పడవేసింది. అతని మొండెంలోంచి వెలువడ్డ తేజస్సు, ఈశ్వరునిలో లీనమై పోయింది. బ్రహ్మాది దేవతలందరూ సంతోషాతిరేకులూ, అవనత శిరస్కులూ అయి ఆ చంద్రశేఖరునకు ప్రణమిల్లారు. స్తుతించారు. కృతజ్ఞతలు చెప్పుకున్నారు. అనంతరం 'బృందామోహితుడై అడవులలోబడి అల్లాడిపోతున్న విష్ణువును స్వస్థుని చేసే ఉపాయాన్ని కూడా అనుగ్రహించమని కోరగా అందుకుగాను పరాశక్తిని వేడుకోమని చెప్పి జయజయధ్వానాల నడుమ సకలగణ సమేతుడై

గృహోన్ముఖుడయ్యాడు. శివాజ్ఞ ప్రకారం దేవతలు మహామాయని ప్రార్థించసాగారు.

దేవతాకృత మహిమాయా ప్రార్థనం

శ్లో॥ య దుద్భవాస్సత్త్వ రజ స్తమో గుణాః
సృష్టి స్థితి ధ్వంస నిదాన కారిణః
య దిచ్ఛయా విశ్వమిదం భవా భవౌ
తనోతి మూల ప్రకృతి నతాస్స్మృతామ్ ॥ 1

శ్లో॥ యాహి త్రయోవింశతి భేద శాబ్దితా
య ద్రూపకర్మాటి జగు స్త్రి యోపివై
జగత్యశేషే సమధిష్ఠితా పరా
వేదాస్తు మూల ప్రకృతిం నతాస్స్మృతామ్ ॥ 2

శ్లో॥ యద్భక్తియుక్తాః పురుషాస్తు నిత్యం
దారిద్ర్య భీ మోహ పరాభ వాదీన్
నప్రాప్నువంత్యేవహి భక్తవత్సలాం
సదైవ మూల ప్రకృతిం నతాస్స్మృతామ్ ॥ 3

1. సృష్టిస్థితి లయలకు కారణమైన సత్త్వ రజస్తమో గుణాలు మూడు దేని నుంచి పుట్టినవో, దేవి యొక్క ఇచ్ఛ వలన లోకంలో జనన -మరణాలు సంభవిస్తున్నాయో అటు వంటి మూల ప్రకృతి (మహామాయ)కి నమస్కరిస్తున్నాయి.

2. ఏదైతే ఇరవై మూడు భేదములతో చెప్పబడి సమస్త లోకములను అధిష్ఠించినదో వేదములలో సైతము దేని యొక్క రూపకర్మములు కీర్తింపబడు తున్నాయో అట్టి మూల ప్రకృతికి నమస్కరిస్తున్నాను.

3. దేనియందు భక్తుడైన వాడు దరిద్రభయ, మోహ, పరాభవాలను పొందడో, ఏదయితే, తన భక్తుల యందు ఎడతెగని ప్రేమ కలదో - ఆ మూల ప్రకృతికి నమస్కరిస్తున్నాను.

నారదోవాచ: స్తవమే త త్త్రిసంధ్యాం యః పఠే దేకాగ్రమానసః
దారిద్ర్యమోహ దుఃఖాని న కదాచిత్ స్పృశంతి తమ్ ॥

నారదుడు చెబుతున్నాడు: దేవతలచే గావించబడిన ఈ మూలప్రకృతి (మహామాయా) స్తనాన్ని ఎవరైతే ఏకాగ్రచిత్తంతో త్రిసంధ్యాలూ పఠిస్తారో వాళ్లేనాడూ కూడా దారిద్ర్యాన్ని గాని, భయాన్ని గాని, మోహాన్నిగాని, దుఃఖాన్ని గాని, అవమానాన్ని

గాని పొందరు. ఇక ప్రస్తుతంలోకి వద్దాము.

ఆ విధంగా దేవతలు ప్రార్థన చేయగానే ఆకాశంలో జ్వాలాయుతమైన అద్భుత తేజస్సొకటి పొడచూపి - ఓ దేవతలారా! త్రిగుణాలరీత్యా నేను త్రిమూర్తులనూ ధరించి వున్నాను. రజోగుణం వలన లక్ష్మిగాను, తమోగుణం వలన - సరస్వతిగానూ, సత్వగుణం వలన పార్వతిగానూ - విలసిల్లుతున్నది నేనే కావున, మీ వాంఛాపరిపూర్తికై ఆ లక్ష్మీ-పార్వతీ-సరస్వతులను ఆశ్రయింపు'డని ఆదేశించి అంతర్థానమై పోయింది. దేవతలు రమా, ఉమా, సరస్వతుల చెంతకు వెళ్లి తమ మనోగతాన్ని వెల్లడించారు. భక్తవత్సలలైన ఆ తల్లులు ముగ్గురూ వారికి కొన్ని బీజాలనిచ్చి - 'విష్ణువు ఎక్కడయితే మోహావృతుడై వున్నాడో అక్కడీ బీజాల్ని చల్లండి' అని చెప్పారు. దేవతలా బీజాలను తెచ్చి - శ్రీహరి మోహితుడై పడి వున్న బృందా చితా ప్రాంతమంతటా చిలకించారు.

ఓ పృథు భూపతీ! పాతివ్రత్య మహిమా సుశోభితమైన ఈ గాథను - ఏకాగ్రచిత్తంతో చదివినా, స్త్రీలుగాని, పురుషులుగానీ, ఇహంలో సంతానసంపదనూ - పరంలో స్వర్గసంపదనూ పొందుతున్నారు - అన్నాడు నారదుడు.

సప్తదశోధ్యాయ స్సమాప్తః (పదునేడవ అధ్యాయము సమాప్తము)

## అష్టదశాధ్యాయము

పునః నారదుడు ప్రవచిస్తున్నాడు: ఓ పృథు మహారాజా! పూర్వోక్త విధంగా బృందాచితాస్థలిలో దేవతలచే చల్లబడిన బీజాల వల్ల - త్రిగుణ శోభితాలైన ఉసిరి, మాలతి, తులసి అనే మూడు రకాల వృక్షాలు ఆవిర్భవించాయి. వీటిలో సరస్వతి వలన ఉసిరిక, లక్ష్మి వలన మాలతి, గౌరి వలన తులసి ఏర్పడ్డాయి. అంతవరకూ బృందా మోహముతో మందుడై వున్న విష్ణువు తన చుట్టూ చెట్లయి మొలచిన లక్ష్మీ, సరస్వతీ, పార్వతీ మహిమల వలన, కోలుకున్నవాడై అనురాగపూరిత హృదయంతో ఆ వృక్షాలను తిలకించసాగాడు. కాని, వాటిలో లక్ష్మీదత్తబీజాలు ఈర్ష్యాగుణాన్వితాలయి వుండటం వలన ఆ బీజోత్పన్నమైన 'మాలతి' బర్బరీ నామధేయమై, విష్ణువునకు ఎడమయ్యింది. కేవల అనురాగ పూరితాలయిన ఉసిరి, తులసి - మాత్రమే పీతాంబరునకు ప్రియాంకరాలయ్యాయి. తద్వారా విష్ణువు మోహ విముక్తుడై, ధాత్రీ తులసీ సమేతుడయి సర్వదేవతా నమస్కారాలనూ అందుకుంటూ

వైకుంఠానికి తరలి వెళ్లాడు. అందువల్లనే కార్తీక వ్రతంలోని విష్ణుపూజలో ముందుగా తులసిని పూజించినట్లయితే పుండరీకాక్షుడు ఎనలేని సంతోషాన్ని పొందుతాడు. అంతే కాదు -

## తులసీ మహిమ

ఎవరింటిలో తులసీవనం వుంటుందో ఆ ఇల్లు సర్వతీర్థస్వరూపమై వర్థిల్లుతుంది. యమదూతలు అక్కడకు రాలేరు. సర్వపాప సంహారకమైన ఈ తులసీవనాన్ని ఎవరు ప్రతిష్ఠిస్తారో, వారికి యమధర్మరాజును దర్శించే పని వుండదు. అనగా, నరకానికి వెళ్లరనీ పుణ్యాత్ములై స్వర్గాన్నే పొందుతారనీ భావము. గంగాస్నానం, నర్మదా దర్శనం, తులసీ సేవనం, ఈ మూడూ సమాన ఫలదాయకాలేనని చెప్పబడుతూంది. తులసిని ప్రతిష్ఠించినా, తడిపినా, తాకినా, పెంచినా, మానసిక శారీరకపాపాలేగాక, మాటలవలని పాపాలూ కూడా మటుమాయమై పోతాయి.

తులసి గుత్తులతో శివ, కేశవులను అర్చించినవాడు ఖచ్చితంగా మోక్షాన్ని పొందుతాడనడంలో ఎటు వంటి సందేహమూ లేదు. పుష్కరాది తీర్థాలు గంగాది నదులు, విష్ణ్వాది దేవతలు తులసి దళాలతో నివసిస్తూంటారు. ఎన్ని పాపాలు చేసినవాడైనాసరే ఎవడైతే శరీరానికి తులసి మట్టిని పూసుకుని మరణిస్తున్నాడో, అటు వంటి వానిని చూసేందుకు యముడు కూడా భయపడతాడు. అటు వంటి వాడు విష్ణు సాయుజ్యాన్ని పొందుతున్నాడనడం సత్యం, సత్యం. ముమ్మాటికీ సత్యం. తులసి చెట్టు యొక్క గంధాన్ని ధరించేవాడికి పాపాలు కొంచెం కూడా అంటవు. తులసీవనపు నీడలో పితృశ్రాద్ధ చేసినట్లయితే, అది పితరులకు అక్షయ పదాన్నిస్తుంది. అదే విధంగా -

## ధాత్రీ (ఉసిరి) మహిమ

ఉసిరిచెట్టు నీడను పిండప్రదానం చేసిన వారి పితరులు నరకం నుంచి విముక్తులవుతారు. ఎవడైతే తన శిరస్సుపైనా, ముఖమందునా, దేహమందునా, చేతులందునా ఉసిరిపండును ధరిస్తున్నాడో వాడు సాక్షాత్ విష్ణుస్వరూపుడని తెలుసుకోవాలి. ఎవడి శరీరంపై ఉసిరిక ఫలమూ, తులసీ, ద్వారకోద్భవమైన మృత్తికా వుంటాయో నిస్సందేహంగా వాడు జీవన్ముక్తుడేనని తెలుసుకో. ఉసిరిపండ్లనీ, తులసీదళాన్ని కలిపిన జలాలతో స్నానమాడిన వాడికి తత్క్షణమే గంగా స్నానఫలం

లభిస్తుంది. ఉసిరిపత్రితోగాని, ఫలాలతో గాని దేవతాపూజ చేసిన వాడికి ముత్యాలతోనూ, మాణిక్యాలతోనూ, బంగారంతోనూ ఆరాధించిన ఫలం ప్రాప్తిస్తుంది. సూర్యుడు తులాగతుడైన కార్తీకమాసంలో చేయబడే యజ్ఞయాగాదులు, తీర్థసేవనలు విశేష ఫలితాలనిస్తాయి. సమస్త దేవతలూ, మునులూ కూడా ఈ కార్తీకమాసంలో ఉసిరిక చెట్టుని ఆశ్రయించుకుని వుంటారు.

ఏ నెలలోనైనా సరే - ఎవడైతే ద్వాదశినాడు తులసిదళాలను, కార్తీకం ముప్పది రోజులలోనూ ఉసిరికపత్రిని కోస్తున్నాడ వాడు నింద్యాలైన నరకాలనే పొందుతున్నాడు. కార్తీకమాసంలో ఎవడైతే ఉసిరిచెట్టు నీడన భోజనం చేస్తాడో, వాడి యొక్క ఒక సంవత్సరపు దోషం తొలగిపోతుంది. ఉసిరినీడన విష్ణుపూజ చేసినట్లయితే - అన్ని విష్ణు క్షేత్రాలలోని శ్రీహరిని ఆరాధించిన పుణ్యం కలుగుతుంది. శ్రీహరి లీలలనీ, మహిమలనీ చెప్పడానికి ఏ ఒక్కరికీ కూడా ఎలాగైతే సాధ్యం కాదో, అదే ప్రకారం ఈ తులసీ ధాత్రీ వృక్షాల మహిమల్ని చెప్పడం కూడా చతుర్ముఖుడైన బ్రహ్మకుగాని, సహస్రముఖుడయిన శేషునికి గాని సాధ్యం కాదు. ఈ ధాత్రీ తులసీ జననగాధ ఎవరు వింటున్నారో, వినిపిస్తున్నారో వాళ్లు తమ పాపాలను పోగొట్టుకున్నవారై తమ పూర్వులను కూడి శ్రేష్ఠమైన విమానంలో స్వర్గానని పొందుతున్నారు.

పదునేడవ, పదునెనిమిదవ అధ్యాయములు

ఇరువది నాలుగవ (బహుళ నవమి) నాటి పారాయణం సమాప్తం

## ఇరువది అయిదవరోజు పారాయణము

## ఏకోన వింశత్యధ్యాయః

పృథువు అడుగుతున్నాడు: 'నారదా! నీచే అత్యద్భుతంగా చెప్పబడిన తులసీ మహాత్మ్యాన్ని విని ధన్యుడనైనాను. అదే విధంగా - కార్తీక వ్రతాచరణా ఫలితాలను కూడా ఎంతో చక్కగా చెప్పావు. అయితే, గతంలో ఈ వ్రతం ఎవరెవరి చేత ఎలా ఆచరించబడిందో కూడా విస్తరంగా తెలియజేయి' అని కోరగానే, నారదుడిలా వినిపించసాగాడు.

### ధర్మదత్తోపాఖ్యానము

చాలా కాలం పూర్వం సహ్య పర్వతభూమిని - కరవీరమనే ఊరుండేది. ఆ ఊళ్లో ధర్మవేత్త, నిరంతర హరి పూజాసక్తుడు, నిత్య ద్వాదశాక్షరీ జపవ్రతుడు అతిథి సేవాపరాయణుడూయైన ధర్మదత్తుడనే బ్రాహ్మణుడు వుండేవాడు.
ఒకానొక కార్తీక మాసంలో ఆ విప్రుడు విష్ణుజాగరణ చేయదలచిన వాడై తెల్లవారు ఝామునే లేచి పూజోపకరణాలు సమకూర్చుకుని విష్ణ్వాలయానికి బయలుదేరాడు. ఆ దారిలో వంకరలు తిరిగి ఘోర దంష్ట్రలూ, పాటిస్తూన్న నాలుకా, ఎర్రటికళ్లూ, దళసరిపాటి పెదాలూ, మాంసరహితమయిన శరీరమూ గలదీ, పందివలె ఘుర్ఘుస్తున్నదీ అయిన ఒక దిగంబర రాక్షసి తారసపడింది. దానిని చూసి భీతి చెందిన ఆ బ్రాహ్మణుడు హరిస్మరణతో తులసీభరితమైన జలతాడనం చేయడం వలన, ఆ నీళ్లు సోకగానే దాని పాపాలన్నీ పటాపంచలై పోతాయి. తద్వారా ఏర్పడిన జ్ఞానం వలన 'కలహ' అనబడే ఆ రాక్షసి ఆ బ్రాహ్మణునకు సాష్టాంగంగా ప్రణమిల్లి - తన పూర్వ జన్మ కర్మ విపాకాన్నిలా విన్నవించసాగింది. 'కలహ' చెబుతోంది - పుణ్యమూర్తివైన ఓ బ్రాహ్మణుడా! పూర్వములో నేను సౌరాష్ట్ర దేశమందలి భిక్షుడనే బ్రాహ్మణుని భార్యను. అప్పుడు మిక్కిలి కఠినురాలినై వుంటూ కలహ అనే పేరుతో పిలువబడే దానిని. నేనేనాడూ నా భర్త ఆజ్ఞలను పాటించి ఎరుగను. ఆయన హితవును ఆలకించేదానిని గాను. నేనలా కలహకారిణై అహంకరించి వుండటం వలన కొన్నాళ్లకు, నాథుని మనసు విరిగి మారుమనువాడాలనే కోరికతో వుండేవాడు. ఆయనను నేను సుఖపెట్టలేకపోయినా, మారు మనువు చేసుకోవాలనే ఆయన కోరికను గుర్తించి, భరించలేక విషం తాగి
చనిపోయాను.

యమదూతలు నన్ను తీసుకు వెళ్లి యముడి ముందు నిలబెట్టారు. యముడు చిత్రగుప్తుడిని చూసి, 'చిత్రగుప్తా! దీని కర్మకాండలను తెలియజేయి. శుభమైనా,

అశుభమైనా సరే, కర్మఫలాన్ని అనుభవించవలసినదే'నన్నాడు. అందు మీదట చిత్రగుప్తుడు, ఓ ధర్మరాజా! ఇది ఒక మంచి పని కూడా చేయలేదు. తాను షడ్రసోపేతంగా భోజనం చేసిన తరువాత కూడా, భర్తకు అన్నము పెట్టేది కాదు. అందువల్ల మేక జన్మమెత్తి బాధిష్ఠయగు గాక! నిత్యమూ భర్తతో కలహించి అతని మనసుకు బాధ కలిగించినందుకు గాను పురుగై పుట్టుగాక! వండిన వంటను తానొక్కతే తినిన పాపానికిగాను పిల్లిగా పుట్టి తన పిల్లలను తనే తినుగాక! భర్తృద్వేషిణియై ఆత్మహత్య చేసుకున్నందు వలన అత్యంత నిందితమైన ప్రేత శరీరాన్ని పొందుగాక! ఇది ప్రేతరూపమును పొంది కొన్నాళ్లు నిర్జల స్థానంలో వుండి, అనంతరం, సత్కార్యముల నాచరించుగాక!' అని తీర్మానించాడు.

అది మొదలుగా ఓ ధర్మదత్తా! నేను అయిదువందల సంవత్సరాల పాటు ఈ ప్రేత శరీరం ధరించి ఆకలి దప్పులతో అల్లాడుతూ అలనాటి నా పాపాలకై దుఃఖిస్తున్నాను. అనంతరం కృష్ణా, సరస్వతి సంగమ స్థానమైన దక్షిణ దేశానికి రాగా - అక్కడి శివగణాలు నన్ను తరిమికొట్టగా ఇలా వచ్చాను. పరమ పావనమైన తులసి జలాలతో నీవు తాడించడం వలన ఈపాటి పూర్వస్మృతి కలిగింది. పుణ్యతేజస్వివైన నీ దర్శనం లభించింది. కాబట్టి కళంకరహితుడవైన భూసురుడా! ఈ ప్రేత శరీరం నుంచీ, దీని తదుపరి ఎత్తవలసిన యోనులలోని జన్మ త్రయాన్నుంచీ, నాకెలా ముక్తి లభిస్తుందో చెప్పి రక్షించు - అని ప్రాధేయపడింది. కలహ చెప్పినదంతా విని కలతపడిన మనస్సు గలవాడైన ఆ విప్రుడు సుదీర్ఘ సమయం యోచించి, యోచించి దుఃఖభార హృదయుడై ఇలా చెప్పసాగాడు.

## వింశత్యధ్యాయము

ధర్మదత్తుడు చెబుతున్నాడు: 'ఓ కలహా! తీర్థాలూ, దానాలు వ్రతాలూ చేయడం వలన పాపాలు నశించిపోతాయి. కాని నీ ప్రేత శరీరం వలన వాటిని ఆచరించేందుకు నీకు అధికారం లేదు. అదీగాక మూడు యోనులలో మూడు జన్మలలో అనుభవించ వలసిన కర్మపరిపాకం స్వల్ప పుణ్యాలతో తీరదు. అందువలన నేను పుట్టి బుద్ధెరిగిన నాటి నుండి ఆచరిస్తూ వున్న కార్తీక వ్రత పుణ్యంలో సగభాగాన్ని నీకు ధారపోస్తాను. తద్వారా నీవు తరించి ముక్తిని పొందు.' ఈ విధంగా చెప్పి ద్వాదశాక్షరీ మంత్రయుక్తంగా తులసీతోయాలతో ఆమెనభిషేకించి, కార్తీక వ్రత పుణ్యాన్ని ధారపోశాడు. ఉత్తరక్షణంలోనే కలహ-ప్రేత శరీరాన్ని విడిచి, దివ్యరూపిణియై, అగ్నిశిఖవలె లక్ష్మీకళతో ప్రకాశించింది. అమితానందంతో ఆమె ధర్మదత్తునికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ వుండగానే,

విష్ణుస్వరూపులైన పార్షదులు ఆకాశం నుంచి విమానంతో సహా వచ్చారు. వారిలోని పుణ్యశీల, సుశీల అనే ద్వారపాలకుల చేత కలహ విమానమందాసీనగా, చేయబడి అప్సరోగణాల చేత సేవించబడసాగింది. ఆ విమానాన్ని చూస్తూనే అందులోని విష్ణుగణాలకు సాష్టాంగపడ్డాడు ధర్మదత్తుడు. సుశీలా పుణ్యశీలులిద్దరూ అతనిని లేవదీసి, సంతసం కలిగించే విధంగా ఇలా చెప్పసాగారు.

'ఓ విష్ణుభక్తా! దీనుల యందు దయాబుద్ధి గలవాడవూ, ధర్మవిదుడవూ, విష్ణుభక్తుడవూ, అయిన నీవు అత్యంత యోగ్యుడవు. లోకోత్తరమైన కార్తీక వ్రత పుణ్యాన్ని ఒక దీనురాలి కోసం త్యాగం చేయడం వలన - నీ నూరు జన్మలలోని పాపాలు యావత్తూ సర్వనాశనమై పోయాయి. ఈమె పూర్వ సంచితమంతా నీచే చేయించబడిన స్నానఫలం వలన తొలగిపోయింది. విష్ణుజాగరణ ఫలంగా విమానం తేబడింది. నీవామెకు అర్పించిన దీపదాన పుణ్యం వలన తేజోరూపాన్ని తులసీ పూజాదుల వలన విష్ణు సాన్నిధ్యాన్నీ ఆమె పొందబోతోంది. ఓ పవిత్ర చరిత్రుడా ! మానవులకు మాధవ సేవ వలన కలుగని మనోవాంఛిత మంటూ యేదీ లేదు. విష్ణుధ్యాన తత్పరుడవైన నీవు ఇద్దరు భార్యలతోనూ కలసి అనేక వేల సంవత్సరాలపాటు విష్ణు సాన్నిధ్యంలో వినోదించగలవు.

ధర్మదత్తునికి విష్ణుదూతల వరం

విష్ణుదూతలు చెబుతున్నారు: ఓ ధర్మదత్తుడా! వైకుంఠంలో నీ పుణ్యఫలాను భవానంతరం తిరిగి భూలోకంలోని సూర్యవంశంలో దశరథుడనే మహారాజుగా పుడతావు. నీ భార్యలిద్దరూ ఆ జన్మలో కూడా నీకు భార్యలవుతారు. ఇప్పుడు నీచే పుణ్యాభిషిక్తయైన ఈ 'కలహ' యే నీకా జన్మలో మూడవ భార్యగా పరిణమిస్తుంది. దివ్యకార్యార్థయై భూమిని అవతరించనున్న విష్ణువు ఆ పుట్టుకలో నీ కుమారుడుగా జన్మిస్తాడు. ఓ ధాత్రీ సురవరేణ్యా! విష్ణువునకు అత్యంత ప్రీతికరమైన ఈ కార్తీక వ్రతంతో సమానమయిన యజ్ఞయాగాదులుగాని, దానతీర్థాలుగాని లేవని తెలుసుకో. అంతటి మహోత్కృష్టమైనదీ, నీచే ఆచరించబడినదీయైన ఈ కార్తీక వ్రతంలోని కేవలం సగభాగపు పుణ్యానికే ఈ స్త్రీ విష్ణులోకాన్ని పొందుతూ వుంది. ఆమెను ఉద్ధరించాలనే నీ సంకల్పం నెరవేరింది గనుక, నీవు దిగులుడుగవయ్యా అన్నారు విష్ణుదూతలు.

పందొమ్మిదీ, ఇరువదీ - అధ్యాయములు

ఇరువది అయిదవ (బహుళ దశమి) రోజు పారాయణము సమాప్తము

## ఇరువది ఆరవ రోజు పారాయణము

## ఏకవింశాధ్యాయము

విష్ణుగణాలు చెప్పినదంతా విని - విస్మృత చేష్టుడూ, విస్మయరూపుడూ అయిన ధర్మ దత్తుడు పునఃవారికి దండవత్‌గా ప్రణామాచరించి - ' ఓ విష్ణుస్వరూపులారా! ఈ జనానీకమంతా అనేకానేక క్రతువ్రత దానాల చేత ఆ కమలనాభుడిని సేవించుకుంటూ వున్నారు. వాటి అన్నింటిలోనూ ఏ ఒక్కదానిని ఆచరించడం వలన విష్ణువునకు అత్యంత మైన ప్రీతి కలుగుతుందో - దేనివలన విష్ణు సాక్షాత్కారం లభిస్తుందో దానిని సెలవీయండి' అని వేడుకున్న మీదట, విష్ణుగణాలు అతనిని ఇలా సమాధానపరచ సాగాయి.

పాపరహితుడైన బ్రాహ్మణుడా! నీవడిగిన ప్రశ్నకు - ఇతిహాసపూర్వకమైన సమాధానాన్ని చెబుతాను. విను. పూర్వం కాంచీపురాన్ని 'చోళుడు' అనే రాజు పరిపాలించేవాడు. అతని పేరు మీదనే ఆ ప్రాంతాలన్నీ చోళదేశాలుగా ప్రఖ్యాతి వహించాయి. ధర్మపాలనకు పెట్టింది పేరైన ఆ రాజు విష్ణుప్రీతికై అనేకానేక యజ్ఞాలను నిర్వర్తించాడు. అతని యజ్ఞాలకై నిర్మించబడిన బంగారపు యూపస్తంభాలతో - తామ్రపర్ణీనది యొక్క రెండు తీరాలు కూడా కుబేరోద్యానవనాలైన 'చైత్రరథా'ల వలే ప్రకాశించేవి. అటు వంటి రాజు ఒకానొకనాడు 'అనంతశయన' మనే పేర యోగనిద్రా ముద్రితుడై వుండే విష్ణ్వాలయానికి వెళ్లి, మణిమౌక్తిక సువర్ణపుష్పాదులతో ఆ శ్రీహరిని అర్చించి, సాష్టాంగ దండ ప్రణామాలు ఆచరించి స్థిమితంగా అక్కడ శ్రీహరి సన్నిధిలోనే కూర్చున్నాడు. అంతలోనే 'విష్ణుదాసు'డనే బ్రాహ్మణుడొకడు విష్ణ్వార్చనార్థమై ఆ ఆలయానికి వచ్చాడు. విష్ణుసూక్తాన్ని పఠిస్తూ అతడా విష్ణు సంజ్ఞను అభిషేకించి తులసిదళాలతోనూ, గుత్తులతోనూ విష్ణుపూజను నిర్వహించాడు. అది చూసి రాజుకు కోపం వచ్చింది. ఆ కోపంలో తాను ధర్మవేత్తయై కూడా అవతలి వ్యక్తి యొక్క బ్రాహ్మణాభిజాత్యాన్ని విస్మరించి,

'ఓరి విష్ణుదాసుడా! నేను మాణిక్యాలతోనూ, బంగారు పువ్వులతోనూ చేసిన నా పూజ వలన ప్రకాశమానుడైన ఆ ప్రభువును నీ తులసి ఆకుల పూజతో ఎందుకు కప్పివేశావురా? నేనెంతో భక్తితో ఆచరించిన పూజనిలా పాడు చేశావంటే - అసలు నీకు విష్ణుభక్తి అంటే ఏమిటో తెలుసా? అని చీదరించుకున్నాడు. ఆ మాటలకు ఈ బాపడికి కూడా కోపం వచ్చింది. అవతలి వ్యక్తి 'రాజు' అనే గౌరవాన్ని కూడా అతిక్రమించి 'ఓ

రాజా! నీకు దైవభక్తి లేదు సరికదా! రాజ్యైశ్వర్యమత్తుడవై వున్నావు. విష్ణు ప్రీత్యర్థం నీచేత ఆచరించబడిన యజ్ఞం ఏదైనా ఒక్కటి వుంటే చెప్పు' అని ఎదిరించాడు. అతని మాటలకు అవహేళనగా నవ్వుతూ నీ మాటల వలన నీవే విష్ణుభక్తి శూన్యుడవని తెలుస్తూ వుంది. ధనహీనుడవూ, దరిద్రుడవూ అయిన నీకు భక్తి ఎలా కలుగుతుంది? అసలు నీవెప్పుడయినా విష్ణుప్రీతిగా ఒక యజ్ఞాన్ని చేశావా? కనీసం ఒక దేవాలయాన్ని కట్టించావా? ఏమీ చేయలేని వాడవైన నీకు భక్తుడవనే అహంకారం మాత్రం అధికంగా వుంది. ఓ సదస్యులారా! సద్బ్రాహ్మణులారా! శ్రద్ధాళువులై వినండి. నేను విష్ణు సాక్షాత్కారాన్ని పొందుతానో, ఈ బ్రాహ్మణుడే పొందుతాడో నిదానించి చూడండి. అంతటితో మా ఇద్దరిలో భక్తి ఎటువంటిదో మీకే తెలుస్తుంది' అని ప్రతిజ్ఞా పూర్వకంగా పలికి - చోళుడు స్వగృహానికి వెళ్ళి 'ముద్గలుడు' అనే మునిని ఆచార్యునిగా వరించి విష్ణుసత్ర యాగానికి పూనుకున్నాడు. బహుకాల పూర్వం గయాక్షేత్రంలో ఋషి సముదాయముల చేత చేయబడినదీ, అన్నదానాలూ, అనేకానేక దక్షిణలతో, సామాన్యులకు ఆచరించ సాధ్యం కానిదీ, సర్వసమృద్ధిమంతమైనదీ అయిన ఆ యజ్ఞాన్ని చేయసాగాడు రాజు.

పేదవాడైన విష్ణుదాసుడు ఆ గుడిలోనే విష్ణుదీక్షితుడై, హరిప్రీతికై ఆచరించవలసిన మాఘ, కార్తీక వ్రతాచరణలూ - తులసీవన సంరక్షణలూ, ఏకాదశినాడు ద్వాదశాక్షరీ యుత విష్ణుజపం, షోడశోపచార విధిని నిత్యపూజలనూ, నృత్యగీత వాద్యాది మంగళ ధ్వనులతోనూ, ఈ విధంగా తన శక్తిమేరకు భక్తియుక్తులతో ఆచరించసాగాడు. నిత్యమూ సర్వవేళలలోనూ, భోజనాది సమయాలలోనూ, సంచారమందూ, తుదకు నిద్రలో కూడా హరినామ స్మరణను చేస్తూ ప్రత్యేకించి మాఘ, కార్తీక మాసాలలో విశేష నియమపాలనని ఆచరిస్తూ వున్నాడు. ఆ విధంగా భక్తులైన చోళ, విష్ణుదాసులిద్దరూ కూడా తమ సర్వేంద్రియ వ్యాపారాలనూ వ్రత నిష్ఠలోనే నిలిపి విష్ణు సాక్షాత్కార ప్రాప్తికోసం చాలా కాలం తమ వ్రతాలను ఆచరిస్తూనే వుండిపోయారు.

(ఇరువది ఒకటవ అధ్యాయము)

## ద్వావింశోధ్యాయః

కాలం గడుస్తూ వుండగా, ఒకనాటి సాయంకాలం విష్ణుదాసుడు వండుకున్న భోజనాన్ని ఎవరో కాజేసుకుని వెళ్లిపోయారు. ఆ దొంగిలించిన వాళ్లెవరా అనే విషయమై విష్ణుదాసు పెద్దగా విచారణ చేయలేదు. కాని పునః వంట ప్రయత్నాలు చేద్దామంటే సాయంకాల పూజకు సమయం మించి పోతూండడం వలన ఆ రోజున భోజనం లేకుండానే విష్ణుపూజలో గడిపేశాడు. మరునాడు కూడా వంట చేసుకుని శ్రీహరికి నివేదించే లోపలే ఎవరో ఆ వంటకాలను అపహరించుకుపోయారు. విష్ణు పూజకు వేళపోనీయకూడదనే ఆలోచనతో ఆ రోజు కూడా ఆ బ్రాహ్మణుడు అభోజనంగానే హరిసేవను కొనసాగించాడు. ఇలా వారం రోజు గడిచాయి. ప్రతి రోజూ అతని భోజనాన్ని ఎవరో అతి చాకచక్యంగా దొంగిలిస్తూనే వున్నారు. అతను పస్తులుంటూ, కూడా హరిసేవ చేస్తూనే వున్నాడు. వారం రోజుల పాటు అభోజనంగా వుండటంతో విష్ణుదాసునికి ఆ దొంగను పట్టుకోవాలనిపించింది. అందువల్ల ఒకనాడు చాలా పెందలాడే ముగించుకుని, వంటకాలను పూర్వస్థానమందే వుంచి తానో చాటున దాగి కూర్చుని, దొంగ కోసం ఎదురు చూడసాగాడు. కాసేపటికి ఒకనొక ఛండాలుడు ఆ అన్నాన్ని దొంగిలించేందుకకు వచ్చాడు వాడి ముఖం అత్యంత దీనంగా వుంది. రక్తమాంసాలే మాత్రమూ లేకుండా - కేవలం ఎముకల మీద చర్మం కప్పినట్లుగా వున్నవాడూ, అన్నార్తుడూ అయిన ఆ ఛండాలుడు వంటకాలను దొంగిలించుకు పోసాగాడు. అతని దైన్యాహైన్యస్థితిని చూసి, అప్పటికే కరుణాభరితమైన హృదయంతో వున్న బ్రాహ్మణుడు 'ఓ మహాత్మా! కాస్సేపు ఆగవయ్యా! ఆ అన్నాన్ని అలా వట్టిగా తినడం కష్టం. ఈ నేతిని కూడా పట్టుకుని వెళ్లు' అంటూ నేతి ఝారీతోసహా అతని వెంటపడ్డాడు. ఈ విప్రుడు తనను బంధించి రాజభటులకకు అప్పగించుతాడనే భయంతో ఆ ఛండాలుడు పరుగు తీయనారంభించాడు. ఈ పారుడు కూడా ఆ చోరుని వెనకాలనే పరుగెడుతూ - 'అయ్యా! నెయ్యి తీసుకుని వెళ్లి కలుపుకుని తినవయ్యా స్వామీ' అని అరుస్తూనే వున్నాడు. అసలే అలసటగా వున్న ఛండాలుడు భయం వలన నేలనపడి మూర్ఛపోయాడు. అతనిని వెన్నంటి వచ్చిన విష్ణుదాసుడు 'అయ్యో! మూర్ఛపోయావా మహాత్మా!' అంటూ తనపై వస్త్రపు చెంగులతో ఆ ఛండాలునికి విసరసాగాడు. ఆ సేవ వల్ల అతి శీఘ్రంగా కోలుకున్న ఛండాలుడు - చిరునవ్వు నవ్వుతూ లేచాడు. ఇప్పుడితను విష్ణుదాసుని కళ్లకు - శంఖచక్ర గదాబ్జధారీ, పీతాంబరుడూ, చతుర్భుజుడూ

శ్రీవత్సలాంఛితుడూ, కౌస్తుభాలంకృతుడూ అయిన శ్రీమన్నారాయణుని వలే గోచరించడంతో అతగాడు స్వాత్త్వికభావా వృతుడై పోయి - అవాక్కుగా వుండిపోయాడు. ఈ భక్త భగవానుల సంగమ దర్శనార్థం ఇంద్రాదులెందరో విమానారూఢులై ఆ ప్రాంతాలకకు వచ్చారు. విష్ణువు మీదా, విష్ణుదాసుడి మీదా కూడా విరివాన కురిపించారు. అప్సరసలు ఆడారు. గంధర్వులు పాడారు. దేవగణాల వందలాది విమానాలతో ఆకాశం నిండిపోయినట్లనిపించింది. అనంతరమా ఆదినారాయణుడు విష్ణుదాసుని గ్రుచ్చి కౌగిలించుకున్నాడు తన సారూప్యాన్ని ప్రసాదించి తనతో బాటే తన విమాన మెక్కించుకుని వైకుంఠానికి బయల్దేరాడు. యజ్ఞవాటికలో వున్న చోళుడు - గగనగాములైన బ్రాహ్మణ బ్రహ్మ జనకులిద్దరినీ చూసి ఆశ్చర్యపోయాడు. తక్షణమే తన ఆచార్యుని పిలిచి - 'ఓ ముద్గరమునీ! నాతో వివాదమాడిన ఆ నిరుపేద విప్రుడు విష్ణురూపాన్ని పొంది వైకుంఠానికి వెళ్లిపోతున్నాడు. అమితైశ్వర్యవంతుడవైన నేను అసాధ్యాలయిన యజ్ఞదానాలను చేస్తూ కూడా విష్ణు సాక్షాత్కారాన్ని పొందలేకపోయానంటే ఇక వైకుంఠం అసంగతమే గదా! నేను ఎన్ని యజ్ఞాలు చేసినా బ్రాహ్మణులు కోరినంత దక్షిణలను సమర్పించినా కూడా ఆ శ్రీహరికి నా మీద లేశమైనా కృప కలిగినట్లు లేదు. దీనిని బట్టి కేవల భక్తియే తప్ప విష్ణ్వనుగ్రహానికి మరో మార్గం లేదు. ఈ యజ్ఞ యాగాది కర్మకాండలన్నీ అనవసరంగా భావిస్తున్నాను, అని చెప్పాడు బాల్యం నుంచీ యజ్ఞదీక్షలోనే వుండటం వలన నిస్సంతుడయిన ఆ రాజు తన సింహాసనం మీద తన మేనల్లునికి స్వయంగా పట్టాభిషేకం చేశాడు.

శ్లో॥ తస్మాదద్యాపి తద్దేశే సదారాజ్యాంశ భాగినః ।
స్వ స్రీయా ఏవ జాయంతే తత్కృతావిధి వర్తినః ॥

ఆ కారణం చేతనే - ఇప్పటికీ కూడ ఆ చోళ దేశాలలో రాజ్యాధికారాన్ని పొందడంలో రాజుల మేనల్లులే కర్తలవుతూ వున్నారు.

అనంతరం చోళుడు యజ్ఞ హోమగుండం దగ్గరకు చేరి - 'ఓ శ్రీహరీ! త్రికరణ శుద్ధిగా నీ యందలి భక్తిని నా యందు సుస్థిరం చేయి తండ్రీ!' అని ప్రార్థించి సమస్తసదస్యులూ చూస్తూండగానే అగ్నిప్రవేశ మాచరించాడు.

శ్లో॥ ముద్గలస్తు అతః క్రోధా చ్ఛిఖ ముత్పాటయిన్ స్వకాం
అత స్త్వ ద్యాపి తద్గోత్రే ముద్గలా విశిఖా2భవన్ ॥

అది చూసి క్రుద్ధుడైన ముద్గలుడు తన శిఖను పెరికివేసుకున్నాడు. అది మొదలు ఆ గోత్రమీనాటికి 'విశిఖ'గానే వర్ధిల్లుతోంది.

హోమగుండంలో ప్రవేశించిన రాజును - అందులోని అగ్ని నుంచి ఆవిర్భవించిన శ్రీహరి ఆదుకున్నాడు. చోళుని అలింగనం చేసుకుని అతనికి సారూప్యాన్ననుగ్రహించి అక్కడి వారందరూ ఆశ్చర్యంగా చూస్తుండగానే తనతో వైకుంఠానికి తీసుకుని వెళ్లిపోయాడు. ఓ ధర్మదత్తా! అలనాడే ఈ విధంగా ఆ శ్రీహరి అటు విష్ణుదాసుని, ఇటు చోళునీ కూడా అనుగ్రహించి, సాక్షాత్కారమిచ్చి - తన వైకుంఠ ద్వారపాలకులుగా చేసుకొన్నాడు కాబట్టి - ఓ విప్రుడా! విష్ణ్వనుగ్రహానికి, విష్ణు సాక్షాత్కారానికి రెండు విధాలుగా వున్న ఒకే ఒక్క మార్గం - భక్తి మాత్రమే. ఆ మార్గాలు రెండూ ఒకటి ఆత్మజ్ఞానం, రెండవది ఆత్మార్పణం' అని ధర్మదత్తునికి బోధించి విష్ణు పార్షదులు మౌనం వహించారు.

ఇరువది ఒకటి, ఇరువది రెండు - అధ్యాయములు

ఇరువది ఆరవ (బహుళ ఏకాదశి) రోజు పారాయణము సమాప్తము.

## ఇరువది ఏడవ రోజు పారాయణము

## త్రయోవింశాధ్యాయము

విష్ణుగణాలు చెప్పిన చోళ, విష్ణుదాసుల కథానంతరం, ధర్మదత్తుడు మరలా వారిని 'ఓ గణాధిపతులారా! జయ-విజయులు వైకుంఠమందలి విష్ణుద్వారపాలకులని వినివున్నాను. వారెటువంటి పుణ్యం చేసుకొనడం వలన విష్ణుస్వరూపులై అంతటి స్థానాన్ని పొందారో తెలియజేయండి' అని అడగడంతో ఆ గణాధిపతులు చెప్పనారంభించాడు.

జయ - విజయుల పూర్వజన్మలు

తృణబిందుడి కూతురు దేవహూతి. ఆమె యందు కర్దమ ప్రజాపతి యొక్క దృక్‌స్ఖలనం జరగడం వలన ఇద్దరు కుమారులు కలిగారు. వారిలో పెద్దవాడు జయుడు, రెండో వాడు విజయుడు. వాళ్లిద్దరూ కూడా విష్ణుభక్తి పరాయణులే అయ్యారు. అనంతరం అష్టాక్షరీ మంత్రాన్ని జపించడం వలన వాళ్లు విష్ణు సాక్షాత్కారాన్ని కూడా పొందారు. వేదవిదులయ్యారు. యజ్ఞాలు చేయించడంలో ప్రజ్ఞ గలవారుగా ప్రసిద్ధి చెందారు. అందువలన, మరుత్తుడనే రాజు వీరిద్దరి వద్దకు వచ్చి తన చేత యజ్ఞం చేయించవలసిందిగా వాంఛించాడు. అన్నదమ్ములిద్దరూ కలిసి వెళ్లి, ఒకరు బ్రహ్మ, మరొకరు యాజకులుగా వుండి, ఆ యజ్ఞాన్ని దిగ్విజయంగా నెరవేర్చారు. సంతుష్టుడైన మరుత్తు, వారికి అగణితమైన దక్షిణలనిచ్చాడు. ఆ సొమ్ముతో ఈ అన్నదమ్ములు ఎవరికి వారుగా విష్ణుయజ్ఞం నిర్వర్తింపదలచారు. తదర్థంగా మరుత్తు ఇచ్చిన - మహాదక్షిణను పంచుకోవడములో ఇరువురికీ తగాదాలు వచ్చాయి. ఇద్దరికీ చెరిసగం అనేది జయుడి వాదం కాగా, తనకు ఎక్కువగా వాటా కావాలని విజయుడు కోరాడు. ఆ వాదోపవాద క్రోధంతో జయుడు అలిగి 'నువ్వు మొసలివై పొమ్మని' శాపం పెట్టాడు. అంతటితో జయుడు ఊరుకోక 'అహంకారంతో శపించిన నువ్వు, సాహంకారియైన సామజమై పుడతావులే' అని ప్రతిశాపమిచ్చాడు. ఇలా పరస్పర శప్తులైన ఆ సోదరులిద్దరూ విష్ణ్వర్చన చేసి ఆయనను సాక్షాత్కరింప చేసికొనినవారై తమ శాపాలనూ, తత్పూర్వాపరాలనూ విన్నవించుకుని శాపవిముక్తికై ఆ శ్రీహరినే ఆశ్రయించారు. 'హే భగవాన్! నీకింతటి చేరువ భక్తులమైన మేము మొసలిగానూ, ఏనుగుగానూ పుట్టడం చాలా ఘోరమైన విషయం. కనుక మా శాపాల నుంచి మమ్ములను మళ్లించు' అని మనవి చేశారు.

అందుకు మందహాసం చేస్తూ అంబుజనాభుడు 'జయ-విజయులారా! నా భక్తుల మాటలు పొల్లుపోనీకపోవడమే నా విధి. వాటిని అసత్యాలుగా చేసే శక్తి నాకు లేదు. పూర్వం ప్రహ్లాద వాక్యం కోసం స్తంభం నుంచి ఆవిర్భవించాను. అంబరీషుని వాక్యం ప్రకారం దశావతారాలనూ ధరించాను. అందువలన మీరు సత్యం తప్పనివారై - మీ మీ శాపాలను అనుభవించి అంత్యంలో వైకుంఠాన్ని పొందండి' అని ఆదేశించడంతో తదాదేశాన్ని శిరసావహించి ఆ జయ-విజయులిద్దరూ గండకీనది ప్రాంతాన మకర, మాతంగాలుగా జన్మించి, పూర్వ జన్మ జ్ఞానం కలవారై - విష్ణు చింతనతోనే కాలం గడుపసాగారు. అలా వుండగా ఒకానొక కార్తీకమాసం ప్రవేశించింది.

ఆ కార్తీకమాసంలో కార్తీకస్నానం చేయాలనే కోరికతో - ఏనుగైన జయుడు గండకీ నదికి వచ్చాడు. నీటిలోనికి దిగిందే తడవుగా అందులోనే మొసలిగా వుంటున్న విజయుడు ఏనుగును గుర్తించి దాని పాదాన్ని బలంగా నోటగరిచాడు. విడిపించుకోడానికి చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో గజదేహుడైన జయుడు విష్ణువును ప్రార్థించాడు. తలచినదే తడవుగా ప్రత్యక్షమైన తార్‌క్ష్యవాహనుడు తన చక్రాయుధాన్ని ప్రయోగించి ఆ కరిమకరాలు రెండింటినీ ఉద్ధరించి వారికి వైకుంఠ ప్రాప్తిని కలిగించాడు. తదాదిగా ఆ స్థలం హరిక్షేత్రంగా విరాజిల్లాసాగింది. విష్ణు ప్రయుక్త చక్రాయుధం ఒరిపిడి వలన ఆ గండకీనదిలోని శిలలు చక్ర చిహ్నాలతో కూడుకొన్నవయ్యాయి. ఓ ధర్మదత్తా! నీచే అడుగబడిన వారైన విష్ణు ద్వారపాలకులకు జయ విజయులు వారిద్దరే. అందువలన నీవు కూడా దంభమాత్సర్యాలను దిగనాడీ, సమదర్శనుడివై సుదర్శనాయుధుడి చరణ సేవలను ఆచరించు. తులా, మకర, మేష సంక్రమణాలతో ప్రాతఃస్నానాలు ఆచరించు. తులసీవన సంరక్షణమందు నిష్ఠగలవాడివై ప్రవర్తించు. గోబ్రాహ్మణులునూ, విష్ణుభక్తులనూ సర్వదా సేవించు. కొర్ర ధాన్యము, పులికడుగు నీరు, వంగ మొదలైన వాటిని విసర్జించు. జన్మ ప్రభృతిగా నీవు అనుష్ఠిస్తూన్న ఈ కార్తీక విష్ణువ్రతం కంటె - దాన, తపో, యజ్ఞ తీర్థాలు ఏవీ కూడా గొప్పవి కావని గుర్తుంచుకో. ఓ విప్రుడా! దైవ ప్రీతికరమైన విష్ణు వ్రతాచరణం వలన నీవూ, నీ పుణ్యంలో సగభాగం అందుకొనడం వలన ఈ కలహ కూడా ధన్యులయ్యారు. ప్రస్తుతం మేము ఆమెను వైకుంఠానికి తీసుకుని వెడుతున్నాము' అని విష్ణుగణాలు ధర్మదత్తునితో హితవాడి అతనిని పునః నియమవ్రత నిష్ఠుడిని చేసి కలహా సమేతంగా విమానాన వైకుంఠానికి బయలుదేరారు.

నారదుడు చెబుతున్నాడు! 'పృథురాజా! అతి పురాతనమైన ఈ పుణ్యేతిహాసాన్ని ఏ మానవుడైతే వింటున్నాడో, ఇతరులకు వినిపిస్తున్నాడో, వాడు శ్రీ మహావిష్ణువు యొక్క సంపూర్ణానుగ్రహానికి పాత్రుడై - విష్ణు సాన్నిధ్యాన్ని పొందదగిన జ్ఞానాన్ని పొందుతూన్నాడు.

త్రయవింశోధ్యాయ స్సమాప్తః (ఇరువది మూడవ అధ్యాయము సమాప్తము)

## చతుర్వింశోధ్యాయః

నారదుడు చెప్పినదంతా విని, ఆశ్చర్యమయుడైన పృథు చక్రవర్తి - 'హే దేవర్షీ! ఇప్పుడు నువ్వు చెప్పిన హరిక్షేత్రం, గండకీ నదులు లాగానే గతంలో కృష్ణ, సరస్వతీత్యాది నదుల గురించి విన్నాను. ఆ మహా మహిమలన్నీ ఆ నదులకు చెందినవా? లేక, ఆ క్షేత్రాలకు చెందినవా? విశదపరచవే' అని కోరగా మరలా నారదుడు చెప్పసాగాడు. 'శ్రద్ధగా విను. కృష్ణానది సాక్షాత్తూ విష్ణుస్వరూపం. సరస్వతీనది శుద్ధ శివస్వరూపం. వాటి సంగమ మహాత్మ్యం వర్ణించడం బ్రహ్మకు కూడా అసాధ్యమే అవుతుంది.

కృష్ణా - సరస్వతీ నదుల ప్రాదుర్భావము

ఒకానొక చాక్షుష మన్వంతరంలో, బ్రహ్మదేవుడు సహ్యాపర్వత శిఖరాలపై సవనం చేసేందుకు సమాయత్తుడయ్యాడు. హరిహరులతో సహా సర్వదేవతలూ, మునులూ కూడా కలసి ఒకానొక దైవత ముహూర్తంలో బ్రహ్మకు యజ్ఞ దీక్ష నీయడానికి నిర్ణయించి - కర్త యొక్క కళత్రమయిన సరస్వతికి విష్ణుమూర్తి ద్వారా కబురు పంపారు. అయినా సరస్వతి సమయానికి అక్కడకు చేరుకోలేదు.

దీక్షా ముహూర్తం అతిక్రమించరాదనే నియమం వలన భృగుమహర్షి - 'హే విష్ణూ! సరస్వతి ఎందుకు రాలేదో తెలియదు. ముహూర్తం దాటిపోతోంది. ఇప్పుడేమిటి గతి?' అని ప్రశ్నించడంతో శ్రీహరి చిరునవ్వు నవ్వుతూ 'సరస్వతి రాని పక్షంలో బ్రహ్మకు మరి యొక భార్యయైన గాయత్రి దీక్షాపతిగా విధించండి' అని సలహా యిచ్చాడు. ఆ సలహాను శివుడు కూడా సమర్థించడంతో భృగువు గాయత్రిని రప్పించి, బ్రహ్మ యొక్క దక్షిణభాగంలో ముందుగా ఆమెను ప్రవేశ పెట్టి దీక్షావిధిని ఏర్పరిచాడు. ఆ విధంగా ఋషులందరూ కలసి హరిహరుల సమక్షంలో బ్రహ్మకు దీక్షనీయడం పూర్తి చేయగానే - అక్కడకు సరస్వతి చేరుకుంది. తన స్థానంలో దీక్షితురాలయి వున్న తన
సవతిని గాయత్రిని చూసి మత్సరవతియై -

స్వరోవాచ: శ్లో॥ అపూజ్యా యత్రపూజ్యంతే, పూజ్యానాంచవ్యతిక్రమః
త్రీణిత్రత్ర భవిష్యంతి దుర్భిక్షం మరణం భయం ॥

'ఎక్కడైతే పూజార్హత లేనివారు పూజింపబడుతున్నారో, మరియు పూజనీయులు పూజింపబడడము లేదో - అక్కడ కరువు, భయము, మరణము - అనే మూడు విపత్తులు కలుగుతాయి.

ఈ బ్రహ్మకు దక్షిణ భాగాన నా స్థానంలో ఉపవిష్టురాలైన ఉవిద ప్రజలకు కనుపించనటువంటి రహస్య నదీ రూపమును పొందుగాక! ఓ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులారా! మీరందరూ ఈ యజ్ఞ వాటికలో వుండి కూడా, నా సింహాసనాన నాకన్నా చిన్నదానిని ఆసీనురాలిని చేశారు. గనక మీరు కూడా జడీభూత నదీరూపాలను పొందండి' అని శపించింది.

ఆ సరస్వతీ క్రుద్ధ వచనాలను వింటూనే, చివ్వున లేచిన గాయత్రి - దేవతలు వారించుతున్నా సరే వినకుండా - ఈ బ్రహ్మ నీకు ఏ విధంగా భర్తయో, అదే విధంగా నాకు కూడా భర్తేనని విస్మరించి అకారణంగా శపించావు గనుక నువ్వు కూడా నదీ రూపాన్ని పొందు' అని ప్రతిశాపమిచ్చింది. ఈ లోపల హరిహరులా వాణిని సమీపించి - 'మేము నదులమయినట్లయితే లోకాలన్నీ అతలాకుతలమయిపోతాయి. గనుక, అవివేక భూయిష్ఠమైన నీ శాపాన్ని మళ్లించుకో'మన్నారు. కాని ఆమె వినలేదు. 'యజ్ఞాదిలో మీరు విఘ్నేశ్వర పూజ చేయక పోవడం వలననే - నా కోప రూపంగా యాగం విఘ్నపడి ఆగమయ్యింది. పలుకుల పడతినైన నా మాట తప్పదు. మీరందరూ నదీరూపాలను ధరించి, మీ అంశలు జడత్వాన్ని వహించవలసినదే,

సవతులమైన నేను, గాయత్రీ కూడా నదులమై పశ్చిమాభిముఖంగా ప్రవహించబోతున్నాము' అని చెప్పింది. ఆమె మాటలు వింటూనే సకల దేవతాంశలూ జడాలుగానూ, రూపాలు నదులుగానూ పరిణమించాయి. ఆ సమయంలో

విష్ణుమూర్తి కృష్ణానదిగానూ, మిగిలిన వారు ఇతరేతర నదీ రూపాలుగానూ మారిపోయారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు నదులై - తూర్పుముఖంగానూ, వారి వారి భార్యలు నదులై - పశ్చిమాభిముఖంగానూ, ప్రవహించ నారంభించారు. గాయత్రీ, సరస్వతీ నదీ రూపాలు - సావిత్రీ అనే పుణ్య క్షేత్రంలో సంగమాన్ని పొందాయి.

ఈ యజ్ఞంలో ప్రతిష్ఠితులైన శివ, కేశవులు - మహాబలుడు, అతిబలుడు అనే దేవతా స్వరూపులయ్యారు. సర్వపాపహారిణియైన ఈ కృష్ణానదీ ప్రకర్షోత్పత్తిని భక్తితో చదివినా, వినినా వినిపించినా - వారి వంశమంతా కూడా నదీ దర్శన స్నాన పుణ్యఫలవంతమై తరించిపోతుంది.

ఇరువది మూడు, ఇరువది నాలుగు - అధ్యాయములు

ఇరువది ఏడవ (బహుళ ద్వాదశి) రోజు పారాయణము సమాప్తము

## ఇరువది ఎనిమిదవ రోజు పారాయణము

## పంచవింశోధ్యాయః

శ్రీకృష్ణుడు చెబుతున్నాడు: సత్యభామా! నారద ప్రోక్తాలైన సంగతులతో ఆశ్చర్యమానసుడయిన పృథువు ఆ ఋషిని పూజించి, అతని వద్ద సెలవు తీసుకున్నాడు. ఆ కారణంగా ఈ మూడు వ్రతాలూ కూడా నాకు అత్యంత ప్రీతిపాత్రాలయి వున్నాయి. మాఘ, కార్తీక వ్రతముల వలెనే తిథులలో ఏకాదశి, క్షేత్రములలో ద్వారక - నాకు అత్యంత ప్రియమైనవి సుమా! ఎవరయితే వీటిని విధివిధానంగా ఆచరిస్తారో వాళ్లు నాకు యజ్ఞాదిక్రతు కర్మకాండలు చేసిన వారి కంటే కూడా చేరువ సన్నిహితులవుతున్నారు. అటు వంటి వాళ్లు - నా కరుణాపూర్ణులై పాపభీతి లేని వాళ్లవుతారు.

శ్రీకృష్ణ వచనామృత శ్రవణజాత విస్మయమైన సత్యభామ - 'స్వామీ! ధర్మదత్తునిచే ధారబోయబడిన పుణ్యం వలన 'కలహ'కు కైవల్యం లభించింది. కేవలం కార్తీక స్నానపుణ్యం వలన రాజద్రోహాది పాపాలు పటాపంచలయిపోతున్నాయి. స్వయంకృతాలో, కర్తల నుండి దత్తములో అయినవి సరే! అలా కాకుండా మానవజాతికి పాప పుణ్యాలేర్పడే విధానమేమిటి? దానిని వివరించు' అని కోరడంతో - గోవిందుడిలా చెప్పసాగాడు.

పాప-పుణ్యములు ఏర్పడు విధానము

శ్లో॥ దేశ గ్రామకులానిస్యు రోప్భగభాంజికృతాదిషు ।
కలౌతు కేవలం కర్తా ఫలభక్పుణ్య పాపయోః ॥

'ప్రియా! కృతయుగంలో చేయబడిన పాప-పుణ్యాలు గ్రామానికీ, ద్వాపరయుగం లోనివి వారి వారి వంశాలకీ చెందేవి. కలియుగంలో చేయబడిన కర్మఫలం మాత్రం కేవలం ఆ కర్తకొక్కడికే సిద్ధిస్తుంది.

సంసర్గ-రహిత సమాయత్తములయే పాప-పుణ్యాలను గురించి చెబుతాను విను. ఫలాపేక్ష కలిగిన మానవుడు ఒక పాత్రలో భుజించటం వలన, ఒక స్త్రీతో రమించడం వలన కలిగే పాప-పుణ్యాలను తప్పనిసరిగానూ, సంపూర్తిగానూ అనుభవిస్తున్నాడు.

వేలాది బోధనవల వలన, యజ్ఞము చేయడం వలన, పంక్తి భోజనం చేయడం వలన కలిగే పాప-పుణ్యాలలో నాలుగవ వంతును మాత్రమే పొందుతున్నాడు. ఇతరులచే చేయబడే పాప-పుణ్యాలను చూడడం వలన, తలంచుకోవడం వలన అందులోని వందవ భాగాన్ని తాను పొందుతున్నాడు. ఇతరులను దూషించేవాడూ, తృణీకరించేవాడు, చెడుగా మాట్లాడేవాడు, పితూరీలు చేసేవాడూ - వీడు ఇతరుల పాపాలను తాను పుచ్చుకుని పుణ్యాన్ని జారవిడుచుకుంటున్నాడని తెలుసుకో - తన భార్య చేతనో, కొడుకు చేతో, శిష్యుని చేతనో తప్ప, ఇతరుల చేత సేవలు చేయించుకొన్నట్లయితే తప్పనిసరిగా వారికి తగినంత ద్రవ్యమును ఇచ్చి తీరాలి. అలా ఇవ్వని వాడు తన పుణ్యంలో సేవానురూపమైన పుణ్యాన్ని ఆ ఇతరులకు జార

విడుచుకున్న వాడవుతున్నాడు. పంక్తి భోజనాలలో, భోక్తలలో ఏ లోపం జరిగినా, ఆ లోపం ఎవరికి జరిగిందో వారు - యజమానుల పుణ్యంలో ఆరవ భాగాన్ని హరించిన వారవుతున్నారు. స్నాన, సంధ్యాదులు ఆచరిస్తూ ఇతరులను తాకినా, ఇతరులతో పలికినా - వారు తమ పుణ్యంలో ఆరవ వంతును, ఆ ఇతరులకు కోల్పోతారు. ఎవరి నుండి అయినా యాచన చేసి తెచ్చిన ధనంతో ఆచరించిన సత్కర్మ వలన కలిగే పుణ్యం ధనమిచ్చిన వానికే చెందుతుంది. కర్తకు కర్మఫలం వినా మరేమీ మిగలదు. దొంగిలించి తెచ్చిన పరద్రవ్యంతో చేసే పుణ్య కర్మ వలన పుణ్యం ఆ ధనం యొక్క యజమానికే చెందుతుంది తప్ప -ఈ కర్మకునికి దక్కదు.

ఋణశేషం వుండగా మరణించిన వారి పుణ్యంలో శేష ఋణానికి తగినంత పుణ్యం ఋణదాతకు చెందుతూ వుంది. పాపంగాని, పుణ్యంగాని - ఫలానా పని చేయాలనే సంకల్పం కలిగినవాడూ, ఆ పని చేయడంలో తోడుపడేవాడు, దానికి తగినంత సాధన, సంపత్తిని సమకూర్చినవాడు, ప్రోత్సహించేవాడు తలా ఒక ఆరవ వంతు ఫలాన్నీ పొందుతారు. ప్రజల పాప - పుణ్యాలలో రాజుకు, శిష్యుని వాటిలో గురువుకు, కుమారుని నుండి తండ్రికి, భార్య నుండి భర్తకు ఆరవభాగం చేరుతుంది. ఏ స్త్రీ అయితే పతిభక్తి కలదై, నిత్యం తన భర్తను సంతోషపెడుతుందో ఆ స్త్రీ తన భర్త చేసిన పుణ్యంలో సగభాగానికి అధికారిణి అవుతుంది. తన సేవకుడో, కొడుకో గాని ఇతరుని చేత ఆచరింపచేసిన పుణ్యాలలో తనకు ఆరవ వంతు మాత్రమే లభిస్తుంది. ఈ విధంగా ఇతరులెవరూ మనకి దానం చేయకపోయినా, మనకే నిమిత్తమూ లేకపోయినా వివిధ జనసాంగత్యాల వలన - పాప-పుణ్యాలు మానవులకు ప్రాప్తించక తప్పడము లేదు. అందువలనే సజ్జన సాంగత్యం చాలా ప్రధానమని గుర్తించాలి. ఇందుకు ఉదాహరణగా ఒక కథ చెబుతాను విను.

పంచవింశోధ్యాయ స్సమాప్తః (ఇరువది అయిదవ అధ్యాయము సమాప్తము)

## షడ్వింశోధ్యాయము

## ధనేశ్వరుడి కథ - సత్సాంగత్య మహిమ

బహుకాలం పూర్వం అవంతీపురంలో ధనేశ్వరుడనే బ్రాహ్మణుడుండేవాడు. సహజంగానే ధనికుడయిన అతగాడు కులాచార భ్రష్టుడయి పాపాసక్తుడయి చరించేవాడు. అసత్యభాషణం, చౌర్యం, వేశ్యాగమనం, మధుపానం - ఇత్యాది దుష్కర్మలలో చురుకుగా పాల్గొనడమే కాక షడ్రసాలూ, కంబళ్ళు చర్మాలు మొదలైన వర్తకాలు కూడా చేసేవాడు.
వర్తకం నిమిత్తము ఒక దేశము నుంచి మరొక దేశానికి వెళ్లడం అతని అలవాటు. అదే విధంగా ఒకసారి మహిష్మతీ నగరం చేరాడు. ఆ నగర ప్రాకారం చుట్టూ నర్మదానది ప్రవహిస్తూ వుంది.

ధనేశ్వరుడు ఆ పట్టణంలో వర్తకం చేసుకుంటూ వుండగానే - కార్తీకమాసం ప్రవేశించింది. దానితో ఆ ఊరు అతి పెద్ద యాత్రాస్థలిగా పరిణమించింది. వచ్చేపోయే జనాల రద్దీ వలన వర్తకం

బాగా జరుగుతుంది కదా! ధనేశ్వరుడు నెలంతా అక్కడే వుండిపోయాడు. వర్తక లక్ష్యంతో ప్రతి రోజూ నర్మదా తీరంలో సంచరిస్తూ అక్కడ స్నాన, జప, దేవతార్చనా విధులు నిర్వహిస్తున్న వారిని చూశాడు. నృత్యగాన మంగళ వాద్యయుతంగా హరికీర్తనలనూ, కథలనూ ఆలాపించేవారూ, విష్ణు ముద్రలను ధరించిన వాళ్లూ, తులసి మాలలతో అలరారుతున్న వాళ్లూ అయిన భక్తులను చూశాడు. చూడటమే కాదు, నెల పొడుగునా తానక్కడే మసలుతూండటం వలన వారితో పరిచయం కలిగింది. వారితో సంభాషిస్తూండే వాడు. ఎందరో పుణ్యపురుషులను స్వయంగా స్పృశించాడు. తుదకు ఆ సజ్జన సాంగత్యం వలన అప్పుడప్పుడు విష్ణు నామోచ్ఛరణం కూడా చేసేవాడు. నెల రోజులూ ఇట్టే గడిచిపోయాయి. కార్తీకోద్యాపనా విధిని, విష్ణు జాగరాన్నీ కూడా దర్శించాడా ధనేశ్వరుడు. పౌర్ణమినాడు గో బ్రాహ్మణ పూజలు ఆచరించి, దక్షిణ భోజనాదులను సమర్పించే వ్రతస్థులను చూశాడు. పిదప సాయంకాలం శివ ప్రీత్యర్థం చేయబడే దీపోత్సవాలను తిలకించాడు. సత్యభామా! నాకు అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో శివారాధన దేనికి! అని ఆశ్చర్యపడకు సుమా!

శ్లో॥ మమరుద్రస్యయః కశ్చి దంతరం పరికల్పయేత్
తస్య పుణ్య క్రియాస్సర్వానిష్ఫ లాస్స్యుర్న సంశయః ॥

ఎవరైతే నన్నూ, శివుణ్ణీ భేదభావంతో చూస్తారో, వారి యొక్క సమస్తమైన పుణ్య కర్మలూ కూడా వృథాయై పోతాయి. అదీగాక ఆ శివుడు కార్తీక పౌర్ణమినాడే త్రిపుర సంహారం చేసిన వాడవడం చేత కూడా, ఆయననా రోజున ఆరాధిస్తారు, ఇక, ధనేశ్వరుడీ పూజా మహోత్సవాలనన్నింటినీ ఎంతో ఆశ్చర్యంతోనూ, వాంఛతోనూ చూస్తూ అక్కడక్కడే తిరుగుతున్నాడు. కాని, ఆ సమయంలోనే కాలవశాన ఒక కృష్ణసర్పం అతనిని కాటు వేయటం, తక్షణమే స్పృహ కోల్పోవడం, అపస్మారకంలో వున్న అతగాడికి అక్కడి భక్తులు తులసి తీర్థాన్ని సేవింప చేయడం - ఆ అనంతరం క్షణంలోనే ధనేశ్వరుడు దేహ త్యాగం చేయడం జరిగింది. మరుక్షణమే యమదూతలు వచ్చి అతని జీవుని పాశబద్ధుడిని చేసి, కొరడాలతో మోదుతూ యముని వద్దకు తీసుకు వెళ్లారు. యముడు అతని పాప-పుణ్యాల గురించి విచారణ ఆరంభించగా చిత్రగుప్తుడు - 'హే ధర్మరాజా! వీడు ఆ గర్భ పాపాత్ముడే గాని, అణువంతయినా పుణ్యం చేసిన వాడు కా'డని చెప్పాడు. ఆ మాట మీద దండధరుడు తన దూతల చేత ధనేశ్వరుడి తలను చితుగగొట్టించి, కుంభీపాక నరకంలో వేయించాడు.

కానీ, ధనేశ్వరుడు ఆ నరకంలో పడగానే, అక్కడి అగ్నులు చప్పగా చల్లారి పోయాయి. ఆశ్చర్యపడిన దూతలీ విషయాన్ని కాలునికి విన్నవించారు. అంతకంటె అబ్బురపడిన నరకాధీశుడు తక్షణమే ధనేశ్వరుని తన కొలువుకు పిలిపించి పునర్విచారణను తలపెట్టుతూండగా అక్కడికి విచ్చేసిన దేవర్షియైన నారదుడు - 'ఓ యమధర్మరాజా! ఈ ధనేశ్వరుడు తన చివరి రోజులలో

నరక నివారకాలయిన పుణ్యాలను ఆచరించాడు. గనుక, ఇతనిని నీ నరకం ఏమీ చేయలేదు. ఎవరైతే పుణ్య పురుష దర్శన, స్పర్శన,భాషణలకు పాత్రులో వారా సజ్జనుల యొక్క పుణ్యంలో ఆరవ భాగాన్ని పొందుతూ వున్నారు. అటువంటిది ధనేశ్వరుడు ఒక నెల పాటు కార్తీక వ్రతస్థులయిన ఎందరెందరో పుణ్యాత్ములతో సాంగత్యం చేసి విశేష పుణ్య భాగాలను పొంది వున్నాడు. కార్తీక వ్రతస్థుల సహజీవనం వలన ఇతను కూడా సంపూర్ణ కార్తీక వ్రతఫలాన్ని ఆర్జించుకున్నాడు. అదీగాక అవసానవేళ హరిభక్తుల చేత తులసి తీర్థమును పొందాడు. కర్ణపుటాలలో హరి నామ స్మరణం జరుపబడింది. పుణ్య నర్మదా తీర్థాలతో వీని దేహము, సుస్నాతమయ్యింది. అందరు హరిప్రియుల ఆదరణకు పాత్రుడయిన ఈ విప్రుడు నరకానుభవానికి అతీతుడేనని తెలుసుకో. ఇతగాడు దేవతా విశేషుడు. పుణ్యాత్ముడైన ఈ భూసురుడు - పాప భోగాలయైన నరకమందు వుండేందుకు అనర్హుడు' అని బోధించి వెళ్లాడు.

ఇరువది అయిదు, ఇరువది ఆరు- అధ్యాయములు

ఇరువది ఎనిమిదవ (బహుళ త్రయోదశి) రోజు పారాయణము సమాప్తము

## ఇరువది తొమ్మిదవ రోజు పారాయణము

## సప్తవింశోధ్యాయము

నారదుని హితవుపై రవంత చింతించిన రవిసుతుడు - ఆ ధనేశ్వరునకు ప్రేతపతియనే తన దూతను తోడిచ్చి, నరకాన్ని తరింపచేయవలసినదిగా ఆదేశించాడు. ఆ దూత, ధనేశ్వరుని తనతో తీసుకొని వెడుతూ మార్గమధ్యమందలి నరక భేదాలను చూపిస్తూ వాటి గురించి ఇలా వినిపించసాగాడు.

*తప్తవాలుకము:* 'ఓ ధనేశ్వరా! మరణించిన వెంటనే, పాపకర్ములు ఇక్కడ కాల్చబడిన శరీరములు కలవారై - దిక్కులు ప్రక్కలయ్యేలా రోదించుతూ వుంటారు. దీనినే 'తప్తవాలుక నరకము' అంటారు. వైశ్వదేవపరులైన అతిధులను పూజించనివారూ, గురువులను - అగ్నిని - బ్రాహ్మణులను - గోవును - వేదవిదులను - యజమానిని - కాళ్లతో తన్నిన వారి పాదాలను మా యమదూతలు ఎలా కాల్చుతున్నారో చూడు.

*అంధతామిస్రము:* ఈ నరకములో సూది మొనలు వంటి భయంకర ముఖాలు కలిగిన పురుగులు - పాపాత్ముల శరీరాలను దొలిచి వేస్తూ వుంటాయి. ఇది పదహారు రకములుగా - కుక్కలు, గ్రద్దలు, కాకులు మొదలగు పక్షి జంతు సమన్వితమై వుంటుంది. పరుల రహస్యాల్ని భేదించే పాపాత్ములందరూ ఈ నరకంలోనే దండింపబడుతూంటారు.

*క్రకచము:* అనే పేరుగల ఈ నరకం మూడవది. ఇక్కడ పాపాత్ములను అడ్డముగానూ, నిలువుగానూ, ఏటవాలుగానూ, సమూలముగానూ, అంగాంగాలుగానూ రంపాలతో కోస్తూంటారు.

*అసిపత్రవనం:* నాలుగు నరకధోరణి అయిన దీనినే అసిపత్రవనం అంటారు. భార్యా-భర్తలను, తల్లి-దండ్రుల నుండి సంతానమును ఎడబాపులు చేసే పాపులంతా ఈ నరకానికి చేరి - నిలువెల్లా బాణాలతో గుచ్చబడి అసిపత్రాలచే శరీరాలు చించబడి, ధారలుగా కారే నెత్తుటి వాసనకు వెంటబడి తరమే తోడేళ్ల గుంపులకు భయపడి, పారిపోవాలని పరుగులు తీసి, పారిపోయే దిక్కులేక పరితపిస్తూ వుంటారు. చంపుట, భేదించుట మొదలగు విధులతో ఈ నరకం ఆరు రకాలుగా వుంటుంది.

కూటశాల్మలి: పదహారు రకాలుగా దండించేదీ - పరస్త్రీలనూ, ద్రవ్యాన్నీ హరించే వాళ్లూ, పరాపకారులూ అయిన పాపులు వుండేదీ 'కూటశాల్మలీ' నరకం.

రక్తపూయము: 'రక్తపూయ' మనే ఈ విభాగం ఆరవనరకం. ఇక్కడ పాపాత్ములు తల క్రిందులుగా వ్రేలాడుతూ యమకింకరుల చేత దండించబడుతూ వుంటారు. ఎవరైతే తమ కులాచారరీత్యా తినకూడని వస్తువులు తింటారో, పరులను నిందిస్తారో, చాడీలు చెబుతుంటారో - వారంతా ఈ నరకంలోనే వుంటారు.

కుంభీపాకము: మొట్టమొదట నీకు విధించబడినదీ ఘోరాతి ఘోరమైనదీ, నరకాలన్నిటిలోకీ నికృష్టమైనదీ అయినది ఈ 'కుంభీపాక'మే ఏడవ నరకం. దుష్టద్రవ్యములు, దుర్భరాగ్ని కీలలు, దుస్సహ దుర్గంధాలతో కూడి వుంటుంది.
రౌరవము: నరకాలలో ఎనిమిదదైన ఈ 'రౌరవం' దీర్ఘకాలికమని తెలుసుకో. ఇందులో పడిన వారు కొన్ని వేల సంవత్సరములు దాకా బైటపడలేరు.
ధనేశ్వరా! మన ప్రమేయం లేకుండా మనకు అంటిన పాపాన్ని శుష్కమనీ, మనకు మనమై చేసుకున్న పాపాన్నీ ఆర్ద్రమనీ అంటారు. ఆ రెండు రకాల పాపాలూ కలిపి ఏడు విధాలుగా వున్నాయి. 1. అపకీర్ణం 2. పాంక్తేయం 3. మలినీకరణం 4. జాతిభ్రంశం, 5.ఉపవీతకం 6. అతిపాతకం 7. మహాపాతకం. ఈ పరిదృశ్యమానులైన నరుల చేత ఉపరి ఏడు రకాల నరకాలూ వరుసగా అనుభవింపబడుతూ వున్నాయి. కాని, నువ్వు కార్తీక వ్రతస్థులైన వారి సాంగత్యం ద్వారా పొందిన అమితపుణ్యం కలిగిన వాడవు కావడం వలన ఈ నరకాలను కేవల దర్శనమాత్రంగానే తరించగలిగావు.
పై విధంగా చెబుతూ - యమదూతయైన ప్రేతాధిపతి, అతనిని యక్షలోకానికి చేర్చాడు. అక్కడ అతడు యక్షరూపుడై, కుబేరునకు ఆప్తుడై, ధనయక్షుడనే పేరును పొందాడు. విశ్వామిత్రుడు అయోధ్యలో ఏర్పరచిన ధనయక్షతీర్థం ఇతని పేరు మీదనే సుమా! అందువలన, సత్యభామా! పాపహారిణీ, శోకనాశినీ అయిన ఈ కార్తీక వ్రత ప్రభావం వల్ల మానవులు తప్పనిసరిగా మోక్షాన్ని పొందగలరనడం ఏ మాత్రమూ అతిశయోక్తి లేదు' అని - సత్యభామకు చెప్పిన వాడై - శ్రీకృష్ణుడు సాయం సంధ్యానుష్టానార్థమై స్వీయ గృహానికి వెళ్లాడని - సూతుడు ఋషులకు ప్రవచించాడు.

సప్తవింశోధ్యాయ స్సమాప్తః (ఇరువది ఏడవ అధ్యాయము సమాప్తము)

# అష్టావింశోధ్యాయము

సూత ఉవాచ: ఈ కార్తీకమాసము పాపనాశని, విష్ణువుకు ప్రియకరి, వ్రతస్థులకు భుక్తి - ముక్తిదాయినీ అయి వుంది. కల్పోక్త విధిగా ముందుగా విష్ణు జాగరణము, ప్రాతః స్నానము, తులసీ సేవ ఉద్యాపనం, దీపదానం - అనే ఈ అయిదింటినీ కూడా కార్తీక మాసంలో ఆచరించినవారు ఇహాన భుక్తినీ పొందుతున్నారు. పాపాలు పోవాలన్నా, దుఃఖాలు తీరాలన్నా, కష్టాలు కడతేరాలన్నా కార్తీక వ్రతాన్ని మించినది మరొకటి లేదు. ధర్మార్థ కామమోక్షాలు నాలుగింటి కోసమూ ఈ కార్తీక వ్రతం ఆచరించవలసి వుంది. కష్టములలో వున్నవాడయిననూ, దుర్గారణ్యగతుడయినా, రోగి అయినా సరే - విడువకుండా ఈ వ్రతాన్ని పాటించాలి. ఎటువంటి ఇబ్బందులు కలిగినాసరే వ్రతమును మానకుండా శివాలయంలోనో , విష్ణ్వాలయంలోనో హరి జాగరాన్ని ఆచరించాలి. శివ విష్ణు దేవళాలు చేరువలో లేనప్పుడు రావిచెట్టు వద్దగాని, తులసీవనంలో గాని వ్రతం చేసుకొనవచ్చును. విష్ణు సన్నిధానంలో విష్ణు కీర్తనలు ఆలపించే వాళ్లు సహస్ర గోదానఫలాన్నీ, వాద్యాలు వాయించే వాళ్లు అశ్వమేథ ఫలాననీ, నర్తకులు సర్వతీర్థాల స్నానఫలాన్నీ పొందుతారు. ఆపదలలో వున్నవాడూ, రోగీ మంచినీరు దొరకనివాడూ - వీళ్లు కేశవనామములతో లాంఛన మార్జన మాచరించితే చాలు. వ్రతోద్యాపనకు శక్తి లేని వాళ్లు బ్రాహ్మణులకు భోజనం పెడితే సరిపోతుంది.

శ్లో ॥ అవ్యక్త రూపిణో విష్ణోః స్వరూపో బ్రాహ్మణోభువి ॥

శ్రీ మహావిష్ణువు యొక్క స్వరూపమే బ్రాహ్మణుడు. కావున కార్తీకమందు బ్రాహ్మణుని సంతోషపరచడం చాలా ప్రధానం.

అందుకుగాను శక్తిలేనివాళ్లు గోపూజ చేసినా చాలును. ఆపాటి శక్తయినా లేని వాళ్లు రావి, మర్రి వృక్షాలనూ పూజించినంత మాత్రం చేతనే వ్రతాన్ని సంపూర్తి చేసిన ఫలాన్ని పొందగలుగుతారు.

దీపదానం చేసే స్థోమతు లేనివారు, దీపారాధనకయినా తాహతు లేని వారు - ఇతరులచే వెలిగించబడిన దీపాన్ని ప్రజ్వలింప చేసి గాలి మొదలైన వాటి వలన అది ఆరిపోకుండా పరిరక్షించినా కూడా పుణ్యం పొందుతారు. పూజకు తులసి అందుబాటులో లేనివారు - తులసికి బదులు విష్ణుభక్తుడైన బ్రాహ్మణుని పూజించాలి.

## రావి - మర్రి

సూతుడు చెప్పినది విని - ఇతర వృక్షములన్నిటి కంటే కూడా రావి, మర్రి వృక్షాలు మాత్రమే గో బ్రాహ్మణ తుల్య పవిత్రతని ఎలా పొందాయి అని అడిగాడు సూతుడు. పూర్వమొకసారి పార్వతీ-పరమేశ్వరులు మహాసురత భోగంలో వుండగా - కార్యాంతరం వలన దేవతలు, అగ్ని - కలిసి బ్రాహ్మణ వేషధారులై వెళ్ళి ఆ సంభోగానికి అంతరాయం కలిగించారు. అందుకు కినిసిన పార్వతీ దేవి 'సృష్టిలోని క్రిమికీటకాదులు సహితము సురతములోనే సుఖపడుతూ వున్నాయి. అటువంటిది మీరు మా దంపతుల సంభోగ సుఖాన్ని చెడగొట్టారు. నాకు సురత సుఖభ్రంశాన్ని పాటించిన మీరు చెట్లయి పడి వుండండి' అని శపించింది. తత్కారణంగా దేవతలంతా వృక్షాలుగా పరిణమించవలసి వచ్చింది. ఆ పరిణామంలో బ్రహ్మ పాలాశవృక్షంగానూ, విష్ణువు అశ్వత్థంగానూ, శివుడు వటముగానూ మారారు. బ్రహ్మకు పూజార్హత లేదు. జగదేక పూజనీయులైన శివకేశవ రూపాలు గనుకనే రావి, మర్రి వృక్షాలకు అంతటి పవిత్రత కలిగింది. వీటిలో రావిచెట్టు శని దృష్టికి సంబంధితమైన కారణంగా - శనివారం నాడు మాత్రమే పూజనీయమైంది. ఇతర వారాలలో రావిచెట్టును తాకరాదు సుమా! అంటూ చెప్పడాన్ని ఆపాడు సూతుడు.

(ఇరువది ఏడు - ఇరువది ఎనిమిది అధ్యాయములు)

ఇరువది తొమ్మిదవ (బహుళ చతుర్దశి) రోజు పారాయణము సమాప్తము

ముప్పదియవ రోజు పారాయణము

ఏకోన త్రింశతితమాధ్యాయము

సూత ప్రోక్తమైన విషయాలను వినిన ఋషులు - ఓ మునిరాజా! రావిచెట్టు ఎందు వలన అంటరానిదయ్యింది. అయినప్పటికీ శనివారం నాడు మాత్రం ఎందుకు పూజనీయతను పొందింది? అని ప్రశ్నించగా సూతర్షి వారిని సమాధాన పరచసాగాడు.

రావిచెట్టు - దరిద్రదేవత: పూర్వం క్షీరసాగర మధనంలో లభించిన అనేక వస్తువులలో లక్ష్మినీ కౌస్తుభాన్నీ శ్రీహరికి సమర్పించి - తక్కిన సంపదనంతా దేవతలు తీసుకున్నారు. శ్రీహరి శ్రీదేవిని పెండ్లి చేసుకోదలచాడు. కాని శ్రీదేవి - 'ఓ నారాయణా! నాకన్నా పెద్దది నా అక్కయ్య వున్నది. ఆ జ్యేష్ఠకు పెండ్లి కాకుండా కనిష్ఠనయిన నేను కళ్యాణమాడటం పాడిగాదు గనుక - ముందామె మనువుకై సంకల్పించ'మని కోరింది. ధర్మబద్ధమైన 'రమ' మాటలను అంగీకరించి, విష్ణువు - ఉద్దాలకుడనే మునికి జ్యేష్ఠాదేవిని సమర్పించాడు. స్థూలవదన, అశుభ్రరదన, అరుణనేత్రి, కఠినగాత్రి, బిరుసు శిరోజాలు గలిగిన జ్యేష్ఠాదేవిని, ఉద్దాలకుడు తన ఆశ్రమానికి తెచ్చుకున్నాడు.

దరిద్ర దేవతకు ఇష్టమైన స్థలములు: నిరంతర హోమధూమ సుగంధాలతోనూ, వేదనాదాలతోనూ నిండిన ఆశ్రమాన్ని చూసి, పెద్దమ్మ దుఃఖిస్తూ - "ఓ ఉద్దాలకా! నాకీ చోటు సరిపడదు. వేదాలు ధ్వనించేదీ, అతిథి పూజా సత్కారాలు జరిగేవీ, యజ్ఞయాగాదులు నిర్వహించబడేవీ అయిన స్థలాలలో నేను నివసించను. అన్యోన్యానురాగం గల భార్యభర్తలు వున్న చోటగాని, పితృదేవతలు పూజింపబడే చోట గాని, ఉద్యోగస్తుడు -నీతివేత్త - ధర్మిష్ఠుడు - ప్రేమగా మాటలాడే వాడు - గురుపూజా దురంధరుడూ వుండే స్థలాలలోగాని, నేను ఉండను. ఏ ఇంటిలో అయితే రాత్రింబవళ్లు ఆలుమగలు దెబ్బలాడుకుంటూ వుంటారో, ఏ ఇంట్లో అతిధులు నిరాశతో ఉసూరుమంటారో - ఎక్కడయితే వృద్ధులకు, మిత్రులకు, సజ్జనులకు అవమానాలు జరుగుతుంటాయో, ఎక్కడయితే దురాచారాలూ, పరద్రవ్య, పరభార్యాపహరణ శీలురైన వారుంటారో - అలాంటి చోటులోనయితేనే నేను వుంటాను. కల్లు తాగేవాళ్లు, గోహత్యలు చేసే వాళ్లు, బ్రహ్మహత్యాది పాతక పురుషులూ ఎక్కడ వుంటారో నేనక్కడ వుండటానికే ఇష్టపడతాను' అంది.

రావి మొదట్లో జ్యేష్ఠావాసం: ఆమె మాటలకు వేదవిదుడైన ఆ ఉద్దాలకుడు కించిత్తు నొచ్చుకున్నవాడై - 'ఓ జ్యేష్ఠా! నీవు కోరినట్లుగా నీకు తగిన నివాస స్థానాన్ని

అన్వేషించి వస్తాను. అంతవరకూ నువ్వీ రావిచెట్టు మొదట్లోనే కదలకుండా కూర్చో'మని చెప్పి బయలు దేరి వెళ్లాడు. భర్తాజ్ఞ ప్రకారం జ్యేష్ఠాదేవి రావిచెట్టు మొదలులోనే అలాగే వుండిపోయింది. ఎన్నాళ్లకీ ఉద్దాలకుడు రాకపోవడంతో పతి విరహాన్ని భరించలేని పెద్దమ్మ - పెద్దపెట్టున దుఃఖించసాగింది. ఆమె రోదనలు వైకుంఠంలో వున్న లక్ష్మీనారాయణుల చెవులలో పడ్డాయి. వెంటనే లక్ష్మి - తన అక్కగారిని ఊరడించవలసిందిగా విష్ణువును కోరింది. విష్ణువు కమలా సమేతుడై జ్యేష్ఠాదేవి ఎదుట ప్రత్యక్షమయి, ఆమెని ఊరడించుతూ - 'ఓ జ్యేష్ఠాదేవి! ఈ రావిచెట్టు నా అంశతో కూడి వుంటుంది. కనుక, నువ్వు దీని మూలంలోనే స్థిరనివాసం ఏర్పరచుకుని వుండిపో. ప్రతి ఏటా నిన్ను పూజించే గృహస్థులయందు లక్ష్మి నివసిస్తూ వుంటుంది' అని చెప్పాడు. ఆ నియమాలలోనే ప్రతి శనివారం రావిచెట్టు పూజనీయగానూ, అక్కడ జ్యేష్ఠాదేవిని షోడశోపచార విధిని అర్పించే స్త్రీల పట్ల శ్రీదేవి అమిత కరుణాకలితయై అనుగ్రహించేటట్లునూ ఏర్పరచాడు శ్రీహరి.

'ఓ ఋషులారా! సత్యభామకు శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా - నారదుని చేత పృథు చక్రవర్తికి చెప్పబడిన విధానంగా, నేను మీకీ పద్మపురాణాంతర్గత కార్తీక పురాణాన్ని వినిపించాను. ఎవరయితే ఈ కార్తీక మహాత్మ్యాన్ని చదువుతున్నారో, వింటున్నారో, వినిపిస్తున్నారో వారు సమస్త పాపాల నుండీ విడివడి విష్ణు సాయుజ్యాన్ని పొందుతున్నారు' అని సూతుడు చెప్పగా విని సంతసించిన ఋషులు - అక్కడి నుంచీ బదరీవన దర్శనాకాంక్షులై పయనమయ్యారు.

ఇరువది తొమ్మిదీ, ముప్పది - అధ్యాయములు

ముప్పదియవ (బహుళ అమావాస్య) రోజు పారాయణము సమాప్తము

## పోలి స్వర్గమునకు (వైకుంఠమునకు) పోవుట

ఆంధ్రదేశమున పవిత్ర కృష్ణానదీ తీరమున బాదర అను గ్రామముండెను. ఆ గ్రామములో నివసించుచున్న అన్ని వర్ణముల వారును అన్నిటను సంపన్నులై యుండిరి. పాడిపంటలు, భోగభాగ్యములు, సుఖశాంతులు మున్నగువానితో ఆ గ్రామము సంతోషపూర్ణమై యుండెను.

ఆ గ్రామములో 'పోతడు' అను పేరుగల చాకలివాడొకడు కలడు. అతని భార్య 'మాలి' క్రూర స్వభావురాలు. దయాదాక్షిణ్యములు లేనిదై గయ్యాళియని పేరు పడెను.

వారికి నలుగురు కుమారులు కలరు. ఆ దంపతులు - తమ కుమారులు నలుగురికిని తగిన సమయములందు వివాహము చేసిరి. మొదటి ముగ్గురు కోడళ్లను తమ అత్తగారి వలెనే పొగరుబోతు స్వభావము కలిగి చెడ్డ పేరును తెచ్చుకొనిరి. అత్తగారితో సమానముగా గయ్యాళితనమును, చెడు స్వభావమును కలిగియుండిరి. నాలుగవ కోడలు 'పోలి' మృదు స్వభావురాలు, భర్తయందు ఆసక్తి కలిగియుండెను. ఊరి వారి బట్టల మాలిన్యమును పోగొట్టి స్వచ్ఛతను కలిగించు 'పోతడు' మాత్రము తన కుటుంబ సభ్యుల దుష్టస్వభావముచే ఏర్పడిన తన కుటుంబంలోని మాలిన్యమును పోగొట్టలేని స్థితిలో వుండెను. దీనికి తోడు వాని నిర్ధనత్వము కూడా వానిని బాధించుచుండెను. చిన్నకోడలైన పోలిని తన భార్యయగు మాలి మిగిలిన కోడళ్లను దూషించుట, బాధించుట గమనించియు నిస్సహాయుడై వూరకుండెను. అత్తయగు 'మాలి', మిగిలిన తోడికోడళ్లను ఇంటి పనులన్నిటినీ పోలిపై వదలిరి. ఇంటి పనులన్నింటిని మారు మాట్లాడక తలవంచి చేయుచున్న ఆమెపై జాలియైన లేక - ఆమెపై చాడీలు చెప్పి ఆమె భర్తచే 'పోలి'ని కొట్టించి, తిట్టించి సంతోషపడుచుండిరి. ఈ విధముగ తనను, అత్త, తోడికోడళ్లు, అనేక విధములగ బాధించుచున్నను, భర్తకు చాడీలు చెప్పి కొట్టించుచున్నను, తిట్టించుచున్నను, 'పోలి' తన శాంతస్వభావమును, దైవభక్తిని, ధర్మకార్యాసక్తిని విడువక కాలమును గడుపుచుండెను.

ఇట్లుండగా కార్తీక మాసము వచ్చెను. గ్రామములోని వారందరును కార్తీకమాస స్నానములను చేయుటకై కృష్ణానదికి పోవుచుండిరి. నదిలో స్నానము చేసి తీరమున దీపములపు వెలిగించుచు పూజలను చేయుచుండిరి. ఇట్లు గ్రామము నుండి నదీస్నానమునకు, దీపారాధనకు, పూజలకు చాలా మంది వెళ్లిరి. అట్లు వెళ్లిన వారిలో నిజమైన భక్తులు కొందరుందురు. కొందరు, తామును వారికి వలె పూజ మున్నగు వానిని చేసి పుణ్యమును సంపాదింపవలయునని తలచి నదీస్నానము మొదలగువానిని చేయుదురు. మరి కొందరు తామును మిగిలిన వారివలె చేయనిచో బాగుండదని వచ్చి మిగిలిన వారి వలె నదీస్నానమును, మిగిలిన వానిని ఆచరింతురు. ఇట్టి వీరందరిని చూచి వినోదించుటకై కూడా మరి కొందరు నదీస్నానము మొదలగు వానికి తయారగుదురు.

పోలి అత్త 'మాలి' యను, ఆమె కోడళ్లు ముగ్గురును 'పోలి'ని ఇంటి వద్ద నుంచి నదీస్నానమునకకు వెళ్లిరి. ఇంటిపనిని, బాధ్యతను 'పోలి'కి అప్పగించిరి. నదీ

స్నానమునకు బోయి స్నానము, దీపారాధన మున్నగు వానిని చేయునప్పుడు 'మాలి' మున్నగు వారి దృష్టి దైవముపై, దైవ కార్యముపై లేదు. మనస్సును చేయుపనిపై నిలుపలేదు. భక్తి వారిలో మొదటి నుండియు లేదు. స్నానము మొదలగు వానిని చేయు చున్నను వారు, 'పోలి' ఇంటి వద్ద పాలను త్రాగుచున్నదేమో, పెరుగు, వెన్న మొదలగు వానిని తినుచున్నదేమో? లేక వానిని అమ్ముకొని సొమ్ము చేసుకొని దాచుకొనుచున్నదేమో' అని అనేక విధములుగా తలచుకొనుచు, తమ తలపులను మాటలలో పక్కవారికి తెలుపుకొనుచు, తమ బుద్ధిని, మనసును 'పోలి'ని ఆడిపోసి కొనుట యందు నిలిపిరి. వారి శరీరములు, అవయములు నదీస్నానమును, దీపారాధనమును, దైవ దర్శనమును చేయుచున్నవి. వారు కేవలము 'పోలి'ని నిందించుటలో మాటలను నిలిపిరి. ఈ విధముగా కార్తీక మాసమును కృష్ణాతీరమున వారు గడిపిరి. వ్రతోద్యాపనకై మార్గశిర శుద్ధ పాడ్యమి నాడు కృష్ణాతీరమునకు చేరిరి. ఇక ఇంటనున్న 'పోలి' నిస్సహాయురాలు. అత్తగారికి, తోడికోడళ్ళకును సమాధానమును కూడా చెప్పలేని స్థితిలో వున్నది. భర్తయు తన తల్లిమాటలను, వదినల పలుకులను వినును, నమ్మును. తనను (పోలి) పట్టించుకొనడు. నదీస్నానము, దీపారాధాన మున్నగు వానిని చేయువలయునని వున్నను, ఇంటి బాధ్యతకు బంధితురాలైన ఆమె తన భక్తిని, నదీ స్నానాదుల యందలి కోరికను, దైవ, ధర్మ కార్యాసక్తిని తనలోనే దాచుకొనెను. అత్తకు, తోడికోడళ్లకు సమాధానము చెప్పలేదు. తననొక సాటి జీవిగనైన తలచని వారి మానవత్వమునకేమి చేయును?

అప్పుడామె నిస్సహాయ రీతిలో ఇంటి బాధ్యతలను, ఇంటి పనులను చేయుచు ఇంటిలోనే వున్నదై తన మనసులో ఇట్లనుకొనెను - 'దీనరక్షణ! గోవిందా! జనార్ధనా! స్వామీ! దీనబంధూ! నేనేమి చేయగలను. అశక్తురాలను, నిస్సహాయురాలను, నా అత్త, తోడికోడళ్లు, నన్ను విడిచి నదీతీరమునకేగి, స్నాన, దీపారాధన మున్నగు వానిని చేయుచున్నారు. వారివలె నాకును - 'పుణ్యమును సంపాదించవలెను. భగవంతుని పూజింపవలయును' అని యుండునని భావింపక పోయిరి.

నేనేమియు చేయలేకున్నాను. పవిత్ర నదీ స్నానము లేదు. స్ఫూర్తినిచ్చు దీపారాధన లేదు. మనసునకు ప్రశాంతతనిచ్చు దైవ దర్శనము పూజ, పురాణ శ్రవణము ఏవియును లేవు. ఏమి చేయుదును. నాకెట్టి గతి కలుగునో కదా! నేనెంత దురదృష్టవంతురాలను' అని ఆమె బహు విధములుగ విచారించెను.

మనసులో భగవంతుని ధ్యానించుచు పోలి, తన పరిస్థితికి లోబడి, ఇంటిలో కుండలో వున్న నీటితో స్నానమాచరించెను. చినిగిన వస్త్రమును ధరించిన ఆమె తాను ధరించిన జీర్ణ వస్త్రము యొక్క అంచును చించి వత్తిగ చేసెను. దానినొక పాత్రలో వుంచి కవ్వమునకు అంటిన కొద్దిపాటి వెన్నను తీసి, ఆ పాత్రయందుంచి, దీపమును వెలిగించి, 'స్వామీ! పుండరీకాక్షా! గోవిందా! జనార్ధనా! అనాథరక్షకా! దీనబంధూ! దయ జూపుము. నేను అశక్తురాలను. నా పై అనుగ్రహము వుంచుమ'ని పోలి ప్రార్థించెను.

ఇట్లు దీనావస్థలో వున్న పోలిని వైకుంఠమున వున్న దయాసముద్రుడగు శ్రీ మహావిష్ణువు గమనించెను. ఆమెపై అనుగ్రహము కలిగెను. ద్వారపాలకుడైన సుశీలుడను వానిని జూచి, ఓయీ! నీవీమెను వెంటనే సగౌరవముగా బంగారు విమానము నెక్కించి తీసికొని రమ్మని ఆజ్ఞాపించెను. సుశీలుడను వెంటనే 'పోలి' వున్న చోటునకు బంగారపు విమానముతో వచ్చి 'ఓ సాధ్వీ! మంచి నడవడిక గల ఉత్తమురాలా! నిన్ను ఈ శరీరముతోనే వైకుంఠమునకు తీసికొని రమ్మని శ్రీ మహావిష్ణువు పంపెను. కావున వెంటనే వచ్చి ఈ విమానమును ఎక్కుము రమ్మ'ని తొందరపెట్టెను. ఆమెను విమానముపై ఎక్కించుకొనుచుండెను.

అప్పుడే వ్రతోద్యాపనము చేసికొని పోలి అత్త 'మాలి', మిగిలిన తోడికోడళ్లు ముగ్గురును ఇంటికి వచ్చిరి. 'మాలి' జరిగిన దానిని తెలిసికొని తానును వైకుంఠమును చేరవలయునని తలచి విమానముతో ఎగురబోవు 'పోలి' పాదములను పట్టుకొనెను. పెద్ద కోడలు తన అత్త 'మాలి' పాదములను పట్టుకొనెను. అట్లే ఆమె పాదములను రెండవ కోడలు, రెండవ కోడలి పాదములను మూడవ కోడలు పట్టుకొనిరి. ఈ విధముగ వైకుంఠమునకు విమానములో పోవుచున్న 'పోలి' పాదములను పట్టుకొని అత్త 'మాలి' ఆమె పాదములను పట్టుకొని పెద్దకోడలు, ఆమె పాదములను పట్టుకొని రెండవ కోడలు, ఆమె పాదములను పట్టి వ్రేలాడు మూడవ కోడలు, చూచువారికి విచిత్ర దృశ్యమును కల్పించిరి.

వైకుంఠ విమానమును నడిపించు సుశీలుడు వీరిని జూచెను. వారు 'పోలి'ని పెట్టిన బాధలను గుర్తుకు తెచ్చుకొనెను. శ్రీ మహావిష్ణువు మాటలను 'పోలి'పై ఆయనకు కలిగిన దయను గమనించెను. మీరు మంచివారు కారు. 'పోలి'ని చూచి అసూయపడి ఆమెను బహువిధములగ బాధించిరి. మీరు దుష్టులు. మీరు నదీ స్నానము, దీపారాధనము, దైవదర్శనము, పూజ, పురాణశ్రవణము మున్నగువానిలో పాల్గొన్నను,

మనసులో 'పోలి'ని దూషించుచు, పాలు, పెరుగు, నెయ్యి మొదలగు యింటి విషయములను తలచిరి. 'పోలి'పై అసూయపడిరి. కావున మీరు దుష్టులు. మీరు వైకుంఠమునకు రాదగిన వారు కారు. కుంభీపాకము మొదలగు నరకములే మీకు దగినవి. అటకుపొండని సుశీలుడు పలుకుచు చేతిలో వున్న కత్తితో 'మాలి' చేతులను నరికెను. అప్పుడు మాలి, ఆమె కోడళ్లు ముగ్గురును కిందపడిరి.

సుశీలుడు మిక్కిలి ప్రేమాదరణలతోను, మహావైభవముగా 'పోలి'ని వైకుంఠమునకు తీసికొని పోయెను. ఈ విధముగా పోలి శ్రీ మహావిష్ణువు దయకు పాత్రురాలైనది. 'పోలి' వృత్తాంతము వలన ఈ కింది విషయములు గమనింపదగి వున్నవి.

భగవంతుని యందు నిర్మలమైన భక్తి వుండవలెను. ఆ భక్తిలో తన్మయత్వము వుండవలెను. పూజలోని ఆడంబరములుగాని, పూజ చేయు వారి ఆడంబరముగాని భగవంతుని మొగమాట పెట్టవు. ఇతరులను చూచి అసూయపడుట, వారిని బాధించుట భక్తులైన వారికి వుండరాదు. అట్టివారు 'మాలి' మొదలగువారు. పరిశుద్ధమైన భక్తి మాత్రమే, నిరాడంబరమైనను భగవంతునకు ప్రీతి కలిగించును. దిక్కు లేని వారికి దేవుడే దిక్కు. కావున మనలో ప్రతి ఒక్కరును, అసూయాద్వేషములను విడిచి నిర్మలమైన భక్తితో ఉన్నంతలో యధాశక్తిగ భగవంతుని చేరుటకు 'పోలి'వలె యత్నింపవలెను. 'మాలి' మున్నగువారు సంసారములోని మాయకు గుర్తులు కాగా, 'పోలి' నిర్మల, నిశ్చల భక్తికి ప్రతీక. అట్టి భక్తికి కులము, సంపన్నత మున్నగునవి లేవు. మనమును అట్లగుటకు యత్నించుట మంచిది.

సర్వేజనాః సుఖినోభవంతు



# Contact

## USA Address Info

Vaachaspathi Veda Vidya
450 Albany,Shaker Road-Loudonville ,
12211 New York USA
Telephone: 518-867-6720
E-mail: info@vaachaspathi.com

## INDIA Address Info



Vaachaspathi Veda Vidya
Vavilala Srinivasa Sharma (Avadhani)
18-4-111/1 , Sagaraveedhi,
LakshmiNagar, Godavarikhani,
Karimnagar, Telangana, India

94 404 82 431
98 484 85 890

www.vaachaspathi.com